సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 331
శుక్రవారం 21-2-2025
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'

సాక్షి ఫ్యామిలీ యువర్స్
హైదరాబాద్ శుక్రవారం 21-2-2025

● టెక్.. టాక్

యూట్యూబ్ డ్రీమ్‌స్క్రీన్ అప్‌డేట్



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సహాయంతో షార్ట్స్-షార్ట్-ఫామ్ వీడియోలను రూపొందించడానికి యూట్యూబ్ యూజర్‌లను అనుమతిస్తోంది. తాజా వీడియో జెనరేషన్ మోడల్ వీయో2ను ఇంటిగ్రేట్ చేస్తూ తన ప్రయోగాత్మక డ్రీమ్ స్క్రీన్ ఫీచర్‌కు కొత్త అప్‌డేట్‌ను ప్రవేశపెట్టింది. టెక్స్ట్ ప్రాంప్ట్ ఎంటర్ చేయడం ద్వారా యూజర్‌లు వీడియో క్లిప్‌లను జెనరేట్ చేయడానికి ఈ అప్‌డేట్ వీలు కల్పిస్తుంది.

2023లో యూట్యూబ్ 'డ్రీమ్‌స్క్రీన్'ను తీసుకువచ్చింది. 'షార్ట్స్' కోసం యూజర్‌లు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ జెనరేటెడ్ బ్యాక్‌గ్రౌండ్‌ను క్రియేట్ చేసేలా ఇది ఉపయోగపడుతుంది. ఏఐ-జెనరేటెడ్ వీడియో బ్యాక్‌గ్రౌండ్స్ కోసం... ● యూట్యూబ్ షార్ట్ కెమెరా ఓపెన్ చెయ్యాలి ● 'గ్రీన్ స్క్రీన్' ఆప్షన్ సెలెక్ట్ చేసుకోవాలి ● 'డ్రీమ్ స్క్రీన్' ఎంపిక చేసుకోవాలి ● మీరు కోరుకున్న బ్యాక్‌గ్రౌండ్ కోసం టెక్స్ట్ ప్రాంప్ట్ ఎంటర్ చేయాలి.



హానర్ మ్యాజిక్ 7 ఆర్‌ఎస్‌ఆర్

డిస్‌ప్లే: 6.80 అంగుళాలు ఓఎస్: ఆండ్రాయిడ్ 15
మెమోరీ: 512జీబి 16జీబి ర్యామ్ ఫ్రంట్ కెమెరా: 50 ఎంపీ
బ్యాటరీ: 5850 ఎంఏహెచ్ కనెక్టివిటీ: 5జీ బరువు: 229 గ్రా.

లావా ప్రోవాచ్ ఎక్స్



సైజ్: 1.43 అంగుళాలు రిఫ్రెష్ రేట్: 30 హెచ్ జడ్ ● బాడీ ఎనర్జీ మానిటరింగ్ అండ్ హార్ట్ రేట్ వేరియబిలిటీ ● ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ మానిటరింగ్ సింగిల్ ఛార్జ్: 10 రోజులు బ్యాటరీ: 300 ఎంఏహెచ్

వివో వి50



సైజ్: 6.77 అంగుళాలు
బ్యాటరీ: 6,000 ఎంఏహెచ్
సెల్ఫీ కెమెరా: 50 ఎంపీ
రిజల్యూషన్: 1.5కే
రిఫ్రెష్‌రేట్: 120 హెచ్ జడ్
సపోర్టింగ్: 4కే వీడియో రికార్డింగ్

వాట్సప్‌లో మల్టీపుల్ చాట్ థీమ్స్



బ్యాక్‌గ్రౌండ్ ఆప్షన్‌కు సంబంధించి ఆండ్రాయిడ్, ఐవోఎస్ యూజర్‌ల కోసం మల్టీపుల్ చాట్ థీమ్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది వాట్సప్. 22 ప్రీ-సెట్ థీమ్స్‌తో కూడిన 30 కొత్త వాల్‌పేపర్లు ఉంటాయి. గత ఏడాది ఈ ఫీచర్ బీటా వెర్షన్‌లో కనిపించింది. 'మీ చాట్‌లు అన్నింటికీ ఒక థీమ్ లేదా ఒక నిర్దిష్టమైన చాట్‌కు ఒక థీమ్‌ను ఎంచుకోవచ్చు' అని వాట్సప్ తెలియజేసింది. బ్యాక్‌గ్రౌండ్ బ్రైట్‌నెస్ మార్చడానికి, ఔట్‌గోయింగ్ మెసేజ్‌ల కలర్ మార్చడానికి ఆప్షన్స్ ఉంటాయి.

వాట్సప్ చాట్ థీమ్‌ను మార్చడానికి...

1 కొత్త చాట్ థీమ్ ఆప్షన్ కోసం: యాప్ రైట్ కార్నర్‌లోని త్రీ-డాట్ మెను క్లిక్ చేయాలి.
2. సెట్టింగ్స్-ట్యాప్ 3. చాట్స్-క్లిక్ 4. డిఫాల్ట్ చాట్ థీమ్-క్లిక్ చేయడం ద్వారా ప్రీ-సెట్ థీమ్, చేంజ్ ది చాట్ కలర్ అండ్ వాల్‌పేపర్ ఆప్షన్స్ సెలెక్ట్ చేసుకోవచ్చు.

● యంగ్ టాలెంట్

ఆక్సిజెమ్

ఆక్సిజన్ టైల్స్ ఎయిర్ క్వాలిటీని పెంచడానికి కార్బన్ డయాక్సైడ్‌ను పీల్చుకుని ఆక్సిజన్‌ను విడుదల చేసే బయోడీగ్రేడబుల్ కార్బన్ స్పాంజ్ టైల్స్ ఫార్ములాను రూపొందించిన మోనిక అక్కినేని అబుదాబికి చెందిన ప్రతిష్ఠాత్మకమైన 'జాయెద్ సస్టైనబిలిటీ ప్రైజ్'ను గెలుచుకుంది.



జాయేద్ సస్టెయినబిలిటీ ప్రైజ్(యూఏఈ)ను ప్రెసిడెంట్ షేక్ మహ్మద్ బిన్ జాయేద్ చేతులమీదుగా అందుకుంటున్న మోనిక

చిన్నప్పుడు జానపద కథల్లో రాక్షసుల గురించి విన్నదో లేదోగానీ కాలుష్యకారక రాక్షసుల గురించి విన్నది మోనిక. భూతాపం పెంచే ఎన్నో భూతాల గురించి విన్నది. అలా వింటున్న క్రమంలో కర్బన ఉద్గారాల కట్టడికి తన వంతుగా ఏదైనా చేయాలనుకునేది.

ఆవిష్కరణకు ముందు అధ్యయనం ముఖ్యం కదా!

క్లైమెట్ ట్రాన్స్‌పరేన్సీ రిపోర్ట్‌లు చదవడం నుంచి కార్బన్ కాప్చర్ స్టోరేజీ(సీసీఎస్) తెలుసుకోవడం వరకు ఎన్నో చేసింది....

ఏలూరు నగరానికి చెందిన భూపేష్ రఘు అక్కినేని, స్వీటీ దంపతులు అబుదాబీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్నారు. వారి కుమార్తె మోనిక అక్కినేని అబుదాబీలోని మేరీ ల్యాండ్ ఇంటర్నేషనల్ స్కూల్లో పదవ తరగతి చదువుతోంది. పర్యావరణ పరిరక్షణకు దోహదపడే ప్రాజెక్టులపై గత రెండేళ్ళుగా మోనిక ఆసక్తి పెంచుకుని సహ విద్యార్థి ముస్కాన్‌తో కలిసి పనిచేస్తోంది. గత ఏడాది జూన్ నుంచి ఎయిర్ క్వాలిటీ పెంచే బయో డీగ్రేడబుల్ కార్బన్ స్పాంజ్ టైల్స్ తయారీపై పరిశోధనలు ప్రారంభించింది. సముద్ర గర్భంలో ఉండే నాచు, కొబ్బరిపీచులు, వైబర్ (ఇండస్ట్రియల్ సిమెంట్)తో పాటు మరి కొన్ని రసాయనాలు వాడి చిన్నపాటి ప్లేట్‌లను సిద్ధం చేసింది. మోనిక పూర్తి చేసిన ప్రాజెక్టును స్కూల్ కమిటీ క్షుణ్ణంగా పరిశీలించింది. ఒక ఫ్యాక్టరీలో ప్రాజెక్టు పనితీరును అధ్యయనం చేసి మేరీల్యాండ్స్ స్కూల్ ప్రాజెక్టును ఎంపిక చేసింది.

ప్రతి ఏటా అబుదాబీ అధ్యక్షుడు షేక్ మహ్మద్ బిన్ జాయేద్ అల్ నహ్యాన్ రాజకుటుంబం పేరుతో 'జాయేద్ సస్టైనబిలిటీ ప్రైజ్‌'లను 11 విభాగాల్లో అందిస్తుంటారు. ఆరోగ్యం, ఆహారం, ఎనర్జీ, నీరు, వాతావరణంలో మార్పులపై అధ్యయనం... ఇలా పదకొండు విభాగాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తారు. ఈ ఏడాది 5,500 దరఖాస్తులు అందాయి. మోనిక ఈ అవార్డుకు దరఖాస్తు చేసింది. పదకొండు విభాగాల్లో 33 మందిని షార్ట్‌లిస్ట్ చేసి పదకొండు మందిని విజేతలుగా ఎంపిక చేశారు.

ఎయిర్ క్వాలిటీ పెంచడానికి కార్బన్ డయాక్సైడ్‌ను పీల్చుకుని ఆక్సిజన్‌ను విడుదల చేసే బయోడీగ్రేడబుల్ కార్బన్ స్పాంజీ టైల్స్ ఫార్ములాను రూపొందించిన మోనికకు ప్రైజ్ దక్కింది. మోనిక రూపొందించిన ఫార్ములా గురించి చెప్పుకోవాలంటే... 1,100 పీఎస్‌ఐ కార్బన్ డయాక్సైడ్ విడుదలైతే మూడు గంటల వ్యవధిలో 300 పీఎస్‌ఐ ఆక్సిజన్ విడుదల చేస్తుంది. ఆడిటోరియాలు, జనాలు అధికంగా ఉండే భవనాలు, పాఠశాల తరగతి గదుల్లో గోడలకు ఈ టైల్స్‌ను అతికిస్తే దీర్ఘకాలం పనిచేస్తాయి. ప్రత్యేకంగా స్కూల్ గదుల్లో ఉపయోగపడేలా ఈ ప్రాజెక్టును రూపొందించింది. ఈ టైల్స్‌ను వినియోగించడం ద్వారా గాలిలోని కర్బన ఉద్గారాలను తగ్గించి గాలి నాణ్యత పెంచవచ్చు. అవార్డుతో పాటు మోనిక అక్కినేనికి లక్షన్నర డాలర్ల గ్రాంటును మంజూరు చేశారు. భవిష్యత్‌లో ఈ ప్రాజెక్టుతో పాటు సరికొత్త ఆవిష్కరణలకు గ్రాంటును వినియోగించుకునే అవకాశం ఇచ్చారు.



ప్రాజెక్టు వర్క్ చేస్తున్న మోనిక అక్కినేని

– కాట్రపాటి కిషోర్, సాక్షి ప్రతినిధి, ఏలూరు

మరిన్ని ఆవిష్కరణలు...

మా పేరెంట్స్, స్కూల్లో టీచర్‌ల ద్వారా పర్యావరణానికి జరుగుతున్న ముప్పు గురించి ఎన్నోసార్లు విన్నాను. బాధగా అనిపించేది. బాధ పడడం కంటే 'నా వంతుగా ఏం చేయగలను' అని ఆలోచించడం ముఖ్యం అనిపించింది. ఉపాధ్యాయులు, ఇంటర్‌నెట్ ద్వారా ఎన్నో విషయాల గురించి తెలుసుకోగలిగాను. పర్యావరణానికి ఉపయోగపడేలా మరిన్ని ఆవిష్కరణలు చేయాలనుకుంటున్నాను. మెడిసిన్ చేయాలనేది నా లక్ష్యం.

– మోనిక అక్కినేని

● మ్యూజిక్ వరల్డ్



లక్ష్యయ్ కపూర్

వన్స్‌మోర్ మోర్ అండ్ మోర్!

బాలీవుడ్‌లోని అత్యంత ఉత్తేజకరమైన యువ గొంతులలో ఒకటి... లక్ష్యయ్ కపూర్. 'దిల్ సే దిల్ తక్'లాంటి ఎన్నో ట్రెండింగ్ పాటలతో శ్రోతలకు దగ్గరయ్యాడు. ఈ రైజింగ్ స్టార్ ఆ మధ్య కాలంలో హైదరాబాద్‌లో ఇచ్చిన ప్రదర్శనకు మంచి స్పందన వచ్చింది. బాలీవుడ్ భారీ హిట్ పాటల నుంచి సూఫీ పాటల వరకు కపూర్ పాడిన పాటలు 'వన్స్‌మోర్' అనిపించాయి.

'నార్త్ ఇండియన్స్‌కు హైదరాబాద్ ప్రత్యేకమైన మార్కెట్' అంటున్న లక్ష్యయ్ కపూర్ హైదరాబాద్‌లో రెండుసార్లు ప్రదర్శన ఇచ్చాడు. 'నీది చక్కని స్వరం' అని చాలామంది ప్రశంసించినా ప్రొఫెషనల్ సింగర్ కావాలని కలలో కూడా అనుకోలేదు కపూర్. 'విధిని నమ్ముతాను. నేను ఈ స్థాయిలో ఉంటానని ఎప్పుడూ ఊహించలేదు. కచేరిలు చేస్తానని, సినిమాల్లో పాడుతానని ఎప్పుడూ అనుకోలేదు' అంటాడు లక్ష్యయ్. విధిని నమ్మినంత మాత్రాన కపూర్ రిలాక్స్‌డ్‌గా, ఖాళీగా ఎప్పుడూ కూర్చోలేదు. కష్టాన్నే ఇష్టంగా నమ్ముకున్నాడు. యువతలో చాలామంది 'తీవ్రమైన పోటీ ఉంది. మనం ఎక్కడ నిలబడతాం' అనుకొని పక్కకు తప్పుకుంటారు. అయితే లక్ష్యయ్ కపూర్ అలా ఎప్పుడూ అనుకోలేదు. ఆ నమ్మకమే సంగీత ప్రపంచంలో తనకంటూ ఒక స్థానాన్ని ఏర్పర్చింది. ఎన్నో సినిమాల్లో పాటలు పాడేలా, నెలకు పదికి పైగా షోలు చేసేలా చేసింది. 'నా కోసం తల్లిదండ్రులు పెద్ద కలలు కన్నారు. నిజానికి తల్లిదండ్రుల దృష్టిలో పిల్లలెప్పుడూ స్టార్‌లే' అంటున్నాడు లక్ష్యయ్ కపూర్.

● గేమింగ్

అనగనగా ఒక దీవిలో...



యాక్షన్-అడ్వెంచర్ గేమ్ లైక్ ఎ డ్రాగన్: పైరేట్ యకుజా ఇన్ హవాయి ఈ నెల 21న విడుదల అవుతుంది. లైక్ ఎ డ్రాగన్:ఇన్‌ఫినిటీ వెల్త్ (2024)కు కొనసాగింపుగా వస్తున్న గేమ్ ఇది. ఒక ద్వీపంలో చిక్కుకొని జ్ఞాపకాలు కోల్పోయిన గోరో మాజిమా ఆ తరువాత తన సిబ్బందితో కలిసి గుప్త నిధిని కనుక్కోనే ప్రయత్నం చేస్తాడు. ఈ గేమ్‌లో ప్లేయర్స్ మాజీమాను కంట్రోల్ చేస్తారు. మ్యాడ్ డాగ్, సీ డాగ్ అనే రెండు ఫైటింగ్ స్టైల్స్‌తో మాజీమా యాక్సెస్ కావచ్చు.
సిరీస్: లైక్ ఏ డ్రాగన్ ప్లాట్‌ఫామ్స్: ప్లేస్టేషన్ 4, ప్లేస్టేషన్ 5, విండోస్, ఎక్స్‌బాక్స్ వన్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్ జానర్స్: యాక్షన్-అడ్వెంచర్, హాక్ అండ్ స్లాష్ మోడ్: సింగిల్-ప్లేయర్

● ఇంగ్లీష్ ఇడియమ్స్



స్కేట్ ఆన్ థిన్ ఐస్

'రిస్క్ చేస్తున్నారు' అనుకున్నప్పుడు వాడే మాట...స్కేట్ ఆన్ థిన్ ఐస్
ఉదా: యూ ఆర్ స్కేటింగ్ ఆన్ థిన్ ఐస్

ఎగ్ ఆన్ యువర్ ఫేస్..

తప్పుగా, తెలివి తక్కువగా మాట్లాడటం, తప్పు చేయడం... ఇలాంటి సందర్భాల్లో ఉపయోగించే మాట...
ఉదా: శ్రీను హ్యాడ్ ఎగ్ ఆన్ హిజ్ ఫేస్ ఆఫ్టర్ సేయింగ్ హీ కుడ్ ఈజీలీ డూ ఫిఫ్టీ పుష్-అప్స్, అండ్ దెన్ గివింగ్ అప్ ఆఫ్టర్ డూయింగ్ జస్ట్ ట్వంటీ!

సాక్షి సినిమా

సరికొత్త మాస్ లుక్‌లో...



● ఎన్టీఆర్

'ఆర్‌ఆర్‌ఆర్, దేవర' వంటి వరుస విజయాల తర్వాత హీరో ఎన్టీఆర్, 'కేజీఎఫ్, సలార్' వంటి విజయాల తర్వాత డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో 'ఎన్టీఆర్ నీల్' (వర్కింగ్ టైటిల్) అనే పాన్ ఇండియా మూవీ రూపొందుతున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్‌పై కల్యాణ్ రామ్ నందమూరి, నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ గురువారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ ప్రకటించి, లొకేషన్‌లోని ఓ ఫొటోని షేర్ చేసింది. ''మాస్ హీరో, మాస్ డైరెక్టర్ ఇమేజ్ ఉన్న స్టార్స్ కాంబోలో తెరకెక్కుతోన్న 'ఎన్టీఆర్ నీల్'పై ఇటు ఇండస్ట్రీలో అటు ప్రేక్షకుల్లో ఫుల్ క్రేజ్ నెలకొంది. మూడువేల మంది జూనియర్ ఆర్టిస్టులతో ఓ భారీ యాక్షన్ ఎపిసోడ్ చిత్రీకరణతో షూటింగ్ ఆరంభించాం. తర్వాతి షెడ్యూల్ నుంచి ఎన్టీఆర్ షూటింగ్‌లో పాల్గొంటారు. ఇప్పటివరకు చూడనటువంటి మాస్ లుక్‌లో ఎన్టీఆర్‌ని చూపించనున్నారు ప్రశాంత్ నీల్. ప్రేక్షకులకు సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ని అందించనున్నాం. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో 2026 జనవరి 9న మా సినిమాని విడుదల చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమేరా: భువన్ గౌడ, సంగీతం: రవి బస్రూర్.

ఆమె నా బలం - చిరంజీవి



● నాగార్జున, అమల, చిరంజీవి, సురేఖ...


హీరో చిరంజీవి, సురేఖ దంపతులు తమ వివాహ వార్షికోత్సవాన్ని గురువారం (ఫిబ్రవరి 20) చాలా ప్రత్యేకంగా సెలబ్రేట్ చేసుకున్నారు. అది కూడా విమానంలో ఆకాశంలో విహరిస్తూ... ఆ ఫ్లైట్‌లో హీరో అక్కినేని నాగార్జున, ఆయన సతీమణి అమల, మహేశ్‌బాబు సతీమణి నమ్రతతో పాటు అత్యంత ఆత్మీయులు, స్నేహితులున్నారు. అందుకు సంబంధించిన ఫొటోలను చిరంజీవి సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు. ''ప్రియమైన స్నేహితులతో కలిసి ఫ్లైట్‌లో దుబాయ్ వెళ్తూ వారి సమక్షంలో మా పెళ్లి రోజును సెలబ్రేట్ చేసుకోవడం సంతోషంగా ఉంది. నా కలల జీవిత భాగస్వామిగా సురేఖ నా జీవితంలోకి అడుగుపెట్టినందుకు నేను చాలా అదృష్టవంతుణ్ణి. ఆమె నా బలం, నా యాంకర్ కూడా. ప్రపంచంలో నాకు తెలియని ఎన్నో అద్భుతమైన విషయాలను కనుగొనేందుకు ఎల్లప్పుడూ సాయం చేస్తుంటుంది. తను నా పక్కన ఉంటే సౌకర్యంతో పాటు నాకు అద్భుతమైన ప్రేరణ కూడా. తన పట్ల నాకున్న ప్రేమ, అభిమానాన్ని తెలియజేయడానికి ఇలాంటివి మరిన్ని సందర్భాలు ఉన్నాయి. థ్యాంక్యూ... మై సోల్‌మేట్ సురేఖ. మాకెంతో ప్రత్యేకమైన ఈ రోజున శుభాకాంక్షలు తెలిపిన కుటుంబ సభ్యులు, మిత్రులు, అభిమానులు, శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు'' అంటూ చిరంజీవి పోస్ట్ పెట్టారు. చిరంజీవి-సురేఖలకు పెళ్లయి 45 ఏళ్లయింది. 1980 ఫిబ్రవరి 20న వీరి వివాహం జరిగింది.

వినయం ముఖ్యం - అల్లు అర్జున్



'పుష్ప: ది రైజ్, పుష్ప 2: ది రూల్' సినిమాలతో అంతర్జాతీయ స్థాయిలో ప్రేక్షకులను అలరించడంతో పాటు ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్నారు హీరో అల్లు అర్జున్. 'పుష్ప: ది రైజ్'లో తన నటనకుగానూ ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డు అందుకున్న విషయం తెలిసిందే. అలాగే 'పుష్ప 2: ది రూల్' చిత్రంతో ప్రపంచవ్యాప్తంగా రూ.1871 కోట్ల వసూళ్లు సాధించి, సరికొత్త రికార్డులు సృష్టించిన అల్లు అర్జున్ తాజాగా మరో అరుదైన ఘనతని సొంతం చేసుకున్నారు. ప్రఖ్యాత హాలీవుడ్ సినిమా వార్తల మ్యాగజీన్ 'ది హాలీవుడ్ రిపోర్టర్' ఇప్పుడు 'ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా' పేరుతో ఇండియాలోనూ అడుగుపెట్టింది. ఈ మ్యాగజీన్ తొలి సంచిక కవర్ పేజీ అల్లు అర్జున్ ఫొటోతో 'అల్లు అర్జున్: ది రూల్' పేరుతో రానుండటం విశేషం. తాజాగా ఈ కవర్ పేజ్ ఫొటోషూట్‌ను నిర్వహించారు. ఆ ప్రోమో వీడియోను షేర్ చేశారు. అందులో అల్లు అర్జున్ పంచుకున్న కొన్ని విషయాలను చూపారు. ''ఇండియన్ బాక్సాఫీస్ వద్ద నటుడిగా గుర్తింపు తెచ్చుకునే అవకాశం నాకు రావడం ఆనందంగా ఉంది. బలం, ఆత్మవిశ్వాసం అనేవి మనసులో ఉంటాయి. వాటిని ఎవరూ తీసేయలేరు. కొన్ని లక్షణాలు పుట్టుకతో వస్తాయి. ఇది అలాంటిదే. విజయం తర్వాత కూడా వినయంగా ఉండటం చాలా ముఖ్యం. జీవితంలో సక్సెస్ అయిన తర్వాత కూడా ఎలాంటి గర్వం లేని చాలా మందిని చూశాను. అది వారి వ్యక్తిత్వం మీద ఆధారపడి ఉంటుంది. నేను వంద శాతం సామాన్యుడినే. సినిమా చూస్తున్నప్పుడు కూడా ఇదే భావనతో ఉంటాను. అలాగే విరామ సమయంలో కేవలం విశ్రాంతి మాత్రమే తీసుకుంటాను. ఏమీ చేయకుండా ఉండటమే నాకిష్టం. కనీసం పుస్తకం కూడా చదవను'' అంటూ 'ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా' ఇంటర్వ్యూలో అల్లు అర్జున్ పేర్కొన్నారు.

సహజంగా కనిపించే అవకాశం దక్కింది - బ్రహ్మాజీ



''బాపు' చాలా యునిక్ కాన్సెప్ట్. రైతులు ఆత్మహత్య చేసుకుంటే ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తుంటుంది. అప్పుల బాధతో నా పాత్ర ఆత్మహత్యకి ప్రయత్నించినప్పుడు ఏమవుతుంది? అనేది ఈ సినిమాలో చూడాలి. ఈ చిత్రం ఫైనల్ కాపీ చూశాను... చాలా బాగా వచ్చింది. ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుతుంది'' అని బ్రహ్మాజీ అన్నారు. దయా దర్శకత్వంలో బ్రహ్మాజీ, ఆమని, 'బలగం' సుధాకర్ రెడ్డి, ధన్యా బాలకృష్ణ, మణి ఏగుర్ల, అవసరాల శ్రీనివాస్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'బాపు'. రాజు, సీహెచ్ భానుప్రసాద్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా నేడు ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా బ్రహ్మాజీ మాట్లాడుతూ- ''రెండేళ్ల క్రితం దయా 'బాపు' కథ చెప్పారు. పాయింట్ చాలా కొత్తగా, నా పాత్ర వైవిధ్యంగా ఉండటంతో పాటు సహజంగా కనిపించే అవకాశం ఉండటంతో ఒప్పుకున్నాను. అయితే బడ్జెట్‌పై చర్చ జరుగుతున్నప్పుడు.. నాకు పారితోషికం వద్దు... విడుదల తర్వాత లాభాలు వస్తే ఇవ్వమని నిర్మాతలకు చెప్పాను. నా తర్వాత ఇతర నటీనటులు కూడా పారితోషికం తగ్గించడం, లొకేషన్‌లో క్యారవ్యాన్స్ వాడకుండా చిత్రీకరణ జరిపిన ఊర్లో (కరీంనగర్) ఉంటూ సర్దుకుపోవడంతో ఈ మూవీ పూర్తి చేశాం. కథపై ఇష్టం, సినిమాపై నమ్మకంతోనే ఇది సాధ్యపడింది. ఆమనిగారు సహజ నటి. 'బాపు' టైటిల్ రోల్‌లో సుధాకర్ రెడ్డిగారి పాత్రతో ఆడియన్స్ చాలా కనెక్ట్ అవుతారు. ఈ సినిమాలోని రెండు పాటలు బాగా పాపులర్ అయ్యాయి. డైరెక్టర్ చంద్రశేఖర్ యేలేటిగారికి మా సినిమా చాలా నచ్చింది. ఇక 'సూపర్ డీలక్స్' సినిమాలో విజయ్ సేతుపతిగారు చేసినటువంటి పాత్ర చేయాలన్నది నా కల. ప్రస్తుతం చిరంజీవిగారి 'విశ్వంభర'లో ఓ పాత్ర చేశాను. సిద్ధు జొన్నలగడ్డ 'జాక్'తో పాటు తరుణ్ భాస్కర్, రాజ్ తరుణ్ వంటి వారి సినిమాల్లో నటిస్తున్నాను'' అని తెలిపారు.

రా రాజా పెద్ద ప్రయోగం - తమ్మారెడ్డి భరద్వాజ్



● శివప్రసాద్, తమ్మారెడ్డి భరద్వాజ్, హరిప్రసాద్

''డైరెక్టర్ స్టీవెన్ స్పీల్ బర్గ్ తీసిన 'డ్యూయల్' చిత్రంలో నటీనటుల ముఖం కనిపించదు. అలాంటి నేపథ్యంలో 'రా రాజా' సినిమా తీసి దర్శకుడు శివ ప్రసాద్ ధైర్యం చేశాడు. ఇది చాలా పెద్ద ప్రయోగం'' అని దర్శక-నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ్ అన్నారు. బి. శివ ప్రసాద్ దర్శకత్వంలో పద్మ సమర్పణలో శ్రీ పద్మిణి సినిమాస్ బ్యానర్‌పై రూపొందిన చిత్రం 'రా రాజా'. బుర్లే హరిప్రసాద్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా, కిట్టు లైన్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించిన ఈ సినిమా మార్చి 7న విడుదల కానుంది. ఈ మూవీ రిలీజ్ డేట్ పోస్టర్‌ను తమ్మారెడ్డి భరద్వాజ్ రిలీజ్ చేసి, మాట్లాడుతూ- ''ఈ చిత్రంలో ముఖాలు కనిపించవు. కథే ముందుకు వెళ్తుంటుంది. ఇది అద్భుతమైన ఐడియా. ఇది సక్సెస్ అయితే హీరోలు, స్టార్లతో పని లేకుండా అద్భుతమైన చిత్రాలు, ప్రయోగాలు చేయొచ్చని అంతా ముందుకు వస్తారు'' అన్నారు. ''మా చిత్రంలో నటీనటుల ముఖాలు కనిపించవు. కథ, కథనమే ముఖ్యంగా ఈ మూవీని తీశాం. ఇది ఒక ప్రయోగం'' అన్నారు శివప్రసాద్.

క్రైమ్... థ్రిల్



● ఆనంది

ఆనంది, వరలక్ష్మీ శరత్ కుమార్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'శివంగి'. దేవరాజ్ భరణి ధరణ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో జాన్ విజయ్, డా. కోయ కిషోర్ ఇతర పాత్రలు పోషించారు. ఫస్ట్ కాపీ మూవీస్ బ్యానర్‌పై నరేశ్‌బాబు పి. నిర్మించిన ఈ చిత్రం మార్చి 7న రిలీజ్ కానుంది. ఈ సినిమాలోని ఆనంది ఫస్ట్ లుక్‌ని డైరెక్టర్ అనిల్ రావిపూడి విడుదల చేశారు. ''ఒక స్త్రీ తన జీవితంలో ఊహించని పరిస్థితులను ఎదుర్కొనే కథ చుట్టూ ఈ సినిమా తిరుగుతుంది. విమెన్ సెంట్రిక్ ఫిల్మ్స్‌లో మా మూవీ వైవిధ్యమైన కథ, స్క్రీన్‌ప్లేతో ఉంటుంది. మా చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఈ క్రైమ్ థ్రిల్లర్ మూవీ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుంది'' అని మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఏహెచ్ కాషిఫ్-ఎబినేజర్ పాల్, కెమేరా: భరణి కె. ధరణ్.



స్టార్ హీరో – డైరెక్టర్ల కాంబినేషన్‌పై 'గురూ... కొత్త కాంబినేషన్ షురూ!' కథనం, నాని 'హిట్ 3', మోహన్‌లాల్ 'దృశ్యం 3' విశేషాల కోసం సాక్షి ఫ్లస్ ఈపేపర్‌ని చూడండి.

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 331

శుక్రవారం 21-2-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'సామాన్యులకు వైద్యం ఏనాడూ ఖరీదుగా ఉండకూడదు. అందుకే అందరికీ ఆరోగ్యశ్రీ'



షమీ.. శుబ్.. ఆరంభం

గిల్ సెంచరీ. షమీకి 5 వికెట్లు. బంగ్లాదేశ్‌పై భారత్ గెలుపు -15లో



పసికూనలకు రక్షణ...లా


చిన్నారులపై లైంగిక వేధింపుల కేసులో తీర్పు చెబుతూ ఓ జడ్జి రాసిన కవిత -14లో

ఎవరినో గెలిపించేందుకు ప్రయత్నించారు

భారత్‌లో ఓటర్ల సంఖ్యను పెంచే ఉద్దేశంతో నిర్వహించే కార్యక్రమాలకు గత బైడెన్ ప్రభుత్వం 2.1 కోట్ల డాలర్ల ఆర్థిక సాయం వెనుక మరేదో కుట్ర కోణం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ఆరోపణలు చేశారు. ఎన్నికల్లో ఇంకెవరినో గెలిపించాలని భావించి నాటి సర్కారు ఈ చర్య చేపట్టి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. అసలు భారత్‌లో ఓటర్ల సంఖ్య పెంచేందుకు అమెరికా సొంత డబ్బు ఎందుకు ఖర్చు చేయాలని ప్రశ్నించారు.

వివరాలు 6లో ▶





హైకోర్టు జడ్జిపై లోక్‌పాల్ విచారణా..?


ఒక హైకోర్టు సిట్టింగ్ అదనపు జడ్జిపై లోక్‌పాల్ విచారణ చేపడుతూ ఉత్తర్వులు జారీ చేయడాన్ని సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా తప్పుబట్టింది. ఈ ధోరణి ఏమాత్రం ఆమోదనీయం కాదని తేల్చిచెప్పింది. లోక్‌పాల్ జారీ చేసిన ఉత్తర్వుల అమలుపై స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. హైకోర్టు జడ్జి ఉదంతంలో స్పందన తెలపాలని కేంద్ర ప్రభుత్వం, లోక్‌పాల్ రిజిస్ట్రార్‌తోపాటు హైకోర్టు జడ్జిపై ఫిర్యాదుచేసిన వ్యక్తికి సుప్రీంకోర్టు నోటీసులు జారీచేసింది.

వివరాలు 6లో ▶

పరీక్షల సమరం

యుద్ధవీరులు 25 లక్షలు.. తెరవెనుక సైన్యం మరో కోటి

- మార్చి నుంచి జూన్ వరకు పరీక్షలే పరీక్షలు
- వార్షిక, ప్రవేశపరీక్షలతో వేడెక్కుతున్న వాతావరణం
- విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు ఉక్కిరిబిక్కిరి
- తొలుత ఇంటర్, అవి ముగిసీ ముగియకముందే టెన్త్
- ఆ తర్వాత జేఈఈ మెయిన్... ఈఏపీ సెట్



జూన్ 15న నీట్ పీజీతో ముగియనున్న సీజన్

సాక్షి, హైదరాబాద్: ఇది పరీక్షల సమయం. భవిష్యత్తును నిర్ణయించే తరుణం. ఇటు వార్షిక పరీక్షలు.. మరోవైపు ప్రవేశ పరీక్షలతో విద్యార్థులు ఉక్కిరిబిక్కిరి అయ్యే కాలం. తీవ్రమైన ఒత్తిడితో గడిపే సీజన్. విద్యార్థుల్లో టెన్షన్..విద్యాసంస్థల్లో హైటెన్షన్. ఇంకోవైపు తల్లిదండ్రుల అటెన్షన్. మొత్తం మీద వేసవికి ముందే వేడి ఊపందుకుంటోంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 25 లక్షల మంది విద్యార్థులు పరీక్షల పోరుకు సిద్ధమవుతున్నారు. వీరికి అండగా నిలిచే తల్లిదండ్రులు, పరీక్షల సమరానికి సిద్ధం చేసే అధ్యాపకులు, ఇతరులు కలిపి మరో కోటి మంది ఈ క్రతువులో భాగస్వాములవుతారని అంచనా. ఫైనల్ పరీక్షలు, ఉన్నత చదువులకు సంబంధించిన ప్రవేశ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. పరీక్షల సమయంలో పిల్లలకు అందుబాటులో ఉండేందుకు తల్లిదండ్రులు సెలవులు పెట్టడం లాంటి ఏర్పాట్లు చేసుకుంటుంటే, మరోవైపు విద్యాసంస్థలు..ప్రత్యేక తరగతులు, మోడల్ టెస్టులతో ఫలితాల తరాజులో మొగ్గు తమవైపే ఉండేలా విద్యార్థులను సన్నద్ధం చేయడంలో నిమగ్నమయ్యాయి.

మార్చి టు జూన్..

మార్చి నుంచి జూన్ వరకూ వరుసగా ఎన్నో పరీక్షలు. ముందుగా ఇంటర్మీడియెట్ పరీక్షలు మొదలవుతాయి. మార్చి 5వ తేదీ నుంచి 25 వరకూ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలు జరుగుతాయి. ఇప్పటికే ప్రాక్టికల్స్ పూర్తయ్యాయి. థియరీ పరీక్షల కోసం అధికారులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఇంటర్ పరీక్షలు చివరలో ఉండగానే టెన్త్ పరీక్షలు షురూ అవుతాయి. మార్చి 21 నుంచి ఏప్రిల్ 2 వరకూ ఇవి కొనసాగుతాయి. ఓరియంటల్ సబ్జెక్టులు రెండురోజుల పాటు జరుగుతాయి. ఇక ఇంటర్ పూర్తి చేసిన ప్రతి విద్యార్థికీ కీలకమైన ప్రవేశ పరీక్ష ఈఏపీ సెట్. ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి ఈ పరీక్షే గేట్ పాస్. ఇది ఏప్రిల్ 29 నుంచి మే 5 వరకూ జరుగుతుంది. ప్రఖ్యాత ఐఐటీలు, జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్లు సాధించాలనేది లక్షల మంది కల. ఈ మెట్టు ఎక్కాలంటే జేఈఈ పరీక్ష రాయాల్సిందే. తొలి విడత సెషన్ ఇప్పటికే పూర్తయింది. రెండో విడత ఏప్రిల్ 1 నుంచి 8 వరకు జరుగుతుంది. ఇక ఐఐటీల్లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ మే 18న జరుగుతుంది. ఇక డిగ్రీ, పీజీ,

మిగతా 2వ పేజీలో ▶

పరీక్షలయ్యే వరకు ధైర్యం చెబుతున్నాం..

అమ్మాయి చదువుపైనే దృష్టి పెడుతున్నాం. రాత్రి పడుకునే వరకూ ఏం కావాలో అందిస్తున్నాం. పరీక్షలంటే భయం ఉండకుండా ధైర్యం చెబుతున్నాం. ఆరోగ్యం దెబ్బ తినకుండా చూస్తున్నాం. కాలేజీకి వెళ్లి లెక్చరర్లతో మాట్లాడి వారి సలహాలు కూడా పాటిస్తున్నాం.



- సానియా బేగం (ఇంటర్ విద్యార్థిని తల్లి, జడ్చర్ల)

'మార్గదర్శి' మోసాల కేసు మూత?

బాబు డైరెక్షన్‌లో ఒక్కసారిగా ప్లేటు ఫిరాయించిన సీఐడీ

రూ.1,050 కోట్ల మార్గదర్శి ఆస్తుల జప్తుపై రాజకీయ ఒత్తిళ్లతో ఇప్పటికే అప్పీళ్లు ఉపసంహరణ

- ఆ చిట్‌ఫండ్ కంపెనీపై కేసు పెట్టడం 'పొరపాటు..' దానికి వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాల్లేవ్
- ఇప్పటివరకు సేకరించినవన్నీ నేరాన్ని నిరూపించడం లేదు
- అందువల్ల ఇక కేసును మూసేయవచ్చు.. మూసివేతకు అదనపు డీజీ అనుమతి కూడా ఇచ్చారు
- దీంతో కోర్టులో దాఖలు చేసేందుకు తుది నివేదిక సిద్ధం చేశాం
- ఆ నివేదిక దాఖలుకు అదనపు డీజీ రవిశంకర్ అయ్యన్నార్ అనుమతి ఇవ్వాల్సి ఉంది.. హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసిన దర్యాప్తు సంస్థ
- సీఐడీ తుది నివేదికను సంబంధిత కోర్టు అనుమతిస్తే అంతే సంగతులు
- మార్గదర్శి చిట్‌ఫండ్ అక్రమాలు శాశ్వతంగా సమాధి అయినట్లే..



- అదే కోరుకుంటున్న చంద్రబాబు సర్కార్.. రాజగురువుపై బాబు రాజభక్తి
- అటు అక్రమ డిపాజిట్లు సేకరించిన మార్గదర్శి ఫైనాన్షియర్స్‌కు అనుకూలంగా తెలంగాణ హైకోర్టులో వైఖరి.. ఇటు మార్గదర్శి చిట్‌ఫండ్‌కు అనుకూలంగా ఏపీ హైకోర్టులో సీఐడీ ద్వారా అఫిడవిట్

మార్గదర్శి అక్రమాలకు కీలక ఆధారాలున్నట్లు గతంలో హైకోర్టుకు నివేదించిన సీఐడీ

ప్రభుత్వం మారడంతో ఆధారాల్లేవంటూ రూటు మార్చిన వైనం

వివరాలు 3లో ▶

న్యూస్‌రీల్

ఈఏపీ సెట్‌కు 25 నుంచి దరఖాస్తుల స్వీకరణ



ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే టీజీఈఏపీసెట్‌కు ఈ నెల 25 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. ఏప్రిల్ 4 వరకూ అపరాధ రుసుము లేకుండా సెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.

- వివరాలు 12లో ▶

షాపింగ్ ఓ రేంజ్‌లో..



విలాసవంతమైన ఉత్పత్తులపట్ల అభిరుచి చిన్న పట్టణాలకూ విస్తరిస్తోంది. ఖరీదైన వస్తువుల కోసం పట్టణవాసులు సైతం ఆర్డర్ చేస్తున్నారు. దీంతో లగ్జరీ ఉత్పత్తుల కొనుగోళ్లు మెట్రో నగరాలకే పరిమితమన్న అభిప్రాయం క్రమంగా చెరిగిపోతోంది.

- వివరాలు 15లో ▶

కనీస పెన్షన్.. ఈసారైనా పెరిగేనా?



ఉద్యోగుల పెన్షన్ పథకం కింద ఇస్తున్న కనీస పెన్షన్ రూ. వెయ్యి పరిమితిని పెంచాలనే డిమాండ్ తీవ్రమవుతోంది. సామాజిక పెన్షన్ పథకాల కింద ఇస్తున్న మేరకైనా పెన్షన్‌ను పెంచాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి.

- వివరాలు 12లో ▶

కాల్ మెర్జింగ్‌తో కాజేస్తారు!



దేశంలో సైబర్ నేరగాళ్లు తాజాగా కాల్ మెర్జింగ్ స్కాంకు తెరలేపారు. మనకు తెలియకుండానే ఓటీపీలు తీసుకుని మన బ్యాంకు ఖాతాల్లో సొమ్మును కాజేస్తున్నారు. ఈ తరహా మోసాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఎన్‌పీసీఐకు చెందిన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ హెచ్చరించింది.

- వివరాలు 16లో ▶

కృష్ణా జలాలపై సర్కార్ మొద్దునిద్ర

మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం



- ఏపీ అక్రమంగా నీటిని తరలిస్తున్నా పట్టింపులేదు.. సాగర్ కుడి కాలువ నుంచి ఏపీకి రోజుకు 10 వేల క్యూసెక్కులు
- ఏపీ తాత్కాలిక వాటా 512 టీఎంసీలు, తరలించింది 657 టీఎంసీలు
- రాష్ట్రానికి రావాల్సింది 343 టీఎంసీలు, వాడింది 220 టీఎంసీలు
- కళ్లు తెరవకపోతే తెలంగాణలో సాగు, తాగునీటికి తీవ్ర సమస్య

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణా నది జలాలను అక్రమంగా తరలిస్తున్నా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర నటిస్తోందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. తెలంగాణ సాగు, తాగునీటి ప్రయోజనాలకు నష్టం కలుగుతున్నా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా ఉందని మండిపడ్డారు. రాష్ట్రంలో లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండుతున్నాయని, వేసవిలో తాగునీటి సమస్య తీవ్రమయ్యే అవకాశముందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం ఆయన తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యేలు

మిగతా 12వ పేజీలో ▶

బీఆర్‌ఎస్ పాలనలోనే 'కృష్ణా'లో అన్యాయం

నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్



- ఏపీ, తెలంగాణకు 512 : 299 టీఎంసీల కోటాను అంగీకరిస్తూ నాటి పాలకులు సంతకం చేశారు
- పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంపునకు సహకరించారు
- నాగార్జున సాగర్ సగభాగాన్ని ఏపీకి అప్పగించి వెళ్లారు
- ఇప్పుడు దుష్ప్రచారంతో మా ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేస్తున్నారు

సాక్షి, హైదరాబాద్: కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరిగింది ముమ్మాటికీ గత బీఆర్‌ఎస్ పాలనలోనే అని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. కృష్ణా జలాలను ఏపీ పాలకులు దోచుకుపోతుంటే అందుకు సహకరించిన బీఆర్‌ఎస్ పాలకులు.. ఇప్పుడు తమ ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలుచేసేందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఉమ్మడి ఏపీకి కృష్ణా జలాల్లో ఉన్న 811 టీఎంసీల వాటాలను ఏపీ, తెలంగాణకు పంపిణీ చేసేందుకు 2015 జూన్ 18, 19 తేదీల్లో కేంద్ర జలశక్తి శాఖ సమావేశం

మిగతా 12వ పేజీలో ▶

ఢిల్లీ సీఎంగా ప్రమాణ స్వీకారం అనంతరం ప్రధాని మోదీకి నమస్కరిస్తున్న రేఖా గుప్తా ▼



రేఖా గుప్తా అనే నేను..

ఢిల్లీ నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం

మంత్రులుగా ఆరుగురు ఎమ్మెల్యేల ప్రమాణం

- రామ్‌లీలా మైదానంలో పండుగ వాతావరణం
- హాజరైన ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు

6లో

మ్యూజియంగా 'శీష్ మహల్'?

అధికారిక నివాసంలో ఉండబోనన్న కొత్త సీఎం రేఖా గుప్తా

మ్యూజియంగా మార్చేందుకు సర్కార్ మొగ్గు

42.6%

మంది పట్టభద్రులే ఉద్యోగాలకు అర్హులు




దేశంలో 2023తో పోలిస్తే 1.7 శాతం తగ్గిన నైపుణ్యం

- అర్హత ఉన్న పట్టభద్రుల్లో ఢిల్లీ టాప్.. ఉత్తరాది రాష్ట్రాలదే హవా
- టాప్–10లో ఒకే ఒక్క దక్షిణాది రాష్ట్రం తెలంగాణకు చోటు
- ఇండియా గ్రాడ్యుయేట్ స్కిల్ ఇండెక్స్–2025 నివేదికలో వెల్లడి

వివరాలు 13లో ▶

హైకోర్టు ఫుల్ బెంచ్ తీర్పున్నా సెలవు రోజు కూల్చివేతలా?

చట్టాన్ని పాటించాల్సిందే.. ఇష్టం వచ్చినట్లు చేస్తే ఊరుకోం



చట్టాన్ని ధిక్కరిస్తే.. హైడ్రాను రద్దు చేస్తాం

అధికారులను హెచ్చరించిన హైకోర్టు

- నీటివనరులు, సర్కార్ భూముల రక్షణకు మేం వ్యతిరేకం కాదు
- రాత్రికి రాత్రే నగరాన్ని మార్చలేమని గుర్తుంచుకోండి
- 'కూల్చివేతల'పై దాఖలైన పిటిషన్‌లో జస్టిస్ కె.లక్ష్మణ్ వ్యాఖ్యలు

సాక్షి, హైదరాబాద్: ఎన్నిసార్లు చెప్పినా.. చట్టాన్ని ధిక్కరించి మీ ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా)ని రద్దు చేస్తూ ఆదేశాలు ఇవ్వాల్సివస్తుందని హైకోర్టు తీవ్రస్థాయిలో హెచ్చరించింది. 'ఎందుకంత తొందర.. రాత్రికి రాత్రే హైదరాబాద్ నగరాన్ని మార్చలేరు. ఏం చేసినా చట్ట ప్రకారం చేయాలి తప్ప ఇష్టం వచ్చినట్లు కాదు'అని హైడ్రా తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. నిబంధనలు పాటించకుండా ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తోందని పేర్కొంది. హైడ్రా ఏకపక్ష చర్యలను తప్పుబట్టింది. 'సరైన విచారణ నిర్వహించకుండా వారాంతాల్లో కూల్చివేతలకు పాల్పడుతున్నారు. ఓసారి తెల్లవారుజామున 4 గంటలకు ప్రహరీ కూల్చివేశారు. దోపిడీ దొంగలు మాత్రమే అలా వ్యవహరిస్తారు.. అధికారులు అలా చేయరన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఆక్రమణల స్వాధీనానికి, అనుమతి లేని భవనాల కూల్చివేతకు మేం ఏ మాత్రం వ్యతిరేకం కాదు. కానీ, ప్రతి దానికీ ఓ చట్టం అంటూ ఉంటుంది. దాన్ని ప్రతీ వ్యక్తి పాటించి తీరాల్సిందే'అని తేల్చిచెప్పింది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ముత్తంగి సర్వే నంబర్ 296/ఇ/2 మూడు గుంటల భూమిలోని షెడ్‌ను ఎలాంటి సమాచారం లేకుండా (ఆదివారం) కూల్చివేయడాన్ని సవాల్ చేస్తూ ప్రవీణ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ గురువారం

మిగతా 2వ పేజీలో ▶

ఇదండీ సంగతి



నీ దగ్గర ఉన్నంత డబ్బు నా దగ్గర కూడా లేదు!



నెమ్మదిగా జీర్ణమయ్యే రెండు ప్రత్యేక వరి వంగడాలపై 'ఇరి' గురి

తెల్లబియ్యం తిన్నా..

షుగర్ పెరగదు!

- ఈ ఏడాది ఖరీఫ్‌కు లో గ్లైసెమిక్ ఇండెక్స్‌తో కూడిన 'ఐఆర్ఆర్ఐ 147' సిద్ధం
- ఇంకో ఏడాదిలో అత్యల్ప గ్లైసెమిక్‌తో హై ప్రొటీన్‌ను అందించే మరో వంగడం రెడీ
- ఫిలిప్పీన్స్‌లోని అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థలో పూర్తి కావొచ్చిన ప్రయోగాలు
- 'సాక్షి సాగుబడి'తో ముఖాముఖిలో 'ఇరి' ప్రధాన శాస్త్రవేత్త డా.నెసె శ్రీనివాసులు



నెసె శ్రీనివాసులు

సాక్షి, సాగుబడి డెస్క్: ప్రపంచవ్యాప్తంగా 54 కోట్ల మంది షుగర్ వ్యాధి (మధుమేహం) బాధితులుంటే.. అందులో 10.1 కోట్ల మంది భారతీయులే (2030 నాటికి ఈ సంఖ్య 15 కోట్లకు చేరనుంది). త్వరలోనే ఈ జాబితాలో చేరే వారు జనాభాలో మరో 15% ఉంటారు. గ్లైసెమిక్ ఇండెక్స్ (జీఐ) ఎక్కువగా ఉండే సాంబ మసూరి (జీఐ 72) వంటి పాలిష్ చేసిన తెల్ల బియ్యం తినటం మధుమేహానికి ప్రధాన కారణాల్లో మొదటిదని ఫిలిప్పీన్స్‌లోని అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ (ఇరి) గుర్తించింది. ఏదైనా ఆహార పదార్థాన్ని తిన్న తర్వాత అది ఎంత త్వరగా గ్లూకోజ్‌గా మారి రక్తంలో కలుస్తున్నదో సూచించేదే 'గ్లైసెమిక్ ఇండెక్స్'. ఇది ఎంత ఎక్కువగా ఉంటే అంత హానికరమన్నమాట. హరిత విప్లవానికి ముందు ఐఆర్8 వంటి అధిక దిగుబడినిచ్చే 'మిరకిల్ రైస్' వంగడాన్ని ఇచ్చి మన దేశ ఆకలి తీర్చిన 'ఇరి'.. ఇప్పుడు షుగర్ పెంచని, ప్రొటీన్ లోపాన్ని ఎదుర్కొనే మరో రెండు అద్భుత వంగడాలను అందుబాటులోకి తెస్తోంది. లో గ్లైసెమిక్ ఇండెక్స్ (55%) కలిగిన 'ఐఆర్ఆర్ఐ147' ఈ ఏడాది ఖరీఫ్‌లోనే మన దేశంలో అందుబాటులోకి రానుంది. అలాగే అల్ట్రా లో

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

నేడు వికారాబాద్, నారాయణపేటలో సీఎం రేవంత్ పర్యటన

శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, బహిరంగ సభ

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి శుక్రవారం వికారాబాద్, నారాయణపేట జిల్లాల్లో పర్యటించనున్నారు. పలు అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి పాల్గొననున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు సీఎం వికారాబాద్ జిల్లా దుద్యాల్ మండలం పోలేపల్లి గ్రామానికి చేరుకుంటారు. పోలేపల్లిలో రేణుకా ఎల్లమ్మ తల్లి జాతరలో భాగంగా ఆలయంలో జరిగే పూజా కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ తర్వాత నారాయణపేట మండలం అప్పక్‌పల్లి చేరుకుంటారు. అక్కడ జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పెట్రోల్ బంక్‌ను ప్రారంభిస్తారు. అనంతరం అప్పక్‌పల్లిలో మొదటి విడతగా గతనెల 26న మంజూరు చేసిన 72,045 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. నారాయణపేట మెడికల్ కాలేజీలో అకడమిక్ బ్లాక్‌తో పాటు, ఇతర భవనాల నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు గురుకుల హాస్టల్ ఆవరణలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తారు.

అసెంబ్లీకి కేసీఆర్ గైర్హాజరుపై వ్యాజ్యం



సాక్షి, హైదరాబాద్: ప్రతిపక్ష నేత కె.చంద్రశేఖర్‌రావు అసెంబ్లీకి హాజరుకాకపోవడంపై హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ప్రధాన ప్రతిపక్ష నేతగా కేసీఆర్ అసెంబ్లీకి హాజరయ్యేలా స్పీకర్, కార్యదర్శికి ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.విజయ్‌పాల్‌రెడ్డి పిల్ దాఖలు చేశారు. ప్రజలు, ప్రధానంగా రైతు సమస్యలను అసెంబ్లీలో చర్చించేందుకు విపక్ష నేత హాజరుకాకపోవడంతో ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లుతోందన్నారు. స్పీకర్, అసెంబ్లీ కార్యదర్శికి, కేసీఆర్, కేటీఆర్‌కు లీగల్ నోటీసులు ఇచ్చినా ఫలితం లేకపోయిందని తెలిపారు. దీంతో ప్రజాస్వామ్య పరిరక్షణకు హైకోర్టును ఆశ్రయించినట్లు పేర్కొన్నారు. ఇందులో ప్రతివాదులుగా స్పీకర్, అసెంబ్లీ కార్యదర్శి, కేసీఆర్, కేటీఆర్‌లను చేర్చారు. ఈ పిల్‌కు ఇంకా నంబర్ కేటాయించలేదు. రిజిస్ట్రీ పరిశీలనలో ఉంది.

ఆధారాల్లేకుండానే కేసులు నమోదు

ఎఫ్‌ఐఆర్‌లను కొట్టివేయాలంటూ హైకోర్టును ఆశ్రయించిన కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: ఎలాంటి సాక్ష్యాలు, ఆధారాల్లేకుండా తనపై ముషీరాబాద్, బంజారాహిల్స్ పోలీసులు కేసులు నమోదు చేశారని, వాటిని కొట్టివేయాలని కోరుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ హైకోర్టులో రెండు పిటిషన్లు దాఖలు చేశారు. 2023, నవంబర్ 27న ఎన్నికల ప్రచార ర్యాలీలో భాగంగా బాణాసంచా కాల్చి ప్రజలకు ఇబ్బంది కలిగించారంటూ అప్పటి ముషీరాబాద్ ఏఎస్‌ఐ ఆర్.ప్రేమ్‌కుమార్ ఫిర్యాదు చేశారన్నారు. అయితే, ర్యాలీకి ముందస్తు అనుమతి తీసుకున్నామని, బాణాసంచాతో ఇబ్బందులు పడినట్లు ఎవరూ ఫిర్యాదు చేయ లేదని చెప్పారు. ఫిర్యాదుదారులు.. సాక్షులు ఇద్దరూ పోలీసులేనన్నారు. సరైన దర్యాప్తు చేయకుండానే పోలీసులు చార్జిషీట్ దాఖలు చేశారని.. కేసులను కొట్టేయాలని కోరారు. పిటిషన్ దాఖలు చేసిన వారిలో కేటీఆర్‌తో పాటు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ కూడా ఉన్నారు. అలాగే, కాంట్రాక్టర్లు, బిల్డర్ల నుంచి వసూలు చేసిన రూ.2,500 కోట్లను సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి పంపారంటూ 2024, మార్చి 27న కేటీఆర్ వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ పార్టీకి చెందిన బి.శ్రీనివాసరావు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. రాజకీయ కక్షతో పెట్టిన ఈ కేసును కొట్టేయాలని కేటీఆర్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై ఒకట్రెండు రోజుల్లో జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టనున్నారు.

దర్యాప్తు నిలిపివేత ఉత్తర్వులు సవరించండి

'ఫోన్ ట్యాపింగ్'పై హైకోర్టులో పోలీసుల పిటిషన్

సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్‌పై రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్‌గౌడ్ పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదైన కేసును నిలిపివేస్తూ జారీ చేసిన ఉత్తర్వులను సవరించాలని కోరుతూ పోలీసులు హైకోర్టులో మధ్యంతర అప్లికేషన్ (ఐఏ) దాఖలు చేశారు. లంచ్ మోషన్ రూపంలో విచారణ చేపట్టాలని పీపీ పల్లె నాగేశ్వర్‌రావు కోరారు. ట్రయల్ కోర్టులో నిందితుల (ఏ-4, ఏ-5) కస్టడీ కోరుతూ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారని, ఒకవేళ పిటిషన్‌కు అనుమతిస్తే ధిక్కరణ అవుతుందని న్యాయస్థానం దృష్టికి తెచ్చారు. ట్రయల్ కోర్టు ఏ నిర్ణయం తీసుకోవాలన్నది కూడా సందిగ్ధంగా ఉందన్నారు. న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ స్పందిస్తూ.. ఇప్పటికిప్పుడు విచారణ సాధ్యం కాదని, శుక్రవారం చేపడతామని చెప్పారు.

తెల్లబియ్యం తిన్నా.. షుగర్ పెరగదు!

▶ మొదటి పేజీ తరువాయి

గ్లైసెమిక్ (45%) + హై ప్రొటీన్ (16%)ను అందించే మరో అద్భుత వంగడం ఇంకో ఏడాదిలో అందుబాటులోకి రానుందని 'ఇరి' ప్రధాన శాస్త్రవేత్త, కంజ్యూమర్-డ్రివెన్ గ్రెయిన్ క్వాలిటీ అండ్ న్యూట్రిషన్ యూనిట్ హెడ్ డా.నెసె శ్రీనివాసులు తెలిపారు. ఈ రెండో వంగడానికి డాక్టర్ శ్రీనివాసులు స్వయంగా రూపకల్పన చేశారు. భారత్ పర్యటనలో భాగంగా ఇటీవల హైదరాబాద్‌కు వచ్చిన ఆయన 'సాక్షి సాగుబడి'తో ముచ్చటించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

తక్కువ జీఐ.. 'ఐఆర్ఆర్ఐ147'

'ఐఆర్ఆర్ఐ 147' రకం తెల్లగా పాలిష్ చేసిన బియ్యంలో గ్లైసెమిక్ ఇండెక్స్ (55%) తక్కువగా ఉంటుంది. 22.3 పీపీఎం జింక్ ఉంటుంది. ఉప్పదనాన్ని, తెగుళ్లను తట్టుకుంటుంది. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్)కి రెండేళ్ల క్రితం 'ఇరి' ఈ వంగడాన్ని అందించింది. ఒడిశా రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి ఐసీఏఆర్ ఈ వంగడాన్ని ప్రయోగాత్మకంగా క్షేత్రస్థాయిలో సాగు చేసింది. 7కు గాను 4 జోన్లలో మంచి ఫలితాలు వచ్చాయి. హెక్టారుకు 5- 9.5 టన్నుల దిగుబడి వచ్చింది. ప్రస్తుతం 'సీడ్ వితవుట్ బార్డర్స్-ఎల్లలు లేని విత్తనాలు' కార్యక్రమంలో భాగంగా ఫాస్ట్ ట్రాక్‌లో విడుదల చేసే ప్రయత్నం జరుగుతోంది. ఇది ముతక రకం కావటంతో ఉప్మా రవ్వ, అటుకులు, తదితర అల్పాహార ఉత్పత్తులుగా ప్రాసెస్ చేసి విక్రయించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ నాటికి మన దేశంలోని రైతులకు ఐసీఏఆర్ ద్వారా ఈ న్యూక్లియస్ సీడ్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుంది.

అత్యల్ప జీఐ, రెట్టింపు ప్రొటీన్!

షుగర్ రోగులు కూడా తినదగిన అతి తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్‌తో పాటు అధిక ప్రొటీన్‌ను కలిగి ఉండే అద్భుత వరి వంగడాన్ని 'ఇరి' భారతీయులకు అందిస్తోంది. దీనికి ఇంకా పేరు పెట్టలేదు. అత్యంత ప్రజాదరణ పొందిన సాంబ మసూరి మాదిరిగానే ఇది సన్న రకం, అధిక దిగుబడినిచ్చేది కూడా. సాధారణ సాంబ మసూరి జీఐ 72% కాగా, ప్రొటీన్ 8%, కుక్‌డ్ రెసిస్టెంట్ స్టార్చ్ 0.3% మాత్రమే. సాంబ మసూరితో కలిపి రూపొందిస్తున్న ఈ సరికొత్త రకం జీఐ కేవలం 45% మాత్రమే. ప్రొటీన్ మాత్రం రెట్టింపు. అంటే.. 16%. కుక్‌డ్ రెసిస్టెంట్ స్టార్చ్ కూడా 3.8% ఉంటుంది. అందువల్ల తిన్న తర్వాత 125 నిమిషాల వరకు నెమ్మదిగా జీర్ణమవుతూ గ్లూకోజ్‌ను తగుమాత్రంగా విడుదల చేస్తూ ఉంటుంది. షుగర్ వ్యాధిగ్రస్తులు, ప్రీ డయాబెటిక్ స్థితిలో ఉన్న వారు కూడా ఈ రకం తెల్ల బియ్యాన్ని ఇబ్బంది లేకుండా తినవచ్చు. వచ్చే ఏడాది దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఈ వంగడాన్ని ప్రయోగాత్మకంగా ఐసీఏఆర్ ఆధ్వర్యంలో సాగు చేస్తాం. ప్రజల దైనందిన ఆహారం ద్వారా డయాబెటిస్ వ్యాప్తిని అడ్డుకునేందుకు, ప్రొటీన్ లోపాన్ని అరికట్టడానికి ఈ వంగడం ఉపకరిస్తుంది.

ఎఫ్‌పీవోల ద్వారా సాగు.. మహిళా సంఘాల ద్వారా ప్రాసెసింగ్

అత్యల్ప గ్లైసెమిక్ ఇండెక్స్‌తో పాటు రెట్టింపు ప్రొటీన్‌ను కలిగి ఉండే ఆరోగ్యదాయకమైన కొత్త రకం వరి బియ్యాన్ని, ఇతర ఉప ఉత్పత్తులను దేశంలోని సాధారణ ప్రజలకు సైతం అందుబాటులోకి తేవాలన్నదే 'ఇరి' లక్ష్యం. ఒకసారి అందుబాటులోకి వస్తే భారత్‌తో పాటు ఇతర దేశాల్లోనూ ఈ బియ్యానికి చాలా గిరాకీ ఉంటుంది. అందువల్ల ఈ వంగడంపై పెద్ద కంపెనీలు గుత్తాధిపత్యం పొందటానికి వీల్లేకుండా, ఈ బియ్యాన్ని, ఇతర ఉత్పత్తులను దేశ ప్రజలకు సరసమైన ధరకే అందుబాటులోకి తేవటానికి కేంద్రం, ఒడిశా ప్రభుత్వాలతో కలసి పని చేస్తున్నాం. ఇందులో భాగంగా ఒడిశాలో ఎంపిక చేసిన కొన్ని రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పీఓలు) రైతులతో సాగు చేయిస్తున్నాం. మిల్లింగ్, ప్రాసెసింగ్‌లో 30 మహిళా స్వయం సహాయక బృందాలకు శిక్షణ ఇచ్చారు. భువనేశ్వర్ దగ్గర్లో ప్రత్యేక ప్రాసెసింగ్ ఫ్యాక్టరీని ప్రభుత్వం భారీ పెట్టుబడితో నెలకొల్పుతోంది. ప్రత్యేక బ్రాండ్‌ను ప్రారంభించి ఆరోగ్యదాయకమైన ఈ బియ్యం, ఇతర ఉత్పత్తులను రిటైల్ మార్కెట్‌లోని పెద్ద కంపెనీల ద్వారా సరసమైన ధరలకే ప్రజలకు విక్రయించేందుకు గట్టిగా కృషి చేస్తున్నాం.



యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఈనెల 23న స్వర్ణ దివ్య విమాన గోపురానికి జరిగే మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవానికి రావాలని సీఎం రేవంత్‌రెడ్డిని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆహ్వానించారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతో కలిసి జూబ్లీహిల్స్‌లోని నివాసంలో ముఖ్యమంత్రికి ఆహ్వానపత్రిక అందజేశారు. అంతకుముందు సీఎం రేవంత్‌రెడ్డికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేసి, శ్రీస్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. సీఎస్ శాంతికుమారి, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్, ఆలయ ఈఓ భాస్కర్‌రావు పాల్గొన్నారు. - యాదగిరిగుట్ట

మిగులు జలాల వినియోగం ఎలా?

నేడు కృష్ణా బోర్డు అత్యవసర భేటీ

- శ్రీశైలం, సాగర్‌లో మిగిలిన నీటి నిల్వల వినియోగంపై జరగనున్న చర్చ
- తెలంగాణ ఫిర్యాదులపై కదలిక.. చర్యలకు ఉపక్రమించిన బోర్డు



కృష్ణా బోర్డు చైర్మన్ అతుల్ జైన్‌తో మాట్లాడుతున్న ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల ఉమ్మడి జలాశయాలైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో ప్రస్తుతం మిగిలి ఉన్న నిల్వల వినియోగంపై చర్చించేందుకు శుక్రవారం కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ప్రత్యేక అత్యవసర సమావేశం జరగనుంది. మధ్యాహ్నం హైదరాబాద్ జలసౌధలో జరిగే ఈ సమావేశానికి ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నీటిపారుదల శాఖల కార్యదర్శులు హాజరు కావాలని కోరుతూ బోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పూరే లేఖ రాశారు. శ్రీశైలం, సాగర్‌లో ప్రస్తుతం మిగిలి ఉన్న నిల్వల్లో ఏపీకి 27.03 టీఎంసీలు, తెలంగాణకు 131.75 టీఎంసీల వాటాలున్నాయని పేర్కొంటూ ఇటీవల రాసిన లేఖకు కొనసాగింపుగా ఈ అత్యవసర సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు కృష్ణా బోర్డు తెలిపింది. ఏపీ తన వాటాకు మించి కృష్ణా జలాలను అక్రమంగా వాడుకుంటోందని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్.. కృష్ణా బోర్డు ద్వారా ఏపీని నియంత్రించే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే కృష్ణా బోర్డు అత్యవసర సమావేశాన్ని నిర్వహించనుంది.

నిల్వలన్నీ తమవే అంటున్న తెలంగాణ

ప్రస్తుత నీటి సంవత్సరంలో 1,010.134 టీఎంసీల జలాలు లభ్యతలోకి రాగా.. తాత్కాలిక సర్దుబాటు ప్రకారం ఏపీకి 666.68 టీఎంసీలు, తెలంగాణకు 343.44 టీఎంసీల వాటా లుంటాయని కృష్ణాబోర్డు తేల్చింది. ఏపీ ఇప్పటికే 639.652 టీఎంసీలు వాడుకోగా, ఆ రాష్ట్ర కోటాలో 27.03 టీఎంసీలు మాత్రమే మిగిలి ఉన్నట్టు తెలిపింది. తెలంగాణ 211.691 టీఎంసీలు వాడుకోగా, మరో 131.75 టీఎంసీలు మిగిలి ఉన్నాయని లెక్క గట్టింది. మరోవైపు నాగార్జునసాగర్ కనీస నీటిమట్టం (ఎండీడీఎల్) 510 అడుగులకు పైన 63.6 టీఎంసీలు, శ్రీశైలం జలాశయం కనీస నీటిమట్టం 834 అడుగులకు పైన 30.811 టీఎంసీల నిల్వలు మాత్రమే ప్రస్తుతం ఉన్నాయని స్పష్టం చేసింది. అయితే ఏపీ ఇప్పటికే తమ వాటాకు మించి నీళ్లను వాడుకుందని, కాబట్టి జలాశయాల్లో మిగిలి ఉన్న నిల్వలు పూర్తిగా తమవేనని పేర్కొంటూ తెలంగాణ తాజాగా కృష్ణా బోర్డుకు లేఖ రాసింది. కృష్ణా జలాల వినియోగం విషయంలో ఏపీ, తెలంగాణల మధ్య వివాదం ముదురుతున్న నేపథ్యంలో.. ఈ అంశంపై కృష్ణా బోర్డు అత్యవసర సమావేశాన్ని నిర్వహించతలపెట్టడడం ప్రాధాన్యత సంతరించుకుంది. కాగా, గురువారం జలసౌధలో మంత్రి ఉత్తమ్‌తో కృష్ణా బోర్డ్ చైర్మన్ అతుల్ జైన్ సమావేశమయ్యారు. ఏపీ, తెలంగాణ మధ్య న్యాయమైన రీతిలో నీటి పంపకాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఉత్తమ్ కోరారు.

ఒక పంటకైనా నీళ్లు ఇవ్వండి: తెలంగాణ

తెలంగాణలోని కృష్ణా పరీవాహక ప్రాంతాల రైతులు కనీసం ఒక పంటనైనా సాగుచేసుకునేందుకు నీళ్లు కేటాయించాలని జస్టిస్ బ్రిజేష్‌కుమార్ నేతృత్వంలోని కృష్ణా ట్రిబ్యునల్-2కి రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ఏపీ, తెలంగాణ మధ్య కృష్ణా జలాల పంపిణీపై విచారణ నిర్వహిస్తున్న ట్రిబ్యునల్ ఎదుట రాష్ట్రం తరఫున సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ గురువారం రెండోరోజు వాదనలు వినిపించారు. కావేరి ట్రిబ్యునల్ అవార్డుపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో తన వాదనలకు అనుకూలంగా ఉన్న కొన్ని వివరాలను ఆయన చదివి వినిపించారు. కావేరి, కృష్ణా బేసిన్‌ల మధ్య పలు అంశాల్లో పోలికలున్నాయని, రెండు బేసిన్లలో నీటి కొరత ఉండగా, అవసరాలు అధికంగా ఉన్నాయని చెప్పారు. అధిక నీళ్లు అవసరమైన వరి సాగుకు బదులుగా తక్కువ నీళ్లతో తక్కువ వ్యవధిలో పండే పంటలను సాగు చేయాలని కావేరి ట్రిబ్యునల్ చేసిన సూచనను కృష్ణా పరీవాహకంలో అమలు చేయాలని ప్రతిపాదించారు.

మార్చి 5న గోదావరి బోర్డు సమావేశం

గోదావరి నదీ యాజమాన్య బోర్డు సమావేశం మార్చి 5న హైదరాబాద్‌లోని జలసౌధలో జరగనుంది.

పరీక్షల సమరం

▶ మొదటి పేజీ తరువాయి

డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి వరుసబెట్టి పరీక్షలున్నాయి. ఐసెట్, పీజీఈసెట్, ఈసెట్, ఎడ్‌సెట్, లాసెట్.. వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే యూజీ, పీజీ నీట్... ఇలా జూన్ వరకూ పరీక్షలే పరీక్షలు.

విద్యార్థుల వెనుక కీలకంగా..: రాష్ట్రంలో జరిగే పలు పరీక్షలకు సుమారు 25 లక్షల మంది విద్యార్థులు హాజరవుతారని అంచనా. ఇది మనకు ప్రత్యక్షంగా కన్పించే సంఖ్య మాత్రమే. ఒక్కో విద్యార్థిని పరీక్షకు సన్నద్ధం చేసేందుకు ఇద్దరు తల్లిదండ్రులు, సగటున మరో ఇద్దరు ఉపాధ్యాయులు తెర వెనుక కృషి చేస్తారు. వీరే కాదు పరీక్షల ఏర్పాట్లలో ఉండే ఉద్యోగులు, విద్యాసంస్థల సిబ్బంది పాత్రా కీలకమే. ఈ లెక్కన సుమారు కోటి మందికి ఇది పరీక్షా కాలమనే చెప్పాలి. విద్యార్థులను సన్నద్ధం చేయడం మొదలుకుని, పరీక్షా కేంద్రాల ఏర్పాటు, సిబ్బంది నియామకం, ప్రశ్నపత్రాలు పంపడం, వాటిని మూల్యాంకన కేంద్రాలకు చేర్చడం.. మొత్తం మీద ఎవరికీ ఈ సీజన్‌లో కంటి మీద కునుకు ఉండదంటే అతిశయోక్తి కాదు. విద్య, వైద్యం, రెవెన్యూ, రవాణా, పోలీస్... తదితర శాఖలకూ ఇది పరీక్షా కాలమనే చెప్పాలి. ఒక రకంగా ప్రభుత్వానికీ ఇవి ఓ సవాలే. ఎక్కడ ఏ పొరపాటు జరిగినా పొలిటికల్ హీట్ తారస్థాయికి చేరుతుంది. దీంతో పరీక్షల దగ్గర్నుంచి ఫలితాల వెల్లడి వరకు టెన్షన్ తప్పని పరిస్థితి.

ఏపీలో 24.50 లక్షల మంది: ఏపీలో జరిగే వార్షిక, ప్రవేశ పరీక్షలకు దాదాపు 24.50 లక్షల మంది విద్యార్థులు సిద్ధమవుతున్నారు. ఇంటర్మీడియెట్ పరీక్షలకు 10.59 లక్షల మంది విద్యార్థులు హాజరవుతుండగా, పదో తరగతి పరీక్షలకు రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు కలిపి 6.49 లక్షల మంది సిద్ధమవుతున్నారు. సెట్‌లతో కూడా కలిపితే ఏపీలో సుమారు 24.50 లక్షల మంది వివిధ పరీక్షలు రాయనున్నారు.

పరీక్ష	తేదీ	రాసే విద్యార్థులు
ఇంటర్	మార్చి 5 నుంచి 25	9.20 లక్షలు
టెన్త్	మార్చి 21 నుంచి ఏప్రిల్ 2 3, 4 తేదీల్లో ఓరియంటల్ సబ్జెక్టులు	5.50 లక్షలు
ఈఏపీ సెట్	ఏప్రిల్ 29, 30 (అగ్రికల్చర్, ఫార్మా) మే 2-5 (ఇంజనీరింగ్)	3 లక్షలు
జేఈఈ మెయిన్-2	ఏప్రిల్ 1-8	2.5 లక్షలు
జేఈఈ అడ్వాన్స్‌డ్	మే 18	50 వేలు
ఐసెట్	జూన్ 8, 9	77 వేలు
పీజీఈసెట్	జూన్16-19	25 వేలు
ఈసెట్	మే 12	21 వేలు
ఎడ్‌సెట్	జూన్1	33 వేలు
లాసెట్	జూన్6	30 వేలు
పీఈసెట్	జూన్ 11, 14	2 వేలు
నీట్ యూజీ	మే 4	2 లక్షలు
నీట్ పీజీ	జూన్15	50 వేలు

పూర్తిస్థాయిలో రివిజన్ చేయిస్తున్నాం



టెన్త్, ఇంటర్ పరీక్షలు కీలకమైనవి. ఇప్పటికే విద్యార్థులను సిద్ధం చేశాం. మరోసారి పూర్తిస్థాయిలో రివిజన్ చేయిస్తున్నాం. విద్యార్థులు పరీక్షలు అంటే కాస్తా టెన్షన్‌గా ఫీలవ్వడం సహజం. ఇలాంటి వారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇస్తున్నాం. అందరికీ మంచి మార్కులు వచ్చేలా టీచర్లు ప్రత్యేక తరగతులు తీసుకుంటూ అలుపెరుగకుండా కష్టపడుతున్నారు.

- ఆర్.పార్వతీరెడ్డి (హార్వెస్ట్ విద్యాసంస్థలు, ఖమ్మం)

ఒకింత టెన్షన్‌గానే ఉంది

గతంలో చాలా పరీక్షలు రాశా. వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు వస్తాయని నమ్మకం ఉంది. అయితే ఒక్కోసారి చదివిందే వస్తుందా? ఇంపార్టెంట్ ఏమిటనే గందరగోళానికి గురవుతున్నా. ముఖ్యమైన చాప్టర్స్ పదే పదే చదవమని టీచర్లు చెబుతున్నారు. నాలో ధైర్యం పెంచేలా తల్లిదండ్రులు కూడా సహకరిస్తున్నారు.

- ముక్తివరపు శేఖర్, (ఇంటర్ సెకండియర్ విద్యార్థి, హైదరాబాద్)

మధ్యాహ్న భోజనానికీ ఫేస్ రికగ్నిషన్!

ప్రభుత్వానికి భద్రాద్రి, పెద్దపల్లి కలెక్టర్ల సూచన

- ఈ రెండు జిల్లాల్లో పథకంపై అధ్యయనం



నివేదికలు పరిశీలిస్తున్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి.పాటిల్

కొత్తగూడెం అర్బన్: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు నమోదు కోసం ఉపయోగిస్తున్న ఫేస్ రికగ్నిషన్ (ఎఫ్ఆర్ఎస్) డేటాను మధ్యాహ్న భోజన పథకానికి కూడా ఉపయోగించాలని భద్రాద్రి కొత్తగూడెం, పెద్దపల్లి జిల్లా కలెక్టర్లు ప్రభుత్వానికి సూచించారు. మధ్యాహ్న భోజన పథకంలో లోపాలను సరిచేసి, మెరుగైన ఫలితాలు రాబట్టేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఈ రెండు జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా అధ్యయనం చేయాలని గత శనివారం ప్రభుత్వం ఆదేశించింది. దీంతో భద్రాద్రి కొత్తగూడెం, పెద్దపల్లి జిల్లాల కలెక్టర్లు జితేశ్ వి.పాటిల్, కోయ శ్రీహర్ష రెండు జిల్లాల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు, బిల్లుల చెల్లింపు తదితర అంశాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. పథకంలో మార్పుచేర్పులపై రాష్ట్రస్థాయిలో 12 మంది ఉన్నతాధికారులతో కమిటీని ఏర్పాటుచేశారు. ఈ బృందంలో భద్రాద్రి, పెద్దపల్లి కలెక్టర్లు, డీఈఓలతోపాటు కొత్తగూడెం ఎంఈఓ, విద్యాశాఖ ఉన్నతాధికారులు ఉన్నారు. వీరు మరోమారు అధ్యయనం చేసి సంస్కరణలపై నివేదిక సమర్పించనున్నారు.

బిల్లుల పెండింగే సమస్య..

మధ్యాహ్న భోజన పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు సమకూరుస్తున్నాయి. వారానికి మూడుసార్లు కోడిగుడ్లతో పాటు ఆకు, కూరగాయలతో మెనూ అమలు చేస్తున్నారు. ఇటీవల మెనూలో మార్పులు చేసినా పూర్తిస్థాయిలో అమలు కావటంలేదు. ఈ పథకం బాధ్యతలు నిర్వహిస్తున్న మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు సకాలంలో బిల్లులు అందక ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకంలో 54,200 మంది కార్మికులు ఉండగా, భద్రాద్రి జిల్లాలో 2,150 మంది పని చేస్తున్నారు. ఈ జిల్లాలో 1 నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులకు సంబంధించి గతేడాది నవంబర్ నుంచి.. 9, 10 తరగతుల వారివి సెప్టెంబర్ నుంచి బిల్లులు పెండింగ్ ఉన్నాయి. వీరికి నెలకు రూ.3,000 చొప్పున ఇచ్చే గౌరవ వేతనాలు కూడా అందాల్సి ఉంది.

కలెక్టర్ల నివేదికలోని అంశాలు

- ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరును ఫేస్ రికగ్నిషన్ సిస్టం ద్వారా నమోదు చేస్తున్నారు. ఇదే డేటాను మధ్యాహ్న భోజన బిల్లులకూ అనుసంధానం చేయాలి. దీనివల్ల రోజువారీగా ఎందరు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందుతుందో తెలిసిపోతుంది.
- ప్రస్తుతం 1 నుంచి 5 వరకు.. 6 నుంచి 8వ తరగతి వరకు ..9 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు సంబంధించి మూడేసి బిల్లులు రూపొందిస్తున్నారు. అలాగే, కోడిగుడ్లకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వేతన బిల్లు.. ఇలా ఆరు బిల్లులను రూపొందించి ప్రభుత్వానికి పంపుతున్నారు. వీటి ఆధారంగా ఈ-కుబేర్ నుంచి కార్మికులకు బిల్లుల సొమ్ము అందిస్తున్నారు. ఈ ప్రక్రియలో ఎక్కడైనా అవాంతరం ఎదురైతే నెలల తరబడి బిల్లులు పేరుకుపోతున్నాయి. దీంతో కొందరు వంట సిబ్బంది అప్పులు చేసి భోజనాలు వండిపెడుతున్నారు. ఎలాంటి జాప్యం లేకుండా బిల్లుల తయారీ, చెల్లింపునకు ఎఫ్ఆర్ఎస్‌ను భోజన బిల్లులకు అనుసంధానిస్తే మెరుగైన ఫలితం ఉంటుందని కలెక్టర్లు నివేదికలో సూచించారు.

చట్టాన్ని ధిక్కరిస్తే.. హైడ్రాను రద్దు చేస్తాం

▶ మొదటి పేజీ తరువాయి

మరోసారి విచారణ చేపట్టారు. హైడ్రా ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ కోర్టు ఎదుట హాజరుకావాలన్న ఆదేశాల మేరకు ఆయన న్యాయస్థానం ముందు హాజరయ్యారు.

ఇకపై జరగదంటూనే.. మళ్లీ అదే తప్పు: పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... 'పార్కు స్థలంలో నిర్మాణాలు చేపడుతున్నారని గాయత్రి మెంబర్స్ అసోసియేషన్ ఇచ్చిన వినతిపత్రంపై హైడ్రా నోటీసులు జారీ చేసింది. నాలా, సేల్ డీడ్, పంచాయతీ అనుమతులు ఇలా అన్ని డ్యాక్యుమెంట్లను ప్రవీణ్ సమర్పించారు. అయినా పట్టించుకోకుండా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సెలవు రోజున కూల్చివేశారు' అని చెప్పారు. హైడ్రా స్టాండింగ్ కౌన్సిల్ రవీందర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'పంచాయతీ కార్యదర్శి బలవంతంగా అనుమతులు మంజూరు చేశారు. ఆ తర్వాత వాటిని రద్దు చేశారు. సెలవు రోజు కూల్చివేతలు లాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం' అని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. 'ప్రతీసారి ఇలా జరగకుండా చూసుకుంటామంటూనే మళ్లీ అదే తప్పు చేస్తున్నారు. గతంలో హైకోర్టు ఫుల్ బెంచ్ ఇచ్చిన ఆదేశాలనూ లెక్కచేయకుండా, చట్టాన్ని పాటించకుండా వ్యవహరిస్తే హైడ్రాను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవో 99ను రద్దు చేస్తాం. హైడ్రా తప్పులకు ఓ రిజిస్టర్ నిర్వహించాల్సిన పరిస్థితి కూడా రావొచ్చు. నిర్మాణ అనుమతి రద్దు ఉత్తర్వులను కోర్టు ముందు ఎందుకు ఉంచలేదు? సదరు పంచాయతీ అధికారిపై చర్యలు తీసుకున్నారా? హైడ్రా తీరు ఆక్షేపణీయం. నీటి వనరులు, రహదారులు, ప్రభుత్వ భూముల రక్షణకు మేం వ్యతిరేకం కాదు. కానీ, చర్యలు చట్టబద్ధమై ఉండాలన్నదే మా ఉద్దేశం' అని వ్యాఖ్యానించారు. గతంలో ఇచ్చిన స్టేటస్‌కో ఆదేశాలను పొడిగిస్తూ, తదుపరి విచారణ వరకు ఎటువంటి నిర్మాణ కార్యకలాపాలు కొనసాగించకూడదని ఆదేశించారు. ప్రతివాదులకు వ్యక్తిగత నోటీసులతో సహా నోటీసులు జారీ చేయాలంటూ తదుపరి విచారణను మార్చి 5కు వాయిదా వేశారు.

సీఎంను కలిసే అవకాశమే లేదా?

నాలుగు దఫాలు ప్రయత్నించినా నిరాశే.. మాజీ ఎమ్మెల్యే నర్సయ్య ఆవేదన



సీఎం ఇంటి వద్ద గుమ్మడి నర్సయ్య

ఇల్లెందు: ఇల్లెందు నియోజకవర్గం నుంచి ఐదు దఫాలు ఎమ్మెల్యేగా గెలిచిన తాను.. నాలుగుసార్లు ప్రయత్నించినా సీఎం రేవంత్‌రెడ్డి అపాయింట్‌మెంట్ దొరకలేదని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఏకంగా సీఎం ఇంటికి వెళ్లినా అనుమతి లభించలేదని తెలిపారు. సెక్రటేరియట్ ఇనుప కంచెలు కూల్చివేసిన సీఎం.. ఒక మాజీ ఎమ్మెల్యేను లోపలికి రానివ్వరా? అని ప్రశ్నించారు. ఇల్లెందు నియోజకవర్గంలో పోడు భూములకు పట్టాలు, సీతారామ ప్రాజెక్టు నీటిని ఇల్లెందు భూములకు పారించడం, రుణమాఫీ, కొత్త రుణాలు, రైతు భరోసా, కొత్త మండలాలు, రెవెన్యూ డివిజన్ ఏర్పాటు తదితర అంశాలపై సీఎంకు వినతిపత్రం ఇవ్వాలన్నదే తన ఉద్దేశమని స్పష్టం చేశారు. దీన్నిబట్టీ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలు, ప్రజాప్రతినిధులకు ఎంత దూరంగా ఉంటున్నారో అర్థమవుతోందని నర్సయ్య చెప్పారు.

విద్య.. కేంద్ర గుత్తాధిపత్యం కాదు

ఢిల్లీ నుంచి రిమోట్ కంట్రోల్‌తో నడపలేరు

- రాష్ట్రాల హక్కులు హరించేలా యూజీసీ మార్గదర్శకాలు
- తిరువనంతపురం విద్యా సమ్మేళనంలో భట్టి విక్రమార్క



కేరళ ముఖ్యమంత్రి విజయన్‌తో డిప్యూటీ సీఎం భట్టి కరచాలనం

సాక్షి, హైదరాబాద్: భారత రాజ్యాంగంలో విద్య ఉమ్మడి జాబితాలో ఉందని, దానిపై కేంద్ర ప్రభుత్వ గుత్తాధిపత్యం పనికిరాదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. విద్యపై కేంద్రానికి గుత్తాధిపత్యం కట్టబెట్టేందుకే యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) కొత్త మార్గదర్శకాలను తీసుకొచ్చిందని ఆరోపించారు. రాష్ట్రాలు తమ సొంత విద్యావిధానాన్ని రూపొందించుకోవడానికి అధికారం ఉండాలని అభిప్రాయపడ్డారు. విద్యా వ్యవస్థను ఢిల్లీ నుంచి రిమోట్ కంట్రోల్ ద్వారా నడపలేరని తేల్చి చెప్పారు. కేరళ ప్రభుత్వం తిరువనంతపురంలో గురువారం నిర్వహించిన జాతీయ ఉన్నత విద్యా సమ్మేళనంలో భట్టి మాట్లాడారు. 'యూజీసీ నిబంధనలు మీరు బిల్లు చెల్లించాలి కానీ ఫుడ్ ఆర్డర్ చేయలేరు అన్నట్లుగా ఉన్నాయి. వర్సిటీలకు రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు సమకూర్చాలి. కీలకమైన వైస్-చాన్స్‌లర్ల నియామకం, ప్రవేశాలపై అధికారం మాత్రం కేంద్రానికి ఇవ్వాలని ముసాయిదాలో ఉంది. వైస్ చాన్స్‌లర్ల నియామకానికి సెర్చ్ కమిటీల్లో రాష్ట్ర ప్రభుత్వ పాత్రను తొలగించడం, వైస్ చాన్స్‌లర్ల అర్హతలు మార్చడం ఆందోళనకరం. ఇది ఇలాగే కొనసాగితే రాష్ట్రాలు భవనాలు ప్రారంభించే రిబ్బన్ కటింగ్ అధికారానికి మాత్రమే పరిమితమవుతాయి' అని పేర్కొన్నారు.

రాష్ట్రాలకు విద్యపై స్వయంప్రతిపత్తి ఉండాలి: స్వయం ప్రతిపత్తి లేకుండా నాణ్యమైన విద్యను ఏ రాష్ట్రమూ అందించలేదని భట్టి విక్రమార్క అన్నారు. ఈ అంశంపై రాష్ట్రాల ఉమ్మడి విజ్ఞప్తిని కేంద్రం తప్పక పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సహకారమంటే బలవంతంగా రుద్దడం కాదని చురకలంటించారు. రాష్ట్రాలు ఐక్యంగా గళం విప్పితే ఆ ప్రతిధ్వని ఎంత దూరమైనా చేరుతుందని అన్నారు. తెలంగాణలో విద్యారంగంలో చేపట్టిన సంస్కరణలు, ఫలితాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భట్టి వివరించారు. సరైన మార్గాన్ని ఎంచుకునే హక్కు రాష్ట్రాలకు ఉందని, సరైన నిర్ణయం తీసుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ అంశంపై తదుపరి సమావేశాన్ని తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో నిర్వహించేందుకు సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కేరళ సీఎం పినరయి విజయన్, ఆ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి ఆర్. బిందు, కర్ణాటక మంత్రి ఎం.సీ. సుధాకర్ అవారే, తమిళనాడు నుంచి తిరు గోవి చేజియాన్, పంజాబ్ నుంచి సర్దార్ హరోజ్ సింగ్ తోపాటు ప్రముఖ విద్యావేత్తలు పాల్గొన్నారు.

'మార్గదర్శి' మోసాల కేసు మూత?

"ఆర్బీఐ సెక్షన్ 45 (ఎస్)కి విరుద్ధంగా మార్గదర్శి ఫైనాన్షియర్స్ అక్రమ డిపాజిట్లను సేకరించిన వ్యవహారంలో రామోజీ, ఆయన కుటుంబ సభ్యులను రక్షించేందుకు ఎంత చేయాలో అంత చేస్తూ వస్తున్న చంద్రబాబు ప్రభుత్వం.. ఇప్పుడు రామోజీ కుటుంబానికి ఆర్థికంగా అత్యంత కీలకమైన మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ విషయంలోనూ అదే రీతిలో వ్యవహరించింది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలపై దాఖలు చేసిన అప్పీళ్లను సీఐడీ ద్వారా ఇప్పటికే ఉపసంహరింప జేసిన చంద్రబాబు ప్రభుత్వం.. ఇప్పుడు మరింత బరి తెగించి మార్గదర్శి చిట్‌ఫండ్‌పై అసలు కేసు నమోదు చేయడమే 'పొరపాటు..' అంటూ దర్యాప్తు సంస్థతో చెప్పించింది"

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్ అక్రమాలు, ఆర్థిక అవకతవలకు కీలక ఆధారాలున్నాయని గతంలో బల్లగుద్ది గట్టిగా వాదించిన సీఐడీ.. చంద్రబాబు ప్రభుత్వం ఒత్తిడితో ఒక్కసారిగా ప్లేటు ఫిరాయించింది. తాము సేకరించిన మౌఖిక, రాతపూర్వక ఆధారాలేవీ మార్గదర్శి చిట్‌ఫండ్ అక్రమాలను రుజువు చేసేవి కావంటూ నిస్సహాయంగా చేతులెత్తేసింది. ఈమేరకు మార్గదర్శి చిట్‌ఫండ్ విషయంలో కేసు నమోదు చేయడం పొరపాటు అంటూ సంబంధిత కోర్టులో ఫైనల్ రిపోర్ట్ దాఖలు చేయనున్నట్లు దర్యాప్తు సంస్థ హైకోర్టుకు నివేదించింది. మార్గదర్శి అక్రమాలను నిరూపించేందుకు అన్ని ఆధారాలున్నాయని గతంలో తేల్చి చెప్పిన సీఐడీ హఠాత్తుగా స్వరం మార్చడం వెనుక సీఎం చంద్రబాబు ఒత్తిళ్లు తీవ్ర స్థాయిలో ఉన్నట్లు తెలుస్తోంది. బాబు డైరెక్షన్‌లో.. ఆయన ఆదేశాల మేరకు దర్యాప్తు సంస్థ నడుచుకుంటున్నట్లు స్పష్టమవుతోంది. రాజగురువు రామోజీ లేనప్పటికీ ఆయన కుటుంబం పట్ల చంద్రబాబు సర్కారు రాజభక్తిని చాటుకుంటూనే ఉంది! రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా నిబంధనలకు విరుద్ధంగా... ఆర్బీఐ సెక్షన్ 45 (ఎస్) తమకు వర్తించదంటూ మార్గదర్శి ఫైనాన్షియర్స్ చట్ట విరుద్ధంగా అక్రమ డిపాజిట్లను సేకరించిన వ్యవహారంలో రామోజీరావు, ఆయన కుటుంబ సభ్యులను రక్షించేందుకు ఎంత చేయాలో అంత చేస్తూ వస్తున్న చంద్రబాబు ప్రభుత్వం.. ఇప్పుడు రామోజీ కుటుంబానికి ఆర్థికంగా అత్యంత కీలకమైన మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ విషయంలోనూ అదే రీతిలో వ్యవహరించింది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాల విషయంలో దాఖలు చేసిన అప్పీళ్లను సీఐడీ ద్వారా ఇప్పటికే ఉపసంహరింప చేసిన చంద్రబాబు ప్రభుత్వం ఇప్పుడు మరింత బరి తెగించింది. ఏకంగా మార్గదర్శి చిట్‌ఫండ్‌పై కేసు నమోదే 'పొరపాటు..' అంటూ సీఐడీ చేత చెప్పించింది. అంతేకాక ఇప్పటి వరకు సాగించిన దర్యాప్తులో సేకరించిన మౌఖిక, రాతపూర్వక ఆధారాలు ఏవీ కూడా మార్గదర్శి చిట్‌ఫండ్‌పై పెట్టిన కేసును నిరూపించేవిగా లేవంటూ సీఐడీతో ఏకంగా హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేయించింది. మార్గదర్శి చిట్‌పై కేసు నమోదు 'పొరపాటు..' (మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్) అంటూ సంబంధిత కోర్టులో ఫైనల్ రిపోర్ట్ దాఖలు చేసేందుకు రంగం సిద్ధం చేయించింది. ఇక ఫైనల్ రిపోర్ట్ దాఖలు చేసేందుకు సీఐడీ అదనపు డీజీ డాక్టర్ రవిశంకర్ అయ్యన్నార్ అనుమతి మంజూరు చేయడమే తరువాయి. తద్వారా మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలు ఎప్పటికీ బహిర్గతం కాకుండా శాశ్వతంగా సమాధి కట్టాలని బాబు సర్కారు నిర్ణయించింది.

ఒకవైపు తెలంగాణ హైకోర్టులో మార్గదర్శి ఫైనాన్షియర్స్ అక్రమ డిపాజిట్ల కేసులో రామోజీరావు చట్టవిరుద్ధంగా వ్యవహరించారని రిజర్వ్ బ్యాంక్ ఇండియా (ఆర్‌బీఐ) బహిర్గతం చేయగా.. మరోవైపు చంద్రబాబు ప్రభుత్వం మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలకు ఆధారాల్లేవని ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో సీఐడీ చేత చెప్పించడం గమనార్హం. మరో కీలక విషయం ఏమిటంటే.. తెలంగాణ హైకోర్టులో మార్గదర్శి ఫైనాన్షియర్స్ అక్రమాల కేసు విచారణకు వచ్చిన రోజే.. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు అనుకూలంగా సీఐడీ కౌంటర్ దాఖలు చేయడం. చట్ట ఉల్లంఘనలకు పాల్పడినందుకు మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కి చెందిన రూ.1,050 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులకు సంబంధించి హైకోర్టులో సీఐడీ దాఖలు చేసిన అప్పీళ్లను ఆ సంస్థ చేత చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉపసంహరింప చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఏకంగా మార్గదర్శిపై కేసు నమోదు చేయడం 'పొరపాటు' అంటూ సీఐడీ దాఖలు చేసే తుది నివేదికను సంబంధిత కోర్టు ఆమోదిస్తే చంద్రబాబు ప్రభుత్వం విజయం సాధించినట్లే! మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై కేసు క్లోజ్ అయినట్లే!!

బాబు డైరెక్షన్‌లో ఒక్కసారిగా ప్లేటు ఫిరాయించిన సీఐడీ

14) It is humbly submit that, Later on 12-08-2024 the then I.O S.Rajasehara Rao, Addl.SP, CID, RO, Vijayawada addressed a letter to the ADGP, CID, AP to issue necessary instructions to refer the case as "NO EVIDENCE" and to file the final report in the Hon'ble Court accordingly.

కేసుని నిరూపించేందుకు తగిన ఆధారాలు లేవంటూ కౌంటర్‌లో నివేదించిన సీఐడీ

15) It is humbly submit that, after verifying the material on record and considering the legal opinion, the Additional Director General of Police, CID, AP, Mangalagiri, granted permission to close the case as a mistake of fact/offense not established, as per the proceedings in C.No:5110/EOW,C-13/CID-AP/2024, dated 16/08/2024.

మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్‌గా కేసు మూసివేతకు అదనపు డీజీ అనుమతించినట్లు కోర్టులో పేర్కొన్న సీఐడీ

17) It is humbly submit that, as the then I.O S.Rajasekhara Rao, Addl.SP, Cid, RO, Vijayawada obtained legal opinion from the legal advisor, Head office, CID in this case to refer the case as mistake of fact and the file the final report in the concerned Court. Later the then I.O G.Srinivas, DSP, CID, RO, Vijayawada forwarded the final report to the ADGP, CID, AP, Mangalagiri, seeking permission to file it in the concerned court, refer the case as "Mistake of Fact".

మార్గదర్శిపై కేసు మూసివేత కోసం ఫైనల్ రిపోర్టుని అదనపు డీజీ అనుమతికి పంపనున్న సీఐడీ

చిట్స్ రిజిస్ట్రార్ ఫిర్యాదుతో రంగంలోకి సీఐడీ...

మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఆర్థిక అవకతవకలు, తప్పుడు రికార్డుల నిర్వహణ, నిధుల మళ్లింపు, ఇతర చట్ట ఉల్లంఘనలపై చిట్స్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ 2023 మార్చి 10న సీఐడీకి ఫిర్యాదు చేయడం తెలిసిందే. ఈ ఫిర్యాదు ఆధారంగా అదే రోజు రామోజీరావు, శైలజా కిరణ్, మార్గదర్శి చిట్స్ ఆడిటర్ కుదరవల్లి శ్రవణ్‌లతో పాటు మొత్తం 15 మందిపై ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ), ఏపీ డిపాజిటర్ల పరిరక్షణ చట్టం, చిట్‌ఫండ్ చట్ట నిబంధనల కింద సీఐడీ కేసులు నమోదు చేసింది. అనంతరం మార్గదర్శి చిట్స్ కార్యాలయాల్లో సోదాలు నిర్వహించి కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకుంది. పలువురు ఖాతాదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించింది. వారు ఇచ్చిన వాంగ్మూలాలను రికార్డ్ చేసింది. గడువు ముగిసి ష్యూరిటీలు సమర్పించిన తరువాత కూడా బ్రాంచ్ మేనేజర్లు సకాలంలో చెల్లింపులు చేయడం లేదని పలువురు చందాదారులు దర్యాప్తు సంస్థకు వాంగ్మూలం ఇచ్చారు. సాకులు చెబుతూ ష్యూరిటీలను తిరస్కరించడం, అదనపు ష్యూరిటీలు సమర్పించాలని కోరడంతో పాటు ప్రైజ్ మొత్తాలను చెల్లించకుండా మార్గదర్శి ఇబ్బంది పెడుతోందని చందాదారులు స్పష్టంగా చెప్పారు. సకాలంలో చెల్లింపులు చేయకపోవడం, చెల్లించాల్సిన ప్రైజ్ మొత్తాన్ని డిపాజిట్‌గా తమ వద్దే అట్టిపెట్టుకోవడం, తక్కువ వడ్డీ చెల్లించడం, చెల్లింపులు ఎగవేయడం లాంటి ఉల్లంఘనలకు మార్గదర్శి చిట్స్ పాల్పడినట్లు సీఐడీ దర్యాప్తులో తేలింది. అనంతరం ఆ సంస్థ ఆడిటర్ కుదరవల్లి శ్రవణ్‌ను 2023 మార్చి 29న అరెస్ట్ చేసింది. అనంతరం సంబంధిత కోర్టు ఆయనకు రిమాండ్ విధించింది.

అప్పట్లో మార్గదర్శికి వ్యతిరేకంగా తీవ్రంగా పోరాడిన సీఐడీ

శ్రవణ్ కుమార్ అరెస్ట్‌ను, రిమాండ్‌ను ప్రశ్నిస్తూ ఆయన భార్య నర్మదతో పాటు శ్రవణ్ కుమార్ కూడా ఆశ్చర్యకరంగా 'హెబియస్ కార్పస్' రూపంలో పిటిషన్ దాఖలు చేశారు. కీలక స్థానాల్లో 'అనుకూల' వ్యక్తులు ఉండటంతోనే అసాధారణ రీతిలో వీరు హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారన్న ప్రచారం అప్పట్లో గట్టిగా సాగింది. ఈ పిటిషన్‌ను అప్పట్లో తీవ్రంగా వ్యతిరేకించిన సీఐడీ చాలా గట్టిగా వాదనలు వినిపించింది.

ఆధారాల్లేవంటూ తాజాగా కౌంటర్...

మార్గదర్శి చిట్‌ఫండ్ విషయంలో కేసు నమోదు చేయడం పొరపాటు అని సంబంధిత కోర్టులో ఫైనల్ రిపోర్ట్ దాఖలు చేయనున్నామంటూ హైకోర్టులో దాఖలు చేసిన తాజా కౌంటర్‌లో నివేదించింది. సంబంధిత కోర్టులో ఫైనల్ రిపోర్ట్ దాఖలు చేసేందుకు సీఐడీ అదనపు డీజీని అనుమతి కోరినట్లు సీఐడీ విజయవాడ ప్రాంతీయ కార్యాలయం అదనపు ఎస్పీ డి.ప్రసాద్ తన కౌంటర్‌లో హైకోర్టుకు తెలిపారు. ఆధారాలు చాలకపోవడంతో మార్గదర్శిపై నమోదు చేసిన కేసును మూసివేసేందుకు అనుమతి కోరుతూ అప్పటి దర్యాప్తు అధికారి రాజశేఖరరావు సీఐడీ అదనపు డీజీకి గత ఏడాది ఆగస్టు 12న లేఖ రాశారని, ఆ లేఖను పరిశీలించిన అదనపు డీజీ మార్గదర్శి చిట్‌ఫండ్‌పై కేసు మూసివేతకు ఆగస్టు 16న అనుమతినిచ్చారని పేర్కొన్నారు. దీంతో తుది నివేదిక సిద్ధం చేసి కోర్టులో దాఖలు చేసేందుకు అనుమతినివ్వాలని అదనపు డీజీని కోరామన్నారు.

నాడు కీలక ఆధారాలున్నాయన్న సీఐడీ..

వాస్తవానికి మార్గదర్శి చిట్‌ఫండ్స్ అవకతవకలపై దర్యాప్తు జరిపిన సీఐడీ పకడ్బందీగా అన్ని ఆధారాలను సేకరించింది. ఇదే విషయాన్ని గతంలోనే హైకోర్టుకు నివేదించింది. మార్గదర్శి చిట్‌ఫండ్ అక్రమాల కేసులో సంస్థ యజమాని శైలజా కిరణ్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను వ్యతిరేకిస్తూ వినిపించిన వాదనల సందర్భంగా ఈ విషయాన్ని చెప్పింది. మార్గదర్శి చిట్‌ఫండ్‌కు వ్యతిరేకంగా కీలక ఆధారాలున్నాయని, అందువల్ల బెయిల్ ఇవ్వొద్దంటూ గట్టిగా వాదనలు వినిపించింది. సీఐడీ సేకరించిన ఆధారాలను పరిగణనలోకి తీసుకున్న అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఖాతాదారుల ప్రయోజనాలను పరిరక్షించే నిమిత్తం చట్ట ప్రకారం మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు చెందిన దాదాపు రూ.1,050 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసింది. మార్గదర్శి చిట్‌ఫండ్ అక్రమాలు, అవకతవలకు కీలక ఆధారాలున్నాయని అప్పుడు తేల్చి చెప్పిన సీఐడీ ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం రాగానే ఒక్కసారిగా ప్లేటు ఫిరాయించింది. తాము సేకరించిన మౌఖిక, రాతపూర్వక ఆధారాలేవీ కూడా మార్గదర్శి చిట్‌ఫండ్ అక్రమాలను రుజువు చేసేవిగా లేవంటూ నిస్సిగ్గుగా, నిస్సహాయంగా చేతెలెత్తేసింది.

మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాల్లో మచ్చుకు..

సకాలంలో చందాదారులకు చెల్లింపులు చేయకపోవడం .. చెల్లించాల్సిన ప్రైజ్ మొత్తాన్ని డిపాజిట్‌గా తమ వద్దే అట్టిపెట్టుకోవడం.. తక్కువ వడ్డీ చెల్లించడం.. చెల్లింపులు ఎగవేయడం.. మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాల్లో మచ్చుకు కొన్ని! చందాదారులకు చెల్లించాల్సిన ప్రైజ్‌మనీని చెల్లించకుండా వడ్డీ చెల్లింపు పేరుతో తమ వద్దే అట్టిపెట్టుకోవడానికి ప్రధాన కారణం ఏమిటంటే... చెల్లింపులు చేయడానికి మార్గదర్శి చిట్‌ఫండ్స్ వద్ద సరిపడినంత డబ్బు లేకపోవడమే. తన వద్ద డబ్బు లేదు కాబట్టి చందాదారులకు చెల్లించాల్సిన డబ్బునే భవిష్యత్తులో చెల్లించాల్సిన చందాగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ తమ వద్దే అట్టిపెట్టుకుంది. అలా అట్టిపెట్టుకున్న మొత్తాలను మార్గదర్శి రొటేషన్ చేస్తూ వస్తోంది. చట్ట ప్రకారం చందాదారుల డబ్బును ప్రత్యేక ఖాతాల్లో ఉంచడం తప్పనిసరి. కానీ మార్గదర్శిలో అలా ఉంచకుండా దాన్ని ఇతర అవసరాలకు మళ్లించేశారు. ఈ ఉల్లంఘనలన్నీ డిపాజిటర్ల పరిరక్షణ చట్టం పరిధిలోకి వస్తాయి.

వడ వద్దన్నందుకు చితకబాదాడు

- కొందుర్గు గురుకులం ప్రిన్సిపాల్ అమానుషం
- కింద పడేసిన కూరగాయ తొక్కలను తినిపించారన్న విద్యార్థులు



విద్యార్థి వీపుపై వాతలు

కొందుర్గు: కడుపునొప్పిగా ఉందని, వడ తింటే పడటం లేదని చెప్పినా వినకుండా తినాల్సిందేనంటూ ఓ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ విద్యార్థి వీపుపై వాతలు తేలేలా కొట్టారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తెలిపిన ప్రకారం.. రంగారెడ్డి జిల్లా కొందుర్గు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో గురువారం ఉదయం అల్పాహారంగా వడ వడ్డించారు. కడుపునొప్పితో బాధపడుతున్న 9వ తరగతి విద్యార్థి సందీప్ వడ తినడానికి ఇష్టపడలేదు. దీంతో వడ వద్దంటావా అంటూ ప్రిన్సిపల్ మహ్మద్ కుర్షీద్ విద్యార్థి వీపుపై వాతలు వచ్చేలా కర్రతో చితకబాదారు. అనంతరం మధ్యాహ్న భోజన సమయంలో డైనింగ్ హాల్‌లోకి వెళ్లిన ప్రిన్సిపాల్.. అక్కడ విద్యార్థులు కూరగాయల తొక్కలు కింద పడేయడాన్ని గమనించారు. వాటిని తిరిగి ప్లేట్లలో వేయించి విద్యార్థులతోనే తినిపించారు. కాగా, తమ అబ్బాయిని కొట్టిన విషయం తెలుసుకున్న సందీప్ తల్లిదండ్రులు మహేశ్వరి, యాదయ్య ప్రిన్సిపల్‌తో గొడవకు దిగారు. దీంతో తప్పయిందని ఆయన అంగీకరించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బుధవారం ఈ విద్యాసంస్థను తనిఖీ చేసిన మర్నాడే ఈ ఘటన జరగడం గమనార్హం.

బీఎడ్ (ఓడీఎల్) అడ్మిషన్ ఫీజు చెల్లింపునకు రేపు ఆఖరు

బంజారాహిల్స్ (హైదరాబాద్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో 2024–25 సంవత్సరానికి బీఎడ్ (ఓడీఎల్) ప్రవేశ పరీక్ష మొదటి దశ కౌన్సెలింగ్‌లో సీటు పొందిన అభ్యర్థులు ఈనెల 22వ తేదీ లోపు అడ్మిషన్ ఫీజు చెల్లించాలని విద్యార్థి సేవా విభాగం డైరెక్టర్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాల కోసం 040–2368 0333/444/544 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని, లేదా విశ్వవిద్యాలయ పోర్టల్‌ను సందర్శించాలని సూచించారు.

వారు ఆకలితో ఉన్నప్పుడు ఆయనే వారికి ఆహారమిచ్చాడు మరియు ఆయనే వారిని భయం (ప్రమాదం) నుండి కాపాడాడు.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 21 ఫిబ్రవరి 2025

ఉదారతకు ట్రంప్ వీడ్కోలు!

రెండోసారి అమెరికా అధ్యక్ష పీఠం ఎక్కింది మొదలు వ్యవస్థల్ని ఎడాపెడా తొక్కుకుంటూ పోతున్న డోనాల్డ్ ట్రంప్ దృష్టి ప్రపంచ దేశాలకు ఉదారంగా సాయం అందించే అమెరికా అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ (యూఎస్ ఎయిడ్)పై పడింది. గత నెల 27నే ఆ సంస్థ కార్యకలాపాలను నిలిపేస్తూ ఆయన ఉత్తర్వులిచ్చారు. దాన్నుంచి విడుదలయ్యే నిధుల గురించి సమీక్షించి ఆ పంపిణీని 'మరింత సమర్థంగా', తమ విదేశాంగ విధానానికి అనుగుణంగా వుండేలా రూపుదిద్దుతామని ఆ సందర్భంగా ప్రకటించారు. ఇప్పుడు దాని తాలూకు సెగలూ పొగలూ మన దేశాన్ని కూడా తాకాయి. ఆ సంస్థ నుంచి లబ్ధి పొందింది 'మీరంటే మీర'ని బీజేపీ, కాంగ్రెస్‌లు వాదులాడుకుంటున్నాయి. సామాజిక మాధ్యమాల్లో గాలించి గత చరిత్ర తవ్వి పరస్పరం దుమ్మెత్తి పోసుకుంటున్నాయి. వెనకా ముందూ చూడకుండా చొరవగా దూసుకెళ్లే బీజేపీయే ఈ వాగ్యుద్ధానికి అంకురార్పణ చేసింది. కాంగ్రెస్, మరికొన్ని పౌర సమాజ సంస్థలూ యూఎస్ ఎయిడ్ నుంచి దండిగా నిధులు పొందాయన్నది బీజేపీ ఆరోపణల సారాంశం. పనిలో పనిగా ప్రపంచ కుబేరుడు జార్జి సోరోస్‌తో కాంగ్రెస్‌కున్న సంబంధాలు మరోసారి ప్రస్తావనకొచ్చాయి. జార్జి సోరోస్‌కు చెందిన ఓపెన్ సొసైటీ ఫౌండేషన్ నుంచి యూఎస్ ఎయిడ్‌కు ప్రధానంగా నిధులు వస్తాయి గనుక దాన్నుంచి నిధులందుకున్నవారంతా మచ్చపడినవారేనని బీజేపీ అభియోగం. కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ మరో అడుగు ముందుకేసి యూఎస్ ఎయిడ్ నిధులతోనే ప్రభుత్వంపై అసంతృప్తిని పెంచే నిరసనోద్యమాలు దేశంలో గత కొన్నేళ్లుగా నడుస్తున్నాయని తేల్చారు. దేశద్రోహులు అనే మాటైతే వాడలేదుగానీ... ఆ చట్రంలో ఇమిడే కార్యకలాపాలన్నిటినీ పరోక్షంగా కాంగ్రెస్‌కూ, ఇతర సంస్థలకూ అంటగడుతూ ఏకరువు పెట్టారు. అటు కాంగ్రెస్ ఊరుకోలేదు. కేంద్రమంత్రి స్మృతీ ఇరానీ ఒకప్పుడు యూఎస్ ఎయిడ్ రాయబారిగా పనిచేయటం, నీతి ఆయోగ్, స్వచ్ఛభారత్ వంటి సంస్థలకు నిధులు రావటం వగైరాలను ప్రస్తావించింది. వాషింగ్టన్‌లోని భారత రాయబార కార్యాలయం వెబ్‌సైట్ సమాచారం ప్రకారం యూఎస్ ఎయిడ్ మన ప్రాథమిక విద్య, ఉపాధ్యాయ శిక్షణ, వ్యవసాయం, తాగునీరు, ఇంధనం వగైరాలకు సాయపడుతున్నది.

ఇదంతా చూస్తుంటే 'గొంగట్లో తింటూ వెంట్రుకలు ఏరడం' నానుడి గుర్తుకొస్తుంది. 1961లో అప్పటి అమెరికా అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెనడీ ఏలుబడిలో ప్రారంభమైన ఈ సంస్థనుంచి నిధులందుకున్న పార్టీలూ, స్వచ్ఛంద సంస్థలూ కొల్లలుగా ఉన్నాయని భావించవచ్చు. ప్రభుత్వ కార్యక్రమాలకు కూడా అది సాయపడింది. అమెరికా తన బడ్జెట్‌లో ఒక శాతాన్ని అంతర్జాతీయ సాయానికి కేటాయిస్తున్నది. ఐక్యరాజ్యసమితి లెక్కల ప్రకారం ప్రపంచంలో అత్యధిక మానవతా సాయాన్ని అందించే ఏకైక దేశం అమెరికాయే. అంతర్జాతీయంగా నిరుడు వివిధ దేశాలకు అందిన సాయంలో అమెరికా వాటా 40 శాతం. 2025 ఆర్థిక సంవత్సరానికి యూఎస్ ఎయిడ్ ద్వారా 5,840 కోట్ల డాలర్లు వ్యయం కావొచ్చన్న అంచనా ఉంది. ట్రంప్ ప్రస్తుతం దాన్ని నిలుపుదల చేశారు గనుక ఇందులో ఎంత మొత్తానికి కత్తెరపడుతుందో అంచనా వేయటం కష్టం. మనకైతే ఇకపై రాకపోవచ్చు. ఎందుకంటే ట్రంప్ ఉద్దేశంలో భారత్ సంపన్న దేశం. 2021 నుంచి నిరుడు డిసెంబర్ వరకూ మన దేశానికి 2 కోట్ల డాలర్లు కేటాయించగా అందులో కోటీ 25 లక్షల డాలర్లు అందించినట్టు లెక్కలున్నాయి. ఇదంతా 'ప్రజాతంత్ర భాగస్వామ్యం', పౌర సమాజం కోసం అని యూఎస్ ఎయిడ్ అంటున్నది. ఇందులో 55 లక్షల డాలర్లు నిరుడు జరిగిన ఎన్నికల్లో పెద్దయెత్తున వోటర్లు పాల్గొనేలా చూడటానికి అందించారు. ఏ సంస్థ ఎంత పొందిందన్న వివరాలు మాత్రం లేవు.

దక్షిణ అమెరికాలో అమెజాన్ అడవుల రక్షణ, ఆఫ్రికాలో వ్యాధులు అరికట్టడానికి, ఆడపిల్లల విద్యకు, ఉచిత మధ్యాహ్న భోజనానికి సాయం చేయగా... రష్యా ఇరుగు పొరుగు దేశాల్లో దాని ప్రభావం తగ్గించటానికి, యుద్ధక్షేత్రమైన సిరియాలో ఆస్పత్రుల కోసం, ఉగాండాలో అట్టడుగు తెగల అభ్యున్నతికి, కంబోడియాలో మందుపాతరల తొలగింపునకు, బంగ్లాలో పౌరసమాజం కోసం... ఇలా భిన్నమైన పథకాలకూ, కార్యక్రమాలకూ అమెరికా తోడ్పడుతోంది. అసలు ఎవరైనా ఎందుకు సాయం చేస్తారు? వ్యక్తుల వరకూ చూస్తే తమ ఎదుగుదలకు కారణమైన సమాజానికి తిరిగి ఏదో ఇవ్వాలన్న కృతజ్ఞతా భావన కారణం కావొచ్చు. కానీ ఏ ఉద్దేశమూ లేకుండా అయాచితంగా ఖండాంతరాల్లోని సంపన్న దేశాలు వేరే దేశాలకు ఎందుకు తోడ్పాటునిస్తున్నాయి? చరిత్ర తిరగేస్తే దీని వెనకున్న మతలబు అర్థమవుతుంది. అప్పట్లో సోవియెట్ యూనియన్ ప్రభావం నుంచి ప్రపంచాన్ని 'రక్షించే' బాధ్యత తన భుజస్కంధాలపై వేసుకుని అమెరికా ఈ సాయం మొదలెట్టింది. అటు సోవియెట్ సైతం ఆ పనే చేసేది. ప్రపంచం దాదాపు రెండు శిబిరాలుగా చీలిన ఆ కాలంలో అమెరికా, సోవియెట్‌లకు ఈ ఉదారత ఎందుకంటిందో సులభంగానే గ్రహించవచ్చు. సాధారణ ప్రజానీకంలో తమపట్ల అనుకూల భావన కలిగితే అవతలివారిని సగం జయించినట్టేనని ఆ రెండు దేశాలూ భావించేవి. ప్రపంచ దేశాలన్నీ ప్రత్యర్థులుగా కనబడుతున్న వర్తమానంలో అమెరికాకు ఉదారత అవసరం ఏముంది? 'నేను ఆదేశించింది పాటించటమే తప్ప నాతో తర్కానికి దిగొద్ద'ని ట్రంప్ స్వయంగా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మనదేశం ఈ సాయాన్ని ముందే తిరస్కరించి ఉంటే ఎంతో హుందాగా ఉండేది. కానీ ఇవ్వబోమని అమర్యాదకరంగా చెప్పించుకోవటం ఆత్మాభిమానం గల భారతీయులందరికీ చివుక్కుమనిపించే సంగతి. పాలకులు గ్రహిస్తారా?

దేశ పునర్నిర్మాణానికి మార్గం

అభిప్రాయం


డా॥ కత్తి పద్మారావు

భారతదేశం ఈనాడు సామాజిక, ఆర్థిక సంక్షోభంలో ఉంది. రూపాయి విలువ అంతకంతకూ పతనం కావడం దేశ ఆర్థిక వ్యవస్థ దుఃస్థితిని తెలియజేస్తుంది. యువత నైరాశ్యంలో, మత్తులో కునారిల్లుతోంది. స్త్రీలైతే నిరక్షరాస్యతలో, మత కర్మకాండల్లో, పనిలేనితనంతో ఉత్ప్రేరక రహిత జీవితం జీవిస్తున్నారు.

దేశ ఆర్థిక వ్యవస్థల్లో కులవివక్ష, అస్పృశ్యత ఇంకా కొనసాగు తున్నాయి. కొన్ని వర్గాల వారే సంపదలను స్వాధీనం చేసుకోవడం పెరుగుతోంది. కొన్ని కులాల వారే వ్యవసాయం, పరిశ్రమలు, వ్యాపార వ్యవస్థల మీద తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నారు. కులం పేరుతో సాంఘిక, ఆర్థిక సంస్థలు, విద్యా వ్యవస్థలు ఏర్పడుతున్నాయి. కుల ఆర్థిక వ్యవస్థ బలీయమైనదిగా రూపొందుతున్నదని సామాజిక శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు.

హర్షద్ మెహతా లాంటి ఒక సామాన్య వ్యక్తి ప్రభుత్వ ఆర్థిక సంస్థలను వినియోగించుకొని వేల కోట్ల సొమ్మును ఏమార్చాడు. అదే చిన్న పొరపాట్లకే ఎస్సీ, ఎస్టీ సివిల్ సర్వీసు ఉద్యోగులు శిక్షలను అనుభవిస్తున్నారు. నూతన ఆర్థిక విధానం, ఉన్నత కులాలకు తమ ఆర్థిక, సామాజిక అధికారాన్ని పటిష్ఠపరుచుకోడానికి కొత్త అవకాశాల్ని ఏర్పరచింది. ఇటీవల ఒక ఏజెన్సీ భారతదేశంలోని వంద మంది ధనవంతుల పేర్లని వెల్లడించింది. వారిలో ఒక్కడు కూడా దళితుడు లేడు.

భారతదేశంలోని అస్పృశ్యతా భావం వ్యవసాయ ఉత్పత్తులపై తీవ్రమైన ప్రతికూల ప్రభావం చూపుతోంది. కారణం భూమి పంపకాన్ని ప్రభుత్వాలు నిరాకరించడం! భూములను కార్పొరేట్లకే ధారాదత్తం చేస్తున్నారు కానీ, పేద ప్రజలకు పంచడం లేదు. ఇటీవల సీపీఎం మహాసభలు జరిగినా వారు అస్పృశ్యతా నివారణ మీద, దళితులకు సాగు భూమి పంచాలనే అంశం మీద, కులనిర్మూలనా అంశం మీద తీర్మానం చేయకపోవడం గమనించదగ్గ విషయం.

పెరగని శాస్త్రీయ భావనలు

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో భక్తుల మధ్య తొక్కిసలాట జరిగి 45 మంది ప్రాణాలు కోల్పోవటం విషాదకరం. మౌని అమావాస్య సందర్భంగా త్రివేణీ సంగమం వద్ద స్నానాలు ఆచరిస్తే పుణ్యం వస్తుందని విపరీత ప్రచారం జరగటంతో పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి చేరారు. అంత మందికి అవసరమైన ఏర్పాట్లు చేయకపోవటం వల్లే ఈ ఘోరం జరిగిందని విమర్శలు వెల్లువెత్తాయి.

అదే రాష్ట్రంలో అంతకుముందు హత్రాస్‌లో జరిగిన ఒక ఆధ్యాత్మిక కార్యక్రమంలో బోలే బాబా పాద ధూళి కోసం జనం ఎగబడిన సందర్భంలో తొక్కిసలాట జరిగి, 121 మంది చనిపోయారు. ఇటీవల తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శనానికి వచ్చిన భక్తుల తొక్కిసలాటలో ఆరుగురు దుర్మరణం చెందారు. హజ్ యాత్రలో తొక్కిసలాట జరిగి వందలాది మంది ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. ఈ ఆధునిక కాలంలోనూ శాస్త్రీయ భావనలు దేశంలో వెల్లివిరియడం లేదు. సాంకేతిక, వైజ్ఞానిక భావచైతన్యం పెరగడం లేదు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం.



అంబేడ్కర్ బాట

అందరూ తమ రాజకీయ మేనిఫెస్టోల్లో దళిత వర్గాల స్త్రీల గురించే హామీలిస్తున్నారు. కానీ చివరకు శూన్య హస్తాలే చూపిస్తున్నారు. ఈ విషయంగా డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ 1951 అక్టోబర్ 28న తన ముంబయి ఎన్నికల ప్రచారంలో ఇలా విశ్లేషించారు: 'ప్రతి రాజకీయ పార్టీ తన ఎన్నికల ప్రణాళికను విడుదల చేసింది. అధికారంలోకి వస్తే ఇది చేస్తాం, అది చేస్తాం అని ప్రతి రాజకీయ పార్టీ వాగ్దానం చేస్తుంది. భారత్‌లో అసలు సమస్య పేదరికం. ప్రతి ఏటా కోట్లాది రూపాయిల విలువ గల ఆహార ధాన్యాలు దిగుమతి చేసుకోవాల్సి వస్తే ప్రజలు ఎలా నెట్టుకు రాగలుగుతారు? ఈ విషయాలన్నింటికీ ప్రభుత్వ ఆలోచనల్లో తావులేదు' అన్నారు.

ఆనాటి నుండి ఈనాటి వరకు పాలక వర్గాల మనస్తత్వంలో ఏ విధమైన మార్పూ లేదు. దీన్ని ఎదిరించి నిలబడే దళిత బహుజనులకు స్వీయ రాజకీయ చైతన్యం కావాలని అంబేడ్కర్ ఆనాడే చెప్పారు. రాజ్యాధికారమే ప్రధానమైన 'కీ' అని, దళిత బహుజన రాజ్యాన్ని నిర్మించినప్పుడే సంపద పంపిణీ అవుతుందని అన్నారు. లేదంటే పరిస్థితుల్లో మార్పులు రాకపోగా, మరింత దిగజారే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

'ఇవాళ దళితుల పరిస్థితి ఏమిటి? నాకు తెలిసినంత వరకూ ముందు ఎలా ఉండేదో ఇప్పుడూ అలాగే ఉంది. అదే నిరంకుశత్వం, అదే అణచివేత. పరిపాలనలో అంతకుముందున్న వివక్షే కొనసాగుతోంది' అన్నారు. అయినా వారికి ఉపశమనం ఎందుకు కల్పించడం లేదని ప్రశ్నించారు. అంబేడ్కర్ ఆనాడు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను ఉద్దేశించి ఈ విశ్లేషణ చేశారు. అవి ఇప్పటికీ స్పష్టంగా అన్వయం అవుతున్నాయి.

- ◆ పరిశోధన – అభివృద్ధికి భారీ మొత్తంలో నిధులు సమకూర్చడం, నవకల్పనలను ఇతోధికంగా ప్రోత్సహించడం, కార్మిక శ్రేణుల నైపుణ్యాలను మెరుగుపరచడం అవసరం.
- ◆ రాజ్యాధికారమే ప్రధానమైన 'కీ' అని, దళిత బహుజన రాజ్యాన్ని నిర్మించినప్పుడే సంపద పంపిణీ అవుతుందని అంబేడ్కర్ అన్నారు.
- ◆ దేశంలో ఉత్పత్తిని పెంచుకొని, దేశ గౌరవాన్ని పెంచుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్క భారతీయుని మీద ఉంది.

భారతీయుల బాధ్యత

నిజానికి దేశంలో నిరుద్యోగం, పేదరికం, స్త్రీ అణచివేత ఇంకా కొనసాగుతున్నాయి. మరో పక్క 'మేక్ ఇన్ ఇండియా' నినాదాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోంది. కానీ తయారీ రంగానికి అవసరమైన సమస్త యంత్రాలనూ దిగుమతి చేసుకుంటున్నాం. పరిశోధన, అభివృద్ధి రంగంలో మనం చేస్తున్న వ్యయం స్థూల దేశీయోత్పత్తిలో 1 శాతం కంటే తక్కువ! పరిశోధన అభివృద్ధికి భారీ మొత్తంలో నిధులు సమకూర్చడం, నవకల్పనలను ఇతోధికంగా ప్రోత్సహించడం, కార్మిక శ్రేణుల నైపుణ్యాలను మెరుగుపరచడం అవసరమని ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. ఇటువంటి చర్యలూ ఏవీ అమలు జరగడం లేదు.

రాజ్యాంగంలో పొందుపరచబడిన ప్రాథమిక సూత్రాలు విధ్వంసానికి గురి అవుతున్నాయి. సమాఖ్య భావన తగ్గడంతో రాష్ట్రాల అస్తిత్వాలు సంఘర్షణలో ఉన్నాయి. రాష్ట్రాల ఆదాయాన్ని తగ్గిస్తూ కేంద్రం ఆర్థిక ఆధిపత్యాన్ని పెంచుకునే క్రమం సాగుతోంది. మేలిమి చదువులు, తీరైన వసతులు, ఉపాధి అవకాశాల కల్పన, అసమానతల నివారణ ద్వారా జనం బతుకుల్లో వెలుగులు నింపాల్సింది పోయి ప్రజాస్వామ్యాన్ని ప్రలోభస్వామ్యంగా మారుస్తున్నారు.

ఈ పరిస్థితుల్లో లౌకిక, ప్రజాస్వామిక, సామ్యవాద శక్తులు ఏకం కావలసిన సమయం ఆసన్నమయింది. దేశంలో ఉత్పత్తిని పెంచుకొని, దేశ గౌరవాన్ని పెంచుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్క భారతీయుని మీద ఉంది. ఈ క్రమంలో అంబేడ్కర్ ఆలోచనలను స్వీకరించి అభివృద్ధి భారతానికి బాటలు వేయాలి.

వ్యాసకర్త దళితోద్యమ నాయకులు
మొబైల్: 98497 41695

సోషల్ మీడియా

ఎక్కడున్నాం?



త్రివేణీ సంగమం నీళ్లలో భారీ స్థాయి మల సంబంధిత కోలిఫార్మ్ బ్యాక్టీరియా ఉన్నట్టు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) గుర్తించింది. కానీ ఆ నీరు స్నానానికీ, తాగడానికీ యోగ్యమైనదనీ, అలాంటి నివేదికలు కుంభమేళా ప్రతిష్ఠను దెబ్బతీయడానికి చేసే ప్రచారమనీ ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ అంటున్నారు. 2025లో ఇండియా ఎక్కడుందో చూడండి!

– అనుభవ్ సింగ్, విశ్లేషకుడు

పెట్టాల్సిన పెట్టుబడులు



ఉత్తరప్రదేశ్ జనాభా 24 కోట్లు. బిహార్ జనాభా 13 కోట్లు. రెండు రాష్ట్రాలది కలిపి 37 కోట్లు. ఇది దేశ జనాభాలో సుమారు 25 శాతం. అమెరికా జనాభా 34.5 కోట్ల కన్నా ఇది ఎక్కువ. ఆ రాష్ట్రాల సగటు తలసరి ఆదాయం 1,100 డాలర్లు. ఆఫ్రికా దేశాల తలసరి జీడీపీ 1,710 డాలర్లు. 'వికసిత్ భారత్' లక్ష్యంలో ఇది మన పెద్ద సవాలు. అయితే, విమానాశ్రయాల కన్నా సోషల్ క్యాపిటల్, నాలెడ్జ్ క్యాపిటల్ ఆ రాష్ట్రాల ప్రాధమ్యాలు కావాలి.

– డి. ముత్తుకృష్ణన్, ఫైనాన్సియల్ ప్లానర్

ఎన్నికలు జరగకపోతే...



ఎన్నికలు జరగకపోతే... యుద్ధం జరుగుతుండగా ఎన్నికలు నిర్వహించలేదు కాబట్టి, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని 'నియంత' అనడం పూర్తిగా తప్పు. యుద్ధ కాలాల్లో తమ అస్తిత్వం కోసే పోరాడే దేశాల్లో ఇది సాధారణ వ్యవహారం. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో బ్రిటన్‌లో సాధారణ ఎన్నికలు జరగలేదు. యుద్ధం ముగియగానే ఎన్నికలు జరిగాయి. ఉక్రెయిన్‌లో కూడా అదే జరుగుతుంది.

– కాన్‌స్టంటిన్ కిసిన్, పాడ్‌కాస్టర్

అక్కడే ఉండగలరు!



పర్ఫెక్టు మనిషి రోజూ ఐదింటికి నిద్ర లేస్తాడు. రోజూ వ్యాయామం చేస్తాడు. తన గదిని తనే శుభ్రం చేసుకుంటాడు. మద్యం తాగడు. వంటగదిలో సాయం చేస్తాడు. సమయానికి భోంచేస్తాడు. రాత్రుళ్లు తిరగడు. టైముకు వస్తాడు. రోజూ ప్రార్థిస్తాడు. సరిగ్గా తొమ్మిదింటికి నిద్రపోతాడు... ఇలాంటివాళ్లంతా సెంట్రల్ జైల్లో కనబడతారు.

– జేవియర్, వ్యంగ్య వ్యాఖ్యాత

ఎందుకు సమర్థన?



ఔరంగజేబు సమర్థకులుగా ఎవరైనా ఎందుకు ఉండాలనుకుంటారు? ఇది నాకు అర్థం కాని విషయం. ఆయన క్రూరత్వం ఎలాంటిదో చరిత్రలో బాగా నమోదయ్యే ఉంది.

– ప్రియాంకా చతుర్వేది, రాజ్యసభ సభ్యురాలు

ఇన్ బాక్స్

ఎన్నాళ్లో వేచిన ఉదయం...

మహారాష్ట్ర తెలుగువారి చిరకాల స్వప్నమైన 'తెలుగు సాహిత్య అకాడమీ' సాకారమైంది. దీంతో మహారాష్ట్రలో మూడు వందల సంవత్సరాలకు మించి చరిత్ర కలిగిన తెలుగువారిలో హర్షాతిరేకాలు వెల్లివిరిశాయి. మహారాష్ట్ర అభివృద్ధిలో తెలుగువారి పాత్ర ఎంతో ఉంది. డా॥ బొల్లి లక్ష్మీనారాయణ అన్నట్లుగా, మహారాష్ట్రలోని ప్రతి తెలుగువ్యక్తీ 'తెలుగు ఆయీ, మరాఠీ మౌసీ' (తెలుగును అమ్మ, మరాఠీని పిన్ని) లాగా భావిస్తాడు. వివిధ రంగాల్లో తెలుగువారు క్రియాశీలకంగా ఉండడమే కాకుండా, సంయుక్త మహారాష్ట్ర ఉద్యమంలో కూడా పాల్గొని, అమరులై తమ కర్మభూమి మహారాష్ట్రకు తగిన సేవలందించారు. వంద సంవత్సరాల క్రితమే ముంబైలో తెలుగు పత్రికలు వెలువరించి, తమ మాతృభాషను కాపాడుకునే ప్రయత్నం చేసిన ఘనత తెలుగు ముంబైకర్లకు ఉంది.

2023లో శాసన సభలో మంత్రి సుధీర్ మునిగంటివార్ మాట్లాడుతూ, 'మహారాష్ట్రలో తెలుగు భాషా, సాహిత్య వికాసం కోసం... తెలుగు-మరాఠీ భాషల ఆదానప్రదానాల కోసం తెలుగు సాహిత్య అకాడమీ ఏర్పాటు చేస్తున్న'ట్లు ప్రకటించారు. 2024 మార్చ్‌లో జరిగిన క్యాబినెట్ సమావేశంలో తెలుగు, బెంగాలీ, సంస్కృత సాహిత్య అకాడెమీల ఏర్పాటుకు ఆమోదం లభించింది. మహారాష్ట్రలో పలు విద్యా సంస్థలు నిర్వహిస్తున్న డా॥ పి.వి. రమణను తెలుగు అకాడెమీ కార్యాధ్యక్షుడిగా, మరికొందరు తెలుగు ప్రముఖులను సభ్యులుగా మహారాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరి తరపున మహారాష్ట్ర ప్రభుత్వానికి జేజేలు!

– సంగెవేని రవీంద్ర, మహారాష్ట్ర తెలుగు సాహిత్య అకాడమీ సభ్యులు

అమ్మ భాష

వెలుగు కిరణాల చైతన్యంలో నుంచి
తెలుగక్షరాల శోభ విరాజిల్లింది
చైతన్యపు ఉరవడి విజయం లోంచి
ఒక అక్షరం పురుడు పోసుకుంది
నుడికారాలతో శ్రీకారం చుట్టబడుతూ
దీర్ఘాక్షరాలతో ఒక ఆకారం ఉద్భవిస్తూ
తెలుగు తేటమై వెలుగులీనుతోంది

దేశభాషలందు లెస్సగా కొనియాడబడుతూ
వివిధ యాసల ప్రాసలతో అలరారుతోంది
సాహిత్యపు సౌధమై శోభిల్లుతూ
సుసంపన్నమై చరిత్రలో మెరిసిపోతోంది
ఛందోబద్ధమైన తెలుగు ప్రాకారమై
తీయదనపు భావమై వికసిస్తోంది

కవుల కలం నుండి జాలువారిన అక్షరమై
విజ్ఞాన సంపదకు మూలమవుతోంది

అమ్మ భాషలోని తీయదనం ఒలికిస్తూ
కమ్మని సరాగ స్వర మాధుర్యమైంది
తెలుగు పలుకు నాల్కలయందు
తేనె చుక్కలా చిక్కగా జారిపోయింది
మాతృభాష పరిమళాల హాయిదనంతో
తెలుగులోగిలి ఓలలాడుతోంది
తెలుగు చక్కని చిక్కదనంతో
మనలో జాలువారాలి
తెలుగు ఘన కీర్తి నలుదిశలా విస్తరించాలి!

– నరెద్దుల రాజారెడ్డి
(నేడు ప్రపంచ మాతృభాషా దినోత్సవం)

చంపాల్సింది కులాన్ని... ప్రేమికుల్ని కాదు!

భారత రాజ్యాంగానికి 75 ఏళ్లు నిండాయి. 1949 నవంబర్ 26న రాజ్యాంగ సభలో అంబేడ్కర్ మాట్లాడుతూ... 'మనం రేపటి నుండి రాజకీయంగా ఓటు ద్వారా మనిషికి ఒకే విలువను సాధించుకున్నాం. కానీ సామాజికంగా సమానతను సాధించుకోవాల్సి ఉంది' అన్నారు. కులమత అంతరాలు ఆర్థిక అసమానతలు, దోపిడీ పీడనలు లేని సమాజాన్ని కలగన్న ఆనాటి మహనీయుల కలలు ఇంకా నెరవేరనే లేదు. భారతదేశ చాతుర్వర్ణ కుల వ్యవస్థ భారత సమాజాన్ని నిలువునా చీల్చిందనీ, కుల నిర్మూలన జరగకుండా, అంధ విశ్వాసాలు తొలగిపోకుండా సమాజం పురోగమించదనీ, ఆ లక్ష్యాల సాధన కోసం రాజ్యాంగ స్ఫూర్తితో సమాజాన్ని పాలకులు ముందుకు నడపాలి. అయితే వారు తమ స్వార్థ ప్రయోజనాల కోసం కులాల దొంతరలలోని కులాలను స్థిరీకరిస్తూ, అంతరాలను పెంచి పోషిస్తున్నారు.

కులం కట్టుబాట్లను అనుసరించి... తమ ఇష్టానిష్టాలకు భిన్నంగా ఆ యా కులాల్లోనే వివాహాలు చేసుకోవడం ఒకరకంగా దోపిడీకి గురికావడం లాంటిదే. రెండు వందల ఏళ్ల నాడే సావిత్రీబాయి పూలే, జ్యోతిరావు పూలేలు ఈ కుల కట్టుబాట్లను తుదముట్టిస్తూ, కులాంతర, మతాంతర వివాహాలను ప్రోత్సహించారు. ప్రేమించి పెళ్లి చేసుకోవాలనుకునే జంటలకు కాని, కులమత అడ్డుకోటలను కూల్చాలనుకునే ప్రేమికులకు కాని, కుల కట్టుబాట్లు, సంప్రదాయాలు, పెళ్లి తంతులు ఇష్టం లేకపోయినా తల్లిదండ్రుల బలవంతం మీద పెళ్లిళ్లు చేసుకొనేవారు అనేకమంది విడిపోతున్నారు.



ఇవాళ కుటుంబంలో అమ్మాయి పుట్టిందంటే భయపడే పరిస్థితి ఎందుకుంది? ఆమె పెరిగి, పెద్దదై పెళ్లి చేసుకునేదాకా తల్లితండ్రులు భయాందోళనలకు గురికావలసి రావడానికి కారణం ఏమిటి? సమాజంలో పాతుకుపోయిన మనువాదమే కదా. 'న స్త్రీ స్వాతంత్ర్య మర్హసి' (ఏ స్త్రీ కూడా స్వేచ్ఛకు అర్హురాలు కాదు) అనే భావం నరనరాల్లో జీర్ణించుకున్న సమాజం కదా మనది. స్త్రీని ఒక వస్తువుగా, ఆస్తిగా, కుటుంబ పరువును కాపాడవలసిన జీవిగా పురుషాధిక్య సమాజం చూడటం వల్లే... ఆమె కులాంతర, మతాంతర వివాహాలు చేసుకుంటే పరువు హత్యలకు పాల్పడుతున్నారు.

రాజ్యాంగం మనిషికి స్వేచ్ఛగా బ్రతికే హక్కుని ప్రసాదించింది. ఇష్టమైనవారిని కులమతాల ప్రసక్తి లేకుండా వివాహమాడే స్వేచ్ఛను కల్పించింది. వరకట్నం చట్ట వ్యతిరేకమని తెలిసినా పట్టించుకుంటున్నది ఎంతమంది? కట్నాలు లేకుండా, కుల పట్టింపులు లేకుండా తమకి ఇష్టమైన వారిని పెళ్లి చేసుకుంటే వారి మీద కత్తులు నూరటం దుర్మార్గం.

ఇవాళ్టి సామాజిక సందర్భంలో పిల్లలు ఒకరిని ఒకరు కలుసుకోవడం, తెలుసుకోవడం, భావి జీవితం గురించి కలలు కనటం అనేది చాలా సహజాతి సహజమైన పరిణామం. ఇందుకు తల్లిదండ్రులు, సమాజం ప్రోత్సహించాల్సిందిపోయి... వాళ్ళు ఏదో సమాజానికి కీడు చేస్తున్నట్టు నియంత్రించడం తగదు. కులం అనే ఒక కాగితపు పులిని చూసి మనిషి తన కన్న బిడ్డల్ని చంపుకొనే క్రూర జంతువుగా మారడం దారుణం. కుల పెద్దలుగా చలామణీ అయ్యేవారు, నాయకులు కులాంతర వివాహం చేసుకున్న జంటల్ని వెంటాడి వేధిస్తున్నారు. సినిమాల్లో ప్రేమల్ని, ప్రేమికుల కష్టాల్ని చూసి కన్నీళ్లు కార్చే పెద్దలు, తమ కడుపున పుట్టిన బిడ్డలు తమకి ఇష్టం వచ్చిన అబ్బాయినో, అమ్మాయినో కోరుకుంటే... పరువు పోయిందని హత్యలకు తెగపడటం చూస్తూనే ఉన్నాం. సూర్యాపేటలో బంటినీ, మిర్యాలగూడలో ప్రణయ్ లాంటి ప్రేమికులనూ చంపడం ఇందుకు కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఇలాంటి వాళ్ల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించవలసి ఉంది. ప్రేమ వివాహాలు, కులాంతర పెళ్లిళ్లు చేసుకునే పిల్లలకు చట్టం, సమాజం మద్దతుగా నిలవాలి.

తమ ఇష్టాలకు అనుగుణంగా పెళ్లిళ్లు చేసుకునే పిల్లలకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరించడం ద్వారా నిజమైన ప్రేమికుల్ని కాపాడుకోవాల్సి ఉంది. అలాగే వాళ్లకు నచ్చకపోతే విడిపోయి స్వేచ్ఛగా బ్రతికే అవకాశాలను కూడా సమాజం ఇవ్వాలి. కులాంతర వివాహం... మానసిక, శారీరక వైకల్యం లేని క్రియాశీల భవిష్యత్ తరానికి బాటలు వేస్తుంది. కులాంతర వివాహాలు చేసుకునే వారికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు పెంచాలి. ఈ జంటలపై దాడులు చేసేవారిని ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా వెంటనే విచారణ చేసి శిక్షించాలి.

– ప్రభాకర్ కస్తూరి
సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం | 94409 70454

నిర్వాణం

నిర్వాణం అనే సంస్కృత పదానికి ఆరిపోవటం (దీపం కొండెక్కినట్టు), చల్లారిపోవటం, అంతరించి పోవటం, నశించి పోవటం అని అర్థం. అయితే వేదాంత గ్రంథాలలో నిర్వాణం అనే పదాన్ని ముక్తి, మోక్షం అనే అర్థాలలో ఉపయోగిస్తారు. ఈ వాడుక బౌద్ధ, జైన సంప్రదాయాలలో కూడా తరచుగా వినిపిస్తుంది.

జ్యోతిర్మయం

'సర్వం బ్రహ్మ' అన్న సత్యపు స్పృహను కోల్పోయి, 'అహం' భావన వల్ల 'నేను వేరు – ఇతరమంతా వేరు' అనే అజ్ఞాన జనిత మైన ప్రత్యేకతను తనకు తాను ఆపాదించుకోవటమే జీవుడి దుఃఖాలన్నిటికీ కారణం. ఈ 'అహం' భావన ఆరిపోయి, అంతరించి, కొండెక్కితే, జీవాత్మ మలిగి పరమాత్మ చైతన్యంతో ఐక్యమైతే, దాని ఫలితం పరమానందమయమైన, శాంతిమయమైన మోక్ష స్థితి. జనన, మరణాల సంసార చక్రం నుంచి విముక్తి. కోరికలు త్యజించి, అహంకార మమకారాలను అధిగమించినవాడు, శాంతిని పొంది, దేహ పతన సమయంలో బ్రహ్మ నిర్వాణాన్ని పొందుతాడు అని భగవద్గీత ప్రవచిస్తుంది (2–71,72).

బౌద్ధ సంప్రదాయంలో కూడా, రాగ–ద్వేష–మోహ లనే మూడు భయంకరమైన అగ్నులు చల్లారి పోవటమే నిర్వాణం అంటారు. మోహ భ్రాంతి అజ్ఞానం. అది ఆరిపోయి జ్ఞానోదయం పొందటమే నిర్వాణ స్థితి. అందుకే బౌద్ధులు బుద్ధుడి జీవితంలో రెండు నిర్వాణ ఘట్టాలను గుర్తిస్తారు. ఒకటి – ఆయనకు జ్ఞానోదయం కలిగిన నాటి 'ఉపాధి శేష నిర్వాణం'. ఇది సశరీరమైన జీవన్ముక్త స్థితి. రెండవది – ఆ తరవాత నలభయ్యేళ్ళకు ఆయన అవతార సమాప్తి చేసినప్పుడు జరిగిన 'పరి నిర్వాణం'.

'నిర్వాణ' అనే పదం ఇప్పుడు ఆంగ్లంతో సహా ఎన్నో విదేశీయ భాషలలో కూడా చేరిపోయింది. ఆ భాషలలో కూడా ఈ పదం వాడుక పరమానంద స్థితి అనే అర్థంలోనే!

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** బ.అష్టమి ఉ.8.25 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** అనూరాధ ప.12.50 వరకు, తదుపరి జ్యేష్ఠ, **వర్జ్యం:** సా.6.51 నుండి 8.31 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.47 నుండి 9.35 వరకు, తదుపరి ప.12.39 నుండి 1.27 వరకు, **అమృత ఘడియలు:** తె.5.04 నుండి 6.46 వరకు (తెల్లవారితే శనివారం); **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.28, **సూర్యాస్తమయం:** 5.59.

క్లుప్తంగా...

గుండెపోటుతో విద్యార్థిని మృతి

• పాఠశాలకు వెళ్తుండగా విషాదం


శ్రీనిధి

కామారెడ్డి టౌన్ / రామారెడ్డి: పాఠశాలకు వెళ్తున్న ఒక విద్యార్థిని గుండెపోటుతో మృతి చెందింది. కామారెడ్డి జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. రామారెడ్డి మండలం సింగరాయిపల్లి గ్రామానికి చెందిన అల్లే శ్రీనిధి (14) జన్మభూమి రోడ్‌లోని ఒక ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. కామారెడ్డి కల్కినగర్ కాలనీలో నివసిస్తున్న పెద్దనాన్న ఇంట్లో ఉంటూ పాఠశాలకు వెళ్తుంది. ఎప్పట్లాగే ఉదయం పాఠశాలకు బయల్దేరిన శ్రీనిధి.. దారిలో గుండె నొప్పి రావడంతో స్పృహ కోల్పోయి పడిపోయింది. పాఠశాల ఉపాధ్యాయుడు గమనించి వెంటనే ఆమెను స్థానిక ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రాథమిక చికిత్స అందించినప్పటికీ స్పందన లేకపోవడంతో.. మరో ఆస్పత్రికి తరలించారు. అక్కడ సీపీఆర్ చేసినా ఫలితం లేకపోవడంతో విద్యార్థిని మృతి చెందినట్లు ధ్రువీకరించారు. విద్యార్థిని మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. మృతురాలి తల్లి గౌతమి, తండ్రి నరేందర్ కన్నీరు మున్నీరుగా విలపించారు.

చదువుకోమన్నందుకు బలవన్మరణం

• ఇంటర్ విద్యార్థి క్షణికావేశం

గీసుకొండ: పని మానేసి చదువుకోమని తండ్రి కోరినందుకు పురుగు మందు తాగాడొక కొడుకు.. నెలరోజులుగా చికిత్స పొందుతూ బుధవారం కన్నుమూశాడు. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం కోనాయమాకులలో గురువారం వెలుగులోకి వచ్చిన ఈ సంఘటనపై. ఇన్‌స్పెక్టర్ ఎ.మహేందర్ తెలిపిన వివరాలివి. ఆంగోతు మోహన్ కుమారుడు నవీన్ (16) ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. కొన్నిరోజులుగా కళాశాలకు వెళ్లడం మానేసి.. కోనాయమాకులలోని పీఎస్సార్ ఫంక్షన్ హాల్‌లో క్యాటరింగ్ పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో పని మాని చదువుకోవాలని, పనిచేసి ఎన్నిరోజులు బతుకుతావని జనవరి 18న నవీన్‌ను తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన నవీన్ అదే రోజు పురుగు మందు తాగగా.. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పించారు. నెల రోజులుగా చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు. తండ్రి మోహన్ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ ఎ.మహేందర్ తెలిపారు.

యాదగిరి క్షేత్రంలో రెండోరోజు స్తోత్ర పారాయణాలు

ఘనంగా మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవం


ఆలయ నిర్మాణం, విమాన గోపురాన్ని పరిశీలిస్తున్న రామానుజ జీయర్ స్వామి

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ స్వర్ణ దివ్య విమాన గోపురం మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవంలో భాగంగా.. రెండోరోజు గురువారం ఆధ్యాత్మిక వేడుకలను పాంచరాత్ర ఆగమశాస్త్రానుసారం నిర్వహించారు. ఉదయం ఉత్సవమూర్తులకు తిరువీధి సేవ అనంతరం.. యాగశాలలో శ్రీస్వామి, అమ్మవారిని అధిష్టింపజేసి ప్రత్యేక పూజలు చేశారు. యాగశాలలోని పంచకుండాల వద్ద రుత్వికులు వేద ఇతిహాసాది పురాణ స్తోత్ర పారాయణాలు పఠించారు. ఈ సందర్భంగా క్షేత్రానికి చేరుకున్న వానమామలై మఠం 31వ మధుర కవి రామానుజ జీయర్ స్వామికి అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆయన గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠ అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.


వివిధ నదుల నుంచి తీసుకువచ్చిన జలాలను చూపిస్తున్న అర్చకులు

యాదగిరి క్షేత్రానికి 14 నదుల జలాలు

కుంభాభిషేకం సంప్రోక్షణ మహోత్సవంలో భాగంగా ఆలయ అర్చకులు 14 నదుల నుంచి తీసుకువచ్చిన జలాలను పంచకుండాత్మక యాగంలోని కలశాల్లో గురువారం కలిపారు. గోదావరి, పెన్‌గంగా, యమున, గంగా, సరస్వతి, సరయూ, గోమతి, నర్మద, మంజీర, తాలిపేరు, హరిద్రా, కృష్ణ, తుంగభద్ర తదితర నదుల నుంచి తీర్థ జలాన్ని ఆలయానికి తీసుకువచ్చారు. ఈ జలంతో ఈ నెల 23వ తేదీన స్వర్ణ దివ్య విమాన గోపురానికి మహా కుంభాభిషేకం, సంప్రోక్షణ జరిపించనున్నట్లు అర్చకులు వెల్లడించారు.

ముగిసిన పెద్దగట్టు జాతర


పెద్దగట్టు లింగమంతుల స్వామి ఆలయం నుంచి సూర్యాపేట పట్టణంలోని గొల్లబజారుకు మకరతోరణాన్ని తరలిస్తున్న కోడి, వల్లపు వంశస్తులు

సూర్యాపేట: సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం దురాజ్‌పల్లిలోని పెద్దగట్టు జాతర గురువారం ముగిసింది. ఈనెల 16న లింగమంతుల స్వామికి కోడి, వల్లపు వంశస్తులు మకర తోరణం ధరింపజేయడం ద్వారా జాతర ప్రారంభమైంది. మకరతోరణాన్ని గురువారం సూర్యాపేట పట్టణానికి తరలించడంతో జాతర ముగిసినట్లు అధికారులు తెలిపారు. ఐదు రోజుల పాటు జరిగిన ఈ జాతరకు.. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తమిళనాడు, రాజస్తాన్, కర్ణాటక రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జాతరను విజయవంతం చేశారు.

విద్యుదాఘాతంతో ముగ్గురు మృతి

• పందులు పట్టడానికి వెళ్లి మృత్యు ఒడికి చేరిన భార్యాభర్తలు, కొడుకు
• నిజామాబాద్ జిల్లాలో ఘటన


ఘటనా స్థలం నుంచి మృతదేహాలను బయటకు తీసుకొస్తున్న పోలీసులు

బోధన్ రూరల్ : పంట పొలాల్లో పందులను పట్టడానికి వెళ్లిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు విద్యుత్ షాక్‌తో మృతి చెందారు. నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం పెగడపల్లి గ్రామంలో ఈ విషాదకర ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. రెంజల్ మండలం సాటాపూర్ గ్రామానికి చెందిన ఓర్సు గంగారాం (50)కు ఇద్దరు భార్యలు, ముగ్గురు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఒకే ఇంట్లో ఉండే వీరందరూ వ్యవసాయ కూలీలుగా పనిచేసుకుంటూ అదనపు ఆదాయం కోసం పందుల పెంపకం చేస్తుంటారు. ఇటీవల పెగడపల్లి, చిన్న మావంది గ్రామాల శివారులో పందులు పంటపొలాల్లోకి వస్తున్నాయని రైతులు చెప్పడంతో గురువారం తెల్లవారు జామున గంగారాం, ఆయన మొదటి భార్య బాలమణి (45), కొడుకు కిషన్ (22) మిగతా కుటుంబ సభ్యులతో కలసి పందులను పట్టేందుకు వెళ్లారు. ఈ క్రమంలో కొన్ని పందులు పొలాల్లోకి వెళ్లాయి. వాటి వెంట వెళ్లిన గంగారాం, బాలమణి, కిషన్ పొలంలో ఉన్న విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనపై మిగతా కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. బోధన్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ విజయ్ బాబు సిబ్బందితో కలసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు.

సమ్మెను తాత్కాలికంగా విరమించిన రెండవ ఏఎన్‌ఎంలు

• సమస్యల పరిష్కారానికి కమిషనర్ హామీ ఇచ్చారు
• ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహ

సాక్షి, హైదరాబాద్: రెండవ ఏఎన్‌ఎంల సమస్యలను పరిష్కరిస్తామని వైద్యారోగ్య శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఇచ్చిన హామీతో తాత్కాలికంగా సమ్మెను విరమించినట్లు ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహ తెలిపారు. గురువారం కర్ణన్‌తో జరిపిన చర్చల్లో రెండో ఏఎన్‌ఎంల సమస్యల పరిష్కారానికి సానుకూలత వ్యక్తం చేశారని చెప్పారు. చర్చల అనంతరం నరసింహ మాట్లాడుతూ పీహెచ్‌సీలలో ఓపీఏఎన్‌ఎం, అర్బన్ పీహెచ్‌సీలలో రెగ్యులర్ ఏఎన్‌ఎంల పోస్టులు మంజూరు చేసే డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారన్నారు. పరీక్ష రాయటానికి అర్హతలేని రెండవ ఏఎన్‌ఎంలకు రిటైర్మెంట్ బెనిఫిట్, 100 శాతం గ్రాస్‌శాలరీని అమలు చేసేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని కర్ణన్ చెప్పారన్నారు. పెండింగ్‌లో ఉన్న ఏడు నెలల పీఆర్సీ బకాయిలను, సబ్ సెంటర్ అద్దె బకాయిలను మార్చి 31లోపు చెల్లిస్తామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.

కేంద్ర విశ్వవిద్యాలయాల్లో పూర్తిస్థాయి వీసీలను నియమిస్తాం

ఎంపీ చామలకు వెల్లడించిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్



సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఉన్న కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో పూర్తిస్థాయి వైస్ చాన్స్‌లర్ల (వీసీ) ను నియమిస్తామని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పష్టం చేశారు. ఈమేరకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశిస్తున్నట్లు తెలిపారు. సెంట్రల్ యూనివర్సిటీల్లో వీసీల నియామకం కోసం భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి.. కేంద్రమంత్రికి లేఖ రాశారు. ఈ లేఖకు స్పందించి ఆయన ప్రత్యుత్తరం రాశారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, ఇఫ్లూ, హైదరాబాద్ ఐఐటీ, మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం (మనూ)లో బోధన సిబ్బంది నియామకాల్లో ఓబీసీ రిజర్వేషన్ల అమలుకు చర్యలు తీసుకోవాలని మరో లేఖలో ఎంపీ చామల కోరగా.. శాఖాపరంగా తగిన చర్యలు తీసుకుంటామని కేంద్రమంత్రి ప్రత్యుత్తరంలో వెల్లడించారు.

కాళేశ్వరం కమిషన్ గడువు పొడిగింపు

23న నగరానికి పీసీ ఘోష్ • కేసీఆర్‌ను విచారణకు పిలిచే అవకాశం

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంలో చోటుచేసుకున్న అవకతవకలపై విచారణ నిర్వహిస్తున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ (పీసీ ఘోష్) కమిషన్ గడువును రాష్ట్ర ప్రభుత్వం మరో రెండు నెలలు పొడిగించింది. ఈ నెల 28తో కమిషన్ గడువు ముగియనుండగా, ఏప్రిల్ చివరి వరకు పొడిగిస్తూ నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు పీసీ ఘోష్ ఈ నెల 24 తర్వాత తుది విడత క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించే అవకాశాలున్నాయి. 23న నగరానికి రానున్న ఆయన.. 24, 25 తేదీల్లో మరో సారి క్రాస్ ఎగ్జామినేషన్ చేయనున్నారు. ఈ దఫాలో మాజీ మంత్రులు ఈటల రాజేందర్, హరీశ్‌రావుతో పాటు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను విచారణకు పిలిచే అవకాశం ఉన్నట్టు తెలిసింది. విచారణ అనంతరం ఏప్రిల్ చివరిలోగా ప్రభుత్వానికి నివేదిక అందించనున్నారు. బరాజ్‌ల వైఫల్యాలపై విచారణ జరిపిన నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్‌ఏ) ఈ నెలాఖరులోగా కమిషన్‌కు తమ నివేదికను అందజేయనుంది.

ఎన్‌ఎంఐఎంఎస్ యూనివర్సిటీలో ఫుడ్‌పాయిజన్

27 మంది విద్యార్థులకు అస్వస్థత

జడ్చర్ల టౌన్: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం పోలేపల్లి వద్ద ఉన్న ఎన్‌ఎంఐఎంఎస్ యూనివర్సిటీలో 27 మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురయ్యారు. ఈ విషయం బయటికి పొక్కకుండా నిర్వాహకులు ప్రయత్నించినప్పటికీ గురువారం మధ్యాహ్నం వెలుగులోకి వచ్చింది. ఎన్‌ఎంఐఎంఎస్ యూనివర్సిటీలో లా విద్యార్థులతో పాటు మరికొందరు బుధవారం సాయంత్రం పకోడీ తిన్నారు. అనంతరం విద్యార్థులు వాంతులు, ఇతర సమస్యలతో అస్వస్థతకు గురవడంతో యూనివర్సిటీలో ఉండే వైద్యులతో చికిత్స అందించారు. గురువారం మధ్యాహ్నం వరకు విద్యార్థులకు తగ్గకపోవడంతో విషయం బయటికి పొక్కింది. దీంతో ఎమ్మెల్యే అని రుద్‌రెడ్డి అక్కడికి చేరుకుని నిర్వాహకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. మీడియాను కూడా మొదట అనుమతించకపోవడంతో ఎమ్మెల్యే ఆదేశాలతో అనుమతించారు. వర్సిటీలోని గదుల్లో వేర్వేరుగా విద్యార్థులకు చికిత్స అందిస్తుండగా కొందర్ని మాత్రమే మీడియాకు చూపించారు. కొందరు విద్యార్థులను అంబులెన్స్‌లో ఆస్పత్రులకు తరలించారు. విద్యార్థులు బయట తిన్న ఫుడ్ కారణంగానే అస్వస్థతకు గురయ్యారని వర్సిటీ ఇన్‌చార్జి మహేశ్‌కుమార్ తెలిపారు. అనారోగ్యానికి గురైన వారిని ఎస్వీఎస్ ఇతర ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స అందించేందుకు తరలిస్తున్నామన్నారు. ఇన్‌చార్జి 27 మంది విద్యార్థులు మాత్రమే అస్వస్థతకు గురయ్యారని తెలిపినప్పటికీ 80 మందికి పైగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని సమాచారం.

ఎల్‌ఆర్‌ఎస్ ఉచితంగా అమలు చేయాలి: వేముల

సాక్షి, హైదరాబాద్: ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని ఉచితంగా అమలు చేయాలని, గతంలో హామీ ఇచ్చి మాట తప్పిన సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు రాజీనామా చేయాలని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రజలకిచ్చిన మాట తప్పడమే అలవాటుగా మార్చుకున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ పేరిట ప్రజల నుంచి దోపిడీకి సిద్ధమైందని ఆరోపించారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎల్‌ఆర్‌ఎస్ పేరిట ప్రజలపై భారం వేయకుండా గతంలో బీఆర్‌ఎస్ పోరాడిందని, కానీ రాయితీల పేరిట మళ్లీ డబ్బులు దండుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ పేరిట ఒక్కో ప్లాట్‌పై రూ.లక్ష చొప్పున వసూలు చేసి ప్రజలపై రూ.20 వేల కోట్ల భారం మోపుతోందని తెలిపారు.

రేఖా గుప్తా అనే నేను..

ఢిల్లీ నూతన సీఎంగా ప్రమాణ స్వీకారం

- మంత్రులుగా ఆరుగురు ఎమ్మెల్యేల ప్రమాణం
- రామ్‌లీలా మైదానంలో పండుగ వాతావరణం
- హాజరైన ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు
- సీఎం పోస్టు కోసం పోటీపడిన పర్వేశ్‌కు ఉప ముఖ్యమంత్రి పదవి
- మోదీ కలలు సాకారం చేయడానికి శ్రమిస్తామన్న రేఖా గుప్తా


సీఎం కార్యాలయంలో రేఖా గుప్తా బాధ్యతల స్వీకరణ

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో 26 ఏళ్ల తర్వాత బీజేపీ అధికార పగ్గాలు చేపట్టింది. తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికైన రేఖా గుప్తా నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే మరో ఆరుగురు ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణం చేశారు. ఢిల్లీలోని చరిత్రాత్మక రామ్‌లీలా మైదానంలో గురువారం అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనా వారితో ప్రమాణం చేయించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను ఓడించిన పర్వేశ్ వర్మతోపాటు కపిల్ మిశ్రా, మంజీందర్ సింగ్ సిర్సా, ఆశిష్ సూద్, రవీందర్ ఇంద్రజ్ సింగ్, పంకజ్ సింగ్‌కు మంత్రియోగం దక్కింది. ప్రస్తుత కేబినెట్‌లో మహిళలకు చోటు కల్పించలేదు. ప్రమాణ స్వీకార వేడుకకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, జె.పి.నడ్డా, రాజ్‌నాథ్‌సింగ్, హర్దీప్ పురి, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, హరియాణా సీఎం నాయబ్‌సింగ్ సైనీ, మేఘాలయా ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రులు కేశవ్ ప్రసాద్ మౌర్య, బ్రజేశ్ పాఠక్‌తోపాటు పలువురు ప్రముఖులు, బీజేపీ నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. 50 వేల మందికిపైగా జనంతో మైదానంలో పండుగ వాతావరణం నెలకొంది. జైశ్రీరామ్.. మోదీ, మోదీ అనే నినాదాలతో ప్రాంగణమంతా మార్మోగిపోయింది. రేఖా గుప్తా ప్రమాణ స్వీకారానికి ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ స్వాతి మలీవాల్ సైతం హాజరుకావడం చర్చనీయాంశంగా మారింది.

వచ్చే నెల 8 నుంచి మహిళలకు రూ.2,500

ప్రమాణ స్వీకారం కంటే ముందు రేఖా గుప్తా తన నివాసం వద్ద మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన మహిళలకు నెలకు రూ.2,500 చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8వ తేదీన మహిళల ఖాతాల్లో తొలి విడత సొమ్ము జమ చేస్తామని ప్రకటించారు. ప్రధాని మోదీ కలలను సాకారం చేయడానికి శ్రమిస్తామని, అది 48 మంది బీజేపీ ఎమ్మెల్యేల బాధ్యత అని ఉద్ఘాటించారు. ఢిల్లీలో గత పదేళ్లలో చోటుచేసుకున్న అవినీతి అక్రమాలకు ఆమ్ ఆద్మీ పార్టీ బాధ్యత వహించాలని తేల్చిచెప్పారు. ఖర్చు చేసిన ప్రజాధనానికి లెక్కలు చెప్పాల్సిందేనని అన్నారు. యమునా నది ప్రక్షాళనకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వబోతున్నామని రేఖా గుప్తా వెల్లడించారు. కశ్మీరీ గేటు ప్రాంతంలోని శ్రీమార్గాత్‌వాలే హనుమాన్ బాబా ఆలయాన్ని ఆమె దర్శించుకున్నారు.

సచివాలయంలో బాధ్యతల స్వీకరణ

ప్రమాణ స్వీకారం అనంతరం మధ్యాహ్నం రేఖా గుప్తా సచివాలయానికి చేరుకున్నారు. ఢిల్లీ తొమ్మిదో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తామని, ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు కట్టుబడి ఉన్నామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. 'వికసిత్ ఢిల్లీ' తమ ధ్యేయమని, ఒక్క రోజు కూడా వృథా చేయకుండా విధులు నిర్వర్తిస్తామని చెప్పారు.

ప్రధాని మోదీ అభినందనలు

సీఎం రేఖా గుప్తాకు ప్రధాని మోదీ అభినందనలు తెలియజేశారు. ఆమె కింది స్థాయి నుంచి కష్టపడి పైకి ఎదిగారని ప్రశంసించారు. గతంలో ఎన్నో హోదాల్లో ప్రజలకు సేవలందించారని తెలిపారు. ఢిల్లీ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రిగా నూతనోత్సాహంతో పని చేస్తారన్న విశ్వాసం తనకు ఉందని పేర్కొన్నారు. రేఖా గుప్తా ఎన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ మేరకు మోదీ ఒక సందేశం విడుదల చేశారు. మరో సందేశంలో మంత్రి అమిత్ షా కూడా అభినందనలు తెలిపారు.

యమునా హారతి

సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రేఖా గుప్తా తన మంత్రివర్గ సహచరులు, ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవాతో కలిసి యమునా హారతి నిర్వహించారు. నగరంలో వాసుదేవ ఘాట్‌లో వారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 'మా యమున పూజ' నిర్వహించారు. ఈ సందర్భంగా రామభజనలతో ఈ ప్రాంతం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అధికారంలోకి వస్తే యమునా నదిని శుద్ధి చేస్తామని ఎన్నికల ప్రచారంలో బీజేపీ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే రేఖా గుప్తా యమునా హారతి ఇవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది. యమునా మాతకు హారతి ఇస్తున్న సమయంలో తమ హామీని మరోసారి గుర్తు చేసుకున్నామని రేఖా గుప్తా వ్యాఖ్యానించారు. నదిని ప్రక్షాళన చేయడానికి అన్ని రకాల వనరులను సమర్థవంతంగా ఉపయోగించుకుంటామని చెప్పారు. యమున హారతి తర్వాత రేఖా గుప్తా నేతృత్వంలో తొలి మంత్రివర్గ సమావేశం జరిగింది.

ఎవరికి ఏ శాఖ

రేఖా గుప్తా (ముఖ్యమంత్రి)	ఆర్థిక, రెవెన్యూ, సేవలు, నిఘా, మహిళా-శిశు అభివృద్ధి
పర్వేశ్ వర్మ	ప్రజా పనులు, సాగునీరు, శాసనసభ వ్యవహారాలు, వరదల నియంత్రణ
ఆశిష్ సూద్	హోం, విద్యుత్, పట్టణాభివృద్ధి, విద్య
మంజీందర్ సింగ్ సిర్సా	పరిశ్రమలు, అడవులు, పర్యావరణం, ఆహారం, సరఫరా
రవీంద్ర కుమార్ ఇంద్రాజ్	సాంఘిక సంక్షేమం, ఎస్సీ/ఎస్టీ సంక్షేమం, సహకార
కపిల్ మిశ్రా	న్యాయం, కార్మిక, ఉపాధి కల్పన, టూరిజం
పంకజ్ కుమార్ సింగ్	ఆరోగ్యం, రవాణా, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ

మ్యూజియంగా 'శీష్ మహల్'?

సాక్షి, న్యూఢిల్లీ: ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ అధికారంలో ఉండగా నిర్మించిన ముఖ్యమంత్రి అధికారిక నివాసం 'శీష్ మహల్'ను కొత్తగా కొలువుదీరిన బీజేపీ ప్రభుత్వం ఏం చేస్తుందన్న దానిపై అప్పుడే ఢిల్లీలో కొత్త చర్చ మొదలైంది. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన రేఖా గుప్తా, తన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముందే ఎట్టి పరిస్థితుల్లోనూ శీష్ మహల్‌లో ఉండబోనని స్పష్టం చేశారు. ఆమె వాదనకు మద్దతుగా ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా సహా పలువురు నేతలు ఇదే రీతిలో స్పందించారు. దీంతో, ఆ భవనాన్ని మ్యూజియంగా మలిచేందుకు బీజేపీ ప్రభుత్వం భావిస్తోందని తెలుస్తోంది. ప్రభుత్వం ఏదైనా స్థలాన్ని మ్యూజియంగా మార్చాలనుకుంటే, దానిని మంత్రివర్గం, సంబంధిత మంత్రిత్వ శాఖ ఆమోదం కోసం పంపి, ఆమోదం పొందిన తర్వాత, భవనాన్ని పరిరక్షించాలా, మ్యూజియంగా మార్చడానికి మార్పులు చేయాలా అనే నిర్ణయానికి వస్తారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. దీనిపై కొత్త ప్రభుత్వం ఒకట్రెండు రోజుల్లోనే తన నిర్ణయాన్ని వెల్లడించే అవకాశం ఉందని పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది.



ఎవరినో గెలిపించేందుకు ప్రయత్నించారు

అందుకే భారత్‌కు 2.1 కోట్ల డాలర్లు పంపారేమో ● నాటి బైడెన్ ప్రభుత్వంపై ట్రంప్ ఆరోపణలు

న్యూయార్క్: విభిన్న అంశాలపై మెరుపు వేగంతో నిర్ణయాలు తీసుకుంటూ సంచలనం రేపుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈసారి భారతీయ కోణంలో ఆరోపణల బాంబు విసిరారు. భారత్‌లో ఓటర్ల సంఖ్యను పెంచే ఉద్దేశంతో నిర్వహించే కార్యక్రమాలకు అమెరికా తన వంతుగా పంపే 2.1 కోట్ల డాలర్ల ఆర్థిక సాయం వెనుక మరేదో కుట్రకోణం ఉందని ట్రంప్ సంచలన ఆరోపణలు చేశారు. డెమొక్రాట్ల సారథ్యంలోని బైడెన్ ప్రభుత్వం కొలువుతీరిన కాలంలో భారత్‌కు రావాల్సిన ఈ 2.1 కోట్ల డాలర్లతో భారత్‌లో ఎన్నికల్లో ఇంకెవరినో గెలిపించాలని భావించి ఉంటారని ట్రంప్ ఆరోపణలు గుప్పించారు. గురువారం మియామీలో సౌదీ అరేబియా ప్రభుత్వ సారథ్యంలో జరిగిన ఎఫ్ఐఐ 'ప్రియారిటీ' సదస్సులో పాల్గొన్న సందర్భంగా ట్రంప్ ప్రసంగించారు. ''నేను రెండోసారి అధ్యక్షుడిగా ప్రమాణం చేయడం ముందు వరకు మన అమెరికా ప్రభుత్వ ఖజానా నుంచి కొంత నగదు ఎక్కడెక్కడికి వెళ్లిందో మీకు కొన్ని ఉదాహరణలు చెబుతా. అందులో భారత్‌కు కూడా వెళ్లాయి. భారత్‌లో ఓటర్ల సంఖ్య పెంచేందుకు అమెరికా ప్రభుత్వం సొంత డబ్బులు 2.1 కోట్ల డాలర్లను ఎందుకు ఖర్చు చేయాలి?. నేను ఏమనుకుంటున్నానంటే.. బైడెన్ ప్రభుత్వం భారత్‌లో ఇంకెవరినో గెలిపించాలని భావించింది. ప్రస్తుతం భారత్‌లో అధికారంలో ఉన్న ప్రభుత్వానికి నేను ఈ విషయాన్ని తెలియజేస్తా. రష్యా అమెరికాలో ఏ రెండు డాలర్లో ఖర్చు పెట్టింది అనుకుంటే అది ఒక విషయమే కాదు. కానీ మనం భారత్ కోసం 2.1 కోట్ల డాలర్లు ఇవ్వడమనేది నిజంగా పెద్ద విషయం. ఇంతకంటే పెద్దవిషయం ఏంటంటే బంగ్లాదేశ్‌లో రాజకీయ సుస్థిరత కోసం మనం 2.9 కోట్ల డాలర్లు ఖర్చుచేశాం. అసలు ఆసియా దేశాలు అద్భుతంగా రాణిస్తున్నాయి. మనం వాళ్లకు డబ్బులు ఇవ్వాల్సిన అవసరమే లేదు. అసలు ఇలాంటి ఎన్నో దేశాలకు విచిత్రమైన నిధుల జారీ పరంపర కొనసాగింది. ఇది చాంతాడంత పెద్ద జాబితా'' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

బంగ్లాదేశ్, నేపాల్‌కు సైతం కోట్ల డాలర్ల నిధులు

అమెరికా ప్రభుత్వ పనితీరు, సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు, పరిపాలనలో సమూల మార్పులు, సంస్కరణలే లక్ష్యంగా దూసుకుపోతున్న డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ (డోజ్) ఫిబ్రవరి 16న ఈ నిధుల అంశాన్ని బయటపెట్టింది. ''అమెరికన్లు ప్రభుత్వానికి పన్నుల రూపంలో కట్టిన సొమ్ము దేశం దాటి ఎన్నో దేశాలకు వెళ్తోంది. భారత్‌కు 2.1 కోట్ల డాలర్లు అక్కడి ఓటర్ల సంఖ్య పెంచేందుకు ఉద్దేశించి మన ప్రభుత్వం ఇన్నాళ్లూ పంపుతోంది. బంగ్లాదేశ్‌కు 2.9 కోట్ల డాలర్లు, నేపాల్ ఆర్థిక స్వేచ్ఛ కోసం 2 కోట్ల డాలర్లు, పర్యావరణ వైవిధ్యం పరిరక్షణ కోసం మరో 1.9 కోట్ల డాలర్లు, ఆసియా కోసం 4.7 కోట్ల డాలర్లు ఖర్చు చేస్తున్నాం'' అని డోజ్ పేర్కొనడం తెల్సిందే.

అంతా అబద్ధం!

అయితే డోజ్ గణాంకాలను భారత్‌లోని పలువురు అబద్ధాలుగా అభివర్ణించారు. ''విదేశాలకు నిధులు ఇస్తున్నామని అమెరికా చెప్పేదాంట్లో నిజం లేదు. పైగా యూఎస్ఎయిడ్ అనేది మానవ చరిత్రలోనే అతిపెద్ద కుంభకోణం'' అని ఆర్థిక వేత్త, ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలిలో సభ్యుడు సంజీవ్ సన్యాల్ వ్యాఖ్యానించారు. మాజీ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎస్‌వై ఖురేషి సైతం ఇదే అభిప్రాయం వెలిబుచ్చారు. ''భారత్‌లో ఓటర్ల పెంపు కోసం అమెరికా నిధులు ఇవ్వలేదు. ఈ వివాదం అంతా ఒక మీడియా చేసిన ప్రచారంతో వచ్చింది. నేను సీఈసీగా ఉన్నప్పుడు 2012లో కేంద్ర ఎన్నికల సంఘంతో ఒక అమెరికా ఏజెన్సీ ఒప్పందం కుదుర్చుకుందని, అలా కోట్ల డాలర్ల నిధులు భారత్‌కు వస్తున్నాయని ఆ మీడియా ఒక కథనంలో పేర్కొంది. ఇందులో వాస్తవం లేదు'' అని ఖురేషీ చెప్పారు. అయితే డోజ్ ఆరోపణలను బీజేపీ సమర్థించింది. ''బైడెన్ ప్రభుత్వ హయాంలో భారత్‌కు నిధులు వచ్చి ఉండొచ్చు. అయితే ఆ నిధుల వల్ల పెరిగిన ఓటర్లకు బీజేపీకి ఎలాంటి సంబంధం లేదు. పెరిగిన ఓటర్లతో ఎవరు లబ్ధి పొందారో తెలియాలి'' అని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి అమిత్ మాలవీయ వ్యాఖ్యానించారు.

ఆస్పత్రిలో చేరిన సోనియా

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్ర నేత సోనియా గాంధీ(78) గురువారం ఉదయం ఢిల్లీలోని సర్ గంగారాం హాస్పిటల్‌లో చేరారు. సోనియాను ఎందుకు ఆస్పత్రిలో చేర్చారనే విషయం స్పష్టం కానప్పటికీ ఆమె బాగానే ఉన్నారని ఆస్పత్రి వర్గాలు తెలిపా యి. వైద్య బృందం పరిశీలనలో ఉన్న ఆమెను శుక్రవారం డిశ్చార్జి చేసే అవకాశముందని వెల్లడించాయి.

నీతి ఆయోగ్ సీఈవో పదవీ కాలం పొడిగింపు

న్యూఢిల్లీ: నీతి ఆయోగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(సీఈవో) బీవీఆర్ సుబ్రమణ్యం పదవీ కాలాన్ని మరో ఏడాదిపాటు పొడిగిస్తూ కేంద్రం గురువారం ఆదేశాలు జారీ చేసింది. 1987 బ్యాచ్ ఐఏఎస్ అయిన సుబ్రమణ్యం ఛత్తీస్‌గఢ్ కేడర్‌కు చెందిన వారు. 2023 ఫిబ్రవరిలో నీతి ఆయోగ్ సీఈవోగా రెండేళ్ల పదవీ కాలానికి గాను నియమితులయ్యారు. ఈయన పదవీ కాలాన్ని 2025 ఫిబ్రవరి 24 నుంచి ఏడాది పాటు పొడిగించే ప్రతిపాదనపై ఇటీవల కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపిందని ఆ ఆదేశంలో వివరించింది.

విదేశీ వైద్య విద్యకు నీట్ యూజీ అర్హత తప్పనిసరి: సుప్రీం

న్యూఢిల్లీ: విదేశాల్లో వైద్య విద్య ఎంబీబీఎస్ చదవాలనుకునే వారు నీట్ యూజీలో అర్హత సాధించడం తప్పనిసరని సుప్రీంకోర్టు పేర్కొంది. దేశంలో వైద్య వృత్తిలో ప్రమాణాలను కాపాడటమే లక్ష్యంగా 2018లో మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఎంసీఐ) తీసుకువచ్చిన ఈ నిబంధనలో పారదర్శకత ఉందని తెలిపింది. గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ రెగ్యులేషన్స్–1997కు లోబడే ఉందని కూడా వివరించింది. 1956 నాటి ఇండియన్ మెడికల్ కౌన్సిల్ యాక్ట్‌ను మార్చకుండానే ఈ నిబంధనను తీసుకువచ్చారన్న పిటిషనర్ల వాదనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. చట్టంలోని సెక్షన్ -33 ప్రకారం ఇలాంటి నిబంధనలను అమలు చేసే అధికారం ఎంసీఐకి ఉందని వివరించింది. అయితే, ఈ నిబంధన అమల్లోకి వచ్చిన తర్వాత విదేశాల్లో ఎంబీబీఎస్ చదివి స్వదేశంలో ప్రాక్టీస్ చేయాలనుకునే వారి కోసం వన్‌టైం మినహాయింపు ఇవ్వాలన్న విజ్ఞప్తిని సైతం తిరస్కరించింది. కాగా, విదేశాల్లో ఎంబీబీఎస్ చేసి, అక్కడే ప్రాక్టీస్ చేసుకునే వారికి మాత్రం నీట్ యూజీ నిబంధన వర్తించదు.

ఏక్‌నాథ్ షిండే కారును పేల్చేస్తామంటూ బెదిరింపు

ముంబై: మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే కారును పేల్చేస్తామని బెదిరిస్తూ ఆగంతకులు ముంబై పోలీసులకు మెయిల్స్ పంపారు. గోరెగావ్, జేజే మార్గ్ పోలీస్‌స్టేషన్లకు గురువారం ఉదయం ఈ మేరకు మెయిళ్లు అందాయి. 'ఆగంతకుల మెయిళ్ల ఐపీ అడ్రస్‌లను ట్రాక్ చేస్తున్నాం. అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేపట్టాం' అని పోలీసులు తెలిపారు.

పనామాలో వలసదారులు భద్రమేనా?

- హోటల్ కిటికీల వద్ద 'సాయం చేయండి' ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వలసదారులు
- అందరూ క్షేమంగా ఉన్నారని వివరణ ఇచ్చిన భారత్


తమను కాపాడాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వలసదారులు

పనామా సిటీ: చట్టవిరుద్ధంగా తమ దేశానికి చేరుకున్న వివిధ దేశాల పౌరులను అమెరికా తిరిగి వారివారి స్వదేశాలకు తరలిస్తున్న ప్రక్రియపై కొత్త అనుమానాలు రేకెత్తుతున్నాయి. అమెరికా నుంచి బయల్దేరిన అక్రమ వలసదారులకు మార్గమధ్యంలో కొంతకాలం పనామా నగరంలో బస సౌకర్యాలు కల్పిస్తున్న విషయం తెల్సిందే. అయితే పనామా సిటీలోని డికాపొలిస్ హోటల్‌లో ఉన్న పలు దేశాల అక్రమ వలసదారులు ''దయచేసి సాయం చేయండి'', ''మేము ఇక్కడ క్షేమంగా లేము'' అంటూ ప్లకార్డులను హోటల్ కిటికీల వద్ద ప్రదర్శిస్తుండటంతో నిర్బంధంలో వారి బాగోగులపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. అమెరికా నుంచి భారత్‌కు పలు దఫాల్లో వచ్చిన కొందరు అక్రమ వలసదారులను అమానుషంగా చేతులు, కాళ్లు కట్టేసి సరైన ఆహారం అందించకుండా ఏకబిగిన గంటలతరబడి ఉక్కబోత, వేడి పరిస్థితుల్లో తీసుకొచ్చారని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తడం తెల్సిందే. ఈ నేపథ్యంలో పనామా హోటల్‌లో వీరిని స్వేచ్ఛగా ఉండనిస్తున్నారో లేదంటే గదిలో బంధించి, సరైన ఆహారం, కనీస సదుపాయాలు కల్పించ కుండా వేధిస్తున్నారేమోనన్న అనుమానాలు బలపడుతున్నాయి. పనామా సిటీకి చేరుకున్న అక్రమ వలసదారుల్లో దాదాపు 300 మంది చైనా, భారత్, నేపాల్, శ్రీలంక, పాకిస్తాన్, అఫ్గానిస్తాన్ దేశస్తులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ దేశాలు తమ దేశస్తులను స్వీకరించేందుకు పూర్తిస్థాయి సుముఖత వ్యక్తం చేయని కారణంగా నేరుగా ఆయా దేశాలకు పంపడంలో ఆలస్యం అవుతుండటంతో మార్గమధ్యంలో పనామా సిటీకి తరలించినట్లు తెలుస్తోంది.

ఆరోపణలను తోసిపుచ్చిన పనామా

''హోటల్‌లో వాళ్లంతా క్షేమంగా ఉన్నారు. వాళ్ల స్వేచ్ఛను మేం లాగేసుకోలేదు. వాళ్లను నిర్బంధించలేదు. రక్షణ కోసం కేవలం కస్టడీలోకి తీసుకుని బాగోగులు చూస్తున్నాం. అమెరికాతో ఒప్పందం మేరకు వలసదారులకు ఆహారంతోపాటు ఔషధాలు, వైద్యసాయం అందిస్తున్నాం'' అని పనామా రక్షణ మంత్రి ఫ్రాంక్ అబ్రిగో చెప్పారు. ''సొంత దేశానికి వెళ్లేందుకు ఇష్టపడని వారిని కొలంబియా సరిహద్దుల్లోని డేరియన్ ప్రావిన్స్‌లోని అటవీ ప్రాంత శిబిరానికి తరలిస్తాం. తర్వాత మరేదైనా దేశానికి తరలించే బాధ్యతను అంతర్జాతీయ వలసదారుల సంస్థ, ఐక్యరాజ్యసమితి శరణార్థుల సంస్థలు తీసుకుంటాయి. 171 మంది సొంత దేశాలకు వెళ్తామంటున్నారు. 97 మంది వేరే దేశాలకు పంపేయాలని వేడుకుంటున్నారు'' అని ఆయన చెప్పారు. ''హోటల్ నుంచి ఒక చైనా దేశస్తురాలు తప్పించుకుంది. ఈమెను ఉత్తర పనామా-కోస్టారికా సరిహద్దు గుండా అమెరికాలోకి పారిపోయేందుకు ప్రయత్నిస్తుంటే మళ్లీ నిర్బంధంలోకి తీసుకున్నాం'' అని ఆయన చెప్పారు.

వారి శ్రేయస్సే మాకు ముఖ్యం: భారత్

పనామా హోటల్‌లో భారతీయ అక్రమ వలసదారులు అవస్థలు పడుతున్నారని వస్తున్న వార్తలపై భారత్ స్పందించింది. ఈ మేరకు పనామా, కోస్టారికా, నికరాగ్వా దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు 'ఎక్స్' వేదికగా ఒక ప్రకటన చేశాయి. ''వలసదారుల తరలింపులో ఒక స్నేహ సేతువుగా ఉండేందుకు పనామా అధ్యక్షుడు జోస్ రౌల్ ములినో అంగీకరించడంతో భారతీయ వలసదారుల బృందం క్షేమంగా పనామా సిటీకి చేరుకుంది. వాళ్లకు అన్ని కనీస సదుపాయాలు కల్పించారు. వాళ్లతో మన ఎంబసీ అధికారులు మాట్లాడుతున్నారు. వారి శ్రేయస్సే మాకు ముఖ్యం. ఇందుకు అనుగుణంగా ఆతిథ్యదేశంతో సంప్రదింపులు జరుపుతున్నాం'' అని భారత రాయబార కార్యాలయాలు స్పష్టంచేశాయి.


హమాస్ అప్పగించిన శవ పేటికలు, ఇన్‌సెట్‌లో మృతులు

నలుగురు బందీల మృతదేహాలు అప్పగింత


ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లోనే మృతి చెందారన్న హమాస్

ఖాన్ యూనిస్: ఇజ్రాయెల్‌కు చెందిన నలుగురు బందీల మృతదేహాలను హమాస్ గురువారం విడుదల చేసింది. దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్ నగర సమీపంలో రెడ్ క్రాస్ సంస్థకు అందజేసింది. అనంతరం రెడ్‌క్రాస్ వాహనంలో ఉంచారు. ఆ పేటికల్లో షిరి బిబాస్(32), ఆమె ఇద్దరు పిల్లలు ఏరియల్ బిబాస్(4), కెఫిర్ బిబాస్, రిటైర్డ్ జర్నలిస్ట్ ఓడెడ్ లిఫ్ షిట్జ్‌గా గుర్తించారు. వీరందరూ హమాస్ 2023 అక్టోబర్ ఏడో తేదీన దాడిలో అపహరించిన వారు. అయితే ఈ నలుగురు గతేదాది నవంబర్‌లో ఇజ్రాయెల్ చేసిన దాడిలో మరణించారని హమాస్ తెలిపింది. ఇజ్రాయెల్ క్రూరమైన నిరంతర బాంబు దాడుల వల్ల అపహరణకు గురైనవారందరినీ రక్షించలేకపోయామని హమాస్ తెలిపింది. చనిపోయినవారు... పిల్లల ప్రాణాలనూ లెక్కచేయని నాయకత్వ తీరుకు బలైపోయారని హమాస్ బాధితుల కుటుంబాలకు తెలిపింది. మృతదేహాల పేటికలు తమకు అందాయని ఇజ్రాయెల్ సైన్యం ధ్రువీకరించింది. మరణించినవారి వివరాలను ఇజ్రాయెల్ అధికారికంగా వెల్లడించలేదు. అప్పగింత సమయంలో.. ఖాన్ యూనిస్ శివార్లలో వేలాది మంది గుమిగూడారు. శవపేటికలను ఉంచడానికి ఏర్పాటు చేసిన వేదికపై ముసుగులు ధరించిన సాయుధులు... ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును రక్త పిశాచిగా చిత్రీకరించిన పెద్ద బ్యానర్‌ను ప్రదర్శించారు. ఒక పెద్ద స్క్రీన్‌లో లిఫ్ షిట్జ్, బిబాస్ కుటుంబం ఫొటోలను, వీడియోలను ప్రదర్శించారు. అత్యంత చిన్నవయస్కుడైన కెఫిర్.. బాట్‌మాన్ దుస్తులు ధరించి చిరునవ్వులు చిందిస్తున్న ఫొటో అందరినీ కదిలించింది.

హైకోర్టు జడ్జిపై లోక్‌పాల్ విచారణా?

ఈ ధోరణి అత్యంత ఆందోళనకరం ● లోక్‌పాల్ ఉత్తర్వుపై స్టే విధించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ఒక హైకోర్టు సిట్టింగ్ అడిషనల్ జడ్జిపై లోక్‌పాల్ విచారణ చేపడుతూ ఉత్తర్వులు జారీచేయడాన్ని సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా తప్పుబట్టింది. ఈ ధోరణి ఏమాత్రం ఆమోదనీయం కాదని పేర్కొంది. ఈ మేరకు లోక్‌పాల్ జారీచేసిన ఉత్తర్వుల అమలుపై స్టే విధిస్తూ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ అభయ్ ఎస్ ఓకాల సుప్రీంకోర్టు ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది. ఒక హైకోర్టు జడ్జిపై నమోదైన రెండు ఫిర్యాదులను విచారిస్తూ లోక్‌పాల్ జనవరి 27వ తేదీన ఉత్తర్వులు ఇచ్చిన అంశాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి గురువారం విచారించింది. న్యాయవ్యవస్థ స్వతంత్రకు భంగం కల్గించేలా లోక్‌పాల్ వ్యవహరిస్తోందని కోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. హైకోర్టు జడ్జి ఉదంతంలో స్పందన తెలపాలని కేంద్ర ప్రభుత్వం, లోక్‌పాల్ రిజిస్ట్రార్‌తోపాటు హైకోర్టు జడ్జిపై ఫిర్యాదుచేసిన వ్యక్తికి సుప్రీంకోర్టు నోటీసులు జారీచేసింది. సుప్రీంకోర్టు అభిప్రాయంతో కేంద్రప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఏకీభవించారు. హైకోర్టు జడ్జి ఎప్పుడూ కూడా లోక్‌పాల్, లోకాయుక్త చట్టం,2013 పరిధిలోకి రారని మెహతా వాదించారు. ఈ కేసులో హైకోర్టు జడ్జి పేరు బహిర్గతం కాకుండా చూడాలని, ఆ ఫిర్యాదుదారు పేరు, అతను ఇచ్చిన ఫిర్యాదులోని అంశాలను రహస్యంగా ఉంచాలని లోక్‌పాల్ రిజిస్ట్రార్ జనరల్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. ''ఈ అంశంలో కోర్టుకు సాయపడతా. హైకోర్టు జడ్జీల విషయంలో ఇలాంటివి పునరావృతంకాకుండా ఒక చట్టం ఉంటే మంచిది'' అని ఈ అంశంలో కోర్టుకు హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ అన్నారు. కేసు తదుపరి విచారణను మార్చి 18వ తేదీకి వాయిదావేస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. లోక్‌పాల్‌లో ఫిర్యాదుచేసిన వ్యక్తికి వ్యతిరేకంగా ఒక ప్రైవేట్ కంపెనీ ఒక కేసును నమోదుచేసింది. ఈ కేసులో తమకు అనుకూలంగా వ్యవహరించాలని ఈ హైకోర్టు సిట్టింగ్ అడిషనల్ జడ్జిని ఈ ప్రైవేట్ సంస్థ కోరింది. ఈ జడ్జి గతంలో లాయర్‌గా ఉన్న కాలంలో ఇదే సంస్థకు చెందిన కేసును వాదించారు. ఇప్పుడు ఆయన జడ్జీ అయ్యాక ఈ కేసులో హైకోర్టులో మరో జడ్జి, అదనపు జిల్లా జడ్జీలను ఈయన ప్రభావితం చేశారని ఫిర్యాదుదారు లోక్‌పాల్‌లో కేసు వేశారు. దీంతో లోక్‌పాల్ జనవరి 27వ తేదీన హైకోర్టు జడ్జిపై ఉత్తర్వులు జారీచేసింది. లోక్‌పాల్, లోకాయుక్త చట్టం, 2013లోని సెక్షన్ 20(4) ప్రకారం హైకోర్టు జడ్జిపై విచారణ చేపట్టే హక్కు తమకు ఉందని జస్టిస్ ఏఎం ఖన్విల్కర్ సారథ్యంలోని లోక్‌పాల్ బెంచ్ పేర్కొనడంతో సుప్రీంకోర్టు చివరకు ఇలా కలగజేసుకుంది.



మహా కుంభమేళా వేళ మరో అద్భుతం

28వ తేదీన ఆకాశంలో కనువిందు చేయనున్న ఏడు గ్రహాలు

న్యూఢిల్లీ: కోట్లాది మంది భక్తుల రాకతో మహాకుంభమేళా ఘాట్లు, ప్రాంగణాలు కన్నుల పండువగా కనిపిస్తే ఆ కుంభమేళా ముగిసిన తర్వాత సైతం ఆ కన్నుల పండువ కొనసాగనుంది. అయితే ఈసారి నేలపై కాకుండా వినీలాకాశంలో ఓ అద్భుత దృశ్యం చూపరులకు కనువిందు చేయనుంది. అదే సౌరమండలంలోని ఏడు గ్రహాల సాక్షాత్కారం. యురేనస్, నెప్ట్యూన్ మినహా మిగతా అన్ని సౌరకుటుంబ గ్రహాలను నేరుగా మనం కంటితోనే చూడొచ్చు. ఫిబ్రవరి 28వ తేదీన ఇవి అత్యంత స్పష్టంగా కనిపించి మనల్ని ఆశ్చర్యంలో ముంచెత్తనున్నాయి. కాస్తంత దూరంగా ఉండటంతో యురేనస్, నెప్ట్యూన్ గ్రహాలను మనం చూడలేము. టెలిస్కోప్, బైనాక్యులర్ సాయంతో ఈ రెండింటిని చూడొచ్చు. భూమి సూర్యుని చుట్టూ తిరిగే సూర్యగమన పథమార్గంలోనే ఈ అన్ని గ్రహాలను మనం ఒకేసారి చూడొచ్చు. మహాకుంభమేళా వంటి అత్యంత పవిత్రమైన ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని అద్భుతంగా జరుపుకుని పూర్తిచేసుకుంటున్న వేళ గ్రహాలన్నీ సాక్షాత్కారం కావడం అనిర్వచనీయ అనుభూతిని ఇస్తుందని కొందరు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. హిందూ ఆచార సంప్రదాయాల్లో గ్రహకూటమిని విశేషమైనదిగా చెప్పుకుంటారు. భారత్‌లో రాత్రి వేళ బుధుడు, శుక్రుడు, అంగారకుడు, గురుడు, శని గ్రహాలను నేరుగా చూడొచ్చు. ఇలా ఎక్కువ గ్రహాలు ఒకేసారి మహాకుంభమేళా కాలంలో దర్శనమివ్వడంతో దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక శక్తి ప్రసరణ మరింత తేజోవంతమవుతుందని కొందరు భక్తులు విశ్వసిస్తున్నారు.

సాక్షి హైదరాబాద్

శుక్రవారం । 21 । ఫిబ్రవరి । 2025



స్క్రాప్ మాటున గంజాయి రవాణా

స్క్రాప్ మెటీరియల్ మధ్య గంజాయి రవాణా చేస్తున్న కంటైనర్ డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. 300 కిలోల గంజాయిని పట్టుకున్నారు. -8లో



అందాల ఆతిథ్యం

నగరంలో ఫ్యాషన్, గ్లామర్ ప్రపంచం సరి కొత్త సందడి పులుముకుంది. ఈవెంట్స్ రంగం ఉత్సాహంతో ఉరకలేస్తోంది. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 35.0/22.0

నగరంలో శుక్రవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్ఠంగా 35, కనిష్ఠంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ కేంద్రం అధికారులు పేర్కొన్నారు.

'చలో విద్యుత్ సౌధ' భగ్నం



సాక్షి, సిటీబ్యూరో: విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న ఆర్టిజన్ కార్మికులను విద్యార్హతను బట్టి కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ గురువారం చేపట్టిన చలో విద్యుత్ సౌధ కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేశారు. ముందస్తు చర్యల్లో భాగంగా విద్యుత్ సౌధ సహా ఖైరతాబాద్, పంజాగుట్ట సర్కిళ్లలో పోలీసులు భారీ సంఖ్యలో మోహరించారు. ఇతర జిల్లాల నుంచి నగరానికి చేరుకుంటున్న వాహనాలను ఎక్కడికక్కడే అడ్డుకుని కార్మికులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కళ్లుగప్పి విద్యుత్ సౌధ ముందుకు చేరుకున్న జేఏసీ చైర్మన్ ఈశ్వర్‌రావును అరెస్టు చేయగా, కన్వీనర్ వజీర్‌ను ఎర్రగడ్డలో అదుపులోకి తీసుకున్నారు. జేఏసీ కో కన్వీనర్ గాంబో నాగరాజు సహా ఇతర ప్రతినిధులు సదానందం, నరేందర్, ఎల్లయ్యలను ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ భవన్ ముందు అదుపులోకి తీసుకున్నారు.

డీఆర్‌ఎఫ్ పాత్ర కీలకం

- హైడ్రా కమిషనర్ రంగనాథ్
- ఔట్ సోర్సింగ్ అభ్యర్థులకు శిక్షణ



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) నిర్వహిస్తున్న విధుల్లో దీని అంతర్భాగంగా పని చేస్తున్న డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్‌ఎఫ్) పాత్ర అత్యంత కీలకమని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. ప్రభుత్వ లక్ష్యాలు నెరవేర్చడంతో పాటు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా హైడ్రా పని చేయాల్సి ఉందని స్పష్టం చేశారు. డీఆర్‌ఎఫ్‌లోని ఔట్ సోర్సింగ్ విధానంలో కొత్తగా ఎంపిక చేసుకున్న 357 మందికి అంబర్‌పేటలోని పోలీసు ట్రెనింగ్ సెంటర్‌లో (పీటీసీ) వారం రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ కార్యక్రమాన్ని రంగనాథ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో, ప్రభుత్వ పరంగా హైడ్రా కీలక భూమిక పోషిస్తోందని పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజల ప్రాణాలు రక్షించడంతో పాటు ఆస్తి నష్టాన్ని తగ్గించడంలో డీఆర్‌ఎఫ్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఇప్పుడు దీనికి హైడ్రా విధులు కూడా తోడయ్యాయని చెప్పారు. హైడ్రా మీద నమ్మకంతో ప్రభుత్వం పలు బాధ్యతలు అప్పగిస్తోందని, తాజాగా ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునే పనినీ అప్పగించిందని తెలిపారు. ఈ బాధ్యతల్ని అందరూ అంకిత భావంతో నెరవేర్చాలని ఆయన సూచించారు.

బీఆర్‌ఎస్ నుంచి ఒకరు విత్‌డ్రా

నేడు మరొకరు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీలోని 15 సభ్యత్వాల కోసం నామినేషన్లు దాఖలు చేసిన వారిలో బీఆర్‌ఎస్ కార్పొరేటర్ లింగాని ప్రసన్న లక్ష్మి తన నామినేషన్‌ను గురువారం విత్‌డ్రా చేసుకున్నారు. బీఆర్‌ఎస్‌కే చెందిన మరో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణరావు సైతం తన నామినేషన్‌ను శుక్రవారం ఉపసంహరించుకోనున్నట్లు సమాచారం. స్టాండింగ్ కమిటీ కోసం అధికార కాంగ్రెస్‌- ఎంఐఎం పరస్పర అవగాహనతో నామినేషన్లు వేసినందున, పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు బీఆర్‌ఎస్ అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకుంటున్నట్లు సమాచారం. ఉపసంహరణకు నేటి (శుక్రవారం) వరకు గడువు ఉంది. సత్యనారాయణరావు ఉపసంహరణ పూర్తయ్యాక, మిగతా 15 మందిని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించే అవకాశం ఉంది. వీరిలో ఎనిమిది మంది ఎంఐఎం సభ్యులు, ఏడుగురు కాంగ్రెస్ సభ్యులుండటం తెలిసిందే.







నాచోరే.. నాచ్!

సేవాలాల్ ఉత్సవ సమితి, బంజారా ధార్మిక వ్యాప్తి మహా సంఘాల ఆధ్వర్యంలో గురువారం రవీంద్ర భారతిలో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నాచోరే.. నాచ్ అంటూ బంజారా మహిళలు వేసిన స్టెప్పులు ఎంతగానో అలరించాయి.

కోకాపేటకు కొత్త కళ!

అంతర్జాతీయ హంగులతో నియో పోలిస్

- రూ.268 కోట్లతో హెచ్‌ఎండీఏ మౌలిక వసతుల అభివృద్ధి
- రూ.65 కోట్లతో తుదిదశలో ట్రంపెట్ రోడ్డు పనులు
- ఔటర్‌కు అనుసంధానంగా రహదారుల విస్తరణ
- భవిష్యత్‌లో భారీగా పెరగనున్న వాహనాల రద్దీ

కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ అంచనాల ప్రకారం రాయదుర్గం-కోకాపేట మధ్య ప్రతి గంటకు వాహనాల రాకపోకలు ఇలా..

సంవత్సరం	వాహనాలు
2028	8000
2033	10,000
2043	11,500
2053	20,000





సాక్షి, సిటీబ్యూరో:

కోకాపేట కొత్త కళను సంతరించుకుంది. ఆకాశహర్మ్యాలతో ఆకట్టుకుంటోంది. అంతర్జాతీయ హంగులను అద్దుకున్న కోకాపేటలో హెచ్‌ఎండీఏ భారీ ఎత్తున మౌలిక సదుపాయాలను విస్తరించింది. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నియోపోలిస్ లే అవుట్ అభివృద్ధి పనులు తుది దశకు చేరుకున్నాయి. రహదారులు, నీటి సదుపాయం, పార్కులు, విద్యుత్ తదితర సదుపాయాలను అందుబాటులోకి తెచ్చారు. నియోపోలిస్ నుంచి నగరంలోని అన్ని వైపులకు రాకపోకలు సాగించేలా రహదారుల విస్తరణ చేపట్టారు. ఔటర్ రింగ్‌రోడ్డుతో అనుసంధానం చేసే ట్రంక్‌రోడ్డు పనులు తుదిదశకు చేరుకున్నాయి. ప్రస్తుతం టోల్‌ప్లాజా నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. మరో 20 రోజుల్లో పనులు పూర్తి చేసి వాహనాల రాకపోకలను ప్రారంభించనున్నట్లు హెచ్‌ఎండీఏ ఉన్నతాధికారులు తెలిపారు.

నగరంలోనే అత్యంత ఖరీదైన ప్రాంతం..

వివిధ రంగాలకు చెందిన అంతర్జాతీయ సంస్థలు, ఐటీ కంపెనీలు, నివాస సముదాయాలతో విస్తరించిన కోకాపేటకు మెట్రో కనెక్టివిటీని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం రెండో దశలో డీపీఆర్‌ను రూపొందించిన సంగతి తెలిసిందే. మహా నగరంలోనే అత్యంత ఖరీదైన ప్రాంతంగా కోకాపేట గుర్తింపు పొందింది. నియోపోలిస్‌లో హెచ్‌ఎండీఏ నిర్వహించిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో ఎకరా భూమి సుమారు రూ.100 కోట్లు పలికింది. బడా బిల్డర్‌లు, రియల్ ఎస్టేట్ సంస్థలు, వ్యాపార వర్గాలు పోటీ పడి మరీ ప్లాట్‌లను కొనుగోలు చేశాయి. బహుళ అంతస్తుల నిర్మాణాలకు అవకాశం ఉండడంతో అనూహ్యమైన పోటీ నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో రెండు దశల్లో వేసిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో సుమారు రూ.5000 కోట్లకు పైగా ఆదాయం లభించింది. మొదటి నుంచి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ లేఅవుట్‌లో రూ.268 కోట్లతో హెచ్‌ఎండీఏ మౌలిక సదుపాయాలను అభివృద్ధిపర్చింది.

రెండో దశలో భారీ స్పందన..

కోకాపేట నియోపోలిస్‌లో రెండు దశల్లో 14 ప్లాట్‌లలో ఉన్న భూములను విక్రయించారు. 2021 జూన్‌లో నిర్వహించిన మొదటి దశ బిడ్డింగ్‌లో 8 ప్లాట్‌లకు బిడ్డింగ్ నిర్వహించగా.. గరిష్ఠంగా ఎకరానికి రూ.42.4 కోట్ల చొప్పున అమ్ముడైంది. సగటున రూ.35 కోట్ల చొప్పున విక్రయించారు. మొత్తం 48.27 ఎకరాలపై రూ.1901.04 కోట్లు వచ్చాయి. 2023లో నిర్వహించిన రెండో దశ బిడ్డింగ్‌లో 7 ప్లాట్‌లలో 46.33 ఎకరాలను విక్రయించారు. ఎకరానికి గరిష్ఠంగా రూ.100.75 కోట్ల ఆదాయం లభించింది. సగటున రూ.73 కోట్ల చొప్పున విక్రయించారు. రెండో దశలో మొత్తం రూ.3319.60 కోట్ల ఆదాయం లభించింది. మొదటి నుంచి ఈ ప్రాజెక్టుకు ఉన్న ప్రాధాన్యం దృష్ట్యా మౌలిక సదుపాయాల అభివృద్ధిని ప్రతిష్టాత్మకంగా చేపట్టి పూర్తి చేశారు.

ఔటర్‌తో అనుసంధానం..

కోకాపేట నుంచి వివిధ మార్గాల్లో వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం తలెత్తకుండా కోకాపేట లే అవుట్ ప్రవేశ రహదారిని ఔటర్‌తో అనుసంధానం చేసేలా రహదారులను విస్తరించారు. ఈ లే అవుట్‌లో పెద్ద ఎత్తున హైరైజ్ భవనాలను నిర్మిస్తున్న దృష్ట్యా వాహనాల రాకపోకలు సైతం భారీగా ఉంటాయని అంచనా. ఈ మేరకు భవిష్యత్ అంచనాలకు అనుగుణంగా రహదారుల విస్తరణకు హెచ్‌ఎండీఏ అత్యధిక ప్రాధాన్యమిచ్చింది. నార్సింగి వద్ద సుమారు రూ.15 కోట్లకు పైగా వెచ్చించి ఇంటర్‌చేంజ్‌ను ఏర్పాటు చేశారు. మరో రూ.65 కోట్లతో ట్రంపెట్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ పనులు చాలా వరకు పూర్తయ్యాయి. కోకాపేట నుంచి ట్రంపెట్‌కు రాకపోకలు సాగించే మార్గంలో ప్రస్తుతం టోల్‌గేట్ నిర్మిస్తున్నారు. ట్రంపెట్‌ను వినియోగించుకొనేందుకు వాహనదారులు ప్రవేశ రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఈ మార్గంలో ఇటు పటాన్‌చెరు వైపు అటు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వైపు రాకపోకలు సాగించవచ్చు.

వారం రోజుల్లో..

గోదావరి రెండు, మూడో దశలకు టెండర్లు..

- మల్లన్న సాగర్ నుంచి 20 టీఎంసీల తరలింపు
- నగర తాగునీటి అవసరాలకు 15 టీఎంసీలు
- జంట జలాశయాల పునరుజ్జీవనానికి 5 టీఎంసీలు
- రెండేళ్లలో ప్రాజెక్టు పనులు పూర్తి చేసేలా చర్యలు


మల్లన్న సాగర్ (ఫైల్)

సాక్షి, సిటీబ్యూరో: మహా నగర తాగునీటి అవసరాల కోసం మరో 20 టీఎంసీల గోదావరి జలాలను తీసుకొచ్చేందుకు కసరత్తు ప్రారంభమైంది. మరో వారం రోజుల్లో గోదావరి తాగునీటి సరఫరా పథకం రెండు, మూడో దశ పనులకు టెండర్లు ఆహ్వానించేందుకు జలమండలి ఏర్పాట్లు పూర్తి చేసింది. సుమారు రూ.7,360 కోట్ల అంచనా వ్యయంతో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) ప్రాజెక్టు పనులు చేపట్టనున్నారు. మొత్తం వ్యయంలో ప్రభుత్వ వాటా 40 శాతం, నిర్మాణ సంస్థ వాటా 60 శాతం భరించనున్నారు. ప్రభుత్వం తన వాటా నిధులను హడ్కో నుంచి రుణం తీసుకోనుంది. టెండర్ ప్రక్రియ పూర్తయిన నాటి నుంచి 24 నెలల్లో పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టనున్నారు.

రెండు వరుసల భారీ పైపులైన్..

కాళేశ్వరం ఎత్తిపోతల్లో భాగంగా నిర్మించిన మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి శామీర్‌పేట ఘన్‌పూర్ మీదుగా ఉస్మాన్‌సాగర్‌కు రెండు వరుసల భారీ పైపులైన్ నిర్మించనున్నారు. 3000 ఎంఎం డయాతో 50 కిలోమీటర్లు, 2,200 ఎంఎం డయాతో 58 కిలోమీటర్ల వరకు పైపులైన్ పనులు చేపట్టనున్నారు. ఘన్‌పూర్ వద్ద సుమారు 1170 ఎంఎల్‌డీల నీటిశుద్ధి ప్లాంట్ ఇతరత్రా నిర్మించనున్నారు. ఇందుకోసం సుమారు రూ.4,671 కోట్లు వినియోగించనున్నారు.

- సుమారు రూ. 596.88 కోట్ల అంచనా వ్యయంతో ఘన్‌పూర్ నుంచి ముత్తంగి జంక్షన్ వరకు సుమారు 40 కిలోమీటర్లు 2400 ఎంఎం పైపులైన్, దాని వెంట 3000 ఎంఎం డయా రింగ్ మెయిన్‌ను కలుపుతూ పైపులైన్ నిర్మాణంతో పాటు ఇతర పనులు చేపట్టనున్నారు.
- దాదాపు రూ. 300.09 కోట్ల అంచనాతో ఉస్మాన్ సాగర్‌లో 120 ఎంఎల్‌డీ, హిమాయత్‌సాగర్‌లో 70 ఎంఎల్‌డీ సామర్థ్యంతో నీటి శుద్ధి కేంద్రాల నిర్మాణ పనులు చేపట్టనున్నారు.

30 టీఎంసీల కేటాయింపు

గోదావరి జలాల్లో మహానగర తాగునీటి అవసరాలకు సుమారు 30 టీఎంసీల కేటాయింపు ఉంది. ఇప్పటికే గోదావరి మొదటి దశ కింద శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి 10 టీఎంసీల నీటిని తరలిస్తున్నారు. రెండు, మూడు దశల కింద మిగిలిన 20 టీఎంసీలు తరలించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 20 టీఎంసీల్లో నగర తాగునీటి అవరాలకు 15 టీఎంసీలు, మిగిలిన 5 టీఎంసీలను ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాల పునరుజ్జీవనానికి వినియోగించనున్నారు. గోదావరి మొదటి దశలో జలాలను ఇప్పటికే మూడు రింగ్ మెయిన్ పైప్లైన్ల ద్వారా నగరంలోని వివిధ ప్రాంతాలకు అందిస్తున్నారు. రెండో దశ ప్రాజెక్టులో ఘన్‌పూర్ నుంచి నాలుగో రింగ్ మెయిన్ పైపులైన్ ముత్తంగి వరకూ నిర్మించనున్నారు. దీనిని ఇప్పటికే ఉన్న రింగ్ మెయిన్లకు అనుసంధానిస్తారు. మొత్తం మీద ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే రెండోదశ నుంచి 150 ఎంజీడీలు, మూడోదశ నుంచి 150 ఎంజీడీల నీరు ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని అన్ని ప్రాంతాలకూ సరఫరా జరిగే అవకాశం ఉంది.

'స్కిల్ డెవలప్‌మెంట్'కు కమ్యూనిటీ హాల్

సీఎస్సార్ కింద లైట్‌హౌస్ ఫౌండేషన్‌కు..

- వివిధ ప్రాజెక్టుల కోసం 560 ఆస్తుల సేకరణ
- రూ.22 కోట్లతో బీఆర్‌ఎస్ భవన్ నుంచి బంజారా లేక్ వరకు వరద కాల్వ ఆధునికీకరణ
- జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీలో ఆమోదం

రూ.700 కోట్లిచ్చిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు: మేయర్

రాష్ట్రప్రభుత్వం గడచిన సంవత్సర కాలంలో జీహెచ్‌ఎంసీకి రూ. 700 కోట్ల నిధులు విడుదల చేసిందని చెబుతూ సమావేశానికి అధ్యక్షత వహించిన మేయర్ విజయలక్ష్మి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జీహెచ్‌ఎంసీకి ఎంతో ఆదాయాన్నిచ్చే క్రీడాప్రాంగణాలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు.

సాక్షి, సిటీబ్యూరో: ఇప్పటికే జీహెచ్‌ఎంసీకి చెందిన రెండు మోడల్ మార్కెట్లను నిరుద్యోగ యువత, మహిళల ఉపాధి కల్పన పేరిట స్కిల్ డెవలప్‌మెంట్ కోసం సీఎస్సార్ కింద లైట్‌హౌస్ కమ్యూనిటీ ఫౌండేషన్‌కు అప్పగించిన జీహెచ్‌ఎంసీ.. మరో కమ్యూనిటీ హాల్‌ను అదే సంస్థకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణకు ఇచ్చేందుకు పచ్చ జెండా ఊపింది. గతంలో మోడల్ మార్కెట్లు అంటే ఎవరూ ముందుకు రానందున ఖాళీగా ఉన్నాయని ఇచ్చారు. ఈసారి మాత్రం బోరబండలోని జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాల్‌ను ఇచ్చేందుకు గురువారం జరిగిన స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. స్థానిక బస్తీల్లోని పేదలు, సామాన్య ప్రజలకు వివిధ కార్యక్రమాల కోసం ఉపయోగపడాల్సిన కమ్యూనిటీ హాల్‌ను సైతం స్కిల్ డెవలప్‌మెంట్‌కు ఇస్తుండటంతో మున్ముందు ఇంకెన్ని జీహెచ్‌ఎంసీ ఆస్తులు శిక్షణల పేరిట బదలాయిస్తారోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

భారీగా భూ సేకరణలు..

కేబీఆర్ పార్కు చుట్టూ నిర్మించనున్న ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లకు 105 ఆస్తులు, ఆల్విన్ క్రాస్‌రోడ్, ఖాజాగూడ, తదితర ప్రాంతాల్లో ఫ్లై ఓవర్లు, రహదారుల అభివృద్ధి పనులు తదితరాల కోసం మరో 455 ఆస్తులు వెరసి.. మొత్తం 560 ఆస్తుల సేకరణకు కమిటీ పచ్చజెండా ఊపింది. వీటితో పాటు మొత్తం 15 అజెండా అంశాలు, ఆరు టేబుల్ అంశాలకు ప్రస్తుత స్టాండింగ్ కమిటీ చివరి సమావేశం ఆమోదం తెలిపింది.

ముఖ్యాంశాలు ఇలా..

- మిధాని బస్టేషన్, బస్ డిపో నిర్మాణాలకు ఆర్టీసీకి కేటాయించిన 5.37 ఎకరాల ప్రభుత్వ భూమికి ఎన్‌ఓసీ.
- బీఆర్‌ఎస్ భవన్‌నుంచి బంజారా లేక్ వరకు ఎస్‌ఎన్‌డీపీ నిధుల నుంచి రూ.22.17 కోట్ల తో వరద కాల్వ నిర్మాణం, ఆధునికీకరణ.
- ఉప్పల్ సర్కిల్‌లోని చిలుకా నగర్ వివేకానంద విగ్రహం నుంచి కావేరీనగర్ కల్వర్టు వరకు రూ.6 కోట్ల అంచనా వ్యయంతో 100 మి.మీ. డయా పైపులైన్ నిర్మాణం.
- ప్రగతి నగర్ నుంచి మహాదేవపురం వెటర్నరీ హాస్పిటల్ (వయా ఎల్లమ్మ బండ) వరకు ప్రతిపాదిత 30 మీటర్ల లింక్ రోడ్ అభివృద్ధికి అవసరమైన 8 ఆస్తుల సేకరణతో పాటు, రోడ్‌ను మాస్టర్‌ప్లాన్‌లో చేర్చేందుకు ప్రభుత్వానికి వినతి.
- దారుసలాం నుంచి చక్నావాడి కల్వర్టు వరకు రూ.7.40 కోట్లతో ఆర్‌సీసీ బాక్స్ డ్రెయిన్ నిర్మాణం.
- వీటన్నింటినీ పాలకమండలి ద్వారా ప్రభుత్వానికి నివేదించనున్నారు.

జోన్‌కు రూ.25 కోట్లు

జీహెచ్‌ఎంసీలో వివిధ అభివృద్ధి పనులకుగాను జోన్‌కు రూ.25 కోట్ల వంతున మొత్తం రూ.125 కోట్లు కేటాయించనున్నట్లు కమిషనర్ ఇలంబర్తి ఈ సందర్భంగా తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ సమన్వయంతో ప్రజల కోసం పని చేద్దామన్నారు. రహదారుల విస్తరణ, జంక్షన్లు, పార్కులు, క్రీడా ప్రాంగణాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. జీహెచ్‌ఎంసీకి సంబంధించిన ఆస్తులు, వాటిపై వస్తున్న ఆదాయ వివరాలను అందించాలని అడిషనల్ కమిషనర్ (ఎస్టేట్స్) సమ్రాట్ అశోక్‌కు సూచించారు. జీహెచ్‌ఎంసీ ఆస్తులన్నింటినీ డిజిటలైజ్ చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో జీహెచ్‌ఎంసీ సెక్రటరీ కె.సత్యనారాయణ, స్టాండింగ్ కమిటీ సభ్యులు, అడిషనల్, జోనల్ కమిషనర్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.



కమిషనర్, మేయర్‌తో స్టాండింగ్ కమిటీ సభ్యులు, అధికారులు

పరికి చెరువు ప్రాంతంలో హైడ్రా కూల్చివేతలు

నిర్మాణంలో ఉన్న తన ఇంటిని తానే కూల్చుకున్న జేసీబీ డ్రైవర్


జేసీబీ డ్రైవర్‌కు నచ్చచెబుతున్న పోలీస్ అధికారి

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి మండల పరిధిలోని ఆల్విన్ కాలనీ డివిజన్ భూదేవి హిల్స్ పరికి చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో నిర్మించిన అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు గురువారం కూల్చివేశారు. ఈ క్రమంలో హైడ్రాలో జేసీబీని నడిపే ఓ ఉద్యోగి నిర్మాణంలో ఉన్న తన ఇంటిని తానే కూల్చివేసుకోవడం గమనార్హం. తనకు చెందిన ఇంటి స్లాబ్ నిర్మాణాన్ని వదిలివేయాలని అతడు అధికారులను బతిమిలాడినా వారు ససేమిరా అన్నారు. చెరువులు, ప్రభుత్వ భూములు, నాలాల వెంట కొనుగోలు చేసే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించి కొనుగోలు చేసుకోవాలని, కష్టపడిన సొమ్మును వృథా చేసుకోరాదని అతడికి వారు సూచించారు. హైడ్రా సిబ్బంది అయినా, రాజకీయ నాయకులైనా, కబ్జాదారులైనా, ప్రభుత్వ భూములు, చెరువు స్థలాలు, నాలా పరిసర ప్రాంత స్థలాలను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులు స్పష్టం చేశారు. కాగా.. అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్నారనే విషయం తెలియడంతో స్థానికులు ఆ ప్రాంతానికి పెద్ద ఎత్తున వచ్చి అడ్డుకోవడానికి యత్నించారు. దీంతో పోలీసులు వారిని చెదరగొట్టారు. లక్షల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేశామని, ఇళ్లు కట్టుకుంటున్న తరుణంలో కూల్చివేయటమేంటని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

గోల్డ్ లోన్ సొమ్ము నేరగాళ్ల పాలు!

- సిటీ బస్సులో ఫోన్ పోగొట్టుకున్న కార్మికుడు
- దాన్ని చేజిక్కించుకుని యూపీఐ యాప్స్ ఇన్‌స్టాల్
- వీటితో రూ.2.98 లక్షలు కాజేసిన ఈ–కేటుగాళ్లు

సాక్షి, సిటీబ్యూరో: విద్య, వైద్య అవసరాల కోసం ఓ కార్మికుడు తీసుకున్న గోల్డ్ లోన్ సొమ్ము సైబర్ నేరగాళ్ల పరమైంది. ఈ మొత్తంతో పాటు అప్పటికే తన బ్యాంకు ఖాతాలో ఉన్న దాంతో కలిపి రూ.2.98 లక్షలు ఈ–కేటుగాళ్లు కాజేశారు. బాధితుడి ఫిర్యాదుతో గురువారం కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నగరానికి చెందిన ఓ దినసరి కార్మికుడు (56) 20 రోజుల క్రితం గోల్డ్ లోన్ తీసుకున్నారు. అందులోంచి కొంత మొత్తం డ్రా చేసుకునేందుకు రెండు రోజులు క్రితం బ్యాంక్‌కు వెళ్లాడు. అయితే అధికారులు ఖాతాలో నగదు లేదని చెప్పడంతో కంగుతిన్న అతను పాస్‌బుక్ అప్‌డేట్ చేయించాడు. దీని ద్వారా కొన్ని అనధికార లావాదేవీలు జరిగాయని, బ్యాంకు ఖాతాలో ఉన్న మొత్తం గుర్తు తెలియని వ్యక్తులు కాజేశారని తెలిసింది. దీంతో ఆయన గురువారం సిటీ సైబర్ క్రైమ్ ఠాణాను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న దర్యాప్తు అధికారులు ప్రాథమిక ఆధారాలను బట్టి నేరం జరిగిన తీరుపై ఓ అంచనాకు వచ్చారు. కొన్ని రోజుల క్రితం బాధితుడు సిటీ బస్సులో ప్రయాణిస్తూ తన సెల్‌ఫోన్ పాగొట్టుకున్నారు. దీనిపై ఫిర్యాదు చేయడం, సిమ్‌కార్డు బ్లాక్ చేయించడం తదితర చర్యలు తీసుకోలేదు. సదరు ఫోన్‌లో ఉన్న సిమ్ కార్డు నెంబరే బ్యాంకు ఖాతాతో లింకై ఉండగా... ఫోన్ పే, గూగుల్ పే సహా ఎలాంటి యూపీఐ యాప్స్ అందులో లేవు. ఈ ఫోన్‌కు చేజిక్కించుకున్న వ్యక్తులు అందులో యూపీఐ యాప్స్ డౌన్‌లోడ్ చేశారు. ఖాతాతో లింకైన సిమ్‌కార్డు బ్లాక్ కాకపోవడంతో వాళ్ల పని తేలికైంది. బ్యాంకు నుంచి వచ్చే ఓటీపీలు దానికే రావడంతో ఆ యాప్స్‌ను నేరగాడు యాక్టివేట్ చేసుకున్నారు. వీటి ద్వారా లావాదేవీలు చేస్తూ రూ.రూ.2.98 లక్షలు స్వాహా చేశారు. ఈ లావాదేవీలపై బ్యాంకు నుంచి ఎస్సెమ్మెస్‌లు వచ్చినప్పటికీ... ఫోన్ సైతం నేరగాళ్ల వద్దే ఉండటంతో బాధితుడికి విషయం తెలియలేదు. ఫోన్ అన్‌లాక్‌కు సంబంధించిన పాస్‌వర్డ్ సైతం పటిష్టంగా లేకపోవడం సైబర్ నేరగాళ్లకు కలిసి వచ్చింది. ఈ కేసు నేపథ్యంలో సైబర్ క్రైమ్ పోలీసులు కొన్ని కీలక హెచ్చరికలు చేస్తున్నారు. ఆండ్రాయిడ్, ఐఫోన్లలో కచ్చితంగా ఫౌండ్ మై డివైజ్‌ను యాక్టివేట్ చేసుకోవాలని కోరుతున్నారు. ఎవరైనా ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే సిమ్‌కార్డు బ్లాక్ చేయించుకోవాలని, పోలీసులతో పాటు బ్యాంకు అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. తన నెట్ బ్యాంకింగ్, యూపీఐ లావాదేవీలను నిలిపివేయాల్సిందిగా బ్యాంకును కోరాలని సూచిస్తున్నారు.

స్క్రాప్ మాటున గంజాయి అక్రమ రవాణా

- అరకు నుంచి పూణెకు తరలింపు
- 300 కేజీల గంజాయి స్వాధీనం
- కంటైనర్ డ్రైవర్ అరెస్ట్



మాట్లాడుతున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు



కంటైనర్‌ను పరిశీలిస్తున్న సీపీ సుధీర్‌బాబు

నాగోలు: ఎవరికీ అనుమానం రాకుండా కంటైనర్‌లో స్క్రాప్ మెటీరియల్ మధ్య గంజాయి దాచి అరకు నుంచి మహారాష్ట్రకు అక్రమ రవాణా చేస్తున్న కంటైనర్ డ్రైవర్‌ను అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు, ఎస్‌ఓటీ మహేశ్వరం జోన్ పోలీసులు గురువారం అరెస్టు చేసిన అతడి నుంచి 300 కిలోల గంజాయి, కంటైనర్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం ఎల్బీనగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాచకొండ సీపీ సుధీర్‌బాబు వివరాలు వెల్లడించారు..మహారాష్ట్ర, పూణె, రూపినగర్‌కు చెందిన అహ్మద్ గులాబ్ షేక్ డీసీఎం డ్రైవర్‌గా పని చేసేవాడు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అతను సులువుగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో అతడికి అదే ప్రాంతానికి చెందిన వైభవ్, దేవాతో పరిచయం ఏర్పడింది. మాదకద్రవ్యాల దందా నిర్వహించే వారు తమ వద్ద డ్రైవర్‌గా పని చేయాలని అహ్మద్ గులాబ్ షేక్‌కు సూచించారు. ఏపీలోని విశాఖపట్నం నుంచి పూణె, మహారాష్ట్ర, తదితర ప్రాంతాలకు గంజాయి తరలిస్తే ఒక్కో లోడ్‌కు రూ. 3 లక్షలు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. అందుకు అంగీకరించిన అతను గతంలో విశాఖపట్నం నుంచి పూణేకు రెండు లోడ్‌ల గంజాయిని విజయవంతంగా డెలివరీ చేసి వైభవ్‌కు అప్పగించాడు. దానిని వైభవ్, దేవా పూణెలోని తమ ఏజెంట్లకు సరఫరా చేశారు. వైభవ్, దేవా సూచన మేరకు నిందితుడు అమ్మద్ గులాబ్ షేక్ ఇటీవల విశాఖపట్నం వెళ్లి బుజ్జిబాబు అనే వ్యక్తి నుంచి 300 కిలోల గంజాయి (138) ప్యాకెట్లు) సేకరించాడు. తనిఖీల సమయంలో పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు కంటైనర్‌లో ప్లాస్టిక్ స్క్రాప్‌లోడ్ చేసి దాని కింద గంజాయి దాచి హైదరాబాద్ మీదుగా పూణెకు తరలిస్తున్నాడు. దీనిపై సమాచారం అందడంతో ఎస్‌ఓటీ మహేశ్వరం జోన్ పోలీసులు, అబ్దుల్లాపూర్‌మెంట్ పోలీసులు గురువారం మధ్యాహ్నం రామోజీ ఫిల్మ్ సిటీ సమీపంలో కంటైనర్‌ను ఆపి సోదా చేయగా గంజాయిని తరలిస్తున్నట్లు గుర్తించారు. నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు అతడి నుంచి గంజాయి, టాటా కంటైనర్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.1.05 కోట్లు ఉండవచ్చునని సీపీ పేర్కొన్నారు. ఈ కేసులో మిగిలిన నిందితులను పట్టుకునేందుకు ఎస్‌ఓటీ, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఎల్బీనగర్, మహేశ్వరం అదనపు డీసీపీ ఎండీ షకీర్ హుస్సేన్, అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాప్రాల్‌లో దాడికి కుట్ర

- దుష్ట శిక్షణ.. శిష్ట రక్షణ కోసం పనిచేయాలని ప్రతిజ్ఞ
- రామరాజ్య స్థాపనకు సహకరించని వారిని అడ్డు తొలగించాలని దిశానిర్దేశం
- పోలీసుల విచారణలో వెల్లడించిన వీర రాఘవరెడ్డి?
- ముగిసిన మూడు రోజుల కస్టడీ
- నేడు కోర్టులో హాజరుపర్చనున్న పోలీసులు



పోలీసు కస్టడీలో వీర రాఘవరెడ్డి

మొయినాబాద్: చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్‌పై దాడి చేసి, కస్టడీలో ఉన్న వీర రాఘవరెడ్డి విచారణ ముగిసింది. దాడికి సంబంధించిన కీలక విషయాలను పోలీసులు ఆయననుంచి రాబట్టే ప్రయత్నం చేశారు. 14 రోజుల జుడీషియల్ రిమాండ్‌లో ఉన్న నిందితుడిని కోర్టు అనుమతితో పోలీసులు మూడు రోజుల కస్టడీకి తీసుకున్న విషయం తెలిసిందే. విచారణ చివరిరోజైన గురువారం ఉదయం మొయినాబాద్ పోలీస్ స్టేషన్ నుంచి వీర రాఘవరెడ్డిని నగరంలోని యాప్రాల్‌కు తీసుకెళ్లారు. రంగరాజన్‌పై దాడికి ముందు రెండు రోజుల పాటు రామరాజ్యం సైన్యంతో యాప్రాల్‌లోని ఓ ఇంట్లో వీర రాఘవరెడ్డి సమావేశం నిర్వహించాడు. అక్కడే దాడికి కుట్ర జరిగిందనే విషయాలను నిందితుడి నుంచి రాబట్టారు. రెండు రోజుల సమావేశంలో ఏయే అంశాలపై చర్చ జరిగింది? అనే విషయాన్ని పోలీసులు ఆరా తీశారు. రామ రాజ్య స్థాపనలో దుష్ట శిక్షణ శిష్ట రక్షణకోసం పనిచేయాలని.. అందుకు సహకరించనివారి అడ్డు తొలగించుకోవాలని వీర రాఘవరెడ్డి సైన్యంతో ప్రతిజ్ఞ చేయించినట్లు సమాచారం. అక్కడి నుంచి నిందితుడిని మణికొండలోని తన నివాసానికి తీసుకెళ్లి పరిశీలించారు. ఇంట్లో పోలీసులకు కొన్ని ఆధారాలు లభించాయి. అనంతరం రాజేంద్రనగర్ డీసీపీ కార్యాలయానికి తలరించారు. డీసీపీ శ్రీనివాస్, వీర రాఘవరెడ్డిని పలు ప్రశ్నలు అడిగి కీలక విషయాలను రాబట్టారు. చిలుకూరు బాలాజీ దేవాలయానికి వచ్చి రంగరాజన్‌పై దాడి చేయడానికి ముందు ఏం జరిగిందనే విషయాలను తెలుసుకున్నారు. మూడు రోజుల విచారణలో రాబట్టిన కీలక విషయాలతో నివేదిక రూపొందించారు. గురువారం కస్టడీ ముగిసిన నేపథ్యంలో శుక్రవారం అతన్ని కోర్టులో హాజరుపర్చనున్నారు. ఇందుకు సంబంధించిన నివేదికను సైతం శుక్రవారం కోర్టులో సమర్పించనున్నారు.

కులగణన రీ సర్వేకు సహకరించండి



నాయకులతో సమావేశమైన బీసీ కమిషన్ సభ్యుడు జయప్రకాశ్

హుడాకాంప్లెక్స్: కులగణన రీ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని బీసీ కమిషన్ సభ్యుడు రాపోలు జయప్రకాశ్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణనలో పలు ఆరోపణలు వచ్చినందున తిరిగి సర్వే చేపట్టిన విషయం తెలిసిందే. ఈ మేరకు గురువారం ఆయన సరూర్‌నగర్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు, పార్టీ సరూర్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు శంకర్‌యాదవ్‌లతో సమావేశమై కులగణనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులగణనలో పాల్గొనని వారు ప్రస్తుతం రీ సర్వేలో తమ పేర్లను కులాల వారీగా నమోదు చేసుకోవాలన్నారు. కుల సంఘాల అభివృద్ధి, సంక్షేమానికి దోహదపడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్‌యాదవ్, శ్రీనివాస్, ధన్‌రాజ్‌గౌడ్, ఇమ్రాన్‌అలీ, శివకుమార్, షఫీ, యూనస్, జంగారెడ్డి, సుశీల, సంగీత తదితరులు పాల్గొన్నారు.

తుంగభద్ర నదిలో గల్లంతైన వైద్యురాలి మృతి

పోస్టుమార్టం అనంతరం నేడు నగరానికి మృతదేహం



అనన్యరావు(ఫైల్)

సుభాష్‌నగర్: విహార యాత్రకు వెళ్లి తుంగభద్ర నదిలో గల్లంతైన నగర వైద్యురాలు మైనంపల్లి అనన్యరావు(27) మృతి చెందింది. గురువారం అక్కడి యంత్రాంగం మృతదేహాన్ని వెలికి తీసింది. దూలపల్లిలోని అశోక ఎలా మైసన్–2కు చెందిన డాక్టర్ మోహన్‌రావు, రజిత దంపతుల కుమార్తె అనన్య రావు గుండ్లపోచంపల్లిలోని వీకేసీ ఆసుపత్రిలో వైద్యురాలిగా పనిచేస్తోంది. తన స్నేహితులు సాత్విన్, హషితలతో కలిసి కర్నాటకలోని హంపీకి విహార యాత్రకు వెళ్లింది. ఈ నెల 19న సుమారు 25 అడుగుల ఎత్తుగల బండరాయి నుంచి తుంగభద్ర నదిలో ఈత కొట్టాలనుకుంది. నదికి మరోవైపు నుంచి స్నేహితులు సరదాగా వీడియో తీస్తున్నారు. అంతెత్తు నుంచి దూకిన అనన్య కొన్ని క్షణాల పాటు ఈత కొట్టి నీటి ఉధృతికి కొట్టుకుపోయింది. వెంటనే స్నేహితులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో బుధవారం రాత్రి వరకు గాలించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులతో కలిసి మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు అక్కడకి చేరుకున్నారు. మరునాడు గురువారం సాయంత్రం మృతదేహం లభ్యమైంది. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. అధికారులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని నగరానికి తీసుకురానున్నారు.

నుమాయిష్‌లో 247 మంది పోకిరీల పట్టివేత

సాక్షి, సిటీబ్యూరో: నాంపల్లిలో గత నెల 3 నుంచి ఈ నెల 17 వరకు జరిగిన నుమాయిష్‌పై డేగకన్ను వేసిన నగర షీ–టీమ్స్ 247 మంది పోకిరీలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నాయి. వీరిలో 37 మందిపై కేసులు నమోదు చేయగా... ఇద్దరికి న్యాయస్థానం శిక్ష విధించింది. మరో 33 మందికి రూ.1,050 చొప్పున, ఒకరికి రూ.50 జరిమానా, మరొకరి రెండు రోజుల సాధారణ జైలుతో పాటు జరిమానా విధించింది. మరో 20 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ 247 మంది పోకిరీల్లో 223 మంది మేజర్లు, 24 మంది మైనర్లు ఉన్నారు. ఈవ్‌టీజింగ్‌పై 100కు ఫోన్ చేసి లేదా 9490616555కు వాట్సాప్ చేసి సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరుతున్నారు.

సైబర్ బాధితులకు రూ.62 లక్షల రిఫండ్

సాక్షి, సిటీబ్యూరో: వివిధ సైబర్ నేరాల్లో బాధితులుగా మారిన 16 మందికి సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు రూ.62 లక్షలు రిఫండ్ చేశారు. ఈ మొత్తాలను ఆయా నేరగాళ్ల ఖాతాల్లో ఫ్రీజ్ చేయగా... కోర్టు ఆదేశాల మేరకు బాధితులకు గురువారం అందించారు. ఈ 16 మందిలో ఎనిమిది మంది ట్రేడింగ్ ఫ్రాడ్, ఆరుగురు డిజిటల్ అరెస్టు స్కామ్‌ల్లో మోసపోగా... ఇద్దరు వేర్వేరు కేసుల్లో నష్టపోయారు.

పీఎం కిసాన్ పేరుతో ఏపీకే ఫైల్

- తెలియక డౌన్‌లోడ్ చేసుకున్న బాధితుడు
- రూ.1.97 లక్షలు స్వాహా చేసిన నేరగాళ్లు

సాక్షి, సిటీబ్యూరో: పీఎం కిసాన్ దరఖాస్తు పేరుతో సైబర్ నేరగాళ్లు పంపిన ఆండ్రాయిడ్ ప్యాకేజ్ కిట్ (ఏపీకే) ఫైల్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్న బాలానగర్ వాసి రూ.1.97 లక్షలు కోల్పోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. బాలానగర్‌లోని గీతానగర్‌కు చెందిన మల్లికార్జున్ ప్రైవేట్ ఉద్యోగి. తన స్వగ్రామానికి చెందిన వారితో కూడిన వాట్సాప్ గ్రూపులో సభ్యుడిగా ఉన్నారు. ఇటీవల ఆ గ్రూపులో పీఎం కిసాన్ పథకం దరఖాస్తు పేరుతో ఓ లింక్ వచ్చింది. దానిని క్లిక్ చేయడంతో ఓ ఏపీకే ఫైల్ మల్లికార్జున్ ఫోన్‌లో ఇన్‌స్టాల్ అయింది. సైబర్ నేరగాళ్లు ఈ ఫైల్స్‌లో మాల్‌వేర్‌ను నిక్షిప్తం చేసి పంపిస్తారు. ఇది ఒకసారి ఇన్‌స్టాల్ అయిన తర్వాత ఫోన్ మొత్తం నేరగాళ్ల ఆధీనంలోకి వెళ్లిపోతుంది. ఫోన్ ద్వారా జరిగే లావాదేవీలతో పాటు వచ్చే ఎస్సెమ్మెస్‌లు సైతం వారికి చేరిపోతుంటాయి. మల్లికార్జున్ ఫోన్‌ను తమ ఆధీనంలోకి తీసుకున్న సైబర్ నేరగాళ్లు దాని ద్వారా ఆర్థిక లావాదేవీలు చేస్తూ, ఓటీపీలను వినియోగించి రూ.1.97 లక్షలు కాజేశారు. ఎట్టకేలకు జరిగిన మోసాన్ని గుర్తించిన బాధితుడు సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. దీన్ని అధికారులు సాంకేతికంగా దర్యాప్తు చేస్తున్నారు. గత ఏడాది రాష్ట్రంలో నాలుగు వేలకు పైగా ఏపీకే ఫ్రాడ్స్‌కు సంబంధించిన కేసులు నమోదయ్యాయి. ఈ ఫైల్స్‌ను సైబర్ నేరగాళ్లు లింకులు, సందేశాలు సహా వివిధ రూపాల్లో పంపిస్తారని, వీటిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు కోరుతున్నారు.

చెరువులో పడి యువకుడి మృతి



సూర్యదేవ్ మృతదేహం

కీసర: పుట్టిన రోజునాడే ప్రమాదవశాత్తు ఓ యువకుడు చెరువులో నీట మునిగి మృతి చెందిన సంఘటన గురువారం కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని యాద్గార్‌పల్లి గండిచెరువు వద్ద చోటు చేసుకుంది. కీసర ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నం ప్రాంతానికి చెందిన శ్రీనివాస్ కుమారుడు సూర్యదేవ్(26) ఓ మెడికల్ ఏజెన్సీలో పని చేస్తున్నాడు. గురువారం తన పుట్టిన రోజు వేడుకలు జరుపుకునేందుకు బుధవారం హైదరాబాద్‌కు వచ్చిన అతను గచ్చిబౌలిలో ఉంటున్న తన చిన్ననాటి మిత్రులు దినేష్, కాలేషా, లోహిత్, తేజను కలిశాడు. అందరూ కలిసి బుధవారం రాత్రి గచ్చిబౌలిలో పార్టీ చేసుకున్న అనంతరం యాద్గార్‌పల్లి సమీపంలోని అండర్ దిమూన్ రిసార్ట్‌కు వచ్చారు. గురువారం తెల్లవారుజామున మద్యం మత్తులో ఈతకొట్టేందుకు చెరువులో దిగిన సూర్యదేవ్ నీటిలో గల్లంతయ్యాడు. స్నేహితుల సమాచారంతో సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కీసర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నాంపల్లి కోర్టుకు ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ గైర్హాజరు

తదుపరి విచారణ మార్చి 20కి వాయిదా

సిటీ కోర్టులు : గత అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్‌పై కమలాపూర్ పోలీసులు నమోదు చేసిన కేసుపై గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణ జరిగింది. విచారణకు ఆయన గైర్హాజరు కావడంతో అతని తరుపు న్యాయవాది కుర్మ నరేందర్ 317 పిటిషన్ దాఖలు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారని ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్‌తోపాటు పలువురిపై కమలాపూర్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ కేసుపై విచారణ చేపట్టిన న్యాయస్థానం బల్మూర్ వెంకట్ గైర్హాజరు కావడంతో విచారణను మార్చి 20కి వాయిదా వేసింది.

నాంపల్లి కోర్టుకు ఎమ్మెల్యే రాజాసింగ్ గైర్హాజరు

సిటీ కోర్టు : గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై నమోదైన 9 కేసుల్లో గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టు విచారణ చేపట్టింది. అయితే రాజాసింగ్ గైర్హాజరు కావడంతో ఆయన తరుపున న్యాయవాది కరుణసాగర్ పిటిషన్ దాఖలు చేశారు. అనంతరం ఐదు కేసుల్లో సాక్షులను న్యాయవాది విచారించారు. దీంతో పాటు మరో రెండు కేసుల్లో వాదనలు వినిపించారు. దీనిపై విచారణ చేపట్టిన ప్రజాప్రతినిధుల కోర్టు విచారణను మార్చి మొదటి వారానికి వాయిదా వేసింది.

ఆరు రోజుల్లో 1196 టన్నులు సీజ్

- ఇసుక అక్రమ దందాపై నగర పోలీసుల చర్యలు
- 57 మంది అరెస్టు, ఎనిమిది వాహనాలు స్వాధీనం

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరంలో జరుగుతున్న ఇసుక అక్రమ దందాపై పోలీసు విభాగం ఉక్కుపాదం మోపుతోంది. స్థానిక పోలీసులతో పాటు ప్రత్యేక విభాగాలు దీనికోసం పని చేస్తున్నాయి. గత శుక్రవారం నుంచి గురువారం వరకు చేపట్టిన ప్రత్యేక డ్రైవ్స్‌లో మొత్తం 1196 టన్నుల ఇసుకను సీజ్ చేసినట్లు నగర కొత్వాల్ సీవీ ఆనంద్ గురువారం ప్రకటించారు. దీనిపై 26 కేసులను నమోదు చేమని, ఎనిమిది వాహనాలను స్వాధీనం చేసుకుని 57 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఇసుక దందాపై సమాచారం తెలిసిన వారు స్థానిక పోలీసుస్టేషన్ లేదా 100కు సమాచారం ఇవ్వాలని సీపీ కోరారు.

అద్దెకు తీసుకుని అమ్మేశాడు..

- ఘరానా మోసగాడి అరెస్ట్
- రూ.2.5 కోట్ల విలువైన 28 కార్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసులు

జీడిమెట్ల: కార్లను లీజు ప్రాతిపదికన అద్దెకు తీసుకుని వాటిని అమ్మి సొమ్ము చేసుకుంటున్న వ్యక్తిని జగద్గిరిగుట్ట పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్, ఏసీపీ హన్మంతరావు, జగద్గిరిగుట్ట సీఐ నర్సింహ, డీఐ అంజయ్యలతో కలిసి వివరాలు వెల్లడించారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన అప్పరి విశ్వ పణీంద్ర గాజులరామారం దేవేందర్‌నగర్‌లో ఉంటూ చివకల రమణ, రెడ్డి వెంకటేశ్‌లతో కలిసి వీవీఆర్ ట్రావెల్స్ పేరిట సంస్థను ఏర్పాటు చేశాడు. అతను జగద్గిరిగుట్టకు చెందిన శశిధర్ వద్ద 2024 అక్టోబర్‌లో నెలకు రూ. 23 వేలు చెల్లించేలా లీజు ప్రాతిపదికన కారును అద్దెకు తీసుకున్నాడు. రెండు నెలలు సక్రమంగా అద్దె చెల్లించిన తర్వాత అద్దె చెల్లించకుండా కాలయాపన చేస్తున్నాడు. దీంతో అనుమానం వచ్చిన శశిధర్ అతడి కార్యాలయం వద్దకు వెళ్లి చూడగా తాళం వేసి ఉంది. దీంతో పరిసర ప్రాంతాల్లో విచారించగా అతను ఇదే తరహాలో మరికొందరిని మోసం చేసినట్లు తెలిసింది. శశిధర్ జగద్గిరిగుట్ట పోలీసులకు పిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు విశ్వపణీంద్రను అదుపులోకి తీసుకున్నారు.

32 కార్లు అమ్మేశాడు..

విశ్వపణీంద్ర ఇదే తరహాలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 32 కార్లను అద్దెకు తీసుకుని విక్రయించినట్లు విచారణలో వెల్లడైంది. 28 కార్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు అతడికి సహకరించిన రమణ, సత్యనారాయణ, వెంకటేష్‌ల కోసం గాలిస్తున్నారు. నిందితుడు విశ్వపణీంద్రను గురువారం రిమాండ్‌కు తరలించారు.

ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన జగద్గిరిగుట్ట ఇన్‌స్పెక్టర్ నర్సింహ, డీఐ ఎం.అంజయ్య, ఎస్సై శంకర్, ఏఎస్సై రమణ, హెడ్‌కానిస్టేబుళ్లు అంజిబాబు, పురందాస్, కానిస్టేబుళ్లు నరేష్‌కుమార్, చిరంజీవి, నరేష్‌లను డీసీపీ అభినందించి రివార్డులను అందజేశారు.

స్టూడెంట్ వీసాపై వచ్చి డ్రగ్స్ దందా

- మియాపూర్‌లో 60 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం
- బెంగళూర్‌కు చెందిన కార్పొరేట్ ఉద్యోగిని శతాబ్ది మన్నా అరెస్ట్
- అంతర్జాతీయ డ్రగ్ పెడ్లర్ వారెన్ కొకరంగో పరారీ



టీ న్యాబ్ ఎస్పీ సాయి చైతన్యతో కలిసి వివరాలను వెల్లడిస్తున్న మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్

గచ్చిబౌలి: కార్పొరేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ అంతర్రాష్ట్ర డ్రగ్ పెడ్లర్‌గా మారిన ఓ యువతిని అదుపులోకి తీసుకున్న యాంటీ నార్కొటిక్ బ్యూరో(టీన్యాబ్), మియాపూర్ పోలీసులు ఆమె నుంచి 60 గ్రాముల సింథటిక్ ఎండీఎంఏ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలు శతాబ్ది మన్నా(24) అరెస్ట్ చేశామని, మరో అంతర్జాతీయ డ్రగ్ పెడ్లర్ వారెన్ కొకరంగో పరారీలో ఉన్నాడు. గురువారం మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ డాక్టర్ వినీత్ వివరాలు వెల్లడించారు. డ్రగ్ పెడ్లర్ శతాబ్ది మన్నా బుధవారం సాయంత్రం మియాపూర్ బస్‌స్టాప్‌లో ఉన్నట్లు సమాచారం అందడంతో దాడి చేసిన పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని రూ.6 లక్షల విలువైన సింథటిక్ ఎండీఎంఏ డ్రగ్, సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. జార్ఖండ్ రాష్ట్రం, జంషెడ్‌పూర్‌కు చెందిన మన్నా బెంగళూర్‌లో బీబీఏ పూర్తి చేసింది. అక్కడే ఆమెకు స్టూడెంట్ వీసాపై వచ్చిన ఆఫ్రికాకు చెందిన వారెన్ కొకరంగోతో పరిచయం ఏర్పడింది. బెంగళూరులోనే ఉంటూ వర్క్ ఫ్రం హోం విధులు నిర్వహిస్తున్న శతాబ్ది మన్నా తన గదిలోనే డ్రగ్స్ నిల్వ ఉంచి డ్రగ్ పెడ్లర్లకు సరఫరా చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఈ క్రమంలో పక్కా సమాచారంతో డ్రగ్స్ అందజేసేందుకు వచ్చిన మన్నాను అరెస్ట్ చేసినట్లు తెలిపారు., ఏదైనా పార్టీ లేదా పెద్దర్లకు విక్రయించేందుకు ఆమె హైదరాబాద్‌కు వచ్చి ఉండవచ్చునన్నారు. మన్నా నుంచి డ్రగ్స్ కొనుగోలు చేసే సబ్ పెడ్లర్‌ను గుర్తించామని, మరి కొందరిని గుర్తించాల్సి ఉందన్నారు. వీరు గోవా, బెంగళూర్, రాజస్తాన్, ముంబై నుంచి డ్రగ్స్ తీసుకొస్తున్నట్లు సమాచారం ఉందని ఈ డ్రగ్ చైన్‌ను త్వరలోనే చేధిస్తామన్నారు. మరో నిందితుడు వారెన్ కొకరంగోకు అంతర్జాతీయ డ్రగ్ నెట్‌వర్క్‌లో ఉన్నాడని, పరారీలో ఉన్న అతడిని త్వరలోనే పట్టుకుంటామన్నారు. డ్రగ్ పెడ్లర్లు జార్కండ్‌లో పేదరికంలో ఉన్న విద్యార్థులకు డబ్బు ఆశ చూపి ఈ దందాలోకి దించుతున్నట్లు తాము గుర్తించామన్నారు. టీ న్యాబ్ ఎస్పీ సాయి చైతన్య మాట్లాడుతూ డ్రగ్ ఫ్రీ తెలంగాణకు ప్రజలు సహకరించాలన్నారు. గత అక్టోబర్‌లో అబిడ్స్, అఫ్జల్‌గంజ్, చౌటుప్పల్ పీఎస్‌ల పరిధిలో రాజస్తాన్ గ్యాంగ్ నుంచి 350 గ్రాముల ఎండీఎంఏ, డిసెంబర్ 25న ఫిల్మ్‌నగర్ పీఎస్ పరిధిలో 17.38 గ్రాముల ఎండీఎంఏ, పేట్ బషీరాబాద్ పీఎస్ పరిధిలో ఫిబ్రవరి 11న ఇద్దరు రాజస్తాన్ పెడ్లర్ల నుంచి 40 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసున్నట్లు తెలిపారు. విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. సమావేశంలో మాదాపూర్ ఏడీసీపీ జయరాం, టి న్యాబ్ డీఎస్పీ హరిచంద్రారెడ్డి, మియాపూర్ ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు విజయభాస్కర్ రెడ్డి, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

కడ్తాల్: శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై మండల కేంద్రం సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి(50) గురువారం రాత్రి ఏడున్నరకు ముచ్చర్ల గేట్ నుంచి కడ్తాల్ వైపు జాతీయ రహదారిపై నడుచుకుంటూ వస్తున్నాడు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి కల్వకుర్తి వైపు వెళుతున్న ద్విచక్ర వాహనం ఆయన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ద్విచక్ర వాహనంపై ఉన్న నాగర్‌కర్నూల్ జిల్లా బండోనిపల్లికి చెందిన చీమర్ల జగన్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. గాయపడిన జగన్‌ను అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ వరప్రసాద్ పేర్కొన్నారు.

ఏఐజీలో ఎమ్మెల్యే గోపీనాథ్‌కు చికిత్స

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆరోగ్య సమస్యలతో గచ్చిబౌలి ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మూడురోజుల క్రితం ఆరోగ్య పరీక్షల నిమిత్తం ఏఐజీ ఆసుపత్రికి వెళ్లిన ఎమ్మెల్యేకు పలు పరీక్షలు నిర్వహించిన వైద్యులు మరిన్ని పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందించాలని సూచించడంతో ఆసుపత్రిలో చేరారు. వైద్యులు కిడ్నీతో పాటు పలు పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. ఎమ్మెల్యే ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు., శుక్రవారం ఆయన డిశ్చార్జి కానున్నారు. పలువురు రాజకీయ ప్రముఖులు ఆయనను పరామర్శించారు.

జేఎన్‌టీయూ వీసీ ప్రొ.కిషన్ రెడ్డికి సన్మానం

ఉస్మానియా యూనివర్సిటీ: జేఎన్‌టీయూ నూతన వీసీ ప్రొ.కిషన్‌రెడ్డికి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ ఆధ్వర్యంలో సన్మానం జరిగింది. గురువారం వీసీ ఛాంబర్‌లో ప్రొ.కిషన్ రెడ్డిని శాలువతో సన్మానించారు. ఇంజినీరింగ్ కాలేజీల్లో నాణ్యమైన విద్యను అందించాలని కోరినట్లు తెలిపారు.

ఆస్ట్రేలియా ప్రతినిధులతో ఓయూ అధికారుల చర్చలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అధికారులు గురువారం ఆస్ట్రేలియా సర్టిఫైడ్ అకౌంటెంట్స్ (ఏసీసీఏ) ప్రతినిధుల బృందంతో చర్చలు జరిపారు. కామర్స్ విభాగంలో బోధన, పరిశోధనలు, అకడమిక్, శిక్షణ భాగస్వామ్యంతో పాటు పలు రంగాల్లో పరస్పర అవగాహన ఒప్పందాలపై ఉన్న అవకాశాల గురించి చర్చించినట్లు పేర్కొన్నారు.

చిన్నారుల ఎదుగుదలకు 'బాలామృతం'..

- తప్పనిసరిగా తినిపించాలంటున్న అంగన్‌వాడీ టీచర్లు..
- ఎన్నో ప్రయోజనాలతో కూడిన ఆహారం
- పోషక విలువలు మెండు


తల్లులకు బాలామృతం ప్యాకెట్లు అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్..

బంజారాహిల్స్: చిన్నారుల్లో బలహీనత, రక్తహీనత, పోషణ లోపాల నివారణకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలామృతం పంపిణీ చేస్తోంది. బలవర్ధకమైన ఈ ఆహారంపై క్షేత్ర స్థాయిలో అవగాహన లేక చాలామంది తల్లిదండ్రులు పోషకాలతో నిండి ఉన్న బాలామృతాన్ని పిల్లలకు తినిపించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. పిల్లల్లో పోషణ లోపం పోవాలన్నా, రక్తహీనత నివారణకు బాలామృతాన్ని ప్రతిరోజూ తినిపించాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు సూచిస్తున్నారు. అంగన్‌వాడీ టీచర్లు సైతం తప్పనిసరిగా తమ పరిధిలోని పిల్లలకు నెలకో సంచి చొప్పున బాలామృతాన్ని అందజేస్తున్నారు. ఖైరతాబాద్ ఐసీడీఎస్ పరిధి కిందికి వచ్చే సోమాజిగూడ, ఖైరతాబాద్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వర కాలనీ, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, బోరబండ, ఎర్రగడ్డ, వెంగళరావునగర్, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలోని 151 అంగన్‌వాడీ కేంద్రాల్లో 16,156 మంది పిల్లలు ఆటాపాటలతో కూడిన విద్యా బోధన అందిస్తున్నారు. వీరికి పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నారు. ఆరు నెలల నుంచి ఆరేళ్ల లోపు పిల్లలకు ఆటపాటలతో కూడిన బోధనతో పాటు తప్పనిసరిగా బాలామృతాన్ని అందించేందుకు ప్రణాళికలు రూపొందించుకుని పటిష్టంగా అమలు చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఎదుగుదలకు, మానసిక వికాసానికి, జ్ఞాపకశక్తి పెరుగుదలకు బాలామృతం దోహద పడుతుందని అంగన్‌వాడీ టీచర్లు పేర్కొంటున్నారు. కొద్ది రోజుల క్రితం ఐసీడీఎస్ ఖైరతాబాద్ జోన్ పరిధిలో నిర్వహించిన సర్వేలో 1450 మంది చిన్నారుల్లో తీవ్ర, అతి తీవ్ర పోషణ లోపం ఉన్నట్లుగా గుర్తించి వారికి బాలామృతం ప్లస్ అందిస్తున్నారు. ఇది క్రమం తప్పకుండా తినిపించడం వల్ల ఆరు నెలల్లోనే గణనీయమైన మార్పు కనిపిస్తుండడంతో చాలామంది తల్లిదండ్రులు దీని వైపు మొగ్గుచూపుతున్నారు.

బాలామృతంలో ఉండే పోషక పదార్థాలు ఇవీ..

బాలామృతం ప్లస్‌లో వేయించిన గోధుమలు, శెనగపప్పు, పాల పొడి, పల్లీలు, అటుకులు, పంచదార, నూనెతో పాటు క్యాల్షియం, ఐరన్, విటమిన్-ఏ, బీ1, బీ2, బీ12, సీ, ఫోలిక్ యాసిడ్, నియాసిన్, జింక్, మాంసకృత్తులు ఉంటాయి. వీటన్నింటి సమ్మేళనమే బాలామృతం.

ప్రయోజనాలు ఇవీ..

పిల్లలకు బాలామృతం తినిపించడం వల్ల శారీరిక, మానసిక ఎదుగుదలతో పాటు రోగ నిరోధక శక్తి, ఆకలిని పెంచుతుంది. రక్తహీనత, బలహీనతను తగ్గిస్తోంది. పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు తోడ్పడుతుంది. బాలామృతం పిల్లల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. తీవ్ర, అతి తీవ్ర పోషణ లోపం ఉన్న చిన్నారులకు బాలామృతం ప్లస్‌ను తప్పక తినిపించాలి.

రోజుకు 100 గ్రాముల పంపిణీ:



అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు ప్రతి నెలా రెండున్నర కిలోల బాలామృతం ప్యాకెట్‌ను అందజేస్తుంటాం. ప్రతిరోజూ 100 గ్రాముల బాలామృతాన్ని తల్లులు చిన్నారులకు తినిపించాలి. బాలామృతం తినడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. మా వద్దకు 70 మంది చిన్నారులు వస్తుంటారు. వీరందరికీ బాలామృతం పంపిణీ చేయడమే కాకుండా తల్లులు రోజూ తినిపిస్తున్నారో లేదోనని ఆరా తీస్తుంటాం. తప్పనిసరిగా తినిపించాలని ఎప్పటికప్పుడు సూచిస్తుంటాం. పిల్లలు ఎదగాలంటే ఎన్నో పోషకాలు ఉన్న ఈ ఆహారాన్ని తినిపించాలి. చాలామంది తల్లులు తమ పిల్లలకు దీనిని తినిపిస్తున్నారు. తద్వారా పిల్లల మానసిక ఎదుగుదల కూడా స్పష్టంగా కనిపిస్తోంది.

– శివమ్మ, అంగన్‌వాడీ టీచర్, జ్ఞానీజైల్‌సింగ్‌నగర్, ఫిలింనగర్

వైభవంగా శివాజీ మహరాజ్ శోభాయాత్ర


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

రహమత్‌నగర్ : భారత్‌సేనా ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని బుధవారం రాత్రి నిర్వహించిన శోభాయాత్ర వైభవంగా సాగింది. మోతీనగర్ నుండి ప్రారంభమైన యాత్ర బోరబండ బస్ స్టాండ్ వరకు కొన సాగింది. శివాజీ మహారాజ్ అభిమానులు, బీజేపీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకురాలు బంగారు శృతి, లంకల దీపక్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు డా. గౌతంరావు, నాయకులు బంగారు ప్రశాంత్, కుంభాల గంగరాజు, కొలన్ సత్యనారాయణ, షర్మిల జాదవ్, కొత్త వెంకటేశ్ గౌడ్ కృష్ణ మో హన్ తదితరులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఆర్‌నగర్ డివిజన్ ఏసీపీ వెంకటరమణ, బోరబండ ఎస్‌హెచ్‌ఓ వీరశేఖర్ సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు.

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించండి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

లిబర్టీ: ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న డిమాండ్లు పరిష్కరించాలని అఖిల భారత అసంఘటిత ఉద్యోగుల, కార్మికుల సంఘం ప్రతినిధి బృందం నేతలు అన్నారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి డ్రైవర్‌కు ఏటా రూ. 12 వేలు ఇవ్వాలని ఆటో మీటర్ చార్జీలు పెంచాలని కోరారు. సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు నాయకులు రుద్రాక్ష మల్లేష్, రాజేశ్వర్ రెడ్డి, సత్యనారాయణ, ఎండి ఫరూక్, బొక్క నాగరాజు శివ తెలిపారు. ఆటో డ్రైవర్లకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, ఆటోల కొనుగోలుకు వడ్డీ లేని రుణం ఇప్పించాలని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని, ఆర్టీఏ, ట్రాఫిక్ అధికారుల వేధింపులు ఆపాలని మంత్రి దృష్టికి తీసుకురాగా అన్ని సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి భరోసా ఇచ్చినట్లు తెలిపారు.

కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలి

వెంగళరావునగర్ : మానవ శరీరంలో కళ్లకు ఎంతో ప్రాధాన్యం ఉందని, వాటిని జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన అవసరం ఉందని విజ్ఞానజ్యోతి సంస్థ అధికారులు అన్నారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మధురానగర్‌కాలనీలోని విజ్ఞానజ్యోతి పబ్లిక్ స్కూల్‌లో గురువారం చిన్నారులకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన విజ్ఞాన్ సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు కళ్లకు అత్యధిక శ్రమ ఇస్తుంటారని, ఇది సరైన నిర్ణయం కాదన్నారు. సరైన వెలుతురులో చదువుతూ, సకాలంలో నిద్రపోతూ కళ్లపై ఒత్తిడి తగ్గించుకోవాలన్నారు. కంటిలో ఏదైనా పడినట్టుగా అనిపిస్తే తక్షణమే వైద్యుడిని సంప్రదించాలేగాని, సొంత ప్రయోగాలు చేయరాదని సూచించారు. అనంతరం స్కూల్‌లో శంకర్ ఐ ఫౌండేషన్, ఫీనిక్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో చిన్నారులకు వివిధ రకాల కంటి పరీక్షలను నిర్వహించారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో విజ్ఞానజ్యోతి స్కూల్ సీనియర్ ప్రిన్సిపాల్ అరుణకుమారి, ప్రతినిధులు కోడె దుర్గాప్రసాద్, కృష్ణ ప్రసాద్, చుక్కపల్లి ఆకాష్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రంగుమారిన నీళ్లతో పరేషాన్...


ఎన్టీటీ నగర్‌లో రంగుమారిన నీళ్లను చూపిస్తున్న స్థానికులు..

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎన్బీటీ నగర్ బస్తీలో నీళ్లు వస్తున్న ప్రతిసారి తొలి అరగంట పాటు పూర్తిగా రంగు మారి, దుర్వాసనతో వెదజల్లుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. బస్తీలోని ప్రభుత్వ పాఠశాల ఎదురుగా ఉన్న రెండు వీధుల్లో గత కొన్ని నెలలుగా ఈ సమస్యతో ఇబ్బందిపడుతున్నారు. సమస్యను ఎన్నిమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని మహిళలు వాపోతున్నారు. రంగు మారిన నీళ్లు వాడటంతో అనారోగ్యానికి గురవుతున్నామని, సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి


జీహెచ్‌ఎంసీ సర్కిల్-18 డీసీకి ఫిర్యాదు చేస్తున్న వేణుకుమార్..

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని గౌతమ్‌నగర్‌లో ప్రభుత్వం నిర్మించిన వాంబే స్కీం ఇళ్లను అడ్డదారుల్లో ఓ వ్యాపారి కొనుగోలు చేసి జీహెచ్‌ఎంసీ అనుమతులు లేకుండానే ఐదంతస్తుల భవనం నిర్మిస్తున్నాడని, ఆ నిర్మాణాలను కూల్చివేయాలంటూ జూబ్లీహిల్స్ డివిజన్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు బి.వేణుకుమార్, సర్కిల్-18 డీసీ ప్రశాంతికి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం బలహీన వర్గాల కోసం 30 ఏళ్ల క్రితం ఇక్కడ క్వార్టర్స్‌ను నిర్మించిందని, అయితే ఓ వ్యాపారి నాలుగు క్వార్టర్లను కొనుగోలు చేసి 200 గజాల స్థలంగా మార్చుకుని అందులో జీ ప్లస్ 5 అక్రమ అంతస్తులు నిర్మిస్తున్నాడని ఆరోపించారు. దీనివల్ల చుట్టుపక్కల వారికి ప్రమాదకరంగా మారిందని, వెంటనే కూల్చివేయాలన్నారు. లేని పక్షంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వ క్వార్టర్స్‌ను కొనుగోలు చేయడం నిబంధనలకు విరుద్ధమని, దీనికి తోడు 200 గజాల స్థలంగా మార్చుకుని జీహెచ్‌ఎంసీ అనుమతులు లేకుండానే ఐదంతస్తుల అక్రమ నిర్మాణం చేపడుతున్నారని ఆరోపించారు. వెంటనే ఈ అక్రమ నిర్మాణాన్ని కూల్చివేసి కొనుగోలు చేసిన ఈ స్థలాన్ని క్వార్టర్ల యజమానులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. స్పందించిన డీఎంసీ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

సనత్‌నగర్: తమ దృష్టికి వచ్చిన సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కారం జరిగే వరకు నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో కృషి చేయాలని ఏఐసీసీ సభ్యురాలు, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ సూచించారు. బేగంపేట సింధికాలనీలో జరిగిన నాయకులు, కార్యకర్తల సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నీలిమ దృష్టికి తీసుకువచ్చారు. వాటిని అధికారులకు తెలియజేసి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా ఫోన్ ద్వారా విజ్ఞప్తి చేశారు. సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడడంలో నేతలు ముందువరుసలో ఉండాలన్నారు. నిత్యం ప్రజల్లో తిరుగుతూ వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం జరిగేలా చూడడంలో కీలకంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు విశాల్ సూదం, రమేష్, హనీఫ్, చిరంజీవి, మునీర్, కృష్ణ, జగదీష్, శేఖర్, మనోజ్, పర్వేజ్ దతితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులే చెత్త వేస్తే ఎలా..?


వెంగల్‌రావు పార్కుకు వెళ్లేదారిలో ఫుట్‌పాత్‌పై చెత్తా చెదారం

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్‌నెం. 1లోని జలగం వెంగల్‌రావు పార్కుకు వెళ్లే దారిలో ఫుట్‌పాత్‌పై పారిశుద్ధ్య కార్మికులు చెత్త వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెత్తకుప్పలు లేకుండా చేయాల్సిన వారే చెత్తను పోస్తుండటంతో అపరిశుభ్రత నెలకొంటుందని వారు ఆరోపిస్తున్నారు. కాలనీని అనుకుని డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడంతో తాము ఇప్పటికే ఇబ్బందులు పడుతున్నామని దీనికి తోడు కాలనీకి దారి తీసే మార్గంలో చెత్త కుప్పలు ఉండటం మరింత ఇబ్బందిగా ఉందని కాలనీవాసులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బాలికపై లైంగిక దాడి

నిందితుడిపై కేసు నమోదు

వెంగళరావునగర్ : మైనరైన తన కుమార్తెపై ఓ యువకుడు లైంగికదాడికి పాల్పడ్డాడని ఆరోపిస్తూ ఓ మహిళ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జూబ్లీహిల్స్ ప్రాంతానికి చెందిన బాలిక (17) ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. బుధవారం ఆమె కాలేజీకి వెళుతున్నట్లు చెప్పి బయటికి వెళ్లింది. అయితే సదరు విద్యార్థిని కాలేజీకి రాలేదంటూ కళాశాల నుంచి తల్లికి ఫోన్ చేశారు. దీంతో ఆమె కుమార్తెకు ఫోన్ చేయగా రహమత్‌నగర్‌కు చెందిన సాయికుమార్‌తో కలిసి ట్యాంక్‌బండ్‌కు వెళ్లినట్లు చెప్పింది. అంతే గాకుండా ఇటీవల తాము ఇంట్లో లేని సమయంలో సాయికుమార్ తన ఇంటికి వచ్చి బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.





ఘనంగా వీ హబ్ వీ రీచ్ గ్రాడ్యుయేషన్ వేడుకలు..


మహిళా పారిశ్రామికవేత్తలతో జయేష్ రంజన్

బంజారాహిల్స్: మహిళా పారిశ్రామికవేత్తల సాధికారత కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వీ హబ్ వీ రీచ్ గ్రాడ్యుయేషన్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టియర్-2, టియర్-3 ప్రాంతాల మహిళా వ్యాపారుల విజయాలను ఆవిష్కరించారు. మూడు నెలల పాటు సాగిన వీ రిచ్ ప్రీ-ఇంక్యుబేషన్ ప్రోగ్రాం కింద వ్యాపార శిక్షణ, డిజిటల్, ఆర్థిక సాక్షరత శిక్షణ ద్వారా మహిళలు ఆర్థిక సాధికారతలో ముందడుగు వేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ మాట్లాడుతూ మహిళలు ఆర్థిక సాధికారత సాధించేందుకు వీ హబ్ చేస్తున్న కృషి అభినందించారు.అనంతరం మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో మహిళా పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటా

సనత్‌నగర్: ప్రజా సమస్యల పరిష్కరించడంలో తాను ముందుంటానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. గురువారం సనత్‌నగర్‌లోని పలు ప్రాంతాల్లో వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. స్థానిక ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించిన ఆయన సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముందుగా బల్కంపేట శ్మశానవాటిక సమీపంలో డీసీఎం వాహనాలను పార్కింగ్ చేయకుండా ట్రాఫిక్ పోలీసులు తొలగిస్తున్నారని పలువురు వాహనదారులు ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను విన్నవించారు. దీంతో గురువారం ట్రాఫిక్ పోలీసు అధికారులతో కలిసి డీసీఎం పార్కింగ్ ప్రాంతానికి చేరుకుని ట్రాఫిక్‌కు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వాహనాలను నిలుపుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ఎస్సార్టీకాలనీలోని భగత్‌సింగ్ పార్కు వద్ద రూ.20 లక్షల వ్యయంతో నూతన రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించగా, ఆ పనులను పరిశీలించేందుకు ఎమ్మెల్యే వెళ్లగా స్థానికులు ప్రస్తుత అవసరాలను దృష్టిలో ఉంచుకొని సీవరేజ్ లైన్‌ను రీమోడలింగ్ చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, డీసీ రజనీకాంత్‌రెడ్డి, ఈఈ వెంకటేశ్వర్‌రెడ్డి, డీఈ వాసుదేవరెడ్డి, వాటర్‌వర్క్స్ జీఎం హరిశంకర్, ఏఎంఓహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: పెండింగ్ స్కాలర్‌షిప్‌లను తక్షణం విడుదల చేయాలని తెలంగాణ విద్యార్థి పరిషత్తు (టీజీవీపీ) రాష్ట్ర అధ్యక్షులు నక్క శ్రీశైలం యాదవ్ గురువారం డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయనందున గత మూడు సంవత్సరాలుగా వివిధ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థుల సర్టిఫికెట్లు కాలేజీలల్లోనే మగ్గుతున్నాయని పేర్కొన్నారు. రూ.7000 కోట్ల బఖాయిలకుగాను రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.100 కోట్లను మాత్రమే విడుదల చేసినందున ఒక్కొక్క కాలేజీకి లక్ష రూపాయలు కూడా రానందున విద్యార్థుల సర్టిఫికెట్లను ఇవ్వడం లేదన్నారు. తక్షణం పెండింగ్ స్కాలర్‌షిఫ్‌లను విడుదల చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు.

ఓయూ అధికారులకు న్యాక్ గుర్తింపు టెన్షన్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అధికారులకు యూజీసీ న్యాక్ గుర్తింపు టెన్షన్ పట్టుకుంది. గతంలో లభించిన న్యాక్ ఎ-ప్లస్ గుర్తింపును సాధించేందుకు వీసీ ప్రొ.కుమార్‌తో ఇతర అధికారులు తీవ్రంగా కృషిచేస్తున్నారు. ఎగ్జామినేషన్ బ్రాంచ్, దూరవిద్య, పీజీ అడ్మిషన్స్, విద్యార్థులు, ప్రొఫెసర్ల సంఖ్య, ప్లేస్‌మెంట్స్, తదితర అనేక అంశాలను క్రోడీకరించి యూజీసీకి ఆన్‌లైన్ సమర్పిస్తున్నారు. న్యాక్‌పట్ల అవగాహన కోసం మార్చి 3, 4, 5 తేదీలలో పర్మనెంట్, కాంట్రాక్టు, పార్టుటైం అధ్యాపకులకు క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో సదస్సును ఏర్పాటు చేశారు.రెండో సారీ కూడ న్యాక్ ఎ-ప్లస్ గ్రేడ్‌ను సాధించి తీరుతామని ఓయూ అధికారులు ధీమా వ్యక్తం చేశారు.

వలస బాధితులకు హెల్ప్‌డెస్క్



సనత్‌నగర్: వలసదారులకు అండగా నిలబడేందుకు 'డాన్‌బాస్కో ఫర్ మైగ్రేంట్స్' పేరిట హెల్ప్‌డెస్క్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. దేశ నలుమూలల నుంచి ఉపాధి, ఇతర అవసరాల నిమిత్తం నగరానికి వస్తున్న వలసదారులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని డాన్‌బాస్కో సంస్థ ఈ హెల్ప్ డెస్క్‌ను ప్రవేశపెట్టింది. ఎర్రగడ్డ రైతుబజార్ ఎదురుగా గల సనత్‌నగర్ సెయింట్ థెరిస్సా చర్చి ప్రాంగణంలో గల డాన్‌బాస్కో, దిశ కార్యాలయంలో ఉచిత హెల్ప్ డెస్క్‌ను సంస్థ జాతీయ కో-ఆర్డినేటర్ ఫాదర్ ఫ్రాన్సిస్ బాస్కో దిశ కో-ఆర్డినేటర్ ఐవాన్ వాజ్‌తో కలిసి ప్రారంభించారు. గ్రేటర్ పరిధిలో నివాసం ఉంటూ సమస్యల బారిన పడి కొట్టుమిట్టాడుతున్న వలసదారులకు తమ హెల్ప్‌డెస్క్ ఉచితంగా సేవలు అందిస్తుందన్నారు. సహాయం కోసం డాన్‌బాస్కో ఫర్ మైగ్రేంట్స్ ఉచిత టోల్ నెంబర్ 96423 72372లో సంప్రదించవచ్చన్నారు.

మాతృభాషే మధురం

- సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాలభాస్కర్
- ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

చార్మినార్: మన భావాలు, ఆలోచనలను మాతృభాషలోనే ప్రకటించటానికి ఇష్టపడతామని సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ రజతోత్సవాల సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక సదస్సులో ఆయన విద్యార్థులు, అధ్యాపకులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఒక రోజు ముందుగానే కాలేజీలో తెలుగు, హిందీ, ఉర్దూ, కన్నడ, మరాఠీ, మధుర, భోజ్‌పురి, కోయ, గోండి, బంజారా, పంజాబీ, మలయాళం, ఒడియా, మైథిలి భాషల విద్యార్థులు తమ సంస్కృతి, తమ ప్రత్యేక పండుగలు, కుటుంబ సంబంధాలు, మానవ సంబంధాలు, సిటీ కళాశాలపై తమ అభిప్రాయం తదితర అంశాలను తమ మాతృభాషలో వ్యక్తీకరించారు.

సిటీ కాలేజీ మినీ ఇండియా..

సిటీ కాలేజీలో రాష్ట్రంలోని 33 జిల్లాల విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. ఇదొక మినీ తెలంగాణగా గుర్తింపు పొందిందన్నారు. ఈరోజు మాతృభాష దినోత్సవ సదస్సులో పద్నాలుగు భాషల విద్యార్థులు పాల్గొని తమ మాతృభాషలలో మాట్లాడటం అనిర్వచనీయమైన అనుభూతిని ఇచ్చిందన్నారు. ఇప్పుడు సిటీ కాలేజీని మినీ ఇండియాగా పేర్కొనవచ్చని అన్నారు. ఇటీవల కాలేజీని సందర్శించిన నాక్ బృందం కూడా ఈ అరుదైన విశేషాన్ని అభినందించిందని గుర్తుచేశారు.

అమ్మ భాషలో మాట్లాడితేనే సంతృప్తి..

బహుభాషలకు నిలయమైన సిటీ కాలేజీలో చదువుకోవటం వల్ల అనేక భిన్న సాంస్కృతిక, ప్రాపంచిక విశేషాలను తెలుసుకోగలుగుతున్నామని విద్యార్థులు అభిప్రాయపడ్డారు. అమ్మ భాషలో మాట్లాడితేనే సంతృప్తిగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా తెలుగు, హిందీ, ఉర్దూ భాషలలో పదప్రహేళిక, వీరి వీరి గుమ్మడి పండు వీరి పేరేమి? మీకు తెలిసిన సామెతలు, తారుమారైన పదం తదితర భాష సంబంధిత పోటీలను నిర్వహించారు. ఐక్యూఏసీ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సును డా. జె.నీరజ నిర్వహించారు. ఈ సదస్సులో వైస్ ప్రిన్సిపాల్ డా.విప్లవ దత్ శుక్లా, డా.కోయి కోటేశ్వరరావు, అవధానం సుజాత, డా.సూర్యనారాయణ మూర్తి, డా.అనంత లక్ష్మి, డా.కమల సుధారాణి, డా.సుజాత అజ్మీరా, డా.రాజేంద్ర కుమార్, డా.అజరార్ ఉల్ హక్, డా.ఘూన్సీ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
శుక్రవారం । 21 । ఫిబ్రవరి । 2025

కష్టమర్లూ నిందితులే!

నకిలీ సర్టిఫికెట్లతో విదేశాలకు వెళ్లిన వారెందరో...

హబీబ్ వద్ద కొన్నవారి గురించి పోలీసుల ఆరా | వారిని వెనక్కి రప్పించాలని అధికారుల యోచన | ఉస్మానియా యూనివర్సిటీ పేరిట కూడా నకిలీ సర్టిఫికెట్లు

సాక్షి, సిటీబ్యూరో: నకిలీ సర్టిఫికెట్ల ముఠాను ఆటకట్టించిన పోలీసులు ఖరీదు చేసినవారి ఆచూకీ కోసం ఆరా తీస్తున్నారు. అర్హులకు రావాల్సిన అవకాశాలను అడ్డదారిలో నకిలీ సర్టిఫికెట్లతో కాజేసిన వాళ్లూ నిందితులే అని పోలీసులు చెప్తున్నారు. నకిలీ సర్టిఫికెట్ల ముఠాను వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ముఠా వద్ద నకిలీ సర్టిఫికెట్లు ఖరీదు చేసి, వాటి ద్వారా విదేశాలకు వెళ్లిన వారిని గుర్తించి, వెనక్కు రప్పించాలని నగర పోలీసులు భావిస్తున్నారు.

రజీవుల్లా ఫోన్‌లో 85 సర్టిఫికెట్లు

ఈ నకిలీ సర్టిఫికెట్ల ముఠాకు ఫ్లై అబ్రాడ్ కన్సల్టెన్సీ సర్వీసెస్ నిర్వాహకుడు మహ్మద్ హబీబ్ కీలకంగా వ్యవహరించాడు. ఇతడికి రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ఏజెంట్లుగా, సబ్-ఏజెంట్లుగా వ్యవహరించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సునీల్ కపూర్‌కు అభ్యర్థుల వివరాలు పంపి, అతడి నుంచి నమూనాలు వాట్సాప్‌లో తెప్పించుకుని, ఖరారైన తర్వాత ముద్రించిన సర్టిఫికెట్‌ను కొరియర్‌లో రప్పించేవాడు. గతంలో నాలుగుసార్లు జైలుకు వెళ్లి వచ్చిన హబీబ్ తన ఫోన్‌లో ఎలాంటి ఆధారాలు ఉంచుకోలేదు. అయితే ఇతడికి ఏజెంట్‌గా వ్యవహరించిన రజీవుల్లా ఖాన్ ఫోన్‌లో 85 నకిలీ సర్టిఫికెట్లను పోలీసులు గుర్తించారు. ఏజెంట్లుగా, సబ్-ఏజెంట్లను పట్టుకుని, వారి ఫోన్లను విశ్లేషిస్తే మరిన్ని సర్టిఫికెట్లు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పోలీసులు ఆ కోణంలో ముందుకు వెళ్తున్నారు.

లాయర్ల 'భద్రత'లో సునీల్ కపూర్

ఉత్తరప్రదేశ్‌లో నివసిస్తున్న సునీల్ కపూర్ నకిలీ సర్టిఫికెట్ల తయారీకి సూత్రధారి. 2019 నుంచి హబీబ్‌తో కలిసి పనిచేస్తున్న ఇతడిపై ఇప్పటివరకు నగరంలోనే నాలుగు కేసులు నమోదయ్యాయి. సునీల్ ఎప్పుడూ తన చుట్టూ కనీసం నలుగురు లాయర్లను ఉంచుకుంటాడు. హైదరాబాద్‌లో 2022లో నమోదైన కేసుకు సంబంధించి ముందస్తు బెయిల్ తీసుకున్నాడు. 2023లో అరెస్టు చేయడానికి వెళ్లినప్పుడు ఈ 'లాయర్ల భద్రత'చూసి నగర పోలీసులు కంగుతిన్నారు. మూడుసార్లు వెళ్లిన ప్రత్యేక బృందం నోటీసులు జారీ చేసి వచ్చింది. చివరకు న్యాయవాదులతో కలిసి విచారణకు హాజరైన తర్వాత అరెస్టు చేయగలిగింది. అయితే ఇతడి విచారణలో ఎలాంటి కీలక విషయాలు రాబట్టలేకపోయింది. తాజా కేసులోనూ సునీల్ కోసం ఫిల్మ్‌నగర్ పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

హబీబ్, సునీల్‌లతో కూడిన ఈ ఘరానా గ్యాంగ్ కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, దేశవ్యాప్తంగా వివిధ బోర్డులు, యూనివర్సిటీల సర్టిఫికెట్లను తయారు చేసి విక్రయించిందని పోలీసులు చెప్తున్నారు. 2019 నుంచి ఇప్పటి వరకు తెలంగాణ, ఆంధ్ర, రాయలసీమ, సింబయోసిస్ ఇంటర్నేషనల్ డీమ్డ్ (పుణే), ఛత్రపతి సాహుజీ మహరాజ్(కాన్పూర్), బెంగళూరు, ఉస్మానియా, అన్నా, రాజస్థాన్ యూనివర్సిటీలతోపాటు రాజస్థాన్ నర్సింగ్ కౌన్సిల్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ (మహారాష్ట్ర), సెకండరీ అండ్ హయ్యర్ సెకండరీ ఎడ్యుకేషన్ (పుణే), అన్వర్ ఉల్ ఉలూమ్ కాలేజ్ (మేడిపల్లి), తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు, కౌన్సిల్ ఫర్ ది ఇండియన్ స్కూల్ సర్టిఫికెట్ ఎగ్జామినేషన్, మధ్యప్రదేశ్‌లోని స్వామి వివేకానంద, రాజస్థాన్ విద్యాపీఠ్, మీరట్‌లోని సీహెచ్ చరణ్‌సింగ్, కాన్పూర్‌లోని ఛత్రపతి శివాజీ మహరాజ్, ఝాన్సీలోని బుందేల్‌ఖండ్, చెన్నైలోని అన్నామలై, యూనివర్సిటీ ఆఫ్ పుణె, వీబీఎస్ పూర్వాంచల్ యూనివర్సిటీ, ఢిల్లీలోని బోర్డ్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ పేర్లతో సర్టిఫికెట్లు తయారు చేసి అమ్మినట్లు వెలుగులోకి వచ్చింది.



అనేక బోర్డులు, వర్సిటీల సర్టిఫికెట్ల విక్రయం

రైజింగ్ తెలంగాణ అవార్డుల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

శ్రీనగర్‌కాలనీ: పలు సేవా రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న వారిని సత్కరించడం శుభపరిణామమని మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. జేఎంజీ గ్రూప్స్ ఆధ్వర్యంలో రైజింగ్ తెలంగాణ సీఎస్ఆర్ అవార్డులకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం మంత్రి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. విద్య, వైద్య, వ్యాపార, స్త్రీ శక్తి రంగాల్లో విశేష సేవలు అందించినవారికి ఈ అవార్డులను ఇప్పటికే నాలుగు పర్యాయాలు అందించామని జేఎంజీ గ్రూప్స్ సీఈఓ జగన్నాథం మాదిరెడ్డి తెలిపారు. ఆయా రంగాల్లో సేవలందిస్తున్నవారు ఏప్రిల్ 20 వరకు నామినేషన్లు అందించవచ్చని పేర్కొన్నారు. ఏప్రిల్ 30న హైదరాబాద్‌లో అవార్డులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జేఎంజీ గ్రూప్స్ డైరెక్టర్ పవన్, ఐకానిక్ ఎండీ శ్రీనివాసగౌడ్, ఆర్‌పీఏ ఫౌండర్ శివకుమార్, గ్లోబర్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫౌండర్ కట్ట సునీల్, రాచకొండ్ ఫార్చ్యూన్ ఇన్‌ఫ్రా డైరెక్టర్స్ భాగీరెడ్డి, గంగాధరరెడ్డి, సుధాకర్ యాదవ్, విశ్వ పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి భూముల పరిశీలన



రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణ స్థలాల మ్యాప్ పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతం, శశాంక్

కూకట్‌పల్లి/కుత్బుల్లాపూర్: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికిగాను వివిధ మండలాల్లో భూములను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం, స్టేట్ ఫ్లాగ్‌షిప్ స్కీమ్స్ కమిషనర్ శశాంక్ గురువారం పరిశీలించారు. కూకట్‌పల్లిలోని సర్వే నెంబర్ 1009లోని హౌసింగ్‌బోర్డు స్థలాల వివరాలను జిల్లా కలెక్టర్ వివరించారు. అనంతరం కుత్బుల్లాపూర్ మండలం గాజుల రామారం సర్వే నెంబర్ 220లోని 20 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. తర్వాత కాప్రా మండలం జవహర్‌నగర్‌లోని సర్వే నెంబర్ 12 లోని 20 ఎకరాల స్థలం వివరాలను జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి తెలిపారు. ఈ పర్యటనలో మల్కాజిగిరి ఆర్‌డీఓ శ్యాం ప్రకాష్, కీసర ఆర్‌డీఓ ఉపేందర్ రెడ్డి, కూకట్‌పల్లి, కాప్రా, కుత్బుల్లాపూర్ తహసీల్దార్లు పాల్గొన్నారు.

చిత్రలేఖనం అద్భుతమైన కళ

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



అవార్డు గ్రహీతలతో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



కళాకృతులను తిలకిస్తున్న గవర్నర్

గన్‌ఫౌండ్రీ: వైవిధ్య భరిత బొమ్మలు గీయడం సృజనాత్మకమైన కళ అని.. వాస్తవ పరిస్థితులకు అద్దం పడుతున్న కళాకృతులు ప్రజల్లో స్ఫూర్తిని, ప్రేరణ కలిగిస్తాయని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. గురువారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 84వ అఖిల భారత వార్షిక చిత్రకళా ప్రదర్శన ముగింపు వేడుకల్లో ఆయన మాట్లాడుతూ.. చిత్రకారుల ప్రతిభా నైపుణ్యాలను వెలికితీసేందుకు కళా ప్రదర్శనలు ఎంతగానో దోహద పడతాయని కొనియాడారు. చిత్రకారులు విభిన్న రకాల చిత్రాల ద్వారా సమాజానికి సందేశంతో పాటు సామరస్యం, సద్భావన వంటి అంశాలను ప్రేరేపిస్తున్నాయని కొనియాడారు. 1941లో స్థాపించిన హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ 84 ఏళ్లుగా కళా ప్రదర్శనకై కృషి చేయడం అభినందనీయమన్నారు. ఎంతో మంది ప్రముఖులు ఈ సంస్థ ద్వారా కళారంగానికి గొప్ప సేవ చేశారని, దేశంలోని పురాతన సంస్థలలో హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ ఒకటి కావడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. అనంతరం అద్భుత ప్రతిభ కనబరిచిన చిత్ర కళాకారులకు నగదు పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎంవీ రమణారెడ్డి, ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు నిరంజన్, కార్యదర్శి బి.సురేందర్‌రెడ్డి, ఉత్సవ కన్వీనర్ సామల వేణు తదితరులు పాల్గొన్నారు.

నార్మ్ జాయింట్ డైరెక్టర్‌గా గోపాల్ లాల్



ఏజీవర్సిటీ: నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్(నార్మ్) జాయింట్ డైరెక్టర్‌గా డాక్టర్ గోపాల్ లాల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. పంటల మెరుగుదల, నిర్వహణ, సమాచార, సూక్ష్మ నీటిపారుదల వ్యవస్థలు, విత్తనోత్పత్తి, విస్తరణ వ్యవస్థలలో ఆయనకు 28 సంవత్సరాల అనుభవం ఉంది. అంతకుముందు ఆయన కావేరి వాటర్ మేనేజ్‌మెంట్ అథారిటీ, సెంట్రల్ వాటర్ కమిషన్, రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో ఉన్న నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఆన్ సీడ్ స్పైసెస్(ఐసీఏఆర్-ఎన్ఆర్‌సీఎస్ఎస్) డైరెక్టర్‌గా పనిచేశారు. రాజస్థాన్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా వృత్తిని ప్రారంభించారు. ఆయన అనేక జాతీయ అవార్డులు అందుకున్నారు.

ఏఎన్ఎంల సమ్మె విరమణ



ఎన్‌హెచ్ఎం కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రెండో ఏఎన్ఎంలు

సుల్తాన్‌బజార్: సమస్యలు పరిష్కరించాలని గురువారం కోఠిలోని ఎన్‌హెచ్ఎం కార్యాలయం వద్ద రెండో ఏఎన్ఎంలు ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ మాట్లాడుతూ రెండో ఏఎన్ఎంల సమ్మెను విరమిస్తున్నట్లు తెలిపారు. పరీక్ష రాయడానికి అర్హతలేని రెండో ఏఎన్ఎంలకు రిటైర్మెంట్ బెనిఫిట్, 100 శాతం గ్రాస్ శాలరీని అమలు చేయడానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. పోస్టుల పెంపు, వంద శాతం గ్రాస్ శాలరీ తదితర సమస్యలపై కమిషనర్ హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర 2వ ఏఎన్ఎంల సంఘం గౌరవ అధ్యక్షులు రామాంజనేయులు, పద్మ, శ్యామల, తన్వీర్ సుల్తానా, రత్నాకుమారి, జయమ్మ, గిరిజారెడ్డి, గీతారాణి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ



ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ధర్నా చేస్తున్న న్యూడెమోక్రసీ కార్యకర్తలు

కవాడిగూడ: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు సాధినేని వెంకటేశ్వర్‌రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి జె.వి.చలపతి రావు ఆరోపించారు. లక్షలాది మంది ప్రజలు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. రైతు బరోసా, రైతు బీమా, రైతు కూలీలకు రూ. 12 వేలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని, 7వ గ్యారెంటీగా ప్రజాస్వామిక హక్కులు, స్వేచ్ఛను కాపాడాలని డిమాండ్ చేస్తూ సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞానకేంద్రం నుండి ఇందిరాపార్కు ధర్నా చౌక్ వరకు కార్యకర్తలు భారీ ఎత్తున కవాతు నిర్వహించారు. ధర్నాలో వారు మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యను పూర్తిగా పరిష్కరించాలని, ఫీజురీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, కె. గోవర్ధన్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వి. కోటేశ్వర్‌రావు, పీఓడబ్ల్యూ జాతీయ నేతలు వి.సంధ్య, ఝాన్సీ, ఐఎఫ్‌టీయూ ఆలిండియా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఏఐకెఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్, పీడీఎస్‌యూ జాతీయ నాయకులు పి. మహేష్, ఎం పరుశురాంలు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- రంగారెడ్డి జిల్లా కన్హా శాంతివనంలో తెలంగాణ బయో డైవర్సిటీ బోర్డు ఆధ్వర్యంలో నేషనల్ బయో డైవర్సిటీ కాన్ఫరెన్స్-2025 ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో సాయంత్రం 6.30 గంటలకు హరిహరన్ గజల్ మ్యూజిక్ షో జరుగుతుంది.
- బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మధ్యాహ్నం 2 గంటలకు రాష్ట్ర గంగపుత్ర డైరీ-2025 ఆవిష్కరణ ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: ఈ నెల 26వ తేదీ మహాశివరాత్రి సందర్భంగా కీసర, ఏడుపాయల జాతర, బీరంగూడ శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులను నడుపనున్నట్లు ఆర్టీసీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సులు 25వ తేదీ నుంచి 28 వరకు భక్తులకు అందుబాటులో ఉంటాయి. సికింద్రాబాద్, ఈసీఐఎల్, ఉప్పల్, అమ్ముగూడ తదితర ప్రాంతాల నుంచి 285 బస్సులను కీసరకు నడిపేందుకు ఏర్పాట్లు చేశారు. సీబీఎస్ నుంచి ఏడుపాయల జాతరకు వరకు 125 ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయి. పటాన్‌చెరు నుంచి బీరంగూడ వరకు 30 బస్సులను నడిపేందుకు ఏర్పాట్లు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

మెట్రోమార్గంలో కూల్చివేతల పరిశీలన



కూల్చివేతలను పరిశీలిస్తున్న మెట్రోరైల్ ప్రాజెక్టు అధికారులు

యాకుత్‌పురా: పాతబస్తీ మెట్రోరైల్ మార్గంలోని భవనాల కూల్చివేతల్లో అధికారులు వేగం పెంచారు. గురువారం ప్రాజెక్టు విభాగాం తహసీల్దార్ పుష్పమీ, డీఈలు విశ్వనాథ్, బాలకృష్ణ, ఎలక్ట్రికల్ ఏడీఈ శ్రీనివాస్ రెడ్డి, ఏఈ అత్తావుల్లా ఖాన్ బృందం సభ్యులు, మీర్‌చౌక్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ నయీముద్దీన్‌లతో కలసి దారుషిఫా నుంచి పురానీహవేలీ, మీరాలంమండి, ఏతేబర్ చౌక్, అలీజాకోట్ల, బీబీ బజార్ చౌరస్తా ప్రాంతాల్లో కొనసాగుతున్న కూల్చివేతలపై మెట్రో అధికారులు ఆరా తీశారు. ఇప్పటికే నష్ట పరిహారం పొందిన భవనాలను ఖాళీ చేసేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. కూల్చివేత కారణంగా వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు.

బంజారాల అభ్యున్నతికి కృషి

సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలలో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: బంజారాలను చైతన్యపరిచేందుకు జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు సంత్ సేవాలాల్ మహారాజ్ అని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం రవీంద్రభారతిలో సేవాలాల్ ఉత్సవ సమితి, బంజారా ధార్మిక వ్యాప్తి మహా సంఘ్ ఆధ్వర్యంలో సేవాలాల్ 286వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో గిరిజనులకు ప్రత్యేక స్థానం ఉందని, విదేశీయుల దండయాత్రల నుంచి దేశాన్ని రక్షించడంలో ఆదివాసీల పాత్ర కీలకమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహిస్తుందని తెలిపారు. బంజారా భాషకు గుర్తింపు వచ్చేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్, డీకే అరుణ, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, సేవాలాల్ ఉత్సవ సమితి చైర్మన్ డాక్టర్ కళ్యాణ్ నాయక్, వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ వాదాన్ని గెలిపించాలి

- జాజుల శ్రీనివాస్ గౌడ్

పంజగుట్ట: రాష్ట్రంలో జరగబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు బడుగుల ఆత్మగౌరవం, బలిసిన వారికి మధ్య జరుగుతున్నాయని, బీసీ వాదాన్ని గెలిపించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ టీచర్స్ యూనియన్ డైరీని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూల రవీందర్ గెలుపు బీసీ వాదం, రేపటి భవిష్యత్ రాజకీయాలకు మలుపు అని పేర్కొన్నారు. 2028లో ముఖ్యమంత్రి పీఠాన్ని బీసీలు కైవసం చేసుకుంటారనే దానికి ఈ ఎన్నికలే నిదర్శనమని అన్నారు. బీసీ మేధావుల ఫోరం కన్వీనర్ డాక్టర్ చిరంజీవులు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రైవేట్ విద్యాసంస్థల్లో 25 శాతం పేదలకు సీట్లు ఇవ్వాలని, ఈ విధానాన్ని 16 రాష్ట్రాలు ఇప్పటికే అమలు చేస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్‌చారి, విక్రమ్ గౌడ్, బీరప్ప, గోపాలకృష్ణ, చంద్రశేఖర్ గౌడ్, రమా, బాలరాజు గౌడ్, శ్యామ్ కురుమ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లలు దాటి వచ్చి ఏకమయ్యారు



వధూవరులను ఆశీర్వదిస్తున్న సీఎన్ రెడ్డి


రహమత్‌నగర్: రహమత్‌నగర్‌కు అమ్మాయి, అమెరికా అబ్బాయి ప్రేమలో పడ్డారు. ఎలాగైనా పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుని ఎల్లలు దాటి నగరానికి వచ్చి వివాహ బంధంతో ఒక్కటయ్యారు. వివరాల ఇలా ఉన్నాయి.. రహమత్‌నగర్‌కు చెందిన శానం జోజప్ప, సుమలత దంపతుల కుమార్తె శాంతి సఫల అమెరికాలోని టెక్సాస్ నగరంలో ఉద్యోగం చేస్తోంది. ఈ క్రమంలోనే అక్కడి నికోలస్ ట్రాయ్ అనే వ్యక్తితో ఆమెకు పరిచయం ఏర్పడింది. అదికాస్తా ప్రేమగా మారింది. మధురానగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్లో బుధవారం రాత్రి వివాహ జరిగింది. కార్యక్రమానికి రహమత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డితోపాటు పలువురు ప్రముఖులు హాజరై దంపతులను ఆశీర్వదించారు.

బండి సంజయ్‌పై కేసు కొట్టివేత

- ఉత్తర్వులు జారీ చేసిన నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు
- న్యాయం గెలిచిందంటూ బీజేపీ నాయకుల హర్షం

సిటీ కోర్టులు: కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌పై నమోదైన కేసును గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిదుల కోర్టు కొట్టివేసింది. దీంతో న్యాయమే గెలిచిందంటూ బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. 2022 అక్టోబర్‌లో మునుగోడు ఉప ఎన్నికలో భాగంగా అప్పటి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ మానిటరింగ్ కమిటీ అధికారి ఫిర్యాదు మేరకు మర్రిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. 'బీఆర్ఎస్ నాయకులు ఓటుకు రూ.40 వేలు పంపిణీ చేశారా? జాగ్రత్తగా చూసుకోండి, అందులో దొంగనోట్లు ఉంటాయి, వాళ్లు ఇచ్చిన డబ్బులు తీసుకోండి'అని ప్రజలను ప్రేరేపించారని ఎంసీసీ అధికారి ఫిర్యాదులో పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులను దండుపాళ్యం బ్యాచ్‌గా అభివర్ణించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారని తెలిపారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను ఉల్లంఘిస్తూ రోడ్‌షో నిర్వహించి ప్రయాణికులు, ప్రజలకు ఇబ్బంది కలిగేలా వ్యవహరించారని ఫిర్యాదులో పేర్కొన్న విషయం తెలిసిందే. చాలాకాలంగా ఈ కేసు విచారణ జరుగుతున్న నేపథ్యంలో గత వారం బండి సంజయ్ తరఫున న్యాయవాది కరుణసాగర్ వాదనలు వినిపించారు. పోలీసులు తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్. శ్రీనివాస్ వాదించారు. ఇరువురి వాదనల అనంతరం కోర్టు తీర్పును రిజర్వ్ చేస్తూ గురువారానికి వాయిదా వేసింది. ఈ మేరకు గురువారం తీర్పును వెలువరిస్తూ బండి సంజయ్‌పై కేసును కొట్టివేస్తున్నట్లు ఉత్తర్వులు ఇచ్చింది.

తాజ్ బంజారా హోటల్ సీజ్



తాజ్ బంజారా హోటల్‌ను సీజ్ చేస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు

బంజారాహిల్స్: ఆస్తి పన్ను వసూళ్లపై జీహెచ్ఎంసీ సర్కిల్-18 జూబ్లీహిల్స్ అధికారులు దూకుడు పెంచారు. మొండి బకాయి ఉన్న భవన యజమానుల ఆస్తులను జప్తు చేస్తూ ఆస్తి పన్నును ముక్కుపిండి కట్టిస్తున్నారు. తాజాగా గురువారం బంజారాహిల్స్ రోడ్ నెం. 1లోని స్టార్ హోటల్ తాజ్ బంజారాను జీహెచ్ఎంసీ అధికారులు సీజ్ చేశారు. హోటల్ నిర్వాహకులు గత రెండేళ్లుగా పన్ను చెల్లించడంలో తాత్సారం చేస్తున్నారని, పలుమార్లు నోటీసులు జారీ చేసినా స్పందించలేదని, ఆఖరికి రెడ్ నోటీసులు సైతం జారీ చేశామని ఏఎంసీ ఉప్పలయ్య తెలిపారు. హోటల్‌కు రూ.కోటి 40 లక్షల పన్ను బకాయి ఉందని, మొత్తం చెల్లించిన తర్వాతే హోటల్ సీజ్‌ను ఎత్తేస్తామని అధికారులు పేర్కొన్నారు. కాగా, ఏడాదిన్నర కాలంగా తాజ్ బంజారా హోటల్ మరమ్మతుల పేరుతో కొనసాగడం లేదు.

'సోషల్' ఖాతాల తొలగింపు అన్యాయం

- ఎమ్మెల్యే రాజాసింగ్



అబిడ్స్: ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్‌ల నుంచి తన ఖాతాలను తొలగించడం పట్ల బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్రంగా స్పందించారు. ఈ మేరకు గురువారం ఆయన ఎక్స్‌లో ఒక పోస్టు పెట్టారు. హిందువులను లక్ష్యంగా చేసుకొని సెలక్టివ్ సెన్సార్‌షిప్ దాడి చేస్తోందని విమర్శించారు. 'నా కుటుంబం, స్నేహితులు, కార్యకర్తలు, మద్దతుదారుల సోషల్ మీడియా ఖాతాలను ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్‌లను బ్లాక్ చేయడం అత్యంత దురదృష్టకరం, అన్యాయం'అని పేర్కొన్నారు. పక్షపాత ధోరణి, అణిచివేతకు ముగింపు పలకాలని, వాక్ స్వాతంత్ర్యాన్ని కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు.

సందడిగా 'ఫిల్మ్ ఇట్ ఇండియా'



అవార్డులు అందుకున్న విద్యార్థులు



విద్యార్థుల సంప్రదాయ నృత్యం

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో గురువారం ఇంటాక్ 'ఫిల్మ్ ఇట్ ఇండియా'ఫిలిం ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో సాంస్కృతిక అవగాహన, బాధ్యతను పెంపొందించే లక్ష్యంతో ఈ ఫెస్టివల్ కొనసాగింది. చలనచిత్రాలను రూపొందించడం, విద్యార్థులను అందులో భాగస్వాములను చేయడమే దీని ఉద్దేశం. ఏటా విద్యార్థులు రూపొందించిన అత్యుత్తమ చిత్రాలను ప్రదర్శిస్తారు. అందులో భాగంగా గురువారం జరిగిన ఫెస్టివల్‌లో షార్ట్‌ఫిల్మ్‌లు, డాక్యుమెంటరీలను ప్రదర్శించారు. వీటిలో అత్యుత్తమంగా నిలిచిన వాటికి మిరాజ్ మీడియాకు చెందిన సినిమాటోగ్రాఫర్, రీసెర్చ్ అసోసియేట్ అరవింద్ ఆచంట ముఖ్యఅతిథిగా హాజరై అవార్డులను అందజేశారు. జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ ఈ ఏడాది మూడు ప్రతిష్టాత్మక అవార్డులను గెలుచుకుంది. బెస్ట్ కాన్సెప్ట్ ఫిలిం, బెస్ట్ డాక్యుమెంటరీ ఫిలిం, బెస్ట్ ప్రోయాక్టివ్ ఫిలిం విభాగాలకుగాను ఎనిమిదో తరగతికి చెందిన సాన్వీ కందెలియా, రెడ్డి ధన్వి అవార్డులను గెలుచుకున్నారు.

సీపీఆర్ చేసి.. ఊపిరి పోసి..

కానిస్టేబుల్‌ను కాపాడిన మరో కానిస్టేబుల్





కానిస్టేబుల్‌కు సీపీఆర్ చేస్తున్న నరేష్

లంగర్‌హౌస్: విధులకు వెళుతున్న కానిస్టేబుల్ ఉన్నట్టుండి గుండెపోటుతో కిందపడిపోయారు. మరో కానిస్టేబుల్ వెంటనే స్పందించి సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడారు. లంగర్‌హౌస్ బాపుఘాట్ వద్ద అద్దెకుంటున్న కానిస్టేబుల్ బుచ్చిగాల సంతోష్ రావు చెర్లాపూర్ మహిళా పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. విధులకు వెళ్లడానికి గురువారం ఉదయం ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. ఫ్లోర్‌మిల్ వద్దకు రాగానే గుండెపోటు రావడంతో కిందపడిపోయారు. కూతవేటు దూరంలో విధులు నిర్వహిస్తున్న లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ నరేష్ వెంటనే అక్కడకు చేరుకొని సీపీఆర్ చేసి ఆయనకు ప్రాణాలు పోశాడు. అనంతరం చికిత్స నిమిత్తం సంతోష్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లారు. పోలీసు అధికారులు, సిబ్బంది, స్థానికులు నరేష్‌ను అభినందించారు.

తెలుగు వర్సిటీ యువ పురస్కారానికి ఆహ్వానం

నిజాంపేట్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రంగస్థల కళల శాఖ యువ పురస్కారానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ప్రతి ఏడాది మార్చి 27న నిర్వహించే ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా జె.ఎల్.నర్సింహారావు పేరు మీద యువ పురస్కార ప్రదానోత్సవం నిర్వహిస్తోంది. నటన, దర్శకత్వం, మేకప్, లైటింగ్, ఇంకా ఇతర సాంకేతిక అంశాల్లో కృషి చేసిన 35 సంవత్సరాల లోపు యువతి, యువకులు ఈ పురస్కారానికి దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. రిజిస్ట్రార్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, బాచుపల్లి పేరిట పోస్టు ద్వారా కాని, స్వయంగా కానీ మార్చి 10 వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, శుక్రవారం, 21, ఫిబ్రవరి, 2025

సేవే పరమావధిగా..

వాట్సాప్ గ్రూపు ద్వారా కార్యక్రమాలు | పేదలకు అండగా నిలబడుతూ

సమాజ సేవే లక్ష్యంగా, పేదలకు సహకారమే పరమావధిగా భావించి.. స్వామి వివేకానంద స్ఫూర్తితో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు గౌతంనగర్‌కు చెందిన 'మానవ సేవే – మాధవ సేవ' వాట్సాప్ గ్రూప్ సభ్యులు. 2014లో 20 మంది సభ్యులతో వివేకానంద రైజింగ్ సొసైటీ ఏర్పాటుచేశారు. దీనిని రిజిస్టర్ చేసుకుని వాట్సాప్ గ్రూప్ ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. సభ్యులంతా వివిధ వృత్తుల్లో ఉండి ఐక్యంగా ఒకే లక్ష్యం కోసం కృషి చేస్తున్నారు.

– గౌతంనగర్





ప్రభుత్వ లోపం, అధికారుల నిర్లక్ష్యం వెరసి అనేక బాధలు అనుభవిస్తున్న ప్రజల సమస్యలను ఎత్తిచూపుతూ వాటి పరిష్కారానికి సొసైటీ సభ్యులు అన్ని ప్రయత్నాలూ చేస్తున్నారు. క్రమంగా 'మానవ సేవే – మాధవ సేవ' వాట్సాప్, ఫేస్‌బుక్ గ్రూపుల ద్వారా మల్కాజిగిరికి చెందిన 250 మంది సభ్యులతో పాటు ఇతర దేశాల్లో స్థిరపడిన మిత్రులను కలుపుకొని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఆర్థిక స్థోమత లేని వారికి అండగా..

చదువుకోవాలనే తపన ఉన్నా.. ఆర్థిక స్థోమత లేని వారికి, వికలాంగులకు, చిన్న వయసులో ప్రమాదకర రోగాల బారిన పడ్డ అభాగ్యులకు చేయూతనందిస్తున్నారు. కనీస సౌకర్యాలు లేని పలు అంగన్‌వాడీ సెంటర్లకు సహకారం అందిస్తున్నారు. కోవిడ్ సమయంలో సినీ నటుడు సోనూసూద్‌ను ఆశ్రయించి గౌతంనగర్‌కు చెందిన విద్యార్థుల ఫీజులకు రూ.20 వేల నగదును సేకరించారు. పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. మిర్యాలగూడలో ఉండే ఉమాదేవి కాలు శస్త్ర చికిత్సకు రూ.32,250 నగదు అందజేశారు. పలు ఆస్పత్రులకు కుర్చీలు, రోడ్డుపక్కన ఉండే వారికి దుప్పట్లు అందజేశారు. ఇంటర్ విద్యార్థులకు ఫీజులు, పేదింటి మహిళల వివాహాలకు ఆర్థిక సహాయం అందజేశారు.

గ్రూపు సభ్యుల సహకారంతో...

మానవ సేవే – మాధవ సేవ గ్రూప్ ఏర్పాటు చేసి పది సంవత్సరాలు అవుతోంది. ప్రతి నెలా సమావేశం నిర్వహించి, సభ్యుల సమిష్టి నిర్ణయంతో, దాతల సహకారం మేరకు కార్యక్రమాలు చేపడతాం.

– కుమ్మరి రాజు, వాట్సాప్ గ్రూప్ అడ్మిన్.



బాహ సే ఇండియా-2025కి సర్వం సిద్ధం

సనత్‌నగర్: ఇంజినీరింగ్ విద్యార్థుల్లో నైపుణ్యతకు అద్దంపట్టే బాహ సే ఇండియా 2025 మళ్లీ వచ్చేసింది. సృజనకు పదును పెట్టి డిజైన్‌కు రూపకల్పన చేసి తయారుచేసిన వాహనాలతో రయ్ రయ్ అంటూ దూసుకెళ్లే సమయం మరోసారి రానే వచ్చింది. శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ సహకారంతో సొసైటీ ఆఫ్ ఆటోమోటివ్ ఇంజినీర్స్ (ఎస్‌ఏఈ) ఆధ్వర్యంలో నేటి నుంచి 25 వరకూ జరిగే 'బాహ సే ఇండియా'కు నర్సాపూర్‌లోని బీవీ రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బీవీఆర్ఐటీ) వేదికైంది. నార్త్‌లో జరిగే బహ సే ఇండియా తెలంగాణలో వరుసగా రెండోసారి నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. బేగంపేటలోని హోటల్ టూరిజం ప్లాజాలో బాహ సే ఇండియా నిర్వాహక కమిటీ అధ్యక్షుడు బాలరాజు సుబ్రహ్మణ్యం, శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి ఆదిత్య విస్సం, బీపీసీఎల్ హైదరాబాద్ టెరిటరీ మేనేజర్ శ్రవణ్ కుమార్, రెనాల్ట్ నిస్సాన్ టెక్నాలజీ బిజినెస్ సెంటర్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ (హెచ్‌ఆర్) సిమోనా అడెలినా పోపోవిసీ తదితరులు మాట్లాడారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ అన్ని రాష్ట్రాల నుంచి 85 టీమ్‌లు పోటీ పడనున్నాయి. ఒక్కో టీమ్‌లో 20–30 మంది విద్యార్థులు చొప్పున దాదాపు 2,500 మంది హాజరుకానున్నారు. ఎలక్ట్రిక్ వాహనాలు, హైడ్రోజన్, సీఎన్‌జీ, పెట్రోల్, డీజిల్ ఆధారిత వాహనాలను తయారుచేసి ప్రతిభను చాటనున్నారు. ఈ సారి ఈ-వాహనాలకు ప్రాధాన్యతనివ్వనున్న నేపథ్యంలో 'ఫ్యూజన్ 4 ఫ్యూచర్' థీమ్‌తో నిర్వహిస్తున్నారు. ఏడాది పొడవునా విద్యార్థులు చేసిన కృషిని ట్రాక్‌పై పరీక్షించుకోనున్నారు.. దాదాపు 60 ప్రముఖ వాహన కంపెనీల ప్రతినిధులు హాజరై నైపుణ్యత కలిగిన విద్యార్థులకు ప్లేస్‌మెంట్ ఇవ్వనున్నారు.



వీకెండ్ వైబ్స్..

ట్రెక్కింగ్, నేచర్ క్యాంప్, బర్డ్స్ వాక్

రేపటి నుంచి మార్చి 30 వరకు

గచ్చిబౌలి : తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ(టీజీఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలో వీకెండ్‌లో ట్రెక్కింగ్, నేచర్ క్యాంప్, బర్డ్స్ వాక్ నిర్వహిస్తున్నట్లు టీజీఎఫ్‌డీసీ ఎకో టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్ నాయక్ తెలిపారు. ఎకో టూరిజాన్ని ప్రోత్సహించేందుకు, అడవులు, జంతువులు, పక్షుల పట్ల అవగాహన కల్పించేందుకు 'దక్కన్‌వుడ్స్, ట్రయల్ పేరుతో ప్రతి శనివారం, ఆదివారం వివిధ కార్యక్రమాలు రూపొందించామని పేర్కొన్నారు. ఫిబ్రవరి 22 నుంచి మార్చి 30 వరకూ ఎకో టూరిజం కార్యక్రమాల వివరాలు..

- ఫిబ్రవరి 22న ఉదయం 6.30 – 9.30 గంటల వరకూ మంచిరేవుల ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో ట్రెక్కింగ్, నేచర్ ట్రయల్
- ఫిబ్రవరి 23న వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్‌లో ఉదయం 7–10 గంటల వరకూ బర్డ్ వాక్, మార్చి 1న మంచిరేవుల ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో మధ్యాహ్నం 3 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 10 గంటల వరకూ నేచర్ క్యాంప్
- మార్చి 2న గజ్వేల్ ఫారెస్ట్‌లో ఉదయం 7–10 గంటల వరకూ బర్డ్ వాక్
- మార్చి 8న మంచిరేవుల ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో మధ్యాహ్నం 3 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 10 గంటల వరకూ నేచర్ క్యాంప్
- మార్చి 9న ఉదయం 6.30 – 10 గంటల వరకూ బర్డ్ వాక్
- మార్చి 15న మంచిరేవుల ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో మధ్యాహ్నం 3 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 10 గంటల వరకూ నేచర్ క్యాంప్
- మార్చి 16న ఉదయం 6.30 – 9.30 గంటల వరకూ ట్రెక్కింగ్, నేచర్ ట్రయల్
- మార్చి 22న మధ్యాహ్నం 3 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 10 గంటల వరకూ నేచర్ క్యాంప్
- మార్చి 23న వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్‌లో ఉదయం 7 – 10 గంటల వరకూ బర్డ్ వాక్, ట్రెక్కింగ్
- మార్చి 29న మంచిరేవుల ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో మధ్యాహ్నం 3 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 10 గంటల వరకూ నేచర్ క్యాంప్
- మార్చి 30న గజ్వేల్ ఫారెస్ట్‌లో ఉదయం 7 – 10 గంటల వరకు బర్డ్ వాక్ ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు 94935-49399, 93463-64583 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

'మిస్ వరల్డ్'తో నగర ఫ్యాషన్ ప్రపంచానికి సరికొత్త ఊపు

గత కొంత కాలంగా స్తబ్దుగా ఉన్న మోడలింగ్‌కు పునర్వైభవం

పలు అనుబంధ రంగాల్లో సందడి



అందాల ఆతిథ్యం..



విశ్వసుందరి జన్మించిన నగరంలో పోటీలు

నగరంలో ఫ్యాషన్, గ్లామర్ ప్రపంచం సరికొత్త సందడి పులుముకుంది. ఈవెంట్స్ రంగం ఉత్సాహంతో ఉరకలేస్తోంది. తొలిసారిగా మిస్ వరల్డ్ పోటీలు నగరంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించడమే ఈ సందడికి కారణం. ప్రపంచస్థాయి అందాల పోటీకి ఆతిథ్యం ఇచ్చే అవకాశం రావడం నగరంలో ఫ్యాషన్ రంగానికి చెందిన ఔత్సాహికులకు కలర్ ఫుల్ కలలకు ఊతమిస్తోంది.

– సాక్షి, సిటీబ్యూరో



దేశానికి విశ్వసుందరి కిరీటాన్ని అందించిన సుస్మితాసేన్ జన్మస్థలం మన హైదరాబాద్ నగరమే. ఈ విషయం తెలిసిందే. ఆ అనుబంధంతోనే మిస్ యూనివర్స్‌కు సన్నాహక పోటీలైన ఐయామ్ షిని స్థాపించిన సుస్మిత మన నగరంలో ఆ పోటీలను నిర్వహించారు. అదే విధంగా మిస్ ఇండియా పోటీలకు సైతం నగరం ఆతిథ్యం ఇచ్చింది. అయితే తొలిసారిగా మిస్ వరల్డ్ పోటీలు జరుగనుండడం నగరంలోని ఫ్యాషన్, గ్లామర్ రంగంతో పాటు పలు అనుబంధ రంగాలకు కొత్త ఉత్సాహాన్ని అందిస్తోంది. 72వ మిస్ వరల్డ్ వచ్చే మే 7వ తేదీ నుంచి 31వ తేదీ వరకూ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ వేదికలపై జరుగుతుండగా, అందులోని అత్యంత ముఖ్యమైన ప్రారంభ, ముగింపు కార్యక్రమాలతో పాటు గ్రాండ్ ఫైనల్స్ కూడా నగరంలోనే జరగనున్నాయి.

అంతర్జాతీయ స్థాయిలో..

ప్రపంచ సుందరి పోటీలకు ఆతిథ్యం ఇవ్వడం నగరానికి మరింత గ్లోబల్ లుక్ తెచ్చిపెడుతోంది. మొత్తం 120 దేశాలు పాల్గొనే ఈ అతిపెద్ద ఈవెంట్ దాదాపు నెల రోజుల పాటు నగర కేంద్రంగా జరగడం వల్ల అంతర్జాతీయంగా ఖ్యాతి పొందనుంది. ముఖ్యంగా ఇప్పటి వరకూ జరగని స్థాయిలో అంతర్జాతీయ ఫ్యాషన్, మోడలింగ్ రంగాలను నగరం ఆకర్షిస్తోంది. తద్వారా నగరంలో ఔత్సాహిక యువతకు అవకాశాలు విస్తరిస్తాయి. అదే విధంగా నగరం, చుట్టుపక్కల చారిత్రక ప్రదేశాలు, సంప్రదాయ హస్తకళలు ప్రపంచం దృష్టికి రానున్నాయి. ఇప్పటికే పలు చిత్రాల ద్వారా అంతర్జాతీయ ఖ్యాతిని అందుకున్న నగరం టాలీవుడ్ పరిశ్రమకు సైతం మరింత ఊపునివ్వనుంది.

గొప్ప విశేషం..

ఎందరో యువత కల.. హైదరాబాద్ దేశంలోనే ఓ గొప్ప నగరంగా ఎదుగుతోంది. ఫ్యాషన్ రంగానికి సంబంధించి ఇది ప్రారంభం మాత్రమే. ఇలాంటివెన్నో నిర్వహించగల సామర్థ్యం నగరానికి ఉంది. ఒకనాటి బ్యూటీ కాంటెస్ట్ విజేతగా.. ప్రపంచ వ్యాప్తంగా ఎందరో అందమైన యువతులకు మన నగరం వేదిక కావడాన్ని చూసే రోజు కోసం ఎంతో ఉద్విగ్నంగా ఎదురుచూస్తున్నాను. – శిల్పారెడ్డి, మాజీ మిసెస్ ఇండియా



బ్యూటీ ఈవెంట్స్ కేంద్రంగా..

గత కొంత కాలంగా బ్యూటీ క్వీన్స్‌కు మాత్రమే కాదు బ్యూటీ ఈవెంట్స్‌కు సైతం చిరునామాగా మారుతోంది. నగరానికి చెందిన శిల్పారెడ్డి మొదలుకుని గత ఏడాది సుష్మ తొండేటి వరకూ మిసెస్ ఇండియా కిరీటాన్ని నగర వాసులు ఎందరో గెలుచుకున్నారు. ఇక మానసా వారణాసి వంటివారు మిస్ ఇండియా కిరీటాలను తీసుకొచ్చారు. పూనమ్ కౌర్, మధుశాలిని వంటి మిస్ హైదరాబాద్‌లు అనంతరం సినీతారలుగా రాణించారు. నగరంలోని కళాశాలల నుంచి క్లబ్స్ వరకూ బ్యూటీ కాంటెస్ట్‌లను నిర్వహిస్తున్నాయి. ఈ తరహా ఈవెంట్లకు మరింత ప్రొఫెషనలిజాన్ని మిస్ వరల్డ్ అందించడం తథ్యం. ఏదేమైనా విశ్వనగరంగా మారుతున్న హైదరాబాద్‌కు ప్రపంచ సుందరి పోటీలు రావడం సమయోచితం అని చెప్పాలి.



మొబైల్ ఎడిక్షన్ ఆర్ట్‌కు బెస్ట్ అవార్డు



సనత్‌నగర్ : మొబైల్ స్లోపాయిజన్ లా మనిషిని దెబ్బతీస్తుందంటూ ఏఎస్‌రావు నగర్‌కు చెందిన ఆర్టిస్ట్ కోట ప్రసన్న జ్యోతి తన పెయింటింగ్ ద్వారా మేల్కొలిపే ప్రయత్నం చేశారు. అయితే తాను వేసిన పెయింటింగ్‌కు బెస్ట్ అవార్డు అందుకున్నారు. 84వ ఆలిండియా వార్షిక ఆర్ట్ ఎగ్జిబిషన్-2025లో భాగంగా ఆమె మొబైల్ ఎడిక్షన్ అంశాన్ని ప్రధానంగా తీసుకుని వేసిన పెయింటింగ్ న్యాయ నిర్ణేతలను ఔరా అనిపించింది. మొబైల్ కారణంగా మనిషి ఏవిధంగా యాంత్రికంగా మారుతున్నాడో పెయింటింగ్ ద్వారా తెలియజేశారు. మొబైల్‌ను పాజిటివ్‌గా వాడితే ఎంత మేలు చేకూరుతుందో, అదే నెగెటివ్‌గా స్వీకరిస్తే అంత నాశనం చేస్తోందని తెలియజేశారు. నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్ గాంధీ సెంటినరీ హాల్లో బుధవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో నిజాం వారసుడు నవాబ్ రనాక్ యార్ ఖాన్ నుండి బెస్ట్ అవార్డును అందుకున్నారు.



దక్కన్ వేదికగా ఫ్రెంచ్-ఇటాలియన్

నగరానికి కాంటినెంటల్ వంటకాల క్యూ

విభిన్న సంస్కృతుల సమ్మేళనానికి నిదర్శనం


ది లీలా వేదికగా సందడి చేస్తున్న న్యూయార్క్ లే సర్క్ వంటకాలు

భిన్న సంస్కృతుల సమ్మేళనం హైదరాబాద్.. విభిన్న రుచుల భాండాగారం మన భాగ్యనగరం. స్థానిక వంటకాలు మొదలు ఖండాంతరాలు దాటిన కాంటినెంటల్ వంటకాలకు నెలవు ఈ నగరం. ఇందులో భాగంగా కొరియన్, మొరాకో వంటకాలు మొదలు ఇటాలియన్, స్పానిష్ వెరైటీల వరకూ నగరానికి క్యూ కడుతున్నాయి. విదేశీ పర్యాటకులు, భహుళ జాతి కంపెనీల ప్రతినిధులు, వ్యాపార వేత్తలు, సినిమా, క్రీడా రంగ ప్రముఖులు నగరానికి వస్తుండటంతో కాంటినెంటల్ వంటకాలకు ఆదరణ పెరిగింది. నగరవాసులు సైతం విభిన్న వంటకాలు, వినూత్న రుచులను ఆస్వాదించడంలో ముందుంటారు. ఈ నేపథ్యంలో నగరంలోని ది లీలా హైదరాబాద్ హోటల్ రీన్ చెఫ్ స్టూడియో వేదికగా ప్రసిద్ధ ఫ్రెంచ్-ఇటాలియన్ వంటకాలు సందడి చేస్తున్నాయి. మార్చి ప్రారంభం వరకూ అందుబాటులో ఉండే ఈ ఐకానిక్ రుచులు నగరానికి మరింత వన్నె తీసుకొస్తున్నాయి.

– సాక్షి, సిటీబ్యూరో

విశ్వవ్యాప్తంగా అరుదైన ఫ్రెంచ్-ఇటాలియన్ రుచులను నగరానికి తీసుకొచ్చింది 'లే సర్క్'. లీలా, రీన్ చెఫ్ స్టూడియోలో ఆతిథ్యమిస్తున్న 'లే సర్క్' న్యూయార్క్ వేదికగా ప్రసిద్ధి చెందిన ఇటాలియన్ రుచులకు గమ్యస్థానం. నగరంలో ప్రారంభమైన ఈ ప్రత్యేక పాప్-అప్ దశాబ్దాలుగా ప్రపంచ స్థాయి లగ్జరీ డైనింగ్ వేదిక. దక్కన్ వారసత్వం నుంచి ప్రేరణ పొందిన వేదికగా ఇటాలియన్ సంస్కృతిని ఆహ్వానించడంతో ఫుడ్ లవర్స్ వావ్ అంటున్నారు. హిమాలయాలు, దట్టమైన అడవుల్లో లభించే అరుదైన పుట్టగొడుగులు (లక్షల రూపాయలు ఖరీదు చేసే) సహా అరుదైన పదార్థాలు, పుష్పాలతో వడ్డించిన డిషెస్ ఇక్కడ సందడి చేస్తున్నాయి.

చెఫ్స్ స్పెషల్ అమ్యూస్-బౌచే (మాంసాహారం)



- స్మోక్డ్ అవకాడో, ట్యూనా సాకు టార్టారే – ప్యాషన్ ఫ్రూట్ జెల్ పదార్థంతో కుంకుమపువ్వును ఆకర్షణీయంగా అలంకరించి తయారు చేసిన ఫుడ్ వెరైటీ.
- రావియోలీ స్టఫ్ట్ విత్ బరోలో బ్రైజ్డ్ డక్ – క్యారెట్ వెలౌట్, అరుదైన రోజ్మేరీ మోరెల్ మష్రూమ్‌తో తయారు చేసిన వంటకం. ఇందులో 'స్ఫఘెట్టి, పార్ల్స్ ఫోమ్ పొంగుతూ కొత్త రుచిని అందిస్తుంది.
- పాపియెట్ ఆఫ్ చిలీయన్ సీబాస్ – కరకరమనే బంగాళాదుంపలు, బరోలో సాస్‌తో నోరూరించే క్రీమ్‌తో తయారు చేస్తారు.
- 'లే సర్క్' క్లాసిక్ టిరామిసు – కాఫీ జెల్లీ, మస్కార్పోన్ ఎస్పుమా, కాఫీ మెరింగ్యూ సమ్మేళనంతో తయారు చేసే వినూత్న వంటకం.

చెఫ్స్ స్పెషల్ అమ్యూస్-బౌచే (శాకాహారం)

- డబుల్ కుక్డ్ మోజారెల్లా – బ్రెడ్ క్రిస్టల్, బాసిల్ స్ప్రింగ్, టొమాటో రిలిష్‌తో తయారు చేసిన శాకాహార వంటకం.
- హ్యాండ్-కట్ ఫ్రెష్ బ్లాక్ ట్రఫుల్ ఫెటుచినీ – లక్ష రూపాయాలకు పైగా ఖరీదు చేసే అరుదుగా దొరికే మోరెల్ పుట్టగొడుగులను కలిపి పర్మేసన్ ఫండ్యు, బ్లాక్ ట్రఫుల్ షేవింగ్స్ వండుతారు.
- రోస్టెడ్ బీట్‌రూట్-బుర్రటా రిసోట్టో – 24కే గోల్డ్ డస్ట్‌గా పిలిచే ముడి పదార్థంతో తయారు చేసే చిరుతిండి.
- సింఫనీ ఆఫ్ చాక్లెట్ – డార్క్ చాక్లెట్ మౌస్‌తో ముంచి, మిల్క్ చాక్లెట్‌తో కలిపి, చాక్లెట్ సాయిల్, ఫ్రెష్ బెర్రీస్, చాక్లెట్ ఐస్ క్రీం సమ్మిళితంగా తయారు చేసే 'లే సర్క్' సిగ్నేచర్ వంటకం.

విభిన్న రుచులు..



అరుదైన, వినూత్న రుచులను ఆస్వాదించడంలో హైదరాబాద్ ఎప్పుడూ ముందు వరుసలో ఉంటుంది. ఇందులో భాగంగానే విదేశాలకు చెందిన వంటకాలకు ఇక్కడ అభిమానులుంటారు. ప్రస్తుతం రెన్ చెఫ్ స్టూడియోలో ఆతిథ్యమిస్తున్న వంటకాలు దేశంలో మరెక్కడా లభించవు.

– ప్రముఖ చెఫ్ వశిష్ఠ, లీలా రీన్ చెఫ్ స్టూడియో

క్యాటిల్ వెల్ఫేర్ లెసన్‌కు గిన్నిస్ రికార్డు

సాక్షి,సిటీబ్యూరో: 'లాంగెస్ట్ క్యాటిల్ వెల్ఫేర్ లెసన్' (బహుళ వేదికలు) ద్వారా ప్రముఖ నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ 'ఎస్‌ఎమ్‌ఎఫ్‌జీ ఇండియా క్రెడిట్' గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌ను సొంతం చేసుకుంది. ఈ విషయాన్ని సంస్థ సీఈఓ, ఎండీ శంతను మిత్రా ఓ ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా తాము నిర్వహించిన పశు వికాస్ డే (పీవీడీ)లో భాగమైన పశు సంరక్షణా శిబిరాల ద్వారా ఈ మైలురాయిని దాటామని, 16 రాష్ట్రాల్లో, 500 ప్రదేశాల్లో ఏకకాలంలో ఈ శిబిరాలు నిర్వహించామని వివరించారు. ఒకే రోజులో అతిపెద్ద పశువుల సంరక్షణా శిబిరాలను నిర్వహించినందుకు, వరల్డ్ రికార్డ్స్ యూనియన్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తించాయని తెలిపారు.



రాజలింగమూర్తి హత్యకేసు.. పోలీసుల అదుపులో ఇద్దరు?


రాజలింగమూర్తి (ఫైల్)

భూపాలపల్లి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో బుధవారం రాత్రి జరిగిన సామాజిక కార్యకర్త నాగవెల్లి రాజలింగమూర్తి (49) హత్య కేసులో పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. భూపాలపల్లి మున్సిపాలిటీ 15వ వార్డు మాజీ కౌన్సిలర్ నాగవెల్లి సరళ భర్త అయిన రాజలింగమూర్తి (49) బుధవారం రాత్రి పట్టణంలోని రెడ్డికాలనీలోని తన ఇంటికి వెళ్తున్న క్రమంలో బైక్ ఆపి కొందరు దుండగులు కత్తులతో పొడిచి చంపిన విషయం తెలిసిందే. తన భర్త హత్యకు కారకులైన వారిపై కేసులు నమోదు చేయాలంటూ గురువారం తెల్లవారుజామున 2 గంటల వరకు పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద సరళ నిరసన చేపట్టింది. హత్యకు పాల్పడిన వారితో పాటు హత్యకు కుట్రపన్నిన మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు కొత్త హరిబాబుపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేసింది. గురువారం ఉదయం ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడిన అనంతరం మృతుడి కుటుంబసభ్యులు శాంతించి రాజలింగమూర్తి మృతదేహాన్ని తీసుకెళ్లి దహన సంస్కారాలు నిర్వహించారు. హత్యోదంతంలో పాల్గొన్న ఐదుగురిలో ఇద్దరు పోలీసులకు లొంగిపోగా మరో ముగ్గురి కోసం గాలిస్తున్నారు.

హత్యా రాజకీయాలు బీఆర్ఎస్‌కు కొత్తకాదు

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధ్వజం



సాక్షి, హైదరాబాద్: తమకు వ్యతిరేకంగా ఉన్నవారిని మట్టుపెట్టడం బీఆర్ఎస్‌కు కొత్త కాదని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విమర్శించారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ హత్యా రాజకీయాలను పెంచి పోషించిందని ధ్వజమెత్తారు. గురువారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతికి సంబంధించి కేసీఆర్‌తో పాటు ఐదుగురిపై కేసు వేసిన సామాజిక కార్యకర్త రాజలింగమూర్తిని బీఆర్ఎస్ నేత గండ్ర వెంకటరమణారెడ్డితో హత్య చేయించారని ఆరోపించారు. కేసీఆర్, కేటీఆర్‌లే ఈ హత్య చేయించారని రాజలింగమూర్తి భార్య, కూతురు చెపుతున్నారని అన్నారు. అడ్వొకేట్ వామన్‌రావు దంపతుల హత్యకు ఎవరు కారణమో? అందరికీ తెలుసని, వరంగల్ ఎంపీడీవోను బీఆర్ఎస్ వాళ్లే హత్య చేశారని అప్పటి సీపీ రంగనాథ్ చెప్పారని గుర్తు చేశారు. కొడంగల్‌లో సాక్షాత్తు జిల్లా కలెక్టర్‌పై సురేశ్ అనే రౌడీ షీటర్ దాడి చేశాడని చెప్పారు. కాగా, రాజలింగమూర్తి హత్యపై సీబీసీఐడీ విచారణ జరిపించాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి వెంటనే శిక్ష వేయాలని డిమాండ్ చేశారు.

రాజలింగమూర్తి హత్యను ఖండిస్తున్నాం

మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి



సాక్షి, హైదరాబాద్: భూపాలపల్లిలో జరిగిన రాజలింగమూర్తి హత్యను తీవ్రంగా ఖండిస్తున్నామని, దీనిని మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఆపాదించాలని కాంగ్రెస్ ప్రయత్నించడం దుర్మార్గమని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి అన్నారు. గురువారం ఆయన తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ, మృతుడిపై భూ వివాదాలకు సంబంధించిన ఆరోపణలు ఉన్నాయని, రౌడీషీట్ కూడా ఉందని తెలిపారు. స్థానికంగా భూ వివాదంతోనే ఈ హత్య జరిగినట్లు ఎఫ్ఐఆర్ కూడా నమోదు అయిందని, ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడుతోందని, కొందరి ఒత్తిడితో రాజలింగమూర్తి భార్య తనపై ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఈ హత్యపై సీబీఐతో విచారణ చేయించినా తమకు అభ్యంతరం లేదన్నారు. మేడిగడ్డపై రాజలింగమూర్తి కోర్టులో వేసిన కేసును న్యాయపరంగా ఎదుర్కొంటున్నామన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి మతి భ్రమించి మాట్లాడుతున్నారని, బట్ట కాల్చి మీద వేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

కనీస పెన్షన్.. ఈసారైనా పెరిగేనా?

ప్రస్తుతం ఈపీఎఫ్ఓ కనీస పింఛన్ రూ.1000

- ఈ మొత్తాన్ని పెంచాలంటూ కేంద్రంపై కార్మిక సంఘాల ఒత్తిడి
- ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పెంపు కోసం డిమాండ్
- ఈపీఎఫ్ఓ పెన్షన్ కంటే రాష్ట్రాల్లో ఇచ్చే సామాజిక పింఛన్ ఎక్కువ
- పెంపుపై వచ్చే వారం సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ తీర్మానం చేసే అవకాశం



సాక్షి, హైదరాబాద్: ఉద్యోగి భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) ద్వారా అమలవుతున్న ఉద్యోగుల పెన్షన్ పథకం (ఈపీఎస్) కింద ఇచ్చే కనీస పెన్షన్ పరిమితి పెంచాలనే డిమాండ్ తీవ్రమవుతోంది. ఈ పథకం కింద అర్హత సాధించిన కార్మికులకు పదవీ విరమణ తర్వాత ఇచ్చే కనీస పెన్షన్ రూ.1000గా ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఈపీఎస్ ద్వారా అందే కనీస పెన్షన్ కార్మికుడి కుటుంబానికి ఏమాత్రం సరిపోవడం లేదు. దేశంలోని వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సామాజిక పెన్షన్ పథకం కింద కూడా ఇంతకు రెట్టింపు స్థాయిలో ఇస్తుండటంతో... కనీసం ఆ మేరకైనా పెంచాలనే డిమాండ్‌ను కార్మిక సంఘాలు బలంగా వినిపిస్తున్నాయి. దీనిపై ఇప్పటికే ఈపీఎఫ్ఓ, కేంద్ర కార్మికశాఖకు పెద్ద ఎత్తున వినతులు సైతం సమర్పించాయి. పెన్షన్ పెంపు కోసం కార్మికులు పదేళ్లుగా ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు.

రూ.2 వేలతో ప్రతిపాదనలు

దేశవ్యాప్తంగా ఈపీఎఫ్ఓలో నమోదైన ఎస్టాబ్లిష్‌మెంట్ (వాణిజ్య, వ్యాపార సంస్థ)లు 7.66 లక్షలు. ఈ సంస్థల పరిధిలో ప్రస్తుతం ఈపీఎఫ్ఓ చందాదారులుగా ఉన్న వారు 7.37 కోట్లు. వీరంతా ఈపీఎస్ కింద వాటా చెల్లిస్తున్న వారే. మరో 78.49 లక్షల మంది పెన్షనర్లు ఉన్నారు. ఒక్కో పెన్షనర్ కనీస పెన్షన్ కింద రూ.వెయ్యి చొప్పున అందుకుంటున్నారు. అయితే ఈ పెన్షన్ కింద వచ్చే డబ్బులు కనీసం నెలవారీ బీపీ, మధుమేహంలాంటి దీర్ఘకాలిక వ్యాధుల మందుల ఖర్చులకూ చాలడం లేదంటూ వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో కనీస పింఛన్ పెంపు కోసం కార్మిక సంఘాలు కేంద్రంపై తీవ్రంగానే ఒత్తిడి చేస్తున్నాయి. మరోవైపు కనీస పెన్షన్ పెంపుకోసం ఏర్పాటైన కమిటీలు సైతం పెంపును సమర్థిస్తూ కేంద్రానికి నివేదికలు సమర్పించాయి. కనీస పెన్షన్‌ను రూ.2 వేలకు పెంచాలంటూ ప్రతిపాదనలు సైతం పంపాయి. పెన్షన్ పెంపుతో తలెత్తే ఆర్థిక భారాన్ని అధిగమించేందుకు ఆర్థిక శాఖ ద్వారా కొంత సాయం అందించాలన్న అంశాన్ని కూడా ప్రస్తావించాయి. కానీ ఈ ప్రతిపాదనలకు ఆమోదం తెలపని ఆర్థిక శాఖ... కనీస పెన్షన్ పెంపు ప్రతిపాదనలను తిరస్కరించింది.

చందాల రూపంలో ఏటా రూ.65 వేల కోట్లు

ప్రస్తుతం ఈపీఎఫ్ఓకు నెలవారీ చందాల రూపంలో ఏడాదికి రూ.65 వేల కోట్లు సమకూరుతోంది. అదేవిధంగా పెన్షన్ నిధి నిల్వలతో వచ్చే వడ్డీ సైతం భారీగా జమ అవుతోంది. అంతే కాకుండా ఈపీఎఫ్ఓ ద్వారా సెక్యూరిటీస్‌లో పెట్టుబడులతోనూ భారీగా ఆదాయం వస్తోంది. ఈ పరిస్థితుల్లో కనీస పెన్షన్ రెట్టింపు చేసినా ఆర్థిక భారం ఉండదనేది కార్మిక సంఘాల వాదన. ఇలాంటి పరిస్థితుల్లో ఆర్థిక శాఖ సాయం లేకున్నా కనీస పింఛన్ పెంపుతో ఇబ్బందులు ఉండవని సంఘాల నేతలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మరోమారు కనీస పెన్షన్ పెంచుతూ కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించాలని ఈపీఎఫ్ఓ ట్రస్టీలు సైతం సూచిస్తున్నారు. వచ్చే వారంలో ఈపీఎఫ్ఓ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (సీబీటీ) సమావేశం జరగనుంది. అందులోనైనా కనీస పెన్షన్‌పై తీర్మానం చేసి కేంద్ర కార్మిక శాఖకు సమర్పించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

ఈపీఎఫ్ఓలో నమోదైన ఎస్టాబ్లిష్‌మెంట్లు, చందాదారులు, పెన్షనర్లు ఇలా..

కేటగిరీ	ఎస్టాబ్లిష్‌మెంట్లు	చందాదారులు	పెన్షనర్లు
దేశంలో	7,66,254	7,37,39,204	78,49,338
తెలంగాణ	34,052	41,64,917	3,51,627
ఆంధ్రప్రదేశ్	20,211	14,99,530	2,64,925

ఎవరేం చేశారో చర్చకు సిద్ధమా?

- గ్రామాలు, మండలాలు జిల్లాల వారీగా చర్చిద్దామా?.... సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి బండి సంజయ్ సవాల్
- రేవంత్ ప్రభుత్వంపై ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉన్నారని వెల్లడి


మీడియాతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి బండి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలోని గ్రామాలు, మండలాలు, జిల్లాల వారీగా కేంద్ర ప్రభుత్వం ఏమి చేసిందో, రాష్ట్ర ప్రభుత్వం ఏమి చేసిందో చర్చకు సిద్ధమా అని సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సవాల్ విసిరారు. తెలంగాణకు కేంద్రం ఏమిచ్చిందో? ఎవరు అన్యాయం చేశారో బహిరంగ చర్చకు తాను సిద్ధమని ప్రకటించారు. 2025–26 కేంద్ర బడ్జెట్‌లో పన్నులు, పథకాల రూపంలో తెలంగాణకు రూ.1.08 లక్షల కోట్లు కేటాయించినట్టు చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి చేసిన కేటాయింపులపై సంజయ్ గురువారం ఓ హోటల్లో మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువకాలం ఉండబోదని చెబుతున్నారు కదా దానికి ఆధారాలున్నాయా అన్న ప్రశ్నకు సంజయ్ సమాధానమిస్తూ.. 'కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎప్పుడైనా ఏమైనా జరగొచ్చు. టాప్–5 మంత్రులు తప్ప రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై పలువురు ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉన్నారు. 6 గ్యారంటీలు అమలు చేయడం లేదు కాబట్టి తాము ప్రజల్లో తిరగలేక పోతున్నామంటూ రహస్య సమావేశాలు నిర్వహిస్తున్నారు. మేము మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం అయిదేళ్లు ఉండాలని కోరుకుంటున్నాం'అని చెప్పారు. మళ్లీ తాము అధికారంలోకి వస్తామని కేసీఆర్ చెబుతున్నారు కదా దానిపై ఏమంటారన్న ప్రశ్నకు... 'బీఆర్ఎస్‌కు ఎమ్మెల్సీ అభ్యర్థులే కరువయ్యారు... ఇక ఆ పార్టీ యాడుంది? బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ చీకటి మిత్రులు. బీఆర్ఎస్ నేతలు ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్‌తో రాజీ కుదుర్చుకున్నది నిజం కాదా? మాపై కేసులు పెట్టొద్దు... కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి బీజేపీని అడ్డుకుందామని కేసీఆర్ ప్రతిపాదించారు. కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉండేందుకే అభ్యర్థులను నిలబెట్టకుండా కేసీఆర్ లోపాయికారీ ఒప్పందం చేసుకున్నారు'అని సంజయ్ బదులిచ్చారు. భూపాలపల్లి రాజలింగమూర్తి హత్యపై విచారణ జరిపి నిజాయితీ నిరూపించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

కులగణన తప్పులతడక

'కులగణన తప్పులతడక... జనాభా లెక్కలే తప్పు. రాష్ట్రంలో 3.95 కోట్ల ఆధార్ కార్డులుంటే... జనాభా 3.7 కోట్లు ఎట్లా ఉంటుంది? నిజానికి 4.30 కోట్ల జనాభా ఉంటే 60 లక్షల ప్రజలు ఏమైపోయారు?'అని సంజయ్ చెప్పారు. 'బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందనడం పచ్చి అబద్ధం. బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ నడుస్తోంది'అని మండిపడ్డారు. దేశ బడ్జెట్‌లో ఒక రాష్ట్రం పేరును ప్రస్తావించనంత మాత్రాన ఆ రాష్ట్రానికి నిధులివ్వలేదనడం సరికాదన్నారు. కృష్ణా జలాల వాటాలో తెలంగాణకు అన్యాయం చేసింది కాంగ్రెస్, బీఆర్ఎస్‌లేనని, ఈ విషయంలో తెలంగాణకు అన్యాయం చేసిన మొదటి ద్రోహి కేసీఆర్ అని విమర్శించారు.

ఏఐజీలో కేసీఆర్‌కు వైద్య పరీక్షలు

గచ్చిబౌలి (హైదరాబాద్): మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఏఐజీ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన గురువారం గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి వెళ్లారు. కేసీఆర్‌కు అక్కడి వైద్యులు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం కేసీఆర్ తిరిగి తన నివాసానికి వెళ్లిపోయారు. సాధారణ వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి వచ్చినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

అంగన్‌వాడీల్లో ఆహార నాణ్యతపై తనిఖీలు

- నాసిరకం సరుకులు పంపిణీ చేసే కాంట్రాక్టర్లకు నోటీసులు
- అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: అంగన్‌వాడీల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతపై తనిఖీలు నిర్వహించాలని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ నిర్ణయించింది. ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలని జిల్లా సంక్షేమాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. రోజుకు కనీసం రెండు కేంద్రాలను పరిశీలించాలని, జిల్లా పరిధిలోని మెజార్టీ కేంద్రాలను పరిశీలించిన తర్వాత.. రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. గురువారం సీతక్క పలువురు జిల్లా సంక్షేమాధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి.. క్షేత్రస్థాయి తనిఖీలకు సంబంధించిన సమాచారాన్ని ఆరాతీశారు. నెలాఖరు నాటికి నివేదిక సమర్పించాలని, ఇందులో ఆహార పదార్థాల నాణ్యత, ప్రమాణాలను లోతుగా విశ్లేషించాలని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో అధికారులు తనిఖీలు చేసి.. నాణ్యత లేని సరుకులను సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేస్తారు. అదేవిధంగా ఆయా కాంట్రాక్టర్లు తదుపరి టెండర్ల ప్రక్రియలో పాల్గొనే అవకాశం లేకుండా బ్లాక్ లిస్టులో పెడతారు.

ప్రజల విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి


భువనగిరిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజల విశ్వాసం కోల్పోయిందని కేంద్ర గనుల శాఖమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. గురువారం భువనగిరిలో ఆయన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డికి మద్దతుగా ప్రచారానికి వచ్చారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. మార్పు పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎలాంటి మార్పు తీసుకురాలేకపోయిందన్నారు. బీఆర్ఎస్ మాదిరిగా తెలంగాణలో కాంగ్రెస్‌ను బొందపెట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు తెరవెనుక రాజకీయాలు చేస్తున్నాయన్నారు. ఒక సంవత్సరంలో 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని మండిపడ్డారు. పీఆర్సీ నివేదికను కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు అమలుచేయలేదన్నారు. నిరుద్యోగులు, ఉద్యోగులు, ప్రజలు, పెన్షనర్లతోపాటు అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని కిషన్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో జరుగుతున్న రెండు ఉపాధ్యాయ, ఒక పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధిస్తారని ధీమా వ్యక్తంచేశారు. రాజకీయాలకతీతంగా భూపాలపల్లిలో రాజలింగం హత్యను పోలీసులు దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్‌గౌడ్, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణలో రేవంత్ పాత్ర లేదు


- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ నివేదికను బయట పెట్టాలి
- కవిత నివాసంలో దళితబంధు సాధన సమితి భేటీ



సాక్షి, హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణలో సీఎం రేవంత్ రెడ్డికి ఎలాంటి పాత్ర లేదని, సుప్రీంకోర్టు తీర్పు వల్లే వర్గీకరణకు బాటలు పడ్డాయని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. దళితుల్లో అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా వర్గీకరణ చేయాలని ప్రభుత్వానికి సూచించారు. గురువారం ఎమ్మెల్సీ కవిత నివాసంలో దళితబంధు సాధన సమితి అధ్యక్షుడు మహేశ్ కోగిల ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కవిత మాట్లాడుతూ.. జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ నివేదికను బయటపెట్టి, తక్షణమే వర్గీకరణను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ వంకతో జాబ్ కేలండర్ అమలును నిలిపివేయొద్దని సూచించారు. కాగా, కేసీఆర్ ప్రభుత్వం ఎంపిక చేసిన 18 వేల దళిత కుటుంబాలకు బడ్జెట్‌కు ముందే దళితబంధు నిధులు విడుదల చేయాలని ఆమె కోరారు. '125 అడుగుల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేయకుండా అవమానిస్తున్న రేవంత్, ఆయన మంత్రివర్గ సహచరులు వైఖరి మార్చుకోవాలి. లేని పక్షంలో అంబేడ్కర్ జయంతి రోజున ప్రభుత్వం మూసిన గేట్లను బద్దలుకొట్టి పూలమాలలు వేస్తాం'అని కవిత ప్రకటించారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి దళితులను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తోందని ఆమె విమర్శించారు. దళితబంధు సాధన ఉద్యమానికి కవిత నాయకత్వం వహించాలని ఈ సందర్భంగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కోరారు.

వర్గీకరణ లోపాలను సబ్ కమిటీ దృష్టికి తీసుకెళ్లాలి

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



పంజగుట్ట (హైదరాబాద్): ఎస్సీ రిజర్వేషన్ అంశం లోతుగా పరిశీలించేందుకు కమిషన్ గడువు పెంచిన నేపథ్యంలో 58 కుల సంఘాల నాయకులు (మాలలు మినహాయించి) న్యాయం జరగాల్సిన విషయంపై కమిషన్ ముందు వారి అభిప్రాయాలు తెలపాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ కోరారు. రిజర్వేషన్ పొందిన కులాలు కాకుండా అణగారిన కులాలు లిఖితపూర్వకంగా వినతులివ్వాలని సూచించారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మందకృష్ణ మాట్లాడుతూ గతంలో ఎస్సీ వర్గీకరణలో 4 గ్రూపులుండేవని, ప్రస్తుతం 3 చేయడంలోనే లోపాలున్నాయన్నారు. నివేదికలోని లోపాలను సీఎం, సబ్‌కమిటీ దృష్టికి తీసుకెళ్లినట్లు గుర్తుచేశారు. 3 గ్రూపుల్లో కొందరికి వెనుకబాటు తనం చూస్తే, కొందరికి జనాభా చూశారని ఇందులో హేతుబద్ధత లోపించినట్లు అర్థమవుతోందని మందకృష్ణ పేర్కొన్నారు. ఫలానా వారివల్ల తాము దోపిడీకి గురయ్యామనే పరిస్థితి రాకుండా చూసుకునే బాధ్యత ఆయా కులసంఘాల నాయకులకు ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ వెంకటేశ్ నేత, దీపక్ కుమార్, మురళీధర్, సీనియర్ పాత్రికేయులు సయ్యద్ ఇస్మాయిల్, వెంకటస్వామి మాదిగ, గోవింద్ నరేశ్, లత, యమున తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా జలాలపై సర్కార్ మొద్దునిద్ర

▶ మొదటి పేజీ తరువాయి

అల వెంకటేశ్వర్‌రెడ్డి, జైపాల్ యాదవ్‌తో కలసి మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణ గురించి పట్టింపులేని ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రానికి జరిగే నష్టం ఏమిటో తెలుస్తోందన్నారు.

రోజుకు 10 వేల క్యూసెక్కులు అక్రమంగా తరలింపు

'నాగార్జునసాగర్ కుడి కాలువ నుంచి ఏపీ ప్రభుత్వం మూడు నెలలుగా రోజుకు 10 వేల క్యూసెక్కుల చొప్పున నీటిని అక్రమంగా తరలిస్తోంది. గడచిన 25 రోజుల్లో 60 టీఎంసీల నీటిని తరలించారు. కృష్ణా జలాల్లో ఏపీ తాత్కాలిక వాటా 512 టీఎంసీలు కాగా ఇప్పటికే 657 టీఎంసీలు తరలించింది. తెలంగాణకు రావాల్సిన వాటా 343 టీఎంసీలు కాగా 220 టీఎంసీలు మాత్రమే వాడుకుంది. ఏపీకి మిగిలింది కేవలం 9 టీఎంసీలు కాగా తెలంగాణకు మరో 123 టీఎంసీల వాటా రావాలి. కానీ శ్రీశైలం, సాగర్‌లో అందుబాటులో ఉన్న నీరు వంద టీఎంసీలు మాత్రమే. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లు తెరిచి అన్యాయాన్ని అడ్డుకోవాలి'అని హరీశ్ అన్నారు.

సాగర్‌ను అధీనంలోకి తీసుకోవాలి: 'సీఆర్‌పీఎఫ్ బలగాలను ఉపసంహరించుకుని సాగర్ ప్రాజెక్టును తెలంగాణ అధీనంలోకి తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైంది. ఏపీ ఇష్టారాజ్యంగా నీళ్లు తరలిస్తున్నా చంద్రబాబును అడిగే ధైర్యం లేదు, కేంద్రాన్ని ప్రశ్నించే దమ్ము లేదు'అని హరీశ్‌రావు మండిపడ్డారు. 'సాగర్ ఎడమ కాలువ, ఏఎంఆర్ ఎస్సెల్బీసీ కింద సుమారు 9 లక్షల ఎకరాలకు 35 టీఎంసీల మేర నీరు కావాలి. ఖమ్మం, మహబూబాబాద్, నల్లగొండ, సూర్యాపేట, హైదరాబాద్ తాగునీరు నాగార్జున సాగర్‌పై ఆధారపడి ఉంది. ఏపీ జలదోపిడీపై కేఆర్ఎంబీ, జలశక్తి మంత్రి కార్యాలయాల ముందు ధర్నాకు సిద్ధం, ఢిల్లీకి అఖిలపక్షం తీసుకెళ్లాలి. ఉమ్మడి ప్రాజెక్టులపై త్రిసభ్య కమిటీ సమావేశం కోసం డిమాండ్ చేయాలి. కాంగ్రెస్, బీజేపీలు తెలంగాణకు అన్యాయం చేస్తున్నాయి'అని హరీశ్‌రావు విమర్శించారు. వెంటనే సాగర్ కుడి కాల్వకు నీటి విడుదలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ పాలనలోనే 'కృష్ణా'లో అన్యాయం

▶ మొదటి పేజీ తరువాయి


సమావేశంలో మాట్లాడుతున్న కోమటిరెడ్డి. చిత్రంలో ఉత్తమ్, పొన్నం ప్రభాకర్

నిర్వహించగా, ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీల కేటాయింపులను అంగీకరిస్తూ సంతకాలు చేశారని ఆయన గత బీఆర్ఎస్ పాలకులపై మండిపడ్డారు. 2016లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో సైతం ఈ అన్యాయానికి సమ్మతి తెలిపారని ఆరోపించారు. కేంద్ర జలశక్తి శాఖ, అపెక్స్ కౌన్సిల్, కృష్ణా బోర్డు 2020 వరకు నిర్వహించిన అన్ని సమావేశాల్లో గత ప్రభుత్వం ఈ కేటాయింపులను అంగీకరించి రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందన్నారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలసి గురువారం జలసౌధలో విలేకరుల సమావేశం నిర్వహించి కృష్ణా జలాల విషయంలో ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు చేసిన ఆరోపణలను ఉత్తమ్ తిప్పికొట్టారు. బీఆర్ఎస్ పాలనలో కృష్ణా జలాల విషయంలో జరిగిన వరుస అన్యాయాల క్రమాన్ని తేదీలతో సహా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. 2019–22 మధ్యలో ఏపీ ఏటా వరుసగా 653 టీఎంసీలు, 629 టీఎంసీలు, 621 టీఎంసీలను తరలించుకుపోయినా, గత పాలకులు చూస్తుండిపోయారన్నారు.

ఏపీని అడ్డుకుంటామని కేంద్రం హామీ ఇచ్చింది..

ఏపీ ప్రభుత్వం కృష్ణా జలాలను అక్రమంగా తరలించుకుపోవడంపై తాను ఇటీవల కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్, కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీకి ఫిర్యాదు చేయగా, ఏపీని అడ్డుకోవడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. సీతారామ ప్రాజెక్టుకి ఇప్పటికే తాము 67 టీఎంసీల కేటాయింపులను సాధించామని, నెలాఖరులోగా ప్రాజెక్టుకు సాంకేతిక అనుమతులిస్తామని కేంద్ర మంత్రి మరో హామీ ఇచ్చారన్నారు. రాష్ట్రంలోని ప్రాజెక్టులకు జీరో వడ్డీ, 50 ఏళ్ల కాలపరిమితితో రుణాలు ఇచ్చేందుకు సంసిద్ధత తెలిపారని వివరించారు.

సాగర్‌ను ఏపీకి అప్పగించారు..

పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని ఏపీ ప్రభుత్వం 2023లో 44 వేల క్యూసెక్కుల నుంచి 92,600 క్యూసెక్కులకు పెంచుకోగా, బీఆర్ఎస్ పాలకులు దానికి సహకరించారని ఉత్తమ్ ఆరోపించారు. అలాగే వెలిగొండ, ఇతర ప్రాజెక్టులను ఏపీ పూర్తిచేసుకునేందుకు కూడా సహకరించారన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాత్రి 2023 నవంబర్ 29న ఏపీ ప్రభుత్వం 400–500 మంది సాయుధ పోలీసులతో నాగార్జునసాగర్ ప్రాజెక్టు సగభాగాన్ని ఆక్రమించుకోగా, కృష్ణా బోర్డు అనుమతి లేకుండా 5,000 క్యూసెక్కులను విడుదల చేసుకున్నారని, అప్పుడు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పాలకులు దీనిని చేష్టలుడిగి చూశారని ధ్వజమెత్తారు.

అన్యాయం చేసింది వారే..: కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం చేసింది హరీశ్‌రావు, కేసీఆర్, మాజీ ఈఎన్‌సీ మురళీధర్‌రావే అని, వారికి ఉరేసినా తప్పులేదని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ధ్వజమెత్తారు. వారిది దొంగల తెలివి అని, ప్రశ్నించిన వారిని హత్యలు చేశారని ఆరోపించారు.

ఈఏపీ సెట్‌కు 25 నుంచి దరఖాస్తుల స్వీకరణ

- ఆన్‌లైన్‌లో ఏప్రిల్ 4 వరకు అవకాశం
- అపరాధ రుసుముతో ఏప్రిల్ 24 వరకు చాన్స్
- రాష్ట్రంలో 27 పట్టణాల్లో పరీక్షా కేంద్రాలు .. ఏపీలో రెండు



సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష (టీజీఈఏపీసెట్)కు ఈ నెల 25 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. ఏప్రిల్ 4 వరకూ ఎలాంటి అపరాధ రుసుము లేకుండా సెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. అపరాధ రుసుముతో ఏప్రిల్ 24 వరకూ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ఏప్రిల్ 19 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఏప్రిల్ 29 నుంచి మే 5 వరకూ ఈ పరీక్ష జరుగుతుంది. ఏప్రిల్ 29, 30 తేదీల్లో అగ్రి, ఫార్మసీ, మే 2 నుంచి 5 వరకు ఇంజనీరింగ్ పరీక్షలు నిర్వహిస్తారు. హైదరాబాద్ జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం ఈఏపీసెట్‌ను నిర్వహిస్తోంది. ఇందుకు సంబంధించిన సమగ్ర సమాచార బులిటెన్‌ను సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ దీన్ కుమార్, డాక్టర్ కె విజయకుమార్ రెడ్డి గురువారం విడుదల చేశారు. అయితే నాన్–లోకల్ కోటా ఎత్తివేతపై నోటిఫికేషన్‌లో ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. కౌన్సెలింగ్ నాటికి ప్రభుత్వ నిర్ణయం మేరకు వ్యవహరిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 27 పట్టణాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఏపీలోని కర్నూలు, విజయవాడల్లో కూడా పరీక్ష నిర్వహిస్తారు. ఏపీకి సరిహద్దుల్లో ఉన్న తెలంగాణ జిల్లాల విద్యార్థుల కోసం ఈ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు.

దివ్యాంగుల రిజర్వేషన్‌లో మరో రెండు కేటగిరీలు

ఈసారి దివ్యాంగుల రిజర్వేషన్ విధానంలో మరికొందరిని చేర్చారు. ఇప్పటివరకు దృష్టి లోపం, వినికిడి–మూగ, అంగ వైకల్యం అనే మూడు కేటగిరీలు (ఏ, బీ, సీ) మాత్రమే ఉన్నాయి. ఒక్కో దానికి మూడు శాతం రిజర్వేషన్ ఉంది. కొత్తగా నాలుగో కేటగిరీ (డీ) కింద ఆటిజం (మానసిక వైకల్యం లాంటివి), అయిదో కేటగిరీ (ఈ) కింద ఒకటికి మించి వైకల్యాలను చేర్చారు. ఒక్కో కేటగిరీకి ఒక శాతం చొప్పున రిజర్వేషన్ ఉంటుంది. వారి సామాజికవర్గాల మొత్తం రిజర్వేషన్‌లోనే ఈ మేరకు సీట్లు కేటాయిస్తారు. ఉదాహరణకు ఆటిజం విద్యార్థి ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారైతే వారికి కేటాయించిన 15% రిజర్వేషన్‌లో సీటు కేటాయిస్తారు.

నాన్–లోకల్‌పై తర్వాత నిర్ణయం

రాష్ట్ర విభజన నాటి నుంచి ఏపీ విద్యార్థులకు 15 శాతం నాన్–లోకల్ కోటా అమలు చేస్తున్నారు. రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు పదేళ్ళు ఇది కొనసాగాల్సి ఉండగా గత ఏడాదితో పదేళ్లు పూర్తయ్యాయి. అయితే అప్పటికే నోటిఫికేషన్ వెలువడటంతో గత ఏడాది నాన్–లోకల్ కోటాను అమలు చేశారు. ఈ ఏడాది మాత్రం దీన్ని ఎత్తివేయాలని నిర్ణయించారు. రాష్ట్రపతి అనుమతి కోసం ప్రభుత్వం లేఖ రాసింది. ఇది వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేయాల్సి ఉంటుంది. కౌన్సెలింగ్ నాటికి ఈ ప్రక్రియ పూర్తవుతుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే నాన్–లోకల్ అంశంపై నిర్ణయాన్ని ప్రభుత్వానికి విడిచిపెట్టారు.

వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు

బీఈ, బీటెక్, బయోటెక్నాలజీ, డెయిరీ టెక్నాలజీ, అగ్రికల్చర్ ఇంజనీరింగ్, బీ ఫార్మసీ, ఫుడ్ టెక్నాలజీ, బయో మెడికల్, ఫార్మాస్యూటికల్, అగ్రికల్చర్ బీఎస్సీ, హార్టికల్చర్, ఫారెస్ట్రీ, బీవీఎస్సీ, ఫాం డీ, బీఎస్సీ నర్సింగ్ కోర్సులకు ఈఏపీ సెట్ నిర్వహిస్తున్నారు. మేథ్స్ విభాగంతో ఇంటర్ పూర్తి చేసిన వారు ఇంజనీరింగ్ సెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. సైన్స్ నేపథ్యంతో ఇంటర్ చేసిన వారు అగ్రికల్చర్, ఫార్మా కోర్సులకు దరఖాస్తు చేయాలి. డిసెంబర్ 31 నాటికి 16 ఏళ్ళు నిండి, ఇంటర్ చివరి సంవత్సరంలో ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. మిగతా వివరాలను https://eapcet.tgche.ac.in వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చని ఈఏపీసెట్ కో–కన్వీనర్ డాక్టర్ విజయకుమార్ రెడ్డి తెలిపారు.


పరీక్షా కేంద్రాలివే..

తెలంగాణ: హైదరాబాద్ (నాలుగు జోన్లు–30 కేంద్రాలు), నల్లగొండ, కోదాడ, సూర్యాపేట, ఖమ్మం, పాల్వంచ, భద్రాద్రి కొత్తగూడెం, సుజాతనగర్, సత్తుపల్లి, జగిత్యాల, కరీంనగర్, హుజూరాబాద్, మంథని, సిద్దిపేట, మహబూబ్‌నగర్, నర్సాపూర్, సుల్తాన్‌పూర్, పటాన్‌చెరు, రాయదుర్గం, ఆదిలాబాద్, ఆర్మూర్, నిజామాబాద్, వరంగల్, హనుమకొండ, హసన్‌పర్తి, నర్సంపేట.

ఏపీ: కర్నూలు, విజయవాడ.

ఈఏపీ సెట్‌కు పెరుగుతున్న దరఖాస్తులు

నాన్–లోకల్ ఎత్తివేస్తే తగ్గే అవకాశం



సాక్షి, హైదరాబాద్: గడచిన ఏడేళ్ళుగా రాష్ట్రంలో ఇంజనీరింగ్, అగ్రి, ఫార్మా కోర్సులకు దరఖాస్తులు పెరుగుతున్నాయి. 2018లో ఇంజనీరింగ్ విభాగానికి 1,47,912 దరఖాస్తులొచ్చాయి. 2024 నాటికి ఈ సంఖ్య 2,54,543కు పెరిగింది. 2018లో మెడికల్‌కు 73,078 మంది అప్లై చేశారు. 2024 నాటికి ఈ సంఖ్య 1,00,260కు పెరిగింది. గత సంవత్సరం మెడికల్ పదాన్ని మార్చి, అగ్రికల్చర్, ఫార్మసీతో ఈఏపీసెట్‌గా మార్పు చేశారు. కాగా ఏటా సెట్ దరఖాస్తులు పెరుగుతూనే వస్తున్నాయి. ఇందులో నాన్–లోకల్ కోటా కూడా ఉండగా.. వేల సంఖ్యలో ఏపీ విద్యార్థులు కూడా ఈఏపీసెట్‌కు దరఖాస్తు చేస్తున్నారు. 2024లో రెండు పరీక్షలకు కలిపి సుమారు 60 వేల మంది దరఖాస్తు చేశారు. అయితే ఈ ఏడాది నాన్–లోకల్ కోటా ఎత్తివేస్తే దరఖాస్తులు తగ్గుతాయని భావిస్తున్నారు.

2018 నుంచి ఇంజనీరింగ్, అగ్రి, ఫార్మాకు దరఖాస్తులు..

సంవత్సరం	ఇంజనీరింగ్			అగ్రి, ఫార్మా		
	ఏపీ	తెలంగాణ	మొత్తం	ఏపీ	తెలంగాణ	మొత్తం
2018	21,364	1,26,548	1,47,912	7,986	65,092	73,078
2019	19,973	1,22,237	1,42,210	10,030	64,959	74,989
2020	25,537	1,17,728	1,43,265	16,165	62,816	78,981
2021	33,711	1,31,252	1,64,963	18,135	68,506	86,641
2022	36,012	1,36,226	1,72,238	17,919	76,557	94,476
2023	51,461	1,53,890	2,05,351	20,743	94,589	1,15,332
2024	49,071	2,05,472	2,54,543	12,349	87,911	1,00,260

క్లుప్తంగా...

సమన్వయం పెంచండి.. మూడు సీట్లూ గెలవండి

• కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్‌బన్సల్ దిశానిర్దేశం



సాక్షి, హైదరాబాద్: ఈనెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడు సీట్లలో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించేందుకు పార్టీ యంత్రాంగమంతా సమన్వయంతో పనిచే యాలని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్‌బన్సల్ దిశానిర్దేశం చేశారు. ఈమేరకు గురువారం రాత్రి బీజేపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు సాగుతున్న ప్రచారం, ఏ మేరకు టీచర్, గ్రాడ్యుయేట్స్ ఓటర్లను కలుసుకోగలిగారు? ఓటర్ కాంటాక్ట్ ప్రోగ్రామ్ ఏ మేరకు పూర్తయింది? తదితర అంశాలపై ఆరాతీశారు. ఈ ఎన్నికల్లో ఉపాధ్యాయులు, పట్టభద్రులు ఓటర్లు కాబట్టి వారిని కలుసుకోవడంతో పాటు, బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే ఒనగూరే ప్రయోజనాల గురించి వివరించాలని నేతలు సూచించారు. సమావేశంలో ఎమ్మెల్సీ అభ్యర్థులు సి.అంజిరెడ్డి (గ్రాడ్యుయేట్స్), మల్క కొమురయ్య, సరోత్తంరెడ్డి (టీచర్స్), బీజేఎల్పీ ఉపనేత పాయల్ శంకర్, పాల్వాయి హరీశ్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

లక్ష లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన అధికారి

• నిందితుడు 'షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి'సంస్థలో జనరల్ మేనేజర్

సాక్షి, హైదరాబాద్: షెడ్యూల్డ్ కులాల సహకార అభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న బొప్పూరి ఆనందకుమార్ రూ.లక్ష లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. గురువారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో సంస్థ కార్యాలయంలో ఒక వ్యక్తికి బిల్లులు మంజూరు చేసే ఫైల్‌ను ఆమోదించడానికి లక్ష రూపాయలు తీసుకుంటుండగా ఆయన ఏసీబీకి చిక్కారు. అధికారులు నిందితుడి దగ్గర నుంచి లక్ష రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. అతడిని అరెస్టు చేసి నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. ప్రభుత్వ ఉద్యోగులు లంచం డిమాండ్ చేస్తే టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫోన్ చేయవచ్చని, లేదా 94404 46106కు వాట్సాప్ చేయవచ్చని, అలాగే ఫేస్‌బుక్‌లో(తెలంగాణ ఏసీబీ), 'ఎక్స్'వేదికగా @TelangnaACBకి ఫిర్యాదు చేయవచ్చని ఏసీబీ అధికారులు తెలిపారు.

జీవ వైవిధ్యాన్ని కాపాడాలి

కన్హా శాంతి వనంలో బయోడైవర్సిటీ కాన్ఫరెన్స్‌లో మంత్రి సురేఖ

నందిగామ: జీవ వైవిధ్యాన్ని పరిరక్షించేందుకు ప్రతిఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హా శాంతి వనంలో రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డు ఆధ్వర్యంలో 3 రోజులపాటు నిర్వహించే 'నేషనల్ బయోడైవర్సిటీ కాన్ఫరెన్స్-2025'ను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జీవ వైవిధ్య పరిరక్షణ దిశగా సంరక్షణ, పరిశోధన, అధ్యయనానికి ఈ సదస్సు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థులు, యువ సైంటిస్టులు జీవ వైవిధ్యం కోసం పని చేయాలని సూచించారు. మొక్కలు నాటడం, వాటిని పరిరక్షించడం బాధ్యతగా తీసుకోవాలని కోరారు. కన్హా శాంతి వనంలో పలు రకాల మొక్కలను నాటి, సంరక్షిస్తున్న విధానం అద్భుతంగా ఉందని ప్రశంసించారు.



గిరిజన కళాశాల వసతిగృహంలో అల్పాహారం తయారు చేస్తున్న విద్యార్థులు

విద్యార్థులతో చాకిరీ

• కంగ్టి గిరిజన సంక్షేమ హాస్టల్‌లో ఘటన.. కలెక్టర్ ఆదేశంతో ఆర్డీవో దర్యాప్తు

కంగ్టి(నారాయణఖేడ్): విద్యార్థులతో ఎలాంటి పనులు చేయించరాదన్న నిబంధనలున్నా సంబంధిత విద్యాసంస్థల సిబ్బంది యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. కంగ్టి మండలం గిరిజన బాలుర రెసిడెన్షియల్ కళాశాల వసతిగృహంలో విద్యార్థులతో అల్పాహారాన్ని వండించిన విషయం గురువారం బయటకు వచ్చింది. దీనిపై ప్రిన్సిపాల్ విజయ్‌ను వివరణ కోరగా.. అల్పాహారం తయారీలో విద్యార్థుల సహాయం తీసుకొంటామని స్పష్టం చేశారు. ఈ విషయం మీడియా ద్వారా జిల్లా కలెక్టర్‌కు చేరడంతో.. నారాయణఖేడ్ ఆర్డీవో అశోక్ చక్రవర్తిని విచారణకు ఆదేశించారు. ఈ మేరకు ఆర్డీవో కళాశాలను సందర్శించి విద్యార్థులు, సిబ్బందిని అడిగి విషయాలు తెలుసుకున్నారు. నివేదికను కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు ఆర్డీవో తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ నజీమొద్దీన్, డీటీ జుబేర్ అహ్మద్, సీనియర్ అసిస్టెంట్ తాజోద్దీన్ ఉన్నారు.

42.6% మంది పట్టభద్రులే ఉద్యోగాలకు అర్హులు

దేశంలో 2023తో పోలిస్తే 1.7 శాతం తగ్గిన నైపుణ్యం

- అర్హత ఉన్న పట్టభద్రుల్లో ఢిల్లీ టాప్.. ఉత్తరాది రాష్ట్రాలదే హవా
- టాప్-10లో ఒకే ఒక్క దక్షిణాది రాష్ట్రం తెలంగాణకు చోటు
- ఇండియా గ్రాడ్యుయేట్ స్కిల్ ఇండెక్స్-2025 నివేదికలో వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ/హైదరాబాద్: ప్రపంచంలోనే అత్యధికంగా యువత ఉన్న దేశం మనది. కానీ, దేశంలోని గ్రాడ్యుయేట్లలో 42.6 శాతం మందికే ఉద్యోగం పొందడానికి అర్హత ఉందని నివేదికలు చెబుతున్నాయి. తాజాగా అమెరికాకు చెందిన మెర్సర్ మెటిల్ అనే కన్సల్టెన్సీ సంస్థ 'ఇండియా గ్రాడ్యుయేట్ స్కిల్స్ ఇండెక్స్-2025'అధ్యయనంలో పట్టభద్రుల నైపుణ్యాలకు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను వెల్లడించింది. 2023లో ఉద్యోగాలకు అర్హత కలిగిన గ్రాడ్యుయేట్ల సంఖ్య 44.3 శాతం కాగా.. 2024లో 1.7 శాతం పడిపోయి 42.6 శాతానికి తగ్గిపోయింది. కొత్తగా పట్టభద్రులైన వారి నుంచి అంచనాలు అధికంగా ఉండటం వల్ల ఈ కొరత ఏర్పడిందని నివేదికలో తేలింది. 30కి పైగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 2,700కి పైగా క్యాంపస్‌లలో సుమారు 10 లక్షల మంది విద్యార్థులపై అధ్యయనం చేసినట్లు ఈ సంస్థ పేర్కొంది. అత్యంత సమర్థత ఉన్న పట్టభద్రుల్లో ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్ కాలేజీలు వరుసగా టాప్-3లో ఉన్నాయి. అలాగే.. అత్యధిక అర్హత కలిగిన గ్రాడ్యుయేట్లు ఉన్న టాప్ 10 రాష్ట్రాల్లో దక్షిణ భారతదేశం నుంచి ఒకే ఒక రాష్ట్రం తెలంగాణ 10స్థానంలో ఉండటం విశేషం.

ఉత్తరాది రాష్ట్రాలదే హవా...

- దేశంలో కనీసం 50% మంది గ్రాడ్యుయేట్లు ఉపాధి పొందగల రాష్ట్రాలు కేవలం 4 మాత్రమే ఉన్నాయి.
- ఓవరాల్ పర్ఫార్మెన్స్‌లో రాజస్తాన్‌కు టాప్ 10లో చోటు దక్కలేదు. కానీ, సాంకేతిక అర్హతలున్న రాష్ట్రాల్లో ఢిల్లీ, ఉత్తరాఖండ్, పంజాబ్, ఉత్తరప్రదేశ్ తర్వాత 48.3 శాతంతో రాజస్తాన్ 5వ స్థానంలో నిలిచింది.
- నాన్-టెక్నికల్ విభాగంలో అర్హత కలిగిన గ్రాడ్యుయేట్లు అత్యధిక సంఖ్యలో ఉన్న రాష్ట్రాల్లో హిమాచల్ ప్రదేశ్ (54%), ఢిల్లీ (54%), పంజాబ్ (52.7%) ఉన్నాయి

ఉద్యోగార్హత ఉన్న టాప్-10 గ్రాడ్యుయేట్స్ రాష్ట్రాలివీ..	
ఢిల్లీ	53.4%
పంజాబ్	51.1%
హిమాచల్ ప్రదేశ్	51.1%
ఉత్తరాఖండ్	50.0%
జార్ఖండ్	49.6%
హరియాణా	49.5%
పశ్చిమ బెంగాల్	48.6%
ఉత్తర్‌ప్రదేశ్	48.5%
అస్సాం	48.2%
తెలంగాణ	47.6%

(విద్య నాణ్యత, ఉద్యోగ అవకాశాలతోపాటు.. పరిశ్రమ డిమాండ్‌కు తగ్గ నైపుణ్యం ఉండాలనే ఆధారంగా ఈ గణాంకాలు వెల్లడించారు.)

2024లో టైర్-1 కళాశాలలే మెరుగు..



కేటగిరీ	టైర్-1	టైర్-2	టైర్-3
టెక్నికల్ సామర్థ్యం	51.1%	46.9%	44.2%
నాన్-టెక్నికల్ అర్హత	46.4%	45.5%	43.0%
ఓవరాల్	48.75%	46.2%	43.6%

- 2023తో పోలిస్తే టైర్-1, టైర్-3 కళాశాలలకు చెందిన పట్టభద్రుల ఉపాధి సామర్థ్యం స్వల్పంగా తగ్గింది. టైర్-1 విషయానికొస్తే.. ఈ సంఖ్య 2023లో 49.1శాతం కాగా.. 2024లో 48.75 శాతంగా ఉంది.
- టైర్-3 లో 44% నుంచి 43.6 శాతానికి పడిపోయింది. టైర్-2 కళాశాలల్లో ఎక్కువ క్షీణత కనిపించింది. 2023లో 47.5% మంది గ్రాడ్యుయేట్లు ఉద్యోగానికి అర్హులుగా ఉంటే.. 2024లో అది 46.2 శాతానికి తగ్గింది.
- ఉద్యోగానికి అర్హులైన గ్రాడ్యుయేట్ విభాగంలో మహిళలు (42%) పురుషుల (43%) కంటే పెద్దగా వెనుకబడి లేరని స్పష్టమవుతోంది.

నైపుణ్యాలు ఉండాల్సిందే..

ఎస్.లావణ్యకుమార్, సహవ్యవస్థాపకుడు, స్మార్ట్‌స్టెప్స్

నాన్-టెక్ గ్రాడ్యుయేట్స్ అంశంపై గత 15 ఏళ్లుగా మేము పనిచేస్తున్నాం. ఆధునిక సాంకేతికత విశ్వవ్యాప్తం కావడంతో... భారత్‌లో విదేశీ కంపెనీలు ఇబ్బడిముబ్బడిగా గ్లోబల్ కెపాసిటీ సెంటర్లు (జీసీసీ) ఏర్పాటు చేస్తున్నాయి. అందువల్ల తగిన శిక్షణ పొందడంతోపాటు అవసరమైన డొమైన్లలో నైపుణ్యాలు ఉంటే నాన్ టెక్ గ్రాడ్యుయేట్స్‌కూ మంచి అవకాశాలు లభిస్తాయి. కోవిడ్ అనంతర పరిస్థితుల్లో ఆన్‌లైన్‌లో డిగ్రీలు, ఇంజనీరింగ్ కోర్సులు పూర్తి చేసిన వారికి కొన్ని విషయాల్లో ఎదురయ్యే సవాళ్లను అధిగమించాలంటే తగిన నైపుణ్యాలు తప్పనిసరి.

భవిష్యత్తులో ఆ ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు నో చాన్స్

• ఎల్ఆర్ఎస్ కింద క్రమబద్ధీకరణ జరగని వాటిపై ప్రభుత్వం స్పష్టత

సాక్షి, హైదరాబాద్: ఎల్ఆర్ఎస్ కింద క్రమబద్ధీకరణ జరగని అనధికార లేఅవుట్ల లోని ప్లాట్ల రిజిస్ట్రేషన్లు భవిష్యత్తులో జరగవని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు గురువారం అర్ధరాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. అనుమతి లేని అక్రమ లేఅవుట్ల లోని ప్లాట్లలో ఇళ్ల నిర్మాణానికి అనుమతి ఇవ్వరాదని పేర్కొంటూ ఆ మేరకు లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం నిబంధనలను సవరించింది. 2020 ఆగస్టు 28 లేదా అంతకు ముందు రిజిస్టర్డ్ సేల్ డీడ్ ద్వారా 10 శాతం ప్లాట్లు విక్రయించి ఉంటే మిగిలి పోయిన ప్లాట్ల యజమానులు ఎల్ఆర్ఎస్ -2020 కింద దరఖాస్తు చేసుకోక పోయినా, రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అనుమతించడం జరుగుతుందని ఈ ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది. ఇందుకోసం తప్పనిసరిగా లేఅవుట్ క్రమబద్ధీకరణ చార్జీలు, ప్రో-రేటా ఓపెన్ స్పేస్ చార్జీలను వసూలు చేస్తారని తెలిపింది.

'ఫాల్కన్'పై ఈడీ కన్ను

- అధిక లాభాల ఆశ చూపించి రూ.850 కోట్ల మోసం
- మనీలాండరింగ్ ఉల్లంఘన నేపథ్యంలో ఈడీ నిర్ణయం
- విచారణ చేపట్టాలని ఈడీకి లేఖ రాసిన సైబరాబాద్ పోలీసులు
- ప్రధాన నిందితుడు అమర్‌దీప్.. రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ కుమారుడు



సాక్షి, హైదరాబాద్: అధిక లాభాల ఆశ చూపించి అమాయకుల నుంచి ఏకంగా రూ.850 కోట్లు దోచుకున్న ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ (ఎఫ్ఐడీ) కేసుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణ చేపట్టనుంది. మల్టీలెవెల్ మార్కెటింగ్ స్కీమ్‌లతో సుమారు 7 వేల మంది నుంచి డిపాజిట్లను సేకరించి.. ఆ సొమ్మును సింగపూర్, దుబాయ్, యూఏఈ వంటి దేశాల్లోని షెల్ కంపెనీలకు మళ్లించినట్లు సైబరాబాద్ ఆర్థిక నేరాల నియంత్రణ విభాగం (ఈఓడబ్ల్యూ) పోలీసుల దర్యాప్తులో తేలింది. మనీలాండరింగ్ ఉల్లంఘనల నేపథ్యంలో సైబరాబాద్ పోలీసులు ఈడీకి లేఖ రాసినట్లు తెలిసింది.

రిటైర్డ్ ఆర్మీ అధికారి కొడుకే..

ప్రధాన నిందితుడు ఎఫ్ఐడీ చైర్మన్ అమర్‌దీప్ కుమార్ బిహార్‌కు చెందిన రిటైర్డ్ ఆర్మీ అధికారి కుమారుడని పోలీసుల విచారణలో తేలింది. హైదరాబాద్‌లో స్థిరపడిన అమర్ కుటుంబం బహుళజాతి కంపెనీలకు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులను అందించే సంస్థను స్థాపించడం ద్వారా అమర్‌దీప్ వ్యాపార రంగంలోకి ప్రవేశించారు. ఈ ఏజెన్సీకి దేశవ్యాప్తంగా 20,000 మందికి పైగా ఉద్యోగులున్నారు. 2020లో అమర్‌దీప్ ఎఫ్ఐడీ సంస్థను స్థాపించి, అధిక వడ్డీ ఇస్తామని నమ్మబలికి సామాన్యుల నుంచి డిపాజిట్లను సేకరించడం మొదలుపెట్టాడు. ఇప్పటికే ఈ కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేయగా.. పరారీలో ఉన్న అమర్, సీఈఓ యోగేందర్ సింగ్, సీఓఓ ఆర్యన్ సింగ్‌ల కోసం పోలీసులు గాలిస్తున్నారు. లుక్ ఔట్ సర్క్యులర్‌ను సైతం జారీ చేశారు. సామాన్యుల నుంచి సేకరించిన డిపాజిట్లను మళ్లించేందుకు నిందితులు కాయిన్ ట్రేడ్, బ్లూలైఫ్ ఇంటర్నేషనల్ ఇండియా, యుకియో రిసార్ట్, ప్రెస్టీజ్ జెట్స్, ఫాల్కన్ ఇంటర్నేషనల్ ప్రాపర్టీస్ వంటి 15 షెల్ కంపెనీలను స్థాపించినట్లు పోలీసుల విచారణలో తేలింది. డిపాజిట్లను క్రిప్టోకరెన్సీతో సింగపూర్, దుబాయ్, యూఏఈ వంటి విదేశాల్లోని ఈ షెల్ కంపెనీలకు మళ్లించినట్లు తేల్చారు. అక్కడ్నుంచి నిందితుల వ్యక్తిగత బ్యాంక్ ఖాతాలకు సొమ్ము చేరినట్లు గుర్తించారు.

9 క్రషర్లకు రూ.127 కోట్ల జరిమానా

సిరిసిల్ల జిల్లాలో అక్రమ మైనింగ్‌పై సర్కార్ కొరడా

ముస్తాబాద్(సిరిసిల్ల): అక్రమ మైనింగ్‌పై రాష్ట్ర ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. నిబంధనలు అతిక్రమించి మైనింగ్ చేసిన స్టోన్ క్రషర్ల యజమానులకు భూగర్భ గనుల శాఖ అధికారులు రూ.127 కోట్ల జరిమానా విధించారు. 2017లో ఇచ్చిన క్వారీ కొలతల అనుమతుల మేరకు ప్రభుత్వం 2023లో డిజిటల్ సర్వే చేపట్టింది. భూగర్భగనుల శాఖ అధికారులు రూపొందించిన మ్యాప్‌ల ఆధారంగా పరిమితికి మించి మైనింగ్ చేసిన స్టోన్ క్రషర్ల జాబితాను సిద్ధం చేశారు. జిల్లాలో 14 క్వారీలు ఉండగా, ఇందులో 9 స్టోన్ క్రషర్లు ఉన్నాయి. నిబంధనలు అతిక్రమించినవారికి రూ.127 కోట్ల జరిమానా విధించినట్లు భూగర్భగనుల శాఖ ఏడీ క్రాంతి తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన క్రషర్లకు సాధారణ జరిమానా రూ.27 కోట్లు ఉంటుందని, అక్రమ మైనింగ్ చేసినందుకు ఆరింతలు, పరిధి దాటి మైనింగ్ చేసిన క్రషర్లకు పది రెట్ల జరిమానా విధించినట్లు చెప్పారు. కాగా, తాము నిబంధనలు అతిక్రమించలేదని స్టోన్ క్రషర్ల యజమానులు హైకోర్టును ఆశ్రయించారు. జరిమానాను రద్దు చేయాలని కోరారు. తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామంలోని స్టోన్ క్రషర్ యజమాని మీరాల భాస్కర్ మాట్లాడుతూ.. తాను 1.50 లక్షల క్యూబిక్ మీటర్లు అక్రమంగా మైనింగ్ చేశానని నోటీసు ఇచ్చారని, దీనిపై హైకోర్టుకు వెళ్లి స్టే పొందామని వెల్లడించారు.

భారతమాల ప్రాజెక్టులకు బ్రేక్

ఎన్‌హెచ్ఏఐ కింద చేర్చినట్లు కేంద్రం వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: 'భారత మాల'ప్రాజెక్టు కింద రాష్ట్రానికి మంజూరైన ప్రాజెక్టులకు బ్రేక్ పడింది. ఈ పథకంలో భాగంగా గతంలో మంజూరు చేసిన ప్రాజెక్టులను తొలగించినట్టు కేంద్రం.. రాష్ట్ర అధికార బృందానికి తెలిపింది. రాష్ట్రంలో కొంతకాలంగా నత్తనడకన సాగుతున్న ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేసే అంశంపై.. గురువారం ఢిల్లీలోని రోడ్లు, జాతీయ రహదారుల శాఖ కార్యదర్శి వి.ఉమాశంకర్‌తో సమావేశం జరిగింది. సమావేశానికి తెలంగాణ రోడ్లు, రవాణా శాఖ ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన, ఎన్‌హెచ్ఏఐ ఎస్ఈ ధర్మారెడ్డి, ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ డాక్టర్ గౌరవ్ ఉప్పల్‌లు హాజరయ్యారు. గతంలో మంజూరు చేసిన భారతమాల ప్రాజెక్టులను తొలగించి ఎన్‌హెచ్ఏఐ కింద చేర్చినట్లు కేంద్రం పేర్కొంది. ఇక రీజినల్ రింగ్ రోడ్డు పనులను వేగవంతం చేయాలని కేంద్రానికి రాష్ట్ర బృందం విజ్ఞప్తి చేసింది. ఈ నిర్మాణానికి భూసేకరణ కూడా పూర్తి చేసి పంపినట్లు తెలిపారు. దక్షిణ భాగం (చౌటుప్పల్ -అమన్ గల్ - షాద్ నగర్ - సంగారెడ్డి -182 కి.మీ.) ను జాతీయ రహదారిగా గుర్తించాలని అధికారులు కోరారు. సమావేశం ముగిసిన తర్వాత ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందనలు తెలంగాణ భవన్‌ను సందర్శించారు. తనకు గది ఇవ్వకుండా బయటకు వెళ్లమన్నారంటూ కొద్దిరోజుల క్రితం బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ చేసిన ఆరోపణలపై వికాస్‌రాజ్ ఆరా తీశారు. ఎమ్మెల్యే ముందస్తు సమాచారం ఇవ్వకుండా రావడంతో గది ఇవ్వలేకపోయామని భవన్ అధికారులు స్పష్టం చేశారు.

కూతురిపై కన్నేసిన కసాయి తండ్రి


• నగ్నవీడియోల చిత్రీకరణ.. విషయం బయటకు చెబితే చంపేస్తానని తల్లీకూతుళ్లకు బెదిరింపు

ఇబ్రహీంపట్నం రూరల్: కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన తండ్రే కామాంధుడయ్యాడు. 15 ఏళ్ల కూతురిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయం బయటకు చెబితే తల్లీకూతుళ్లను చంపేస్తానని బెదిరించాడు. ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ సుధాకర్‌రెడ్డి కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా నేరడుగొమ్ము గ్రామానికి చెందిన సేవ అలియాస్ సేవ్యా నాయక్.. భార్యా ముగ్గురు పిల్లలతో ఏడేళ్ల క్రితం కుర్మల్‌గూడకు వలస వచ్చారు. సేవ్యానాయక్ కూతురు అమ్రాబాద్ గిరిజన పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఆమె 2024 అక్టోబర్‌లో దసరా సెలవులకు ఇంటికి వచ్చిన సమయంలో టైఫాయిడ్ రావడంతో ఇంట్లోనే ఉండిపోయింది. ఈ సమయంలో బాలికతో తండ్రి అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక అరిచేందుకు యత్నించగా ఆమె నోరు నొక్కి ఎవరికైనా చెబితే తల్లీకూతుళ్లను చంపేస్తానని బెదిరించాడు. బాలిక నగ్నవీడియోలు చిత్రీకరించాడు. ఇది తట్టుకోలేని బాలిక ఆత్మహత్యకు యత్నించగా తల్లి కాపాడి.. ఎందుకలా చేశావని ప్రశ్నించింది. దీంతో బాలిక అసలు విషయాన్ని చెప్పింది. హాస్టల్ నుంచి వచ్చిన ప్రతీసారి తండ్రి ఇదే మాదిరిగా ప్రవర్తిస్తుండటంతో బాలిక ఇంటికి రావడమే మానేసింది. గత జనవరిలో కుర్మల్‌గూడ నుంచి సైదాబాద్ సింగరేణి కాలనీలో అద్దె ఇంట్లోకి మారగా, భార్యను కూడా వేధింపులకు గురిచేశాడు. రెండు మూడు రోజుల క్రితం ఇంటికి వచ్చిన కూతురితో మరోసారి అసభ్యంగా ప్రవర్తించగా తమను రక్షించాలంటూ తల్లీకూతుళ్లు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు ఈ మేరకు సేవ్యానాయక్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

హైదరాబాద్‌కు 2,800 ఎలక్ట్రిక్ బస్సులు

పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద కేంద్రం ఆమోదం

- సబ్సిడీ విడుదలకు రెండు రోజుల క్రితం ఓకే.. మార్చి చివరలో టెండర్లు.. జూన్ నాటికి ప్రక్రియ పూర్తి
- ఆ తర్వాత విడతలవారీగా బస్సుల సరఫరా



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులు భారీగా రాబోతున్నాయి. పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద 2,800 ఎలక్ట్రిక్ బస్సులు ఇవ్వాలని గత సెప్టెంబర్‌లో తెలంగాణ ఆర్టీసీ కేంద్రానికి దరఖాస్తు చేసిన విషయం తెలిసిందే. ఈ పథకాన్ని పర్యవేక్షిస్తున్న కేంద్ర భారీ పరిశ్రమల శాఖ తాజాగా ఆర్టీసీ కోరిన బస్సులకు సబ్సిడీ మొత్తాన్ని ఇచ్చేందుకు ఆమోదం తెలిపింది. త్వరలో ఈ బస్సుల సరఫరాకు టెండర్లు పిలవనున్నారు. జూన్ నాటికి టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి సరఫరా ప్రారంభించనున్నారు. టెండర్ దక్కించుకునే సంస్థ విడతలవారీగా ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టి, గ్రాస్ కాస్ట్ కాంట్రాక్టు (జీసీసీ) విధానంలో నిర్వహిస్తుంది.

ప్రస్తుతానికి రెండు నగరాలకే..

దేశవ్యాప్తంగా 40 లక్షల కంటే ఎక్కువ జనాభా ఉన్న 9 నగరాల్లో వీలైనన్ని ఎక్కువ ఎలక్ట్రిక్ బస్సులు నడపాలని కేంద్ర ప్రభుత్వం పీఎం ఈ-డ్రైవ్ పథకం మొదటి విడతలో లక్ష్యంగా పెట్టుకుంది. మొదటి విడత 2026 మార్చి వరకు కొనసాగనుంది. ఇందులో మొత్తం 14,028 బస్సులను సరఫరా చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం 4,391 కోట్లు కేటాయించింది. ఈ పథకం కింద 2,800 బస్సులు ఇవ్వాలని తెలంగాణ ఆర్టీసీ దరఖాస్తు చేసింది. బెంగళూరు సిటీ కోసం కర్ణాటక ఆర్టీసీ 7 వేల బస్సులు కోరింది. కేంద్రం ఈ రెండు నగరాలకు 9,800 బస్సుల సబ్సిడీ మొత్తానికి ఆమోదం తెలిపింది. ఈ పథకంలో పేమెంట్ సెక్యూరిటీ మెకానిజం అనే అంశాన్ని కేంద్రం పొందుపరిచింది. జీసీసీ పద్ధతిలో ప్రైవేటు సంస్థ ఈ బస్సులను ఆర్టీసీ పరిధిలో నిర్వహిస్తుంది. ఆ బస్సులు తిరిగిన దూరం ఆధారంగా అద్దెను ఆ సంస్థకు ఆర్టీసీ చెల్లించాలి. ఒకవేళ నెల రోజులపాటు ఆర్టీసీ చెల్లించలేకపోతే, ఆ మొత్తాన్ని కేంద్రం చెల్లించి, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పూచీకత్తు పేమెంట్ సెక్యూరిటీ మెకానిజం నుంచి ఆ మొత్తాన్ని తీసేసుకుంటుంది. అంతమేర సొమ్మును తిరిగి మూడు నెలల్లో రాష్ట్రం ఆ మెకానిజంలో భర్తీ చేయాల్సి ఉంటుంది. నగరానికి సరఫరా అయ్యే 2,800 బస్సులకు సాలీనా అద్దె దాదాపు రూ.120 కోట్లు ఉంటుందని ఆర్టీసీ అంచనా వేసింది. రూ.1.85 కోట్ల విలువైన ఒక్కో బస్సుపై గరిష్ఠంగా 30 శాతం వరకు కేంద్రం సబ్సిడీ ఇస్తోంది.

పకడ్బందీ వ్యూహాలతో పనిచేయాలి

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం కావాలి
- 50 మంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జిని పెట్టండి
- ఓటర్లు పోలింగ్ బూత్‌కు వెళ్లేలా చూడాలి
- కాంగ్రెస్ నేతలతో సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పకడ్బందీ వ్యూహాలకు పదును పెడుతోంది. పార్టీ నేతలు, కేడర్‌ను సిద్ధం చేస్తోంది. కరీంనగర్- ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం ఎన్నికలపై వరుసగా రెండోరోజు గురువారం కాంగ్రెస్ పార్టీ జూమ్ సమావేశం నిర్వహించింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నేతృత్వంలో జరిగిన ఈ భేటీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఎన్నికల్లో గెలుపు కోసం పకడ్బందీగా ప్రచార వ్యూహం రూపొందించుకోవాలని, ప్రతి 50 మంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జిని నియమించాలని సూచించారు. యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు గ్రామ స్థాయి నుంచి వ్యూహాలు రచించాలని, ఓటర్లకు మంచి అభిప్రాయం ఉన్నప్పటికీ వారిని పోలింగ్ బూత్‌కు తీసుకెళ్లి ఓటు వేయించేలా బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పనులకు విస్తృతంగా ప్రచారం చేయాలని, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జీలు పూర్తి స్థాయిలో వ్యూహాత్మకంగా పని చేయాలని కోరారు.

ప్రతి ఓటూ కీలకమే..: మొదటి, రెండో ప్రాధాన్యత ఓట్లను కూడా సీరియస్‌గా తీసుకోవాలని, ఎలిమినేషన్ ప్రక్రియలో ప్రతి ఓటు చాలా కీలకమైందని సీఎం చెప్పారు. ఓటర్ మ్యాపింగ్ చేయడం, ఓటర్లను ప్రత్యేకంగా కలవడం లాంటి అంశాలు చాలా ముఖ్యమైనవని, ఎక్కడా నిర్లక్ష్యం ఉండకూడదని చెప్పారు. గాంధీభవన్‌లో కంట్రోల్ రూమ్ పెట్టి నిరంతరం పర్యవేక్షించాలని పార్టీ నేతలను ఆదేశించారు. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జీ మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ.. ఈ ఎన్నిక చాలా కీలకమైనదని, ప్రతి ఒక్కరూ ప్రతిష్టాత్మకంగా తీసుకుని సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టేలా కృషి చేయాలని కోరారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖలతో పాటు ఎమ్మెల్సీ ఎన్నికల పరిధిలోని 42 అసెంబ్లీ నియోజకవర్గాల బాధ్యులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇన్‌చార్జీలు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, సేవాదళ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు పాల్గొన్నారు.

నాంపల్లి కోర్టుకు సీఎం రేవంత్‌రెడ్డి

• సీఎం వాంగ్మూలం నమోదు

సిటీ కోర్టులు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజర య్యారు. గత ఎన్నికల సమయంలో ఆయనపై నమోదైన పలు కేసుల్లో సెక్షన్ 313 కింద వాంగ్మూలం ఇచ్చేందుకు కోర్టుకు వచ్చారు. గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఆయన బీఆర్ఎస్ పార్టీని కించపరిచేలా మాట్లాడి ప్రజలను మభ్యపెట్టే యత్నం చేశారంటూ పార్టీ నాయకులు చేసిన ఫిర్యాదు మేరకు ఆయనపై వేర్వేరు ప్రాంతాల్లో మూడు కేసులు నమోదయ్యాయి. హైదరాబాద్‌లోని బేగం బజార్, మెదక్ జిల్లాలోని కౌడిపల్లి, నల్లగొండలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన మూడు కేసుల్లో విచారణ నిమిత్తం ఆయన వ్యక్తిగతంగా కోర్టు ముందు హాజరయ్యారు. కోర్టు ఈ కేసుల్లో రేవంత్ వాంగ్మూలం నమోదు చేసుకుంది. అనంతరం తదుపరి విచారణను మార్చి 23కు వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. సీఎం రేవంత్‌రెడ్డి కోర్టుకు హాజరైన నేపథ్యంలో పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు.

పలువురు ఐఏఎస్‌లకు స్థాన చలనం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి కె.హరితను ప్రభుత్వం వాణిజ్య పన్నుల శాఖ డైరెక్టర్‌గా బదిలీ చేసింది. ఆ శాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతల నుంచి సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీని తప్పించింది. ఈ మేరకు రాష్ట్రంలో పలువురు ఐఏఎస్ అధికారులకు స్థానచలనం కల్పిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ కె.సురేంద్ర మోహన్‌కు ప్రభుత్వం సహకార శాఖ కమిషనర్/కోఆపరేటివ్ సొసైటీల రిజిస్ట్రార్‌గా, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ పోస్టుల అదనపు బాధ్యతల నుంచి పి.ఉదయ్‌కుమార్‌ను ఉపసంహరించింది. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవో శివశంకర్ లాహోటిని ఆ బాధ్యతల నుంచి తప్పించి, తదుపరి పోస్టు కోసం సాధారణ పరిపాలన శాఖకు రిపోర్టు చేయాలని ఆదేశించింది. వైద్య, ఆరోగ్య శాఖ డైరెక్టర్ ఆర్వీ కర్ణన్‌కు ప్రభుత్వం, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఉద్యానవన శాఖ డైరెక్టర్ ఎస్కే యాస్మిన్ బాషాకు తెలంగాణ సీడ్స్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. తెలంగాణ సీడ్స్ డైరెక్టర్ పి.ఉదయ్‌కుమార్‌ను ఆ పోస్టునుంచి ఉపసంహరించింది. హాకా ఎండీ కె.చంద్రశేఖర్ రెడ్డికి తెలంగాణ ఫుడ్స్ ఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించింది. తెలంగాణ ఫుడ్స్ డైరెక్టర్ బి.శ్రీనివాస్ రెడ్డిని చేనేత, జౌళి శాఖ అదనపు డైరెక్టర్‌గా బదిలీ చేసింది. వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ సచిత్ గంగ్వార్‌ను నారాయణపేట జిల్లా అదనపు కలెక్టర్‌గా బదిలీ చేసింది.

హరీశ్ పేరు చెప్పాలని చిత్రహింసలు


• ఫోన్ ట్యాపింగ్ కేసులో వంశీకృష్ణ అఫిడవిట్

సిటీ కోర్టులు: ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టయిన తనను మాజీ మంత్రి హరీశ్‌రావు పేరు చెప్పాలని పోలీసులు చిత్రహింసలు పెట్టారని నిందితుడు (ఏ-3) వంశీకృష్ణ నాంపల్లి కోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారు. అరెస్టు సమయంలోనూ డీసీపీ విజయ్, ఏసీపీ మోహన్ తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని చెప్పారు. హరీశ్‌తోపాటు ఆయన అనుచరుడు వేణుగోపాల్ పేరు చెప్పాలని దుర్భాషలాడారని పేర్కొన్నారు. రిమాండ్‌లో ఉన్న వంశీకృష్ణ గురువారం చంచల్‌గూడ జైలు నుంచి లిఖితపూర్వక అఫిడవిట్‌ను న్యాయవాది జక్కుల లక్ష్మణ్ ద్వారా నాంపల్లిలోని 14వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టుకు పంపించారు.

అఫిడవిట్‌లో పేర్కొన్న అంశాలు..: 'నన్ను పంజగుట్ట పోలీసులు క్రైమ్ నంబర్ 1204/2024లో అరెస్ట్ చేసి జైలుకు తీసుకొచ్చారు. జైలుకు తీసుకెళ్లే వరకు నాకు కేసేంటో కూడా తెలియదు. నేను పోలీసుల ముందు ఏమీ చెప్పలేదు. పోలీసులు కేసేంటో కూడా చెప్పలేదు. హైకోర్టు ఆదేశాల మేరకు ఈ నెల 15న పంజగుట్ట పోలీసుల ముందు విచారణకు హాజరయ్యా. డీసీపీ విజయ్‌కుమార్, ఏసీపీ మోహన్ కుమార్ మాట్లాడుతూ... నీవు ఫోన్ ట్యాపింగ్ విషయంలో మచ్చ వేణుగోపాల్, హరీశ్‌రావుకు వ్యతిరేకంగా వాంగ్మూలం ఇవ్వకపోతే ఈరోజు రాత్రిలోపు జీవితం లేకుండా చేస్తాం అని బెదిరించారు. ఉద్యోగం లేకుండా చేస్తామని.. తీవ్రస్థాయిలో దుర్భాషలాడుతూ నరకం చూపించారు. బలవంతంగా నా సంతకాలు తీసుకున్నారు. మా లాయర్‌కు చూపించి సంతకం చేస్తా అన్నా కూడా వినలేదు. డీసీపీ నన్ను పదేపదే దూషిస్తూ వారి వివరాలు (వేణుగోపాల్, హరీశ్) చెబితే నీ ఉద్యోగం నీవు చేసుకుంటావని చెప్పారు. వారికి వ్యతిరేకంగా చెప్పకుంటే థర్డ్ డిగ్రీ ఇప్పిస్తానని, నీ కుటుంబ పరువు తీసేస్తా అని హెచ్చరించారు. నా ఆరోగ్యం బాగాలేదని చెప్పినా వినకుండా విపరీతంగా తిట్టారు. ఏసీపీ మోహన్, ఎస్ఐ శివశంకర్ మా ఫ్యామిలీతో ఉన్నా అని కూడా చూడకుండా మూడేళ్లు, రెండేళ్ల చిన్నారులను అర్ధరాత్రి వరకు తిండి లేకుండా ఉంచారు. మానసికంగా నరకం చూపించారు' అని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. కాగా, కాంగ్రెస్ నేత చక్రధర్ గౌడ్ ఫిర్యాదు చేసిన ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టయి రిమాండ్‌లో ఉన్న వంశీకృష్ణ, సంతోశ్‌కుమార్, పర్శరాములుకు నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఒక్కొక్కరు రూ.20 వేల చొప్పున రెండు పూచీకత్తులు ఇవ్వాలని ఆదేశించింది.

3న ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసు విచారణ

సాక్షి న్యూఢిల్లీ: తెలంగాణలో ఎమ్మెల్యేల ఫిరా యింపుల కేసుపై మార్చి 3న వాదనలు వింటామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. బీఆర్ ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన పది మంది ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకో వాలని కోరుతూ కేటీఆర్, పాడి కౌశిక్ రెడ్డి సహా మరికొందరు దాఖలు చేసిన పిటిషన్లను గురువారం జస్టిస్ బీఆర్ గవాయి ధర్మాసనం ఎదుట పిటిషనర్ల తరఫున న్యాయవాదులు ప్రస్తావించారు. మార్చి 3న కేసును విచారిస్తామని న్యాయమూర్తి చెప్పారు.



పసిపిల్లలకు భయం ఎక్కువ.
ఆ భయాన్ని వాడుకునే నీడలు ఎక్కువ.
నీడలు వారిని బంధిస్తాయి
వారితో చెడు పనులు చేస్తాయి
వారి పసితనాన్ని అశుభ్రం చేస్తాయి.
నీడలు ఈ పనికి దేవుణ్ణో, దెయ్యాన్నో
తోడు తెచ్చుకుంటాయి.
తల్లిదండ్రులు స్వయంగా తీసుకెళ్లి
అమాయకత్వంతోనో మూర్ఖత్వంతోనో
పిల్లల్ని ఈ నీడలకు అప్పగిస్తారు.
పిల్లలు పులి నోటికి చిక్కుతారు.
న్యాయం ఎప్పుడోగాని ఉదయించదు.
జమ్ము–కశ్మీర్‌లో మంత్రాల పేరు చెప్పి
పిల్లలను లైంగికంగా వేధించిన బాబాకు
శిక్ష విధిస్తూ న్యాయమూర్తి
ఉద్వేగంగా కవిత రాశారు.
భయం లేని వేకువకై ప్రార్థించారు.

● చైల్డ్ అబ్యూజ్

పసికూనలకు రక్షణ..లా

జనవరి, 2021.

మదనపల్లె ఘటన అందరికీ గుర్తుంది.

మూఢ విశ్వాసం నెత్తికెక్కి ఇద్దరు ఎదిగొచ్చిన కుమార్తెల ఉసురు తీశారు తల్లిదండ్రులు.

చనిపోయాక వారు సత్యయుగంలో జన్మిస్తారట. అందుకోసమని బతికుండగానే సమాధి చేశారు.

ప్రాణం పోయడం దైవం. ప్రాణం తీయడం దెయ్యం.

•••

అక్టోబర్, 2024.

చత్తీస్‌గఢ్‌లోని శక్తి జిల్లా.

తల్లి తన ఇద్దరు కుమార్తెలతో కలిసి ఇద్దరు కుమారులను గొంతు పిసికి చంపేసింది. తర్వాత ఉజ్జయినీ నుంచి తెచ్చుకున్న ఒక 'గురువు' ఫొటో పెట్టుకొని ఆ చనిపోయిన కుమారులను ప్రాణాలతో లేచేందుకు మంత్రాలు చదవడం మొదలెట్టింది.

ఇదంతా ఆమె తంత్ర సాధనలో భాగమట.

కడుపున పుట్టిన వారినే కాటేసే గుడ్డితనమే అంధ విశ్వాసం.

•••

జూన్, 2024.

తమిళనాడులోని అలియలూరు జిల్లా.

లేక లేక మనవరాలు పుడితే ఆ పుట్టిన శకునం బాగ లేదని స్వయంగా తాతే ఆ పసికూన ప్రాణాలు తీశాడు. ఆ శకునం కుటుంబానికి హానికారక సూచన కనుక ఈ పని చేశాడట.

చేతులతో పూజ చేయడం భక్తి. అదే చేతులతో పీక పిసకడం మూఢ భక్తి.

•••

ఫిబ్రవరి 18, 2025.

జమ్ము–కశ్మీర్‌లోని సాపోర్ నగర కోర్టులో చీఫ్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ మీర్ వజాహత్ ఒక 123 పేజీల తీర్పును వెలువరించారు. ఆ తీర్పు అంతా మూఢ విశ్వాసాల వల్ల చిన్నపిల్లల మీద సాగుతున్న దౌర్జన్యాల పట్ల, అకృత్యాల పట్ల ఆవేదన. కారణం? ఆ తీర్పు ఏజాజ్ అహ్మద్ అనే దొంగబాబా పసిపిల్లల మీద సాగించే అకృత్యాల మీద కావడం. ఈ ఘోరాన్ని ఆ బాబా ఏళ్ల తరబడి కొనసాగిస్తూ ఉండటం. విషయం తెలియకనే తల్లిదండ్రులు అందులో భాగం కావడం.

ఏం జరిగింది?

జమ్ము–కశ్మీర్‌లో 'పీర్ బాబా'గా పేరుబడ్డ ఏజాజ్ షేక్ దగ్గరకు చాలా మంది తమ దైనందిన బాధల నుంచి విముక్తి కోసం వచ్చేవారు. అనారోగ్యం, ఆర్థిక బాధలు, తగవులు... వీటికి విరుగుడు కోసం ఆయన దగ్గరకు మంత్ర తంత్రాలకు వచ్చేవారు. అయితే ఇక్కడే ఆ బాబా ఒక చిట్కా పాటించేవాడు– 'మీ కష్టాలు పోవడానికి దైవ సహాయం కంటే 'జిన్ను' (భూతం)ల సాయం మంచిది. జిన్నులతో మాట్లాడి పరిష్కారం చేస్తాను. అయితే జిన్నులు పెద్దల కంటే పిల్లలతో మాట్లాడటానికి ఇష్టపడతాయి. మీరు మీ పిల్లల్ని (అబ్బాయిల్ని) తెచ్చి నాకు అప్పగిస్తే తంత్రాలు ముగిశాక మళ్లీ మీకు అప్పగిస్తాను' అనేవాడు. అమాయక/ఆశబోతు తల్లిదండ్రులు ఈ మాటలు నమ్మి తమ పిల్లల్ని బాబా దగ్గరకు తీసుకెళ్లేవాళ్లు.

పదేళ్లలోపు మగపిల్లలు

ఈ బాబా చేతిలో బాధితులుగా మారిన వారందరూ పదేళ్ల లోపు అబ్బాయిలే. బాబా వారిని పూజ పేరుతో నగ్నంగా మార్చి అసహజ లైంగిక కార్యకలాపాలకు పాల్పడేవాడని ప్రాసిక్యూషన్ నిరూపించగలిగింది. పిల్లల్ని భయపెట్టేందుకు బాబా తనలోనే 'జిన్' ఉందని, అది అన్ని కష్టాల నుంచి దూరం చేస్తుందని, కోరికలు నెరవేరుస్తుందని చెప్పి లైంగిక వాంఛలు తీర్చుకునేవాడు. కొందరు పిల్లలు నాలుగైదు ఏళ్లపాటు ఇతని వల్ల బాధ పడ్డారు. భయం వల్ల, ఆ బాబా స్కూల్ టీచర్ కూడా కావడం వల్ల నోరు మెదపలేక తల్లిదండ్రులు బాబా దగ్గరికెళ్దామంటే వారు మొండికేయడం మొదలెట్టారు. అప్పుడు గాని పెద్దలకు అనుమానం రాలేదు. ఒక బాలుడు తెగించి తండ్రికి జరిగేది చెప్పడంతో బండారం బయటపడింది.

శిక్ష పడింది

2016లో బాబా అకృత్యాలు బయటపడి బేడీలు పడ్డాయి. అప్పటి నుంచి జైలులో శిక్ష అనుభవిస్తున్న బాబాకు ఫిబ్రవరి 18న న్యాయమూర్తి మీర్ వజాహత్ 14 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధించారు. అంతేకాదు భక్తి, విశ్వాసాలను జనం బలహీనతగా ఎంచి దొంగ వేషగాళ్లు పసిపిల్లలను కబళించడంపై న్యాయమూర్తి తీవ్రమైన ఆవేదన, ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి బాబాలు మొత్తం విశ్వాస ప్రపంచానికి విఘాతం కలిగిస్తారన్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులు చాలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన ఈ మొత్తం కేసు మీద ఒక లోతైన, సంకేతపూర్వకమైన కవిత రాశారు. ఎంత కదిలిపోతే ఇంత గాఢమైన కవిత వస్తుందనే ఇప్పుడు సర్వత్రా చర్చ జరుగుతోంది.

జస్టిస్ మీర్ వజాహత్ రాసిన కవిత

విశ్వాసపు గుసగుసలు... భయవిహ్వల పెనుకేకలు

వెలుగు దుస్తులు ధరించి నిలిచిన వాడు
కారు చీకటిలో దారి చూపుతానని మాటిచ్చాడు
గుసగుసగా మంత్రాలు జపిస్తూ తన పవిత్ర హస్తాలతో
అంగలార్చే నేలలో విశ్వాసపు బీజాన్ని నాటాడు

సాంత్వనకై వెదుకుతూ అభయానికై తపిస్తూ
విప్పారిన నేత్రాలతో చేరవచ్చిందొక పసితనం
కానీ ఆ వెలుగుల మాటున చీకటి నీడలు
గడ్డకట్టిన మంచులా వణికించిన గుసగుసలు

'భూతమంటే భయమేలే కానీ నాపై నమ్మకముంచు
నిన్ను బయటపడేసే తాళంచెవి నా దగ్గరుంది'
పవిత్ర వేషంలో మాటలే సంకెళ్లు
ఇక గొంతు దాటని రోదన... విశ్వాసం గల్లంతు

చెప్పినట్టు, తాకినట్టు, దయగా చూసినట్టు
మాయామంత్రాల మత్తుగాలి... ఆశలను బూడిద చేస్తూ
కానరాని వలయాల్లో సుళ్లు తిరిగిన ఉత్త మాటలు
ఇక మిగిలింది కలవర పెట్టే పీడకలలు

ఏళ్లు గడిచిపోతాయి... పుళ్లు సలుపుతూనే ఉంటాయి
కాని ఆ నొప్పి వెనుక దాగి వెంటాడే ఆనాటి గుసగుసలు
చీలికలైనదేదీ అతుకు పడనే లేదు
నిబద్ధమై ఉండాల్సిన ఆత్మ గాలివాటుగా పరిభ్రమిస్తూ

కాని నిజం తలెత్తుకుని నిలబడుతుంది
జాతకాలు తలకిందులవుతాయి
న్యాయానికి ఎదురు నిలవక నీడలు చెదిరిపోతాయి
గాయాల ఆనవాళ్లు మాసిపోవేమోలే కానీ
భయం లేని వేకువలో భళ్లున తెల్లారుతుంది



సోషల్ మీడియా

నిదుర పో కన్నా...

తమ పసిబిడ్డను ఇంట్లోవాళ్లకు అప్పగించి ఉద్యోగం చేసుకునే అవకాశం అందరు తల్లులకు ఉండకపోవచ్చు. అలాంటి వారికి ఆ బిడ్డను భుజాన వేసుకొని ఉద్యోగానికి పోవడం అనివార్యం అవుతుంది.

అయితే అదేమీ అంత ఆషామాషీ విషయం కాదు.

'ఎంత కష్టం! ఎంత కష్టం!' అనిపిస్తుంది, అయినా సరే తప్పదు.

ఇక తాజా విషయానికి వస్తే...

తన పసికందును మోసుకుంటూ న్యూ ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో విధులు నిర్వహిస్తోన్న రైల్వే ప్రొటెక్షన్ స్పెషల్ ఫోర్స్(ఆర్పీఎఫ్) కానిస్టేబుల్ రీనా వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చేతిలో లాఠీ ఒకవైపు, స్టేషన్ రణగొణ ధ్వనులను పట్టించుకోకుండా ప్రశాంతంగా నిద్రపోతున్న బిడ్డ మరోవైపు.

ఆమె భర్త సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ జమ్మూకశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. అత్త మామలు లేరు. దీంతో బిడ్డతోపాటు డ్యూటీకి రావడం తప్ప ఆమెకు వేరే మార్గం లేదు. 'ఇది నా దినచర్యలో భాగం, ఎవరైనానా సహాయం చేస్తారేమోనని ఎదురుచూస్తున్నాను. అప్పటివరకు ఇది తప్పదు' అంటుంది రీనా.

ఇంతకుమించి ఆ వీడియోలో సాంకేతిక అద్భుతాలేవీ లేవు. అయినా సరే ఆ వీడియో నెటిజనులను ఉద్వేగానికి గురిచేసింది.

మాతృత్వాన్ని, ఉద్యోగ విధులను సమన్వయం చేసుకునే ఎంతోమంది తల్లులకు ఈ వీడియో ప్రాతినిధ్యం వహించడం వల్లే అంతగా పాపులారిటీ వచ్చింది.

బిడ్డకు తగినన్ని పాలు పడాలంటే..?



కొత్తగా అమ్మగా మారిన ఆ తల్లి తన బిడ్డకు సరిపోయినన్ని పాలు పడకపోతే ఆ మాతృమూర్తి పడే వేదన అంతా ఇంతా కాదు. చిన్నారికి సరిపోయినన్ని పాలు పడాలనుకునేవారు తీసుకోవాల్సిన కొన్ని జాగ్రత్తలివి...

- కొత్తగా తల్లి అయిన మహిళ తాను తీసుకునే ఆహారంలో పాలు, పెరుగు, కూరగాయలు, ఆకుకూరలు, పప్పుధాన్యాలు, నీళ్లు తప్పని సరిగా తీసుకోవాలి.
- అన్ని రకాల పోషకాలు అందేలా మంచి బలవర్ధకమైన ఆహారంతో పాటు... ముఖ్యంగా నువ్వులు, వెల్లుల్లి, పాలు, కోడిగుడ్లు, కొబ్బరి, కొబ్బరి నీళ్లు ఎక్కువగా తీసుకోవాలి.
- సిజేరియన్ జరిగి బిడ్డను పొందిన మహిళల్లో కుట్లు చీము పడతాయనే అపోహతో పప్పుధాన్యాలు తీసుకోరు. కానీ పప్పులు తీసుకోవడం వల్ల గాయం త్వరగా మానుతుంది. కానీ పప్పుధాన్యాలు ఇవ్వడం వల్ల కూడా పాలకు మంచి రుచి వచ్చి పాపలు ఇష్టంగా తాగుతారు.

తల్లి మంచినీళ్లు కూడా ఎక్కువగా తాగాలి. ఈ సూచనలు పాటించాక కూడా బిడ్డకు ఇంకా పాలు సరిపోకపోయినట్లయితే డాక్టర్ సలహా తీసుకోవాలి.

బ్యూటిప్స్ | **చుండ్రు తగ్గాలంటే...**



యువతను విసిగించే సమస్యలలో చుండ్రు ఒకటి. దీనికి విరుగుడుగా కొన్ని జాగ్రత్తలతో ఈ సమస్యలను నివారించుకోవచ్చు.



- అల్లం ముక్కను సన్నగా తరగాలి. ఈ ముక్కలను నువ్వుల నూనెలో వేసి మరిగించాలి. చల్లారిన తర్వాత కుదుళ్లకు నూనె పట్టేలా మర్దనా చేయాలి. గంట తర్వాత మైల్డ్ షాంపూతో తలస్నానం చేయాలి. వారంలో రెండుసార్లు ఈ విధంగా చేస్తే చుండ్రు తగ్గుతుంది.



- ఆలివ్ ఆయిల్, వేప నూనె సమపాళ్లలో కలిపి వేడి చేయాలి. గోరువెచ్చని ఈ నూనెను మాడుకు పట్టించి, వేళ్లతో మృదువుగా మర్దనా చేయాలి. అరగంట తర్వాత తల స్నానం చేయాలి.



- ఆపిల్ సైడర్ వెనిగర్‌ని మాడుకు పట్టించి, పది నిమిషాల తర్వాత గోరువెచ్చని నీళ్లతో శుభ్రపరుచుకోవాలి.
- బేబీ ఆయిల్‌ను మాడుకు పట్టించి, మర్దనా చేసి, గోరువెచ్చని నీళ్లలో ముంచి తీసిన టర్కీ టవల్‌ని తలకు చుట్టుకోవాలి. పది నిమిషాల తర్వాత చుండ్రు నివారణకు ఉపయోగించే షాంపూతో తలస్నానం చేయాలి.
- అలొవెరా జెల్‌ను పట్టించి 15 నిమిషాల తర్వాత తలస్నానం చేయాలి. అలొవెరా జెల్ చుండ్రును నివారించడమే కాకుండా మాడుపైన దురద వంటి చర్మ సమస్యలనూ నివారిస్తుంది. వెంట్రుకలకు మంచి కండిషనర్‌గా ఉపయోగపడుతుంది.

కిచెన్ టిప్స్



- గారెల కోసం తయారు చేసుకున్న పిండిలో నీరు ఎక్కువై నూనెలో వేయగానే అంచుల దగ్గర సన్న పలుకులుగా విడిపోతున్నట్లయితే, పిండిలో ఒక టేబుల్ స్పూను నెయ్యి కలపాలి.
- కూరలు, పులుసులు, సూప్‌లు మరీ పలచగా ఉన్నట్లనిపిస్తే అందులో ఒక టేబుల్ స్పూను కార్న్ ఫ్లోర్ కలపాలి. కార్న్‌ఫ్లోర్‌ను అలాగే వేస్తే ఉండలవుతుంది. ముందుగా ఒక కప్పులో వేసి చన్నీటితో కలిపి ఆ మిశ్రమాన్ని కూరల్లో వేస్తే సమంగా కలుస్తుంది.

ఫ్యాషన్

నయగారాల సోయగాలు

తరతరాలుగా చేతులు మారే ఆభరణాలలా పార్సీ 'గారా' అనే ఎంబ్రాయిడరీని అత్యున్నతమైన వారసత్వ సంపదగా పేర్కొంటారు. గాజ్ లేదా పాజ్ అనే అందమైన పట్టు వస్త్రంపై రూపొందించే ఈ ఎంబ్రాయిడరీ సంప్రదాయ వేడుకలలో వైభవంగా వెలిగిపోతుంటుంది. వందేళ్లకు పైగా ప్రాచీన చరిత్ర కల 'గారా' డిజైన్ నేడు సెలబ్రిటీలకు ఇష్టమైన ఎంపిక అయ్యింది.



ఇటీవల హార్వర్డ్ ఇండియా కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న నీతా అంబానీ పార్సీ గారా శారీలో మెరిసి, మరోసారి వారసత్వ సంపదను అందరికీ గుర్తుచేశారు. సంక్లిష్టమైన ఈ హస్తకళ పూర్తి కావడానికి దాదాపు రెండేళ్లు పట్టింది. ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ జెనోబియా ఎస్.దావర్ ఈ చీర రూపకర్త.

వివాహాలు, ప్రత్యేక సందర్భాలలో పార్సీ మహిళలు గారా చీరలను ధరించేవారు. అత్యంత ఖరీదైనదిగా పేరొందిన ఈ ఎంబ్రాయిడరీని కొన్ని ప్రత్యేక రోజులకే పరిమితం చేయకూడదని నేడు సృజనాత్మకంగా దుపట్టాలు, లెహంగాలు, ఇండోవెస్టర్న్ డ్రెస్సుల మీదకు తీసుకు వస్తున్నారు.

•••

భారతదేశం నుండి పార్సీలు వాణిజ్యం కోసం చైనాకు ప్రయాణించే రోజుల్లో 'గారా' ఎంబ్రాయిడరీ మన దేశంలోకి అడుగుపెట్టింది. పార్సీలు మన దేశం నుండి నల్లమందు, పత్తిని చైనాకు తీసుకెళ్లి, అక్కడి టీ కోసం మార్పిడి చేసేవారు. బ్రిటిష్ వారు ఐరోపాలో ఎక్కువ టీని అమ్మాలనుకోవడంతో పార్సీలు త్వరగా వ్యాపారంలో ధనవంతులయ్యారు. వారు తిరిగి వచ్చేటప్పుడు చైనాలో అందుబాటులో ఉన్న సిరామిక్స్, వివిధ ప్రాచీన వస్తువులను కూడా తీసుకువచ్చేవారు. ఒక వ్యాపారి కళాత్మకంగా ఉండే ఆ ఎంబ్రాయిడరీ ముక్కను ఒకటి తీసుకువచ్చాడన్నది చరిత్ర. ఆ ఎంబ్రాయిడరీ లో రకరకాల మార్పులు చేసి, తదుపరి కాలంలో పార్సీ మహిళల చీరల మీద వైభవంగా వెలిసింది. ముంబైలో స్థిరపడిన పార్సీ సమాజం చాలా ధనవంతులుగా, గారా చీరలు వారి సిగ్నేచర్‌గా మారిపోయాయి. ఆ విధంగా పార్సీ గారా అనే పేరు స్థిరపడిపోయింది.

•••

'గారా' ఎంబ్రాయిడరీలో పోల్కా చుక్కలను, సాలీడులా అనిపించే మోటిఫ్స్ కనిపిస్తాయి. పక్షులు, వృక్షజాలం, జంతుజాలం.. వంటివి ఈ ఎంబ్రాయిడరీలో ఒద్దికగా కనిపిస్తాయి. అచ్చమైన పట్టు దారాలతో సంక్లిష్టంగా ఉండే ఈ డిజైన్‌తో చీర రూపొందించాలంటే కళాకారులకు కొన్ని నెలల సమయం పడుతుంది. అందుకే ఈ ఎంబ్రాయిడరీ అత్యంత ఖరీదైనదిగా పేరొందింది.

•••

నాటి రోజుల్లో ఈ ఎంబ్రాయిడరీకి సాలిఘజ్' అని పిలిచే ప్రత్యేక ఫ్యాబ్రిక్‌ను ఎంపిక చేసుకునేవారు.. 1930లలో ఈ ఫ్యాషన్ వెలుగు చూసింది. తర్వాత 80లలో పునరుద్ధరించబడింది. ముంబైలో పార్సీలు ఈ ఎంబ్రాయిడరీని మందపాటి పట్టు ఫ్యాబ్రిక్ పైనే డిజైన్ చేసేవారు. ఇప్పుడు క్రేప్, జార్జెట్, షిఫాన్ ఫ్యాబ్రిక్‌లను ఉపయోగిస్తున్నారు. డిజైన్‌కి పెద్దమొత్తంలో పట్టుదారాలు ఉపయోగిస్తారు కాబట్టి కొన్ని ఫ్యాబ్రిక్స్ ఈ ఎంబ్రాయిడరీ బరువును మోయలేవు.

దాదాపు 40–50 సంవత్సరాల క్రితం ట్రెండ్‌లో ఉన్న ఈ కళ ఇప్పుడు మళ్లీ కళగా వెలుగులోకి రావడం చూస్తుంటే టైమ్‌లెస్ ట్రెడిషన్ అనిపించకమానదు.



గారా ర్యాప్ టాప్





గారా ఎంబ్రాయిడరీ



గారా లాంగ్ గౌన్



గారా దుపట్టా

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	203	75,736
నిఫ్టీ ▽	20	22,913

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

నాస్‌డాక్	19,919	▽	136
డోజోన్స్	44,042	▽	585
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,663	▽	50
డాక్స్	22,315	△	119
షాంఘై	3,351	△	1
నికాయ్	38,678	▽	487

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారట్)	85,520
బంగారం (22 క్యారట్)	81,450
వెండి (కేజీ)	1,09,000

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ధాయవసిటికే	86.45	87.47
£	బ్రిటన్ పౌండ్	ధాయవసిటికే	108.10	110.92
€	యూరో	ధాయవసిటికే	89.37	92.01
¥	జపాన్ ఎన్ (100)	ధాయవసిటికే	57.00	58.45
AUS	ఆస్ట్రేలియా డాలర్	ధాయవసిటికే	54.10	56.31
S$	సింగపూర్ డాలర్	ధాయవసిటికే	62.56	67.24
SAR	సౌదీ రియాల్	ధాయవసిటికే	22.21	23.77
UAE D	యూఏఈ దిర్హామ్	ధాయవసిటికే	22.70	24.49
¥	చైనా యువాన్	ధాయవసిటికే	11.07	12.89

వేదాంత విభజనకు గ్రీన్ సిగ్నల్



- ఐదు కంపెనీలుగా విడదీత
- ప్రణాళికకు షేర్‌హోల్డర్లు, రుణదాతల ఆమోదం
- ఒక్కో వేదాంత షేరుకు ఒక్కొక్కటి చొప్పున 4 కొత్త కంపెనీల షేర్లు

న్యూఢిల్లీ: షేర్‌హోల్డర్లు, రుణదాతలు ఆమోద ముద్ర వేయడంతో డైవర్సిఫైడ్ దిగ్గజం వేదాంత లిమిటెడ్ విభజనకు లైన్ క్లియర్ అయ్యింది. దీంతో వ్యాపారాలను అల్యూమినియం, ఆయిల్ తదితర రంగాలవారీగా అయిదు కంపెనీలుగా విడదీస్తారు. డీమెర్జర్ స్కీము ప్రకారం వేదాంత షేర్‌హోల్డర్లకు ఒక్కో షేరుకు గాను కొత్తగా ఏర్పడే నాలుగు సంస్థలకు సంబంధించి అదనంగా ఒక్కొక్క షేరు చొప్పున లభిస్తుంది. కార్యకలాపాలను క్రమబద్ధీకరించుకునేందుకు, వనరులను సమర్ధవంతంగా ఉపయోగించుకునేందుకు, అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఈ డీమెర్జర్ ఉపయోగపడుతుందని వేదాంత వెల్లడించింది. అలాగే, ఒక్కో స్వతంత్ర కంపెనీ వేర్వేరుగా ఇన్వెస్టర్ల నుంచి పెట్టుబడులు సమకూర్చుకునేందుకు, వ్యూహాత్మక భాగస్వాములతో జట్టు కట్టేందుకు అవకాశం లభిస్తుందని పేర్కొంది. అయిదు కంపెనీలుగా విడదీసే ప్రణాళికకు 99.99 శాతం మంది షేర్‌హోల్డర్లు, 99.59 శాతం మంది సెక్యూర్డ్ రుణదాతలు, 99.95 శాతం మంది అన్‌సెక్యూర్డ్ రుణదాతలు ఆమోదం తెలిపినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలియజేసింది.

గురువారం బీఎస్‌ఈలో వేదాంత షేర్లు దాదాపు 2.40 శాతం పెరిగి రూ. 433.55 వద్ద క్లోజయ్యాయి. ఇంట్రాడేలో సుమారు 3 శాతం పెరిగి రూ. 435.50 స్థాయిని తాకాయి. కంపెనీ మార్కెట్ వేల్యుయేషన్ రూ. 3,969 కోట్లు పెరిగి రూ. 1,69,535 కోట్లకు చేరింది.

ఇవీ కంపెనీలు..

విడదీత అనంతరం వేదాంత లిమిటెడ్ ప్రధానంగా వెండి, జింకు మొదలైన మెటల్స్ ఉత్పత్తి కార్యకలాపాలు నిర్వహిస్తుంది. మిగతా కంపెనీల జాబితాలో వేదాంత అల్యూమినియం, వేదాంత ఆయిల్ అండ్ గ్యాస్, వేదాంత పవర్, వేదాంత ఐరన్ అండ్ స్టీల్ ఉంటాయి. టెక్నాలజీ విభాగాలతో పాటు కొత్త వ్యాపారాలకూ వేదాంత ఇన్‌క్యుబేటరుగా వ్యవహరిస్తుంది.

ఐపీవో రూట్లో ఫోన్‌పే



న్యూఢిల్లీ: పబ్లిక్ ఇష్యూ (ఐపీవో) ద్వారా దేశీ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టయ్యేందుకు ఫిన్‌టెక్ దిగ్గజం ఫోన్‌పే కసరత్తు ప్రారంభించింది. ఈ ఏడాది పదో వార్షికోత్సవం జరుపుకోనున్న నేపథ్యంలో తమ సంస్థకు ఇదొక కీలక మైలురాయి అవుతుందని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ఫోన్‌పే పోటీ సంస్థలు పేటీఎం, మొబిక్విక్ ఇప్పటికే దేశీ మార్కెట్లలో లిస్టయిన సంగతి తెలిసిందే. సింగపూర్ కేంద్రంగా కార్యకలాపాలు సాగించిన ఫోన్‌పే 2022లో తమ ప్రధాన కార్యాలయాన్ని భారత్‌కి మార్చుకుంది. 2023లో చివరిసారిగా నిధులు సమీకరించినప్పుడు ఫోన్‌పే వేల్యుయేషన్‌ను 12 బిలియన్ డాలర్లుగా లెక్కగట్టారు. ఫోన్‌పేలో వాల్‌మార్ట్‌కి చెందిన లక్సెంబర్గ్ సంస్థ ఫిట్ హోల్డింగ్స్ ఎస్‌ఏఆర్‌ఎల్‌కి 83.91 శాతం, జనరల్ అట్లాంటిక్ సింగపూర్‌కి 5.14 శాతం, ఫోన్‌పే సింగపూర్ విభాగానికి 6.7 శాతం వాటాలు ఉన్నాయి.

పీఎన్‌బీ రుణ రేట్లు కట్..

- రిటైల్ రుణాలన్నింటికీ వర్తింపు...
- ఆర్‌బీఐ రెపో రేటు తగ్గింపు ఎఫెక్ట్





న్యూఢిల్లీ: రిటైల్ రుణాలపై (గృహ, వాహన సహా) 25 బేసిస్ పాయింట్ల (0.25శాతం) మేర వడ్డీ రేటును తగ్గిస్తున్నట్లు పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) ప్రకటించింది. గృహ, కార్ల రుణాలు, విద్య, వ్యక్తిగత రుణాలకు ఈ తగ్గింపు అమలు కానుంది. ఐదేళ్ల విరామం తర్వాత ఆర్‌బీఐ ఈ నెల మొదట్లో రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించడం తెలిసిందే. ఈ తగ్గింపు ప్రయోజనాన్ని రుణగ్రహీతలకు బదిలీ చేస్తూ పీఎన్‌బీ కొత్త రేట్లను ప్రకటించింది. సవరణ తర్వాత గృహ రుణాలపై రేటు 8.15 శాతం నుంచి మొదలవుతుంది. అంటే ప్రతి లక్షకు చెల్లించాల్సిన ఈఎంఐ రూ.744గా ఉంటుందని పీఎన్‌బీ ప్రకటించింది. ఆటో రుణాలపై 8.50 శాతం నుంచి రేట్లు మొదలవుతాయి. ప్రతి లక్షకు రూ.1,240 ఈఎంఐ చెల్లించాల్సి ఉంటుంది. పర్యావరణ అనుకూల ఇంధన వాహనాలకు 0.05 శాతం మేర వడ్డీలో రాయితీ ఇవ్వనుంది. అలాగే ఎక్స్ షోరూమ్ ధరపై 100 శాతం రుణంగా లభిస్తుంది. 120 నెలల కాలానికి ఎంపిక చేసుకోవచ్చు. విద్యా రుణాలపై రేట్లు 7.85 శాతానికి తగ్గాయి. వ్యక్తిగత రుణాలపై రేట్లు 11.25 శాతం నుంచి మొదలవుతాయి. కొత్త రేట్లు ఫిబ్రవరి 10 నుంచే అమల్లోకి వస్తాయని పీఎన్‌బీ ప్రకటించింది.

టారిఫ్ భయాలు

సూచీలకు మూడో రోజూ నష్టాలే



ముంబై: అమెరికా తాజా సుంకాల విధింపు ఆందోళనలతో దలాల్ స్ట్రీట్‌లో మూడోరోజూ అమ్మకాలు కొనసాగాయి. సెన్సెక్స్ 203 పాయింట్లు పతనమై 75,736 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 20 పాయింట్లు నష్టపోయి 22,913 వద్ద నిలిచింది. అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, మారుతీ సుజుకీ, ఐసీఐసీఐ బ్యాంకు, ఐటీసీ షేర్లు 2–1% పతనంతో సూచీలు ఏ దశలోనూ కోలుకోలేకపోయాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 476 పాయింట్లు క్షీణించి 75,463 వద్ద, నిఫ్టీ 120 పాయింట్లు కోల్పోయి 22,813 వద్ద కనిష్టాన్ని నమోదు చేశాయి. ఇటీవల భారీ పతనమైన చిన్న, మధ్య తరహా షేర్లకు డిమాండ్ కొనసాగింది. బీఎస్‌ఈ స్మాల్ క్యాప్ సూచీ 1.32%, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.18 శాతం పెరిగాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 34 పైసలు బలపడి 86.64 వద్ద ముగిసింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

టెర్మినల్ నుంచి బంక్ దాకా ప్రతీ చుక్కకూ లెక్క!	ఈ-రీసైక్లింగ్ @ 20 కోట్ల డాలర్లు

షాపింగ్ ఓ రేంజ్‌లో..!

- చిన్న పట్టణాల్లోనూ లగ్జరీ ఉత్పత్తులకు సై..
- ఖరీదైన పాదరక్షలు, వాచీలు, వస్త్రాల కొనుగోళ్లు
- టాటా క్లిక్ లగ్జరీ అధ్యయనంలో వెల్లడి



న్యూఢిల్లీ: విలాసవంతమైన ఉత్పత్తుల పట్ల అభిరుచి చిన్న పట్టణాలకూ విస్తరిస్తోంది. ఖరీదైన పాదరక్షలు, వాచీలు, వస్త్రాలు, యాక్సెసరీల కోసం దేశవ్యాప్తంగా ఉన్న మారుమూల పట్టణ వాసులు సైతం ఆర్డర్ చేస్తున్నారు. దీంతో లగ్జరీ ఉత్పత్తుల కొనుగోళ్లు ప్రధానంగా ముంబై, ఢిల్లీ, బెంగళూరు తదితర మెట్రోలకే పరిమితం అన్న అభిప్రాయం క్రమంగా చెరిగిపోతోంది. గుజరాత్‌లో 2 లక్షల జనాభా కూడా లేని బోటాడ్ నుంచి వీటి కోసం ఆర్డర్లు వస్తుండడమే ఇందుకు నిదర్శనం. ఈ కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు ఇందుకు వారధిగా నిలుస్తున్నాయి. టాటా క్లిక్ లగ్జరీ సంస్థ నిర్వహించిన అధ్యయనంలో ఈ వివరాలు తెలిశాయి. ''లగ్జరీ అన్నది ఇక ఎంత మాత్రం అధిక ధనవంతులకు సంబంధించిన విభాగం కాబోదు. టైర్-2, 3 పట్టణ వాసులు, మెట్రో పరిధిలో కొత్త భౌగోళిక ప్రదేశాలు పరిశ్రమకు కొత్త పునరుజ్జీవాన్నిస్తున్నాయి''అని టాటా క్లిక్ లగ్జరీ నివేదికలో అనలిస్టులు పేర్కొన్నారు. సంపన్నులు కాని అధిక ఆదాయ వర్గాలతో (హెన్రీ) కూడిన వినియోగ వర్గం గురించి ఈ నివేదిక ప్రముఖంగా ప్రస్తావించింది. వీరు లగ్జరీ ఉత్పత్తుల అనుభవాన్ని కోరుకుంటున్నట్టు తెలిపింది.

నాన్ మెట్రోల్లోనే అధిక అమ్మకాలు..

టాటా క్లిక్‌లో లగ్జరీ ఉత్పత్తుల ప్రత్యేక విభాగమైన 'టాటా క్లిక్ లగ్జరీ'పై జరిగే విక్రయాల్లో 55 శాతం నాన్ మెట్రోలైన పంచకుల, మైసూరు తదితర పట్టణాల నుంచే ఉంటున్నాయి. ''ఇలా కొనుగోలు చేసే వారంతా ఉద్యోగాలు చేస్తూ, అధిక ఆదాయం సంపాదిస్తున్న వారు. విలాస అనుభం, ఉత్పత్తుల వినియోగాన్ని కోరుకుంటున్నారు. దీంతో సౌందర్య ఉత్పత్తులు, యాక్సెసరీలు, వస్త్రాలు, పాదరక్షల విక్రయాల్లో అధిక విక్రయాలకు మద్దతుగా నిలుస్తున్నారు. మెట్రో వినియోగదారుల మాదిరే వీరి కొనుగోళ్ల విలువ కూడా ఉంటోంది''అని టాటా క్లిక్ లగ్జరీ సీఈవో గోపాల్ ఆస్థానా తెలిపారు. సంపన్నులే కాకుండా చిన్న పట్టణాల్లోని వృత్తి నిపుణులు సైతం లగ్జరీ వస్తువులకు వినియోగదారులుగా మారుతున్నట్టు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. బల్గరీ తదితర అంతర్జాతీయ లగ్జరీ బ్రాండ్‌లు ఆన్ లైన్ ప్లాట్‌ఫామ్‌ల సహకారంతో భారత్‌లో కొత్త కస్టమర్లను చేరుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. అజియో లగ్జే సైతం అంతర్జాతీయ బ్రాండ్లకు చిన్న పట్టణాల్లో భౌతిక స్టోర్లు తెరవాల్సిన అవసరాన్ని తప్పిస్తోంది. సంప్రదాయ లగ్జరీ షాపర్లకు భిన్నంగా.. కొత్త కస్టమర్లు తగిన పరిశోధన తర్వాతే ఆర్డర్ చేస్తున్నారు. ఇందుకు సోషల్ మీడియా వేదికలు, వెబ్‌సైట్లు, కస్టమర్ల రివ్యూలను ఉపయోగించుకుంటున్నారు. కనీసం ఆరేడు బ్రాండ్ల ఉత్పత్తులను పరిశీలించిన తర్వాతే చివరికి ఒకటి ఎంపిక చేసుకుంటున్నారు.

✔ అధిక ఆదాయంతో మెరుగైన అనుభవానికి మొగ్గు	✔ సరైన పరిశోధన తర్వాతే ఉత్పత్తి ఎంపిక	✔ ఈ కామర్స్ రూట్‌లో అంతర్జాతీయ బ్రాండ్లు
✔ పలు బ్రాండ్లను పరిశీలించిన తర్వాత కొనుగోలు	✔ జెన్ జెడ్, జెన్ ఆల్ఫా భవిష్యత్ లగ్జరీ కస్టమర్లు	✔ నాన్ మెట్రోల నుంచే 55 శాతం అమ్మకాలు

సీఈఏ పదవీ కాలం పొడిగింపు



న్యూఢిల్లీ: ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు (సీఈఏ) వి అనంత నాగేశ్వరన్ పదవీకాలాన్ని కేంద్రం మరో రెండేళ్ల పొడిగించింది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపింది. దీంతో నాగేశ్వరన్ మార్చి 31, 2027 వరకు పదవిలో కొనసాగనున్నారు. కేవీ సుబ్రమణియన్ స్థానంలో 2022, జనవరి 28న సీఈఏగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. వివిధ ఆర్థిక విధానాలపై ప్రభుత్వానికి సలహాలు ఇవ్వడంతో పాటు కేంద్ర బడ్జెట్‌కు ముందు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ఆర్థిక సర్వేను రూపొందించడం సీఈఏ కార్యాలయం ప్రధాన బాధ్యత. నాగేశ్వర్ సీఈఏగా బాధ్యతలు స్వీకరించడానికి ముందు 2019 నుంచి 2021 వరకు ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలిలో పార్ట్‌టైం సభ్యుడిగా పనిచేశారు. భారత్, సింగపూర్‌లో అనేక బిజినెస్ స్కూల్స్‌లో బోధించారు. నాగేశ్వరన్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, అహ్మదాబాద్ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ డిగ్రీని పొందారు. 1994లో మసాచుసెట్స్ విశ్వవిద్యాలయం నుంచి ఫైనాన్స్‌లో డాక్టరేట్ పట్టా అందుకున్నారు.

సాక్షి స్పోర్ట్స్

200 వన్డేల్లో షమీ 200 వికెట్ల మైలురాయిని అందుకున్నాడు. బంతుల పరంగా చూస్తే అందరికంటే వేగంగా (5126 బంతుల్లో) ఈ ఘనత సాధించిన బౌలర్‌గా అతను రికార్డు సాధించాడు. ఇందు కోసం మిచెల్ స్టార్క్‌కు (ఆస్ట్రేలియా) 5240 బంతులు పట్టాయి. తక్కువ ఇన్నింగ్స్‌లో ఈ ఘనత సాధించిన భారత బౌలర్‌గానూ షమీ గుర్తింపు పొందాడు. గతంలో అజిత్ అగార్కర్ 133 ఇన్నింగ్స్‌లో ఈ మైలురాయి అందుకోగా... షమీ 103 ఇన్నింగ్స్‌లు తీసుకున్నాడు.

60 ఐసీసీ టోర్నీల్లో అత్యధిక (60) వికెట్లు తీసిన భారత బౌలర్‌గా షమీ నిలిచాడు. జహీర్ ఖాన్ (32 ఇన్నింగ్స్‌లలో 59) రికార్డును షమీ (19 ఇన్నింగ్స్‌లలో 60) సవరించాడు.

11,000 వన్డేల్లో రోహిత్ 11 వేల పరుగులు పూర్తి చేసుకొని ఈ ఘనత సాధించిన 10వ ఆటగాడిగా నిలిచాడు.

156 వన్డేల్లో కోహ్లి క్యాచ్‌ల సంఖ్య. భారత్ తరఫున అత్యధిక క్యాచ్‌లు పట్టిన ఫీల్డర్‌గా అజహరుద్దీన్ (156) రికార్డును సమం చేయగా... జయవర్ధనే (218), పాంటింగ్ (160) వీరికంటే ముందున్నారు.

చాంపియన్స్ ట్రోఫీలో నేడు

దక్షిణాఫ్రికా x అఫ్గానిస్తాన్

వేదిక: కరాచీ

మధ్యాహ్నం గం. 2:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ 18, జియోహాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం



గిల్ సెంచరీ అభివాదం

షమీ... శుబ్... ఆరంభం

229 పరుగుల స్వల్ప విజయలక్ష్యం...భారత్‌లాంటి బలమైన జట్టు ఆడుతూపాడుతూ దీనిని ఛేదిస్తుందని ఎవరైనా భావిస్తారు... కానీ పిచ్ ఒక్కసారిగా నెమ్మదించింది... పరుగులు రావడం కష్టంగా మారిపోయింది. ఈ స్థితిలో శుబ్‌మన్ గిల్ పట్టుదలగా నిలబడ్డాడు... కీలక భాగస్వామ్యాలతో జట్టును గెలుపుతీరం చేర్చడంతో పాటు వరుసగా రెండో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అంతకుముందు భారత్ పదునైన బౌలింగ్‌కు ఒకదశలో 35/5 వద్ద కుప్పకూలే స్థితిలో నిలిచిన బంగ్లాదేశ్... తౌహీద్, జాకీర్ ఆటతో 200 పరుగులు దాటగలిగింది. మరో ఐసీసీ మ్యాచ్‌లో ఐదు వికెట్ల ప్రదర్శనతో షమీ తన పునరాగమాన్ని ఘనంగా ప్రదర్శించాడు. శుభారంభం తర్వాత ఆదివారం అసలు పోరులో పాకిస్తాన్‌తో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది.

చాంపియన్స్ ట్రోఫీ తొలి పోరులో భారత్ ఘన విజయం

- ఆరు వికెట్లతో బంగ్లాదేశ్ చిత్తు ● గిల్ అజేయ సెంచరీ
- 5 వికెట్లతో మెరిసిన షమీ ● ఆదివారం పాకిస్తాన్‌తో పోరు



తౌహిద్ హృదయ్



షమీ

దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీలో భారత్ గెలుపు బోణీ చేసింది. గ్రూప్ 'ఎ'లో భాగంగా గురువారం జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 6 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 49.4 ఓవర్లలో 228 పరుగులకు ఆలౌటైంది. తౌహీద్ హృదయ్ (118 బంతుల్లో 100; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) కెరీర్‌లో తొలి సెంచరీ సాధించగా... జాకీర్ అలీ (114 బంతుల్లో 68; 4 ఫోర్లు) రాణించాడు. వీరిద్దరు ఆరో వికెట్‌కు 34.2 ఓవర్లలో 154 పరుగులు జోడించారు. మొహమ్మద్ షమీ (5/53) ఐదు వికెట్లతో చెలరేగగా... హర్షిత్ రాణా 3, అక్షర్ 2 వికెట్లు తీశారు. అనంతరం భారత్ 46.3 ఓవర్లలో 4 వికెట్లకు 231 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' శుబ్‌మన్ గిల్ (129 బంతుల్లో 101 నాటౌట్; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ శతకం నమోదు చేయగా... కెప్టెన్ రోహిత్ శర్మ (36 బంతుల్లో 41; 7 ఫోర్లు), కేఎల్ రాహుల్ (47 బంతుల్లో 41 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) రాణించారు.

భారీ భాగస్వామ్యం...

తొలి 5 వికెట్లకు 35 పరుగులు... చివరి 5 వికెట్లకు 39 పరుగులు... మధ్యలో తౌహీద్, జాకీర్ భారీ భాగస్వామ్యం! బంగ్లాదేశ్ ఇన్నింగ్స్ సాగిన తీరిది. షమీ, రాణా దెబ్బకు టపటపా 3 వికెట్లు కోల్పోయిన బంగ్లాను అక్షర్ తన తొలి ఓవర్లోనే దెబ్బ కొట్టాడు. వరుస బంతుల్లో తన్‌జీద్ (25 బంతుల్లో 25; 4 ఫోర్లు), ముష్ఫికర్ (0)ను అవుట్ చేసిన అతను త్రుటిలో హ్యాట్రిక్ కోల్పోయాడు. 35/5 నుంచి తౌహీద్, జాకీర్ జట్టును ఆదుకున్నారు. భారత ఆటగాళ్ల పేలవ ఫీల్డింగ్ కూడా వారికి కలిసొచ్చింది. సుదీర్ఘ ప్రయత్నం తర్వాత ఎట్టకేలకు 206 బంతుల ఈ భాగస్వామ్యాన్ని షమీ విడగొట్టాడు. ఆ తర్వాత 49వ ఓవర్ తొలి బంతికి సింగిల్‌తో తౌహీద్ 114 బంతుల్లో కెరీర్‌లో తొలి సెంచరీని పూర్తి చేసుకున్నాడు.

రాణించిన రాహుల్...

స్వల్ప లక్ష్యమే అయినా భారత్ ఛేదన సులువుగా సాగలేదు. ముస్తఫిజుర్ ఓవర్లో 3 ఫోర్లు సహా కొన్ని చక్కటి షాట్లు ఆడిన రోహిత్ పదో ఓవర్లో వెనుదిరగ్గా, గిల్ తన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. ఆ తర్వాత పిచ్ ఒక్కసారిగా మందగించడంతో పరుగుల రాక గగనమైంది. గిల్, విరాట్ కోహ్లి (38 బంతుల్లో 22; 1 ఫోర్) కలిసి 12.5 ఓవర్లలో 43 పరుగులే జోడించగలిగారు. అనంతరం 11 పరుగుల వ్యవధిలో శ్రేయస్ అయ్యర్ (15), అక్షర్ పటేల్ (8) అవుటయ్యారు. అయితే గిల్‌కు రాహుల్ అండగా నిలిచాడు. బంగ్లా బౌలర్లు మధ్యలో కొద్ది సేపు ఆధిపత్యం ప్రదర్శించినట్లు కనిపించినా... నిలదొక్కుకున్న తర్వాత వీరిద్దరు స్వేచ్ఛగా ఆడారు. గిల్, రాహుల్ 16.2 ఓవర్లలో అభేద్యంగా 87 పరుగులు జోడించి మ్యాచ్‌ను ముగించారు. ఈ క్రమంలో 46వ ఓవర్లో సింగిల్‌తో 125 బంతుల్లో గిల్ వన్డేల్లో ఎనిమిదో సెంచరీని పూర్తి చేసుకున్నాడు.

స్కోరు వివరాలు

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: తన్‌జీద్ (సి) రాహుల్ (బి) అక్షర్ 25; సౌమ్య సర్కార్ (సి) రాహుల్ (బి) షమీ 0; నజ్ముల్ (సి) కోహ్లి (బి) రాణా 0; మిరాజ్ (సి) గిల్ (బి) షమీ 5; తౌహీద్ (సి) షమీ (బి) రాణా 100; ముష్ఫికర్ (సి) రాహుల్ (బి) అక్షర్ 0; జాకీర్ (సి) కోహ్లి (బి) షమీ 68; రిషాద్ (సి) పాండ్యా (బి) రాణా 18; తన్‌జీమ్ (బి) షమీ 0; తస్కిన్ (సి) అయ్యర్ (బి) షమీ 3; ముస్తఫిజుర్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (49.4 ఓవర్లలో ఆలౌట్) 228.** **వికెట్ల పతనం:** 1–1, 2–2, 3–26, 4–35, 5–35, 6–189, 7–214, 8–215, 9–228, 10–228. **బౌలింగ్:** షమీ 10–0–53–5, హర్షిత్ రాణా 7.4–0–31–3, అక్షర్ 9–1–43–2, పాండ్యా 4–0–20–0, జడేజా 9–0–37–0, కుల్దీప్ 10–0–43–0.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) రిషాద్ (బి) తస్కిన్ 41; గిల్ (నాటౌట్) 101; కోహ్లి (సి) సర్కార్ (బి) రిషాద్ 22; అయ్యర్ (సి) నజ్ముల్ (బి) ముస్తఫిజుర్ 15; అక్షర్ (సి అండ్ బి) రిషాద్ 8; రాహుల్ (నాటౌట్) 41; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (46.3 ఓవర్లలో 4 వికెట్లకు) 231.** **వికెట్ల పతనం:** 1–69, 2–112, 3–133, 4–144. **బౌలింగ్:** తస్కిన్ 9–0–36–1, ముస్తఫిజుర్ 9–0–62–1, తన్‌జీమ్ 8.3–0–58–0, మిరాజ్ 10–0–37–0, రిషాద్ 10–0–38–2.

అక్షర్ 'హ్యాట్రిక్' మిస్



మ్యాచ్‌లో బంగ్లాను తక్కువ స్కోరుకే పరిమితం చేయగలిగినా భారత్ ఫీల్డింగ్ స్థాయికి తగినట్లుగా లేకపోయింది. అక్షర్ తొలి ఓవర్లో వరుసగా రెండు వికెట్ల తర్వాత జాకీర్ (0 వద్ద) ఇచ్చిన అతి సునాయాస క్యాచ్‌ను స్లిప్‌లో రోహిత్ వదిలేశాడు. దాంతో అక్షర్ 'హ్యాట్రిక్' అవకాశం చేజారింది. రోహిత్ ఆ క్యాచ్ పట్టి ఉంటే స్కోరు 35/6తో ఇక కోలుకునే అవకాశం లేకపోయేది. ఆ తర్వాత జాకీర్ 24 వద్ద ఉన్నప్పుడు జడేజా బౌలింగ్‌లో స్టంప్ చేసే అవకాశాన్ని రాహుల్ చేజార్చాడు. చివరకు బ్యాటర్ 68 పరుగులు సాధించగలిగాడు. తౌహీద్ స్కోరు 23 వద్ద కుల్దీప్ బౌలింగ్‌లో మిడాఫ్‌లో పాండ్యా సునాయాస క్యాచ్ వదిలేయగా చివరకు అతను సెంచరీ పూర్తి చేసుకోగలిగాడు. ఇన్నింగ్స్ ఆరంభంలో 12 వద్ద తన్‌జీద్‌ను రనౌట్ చేసే అవకాశం వచ్చినా...అయ్యర్ త్రో స్టంప్స్‌కు చాలా దూరంగా వెళ్లింది. భారత్ ఇన్నింగ్స్‌లో రాహుల్ 9 వద్ద ఉన్నప్పుడు జాకీర్ సులువైన క్యాచ్ వదిలేసి మేలు చేశాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాత్విక్ సాయిరాజ్‌కు పితృవియోగం

గుండెపోటుతో తండ్రి కాశీ విశ్వనాథం మృతి



సాక్షి, అమలాపురం: ఇది విధి రాసిన విషాదవార్త! తనయుడి అవార్డుని చూసి మురిసిపోదామనుకుంటే... తండ్రి భౌతికకాయాన్ని చూసి కన్నీరు మున్నీరయ్యే పరిస్థితి! 'ఖేల్‌రత్న'తో విజయోత్సవ వేడుకలు చేసుకోవాల్సిన ఇంట విషాదం అలుముకున్న దుస్థితి! ఆంధ్రప్రదేశ్ స్టార్ షట్లర్ సాత్విక్ సాయిరాజ్ తండ్రి రంకిరెడ్డి కాశీ విశ్వనాథం గురువారం ఉదయం గుండెపోటుతో హఠాత్తుగా కన్నుమూశారు. ఆయనకు భార్య రంగమణి, ఇద్దరు కుమారులు రాంచరణ్, సాత్విక్ ఉన్నారు. 65 ఏళ్ల కాశీ విశ్వనాథం గురువారం సాయంత్రం దేశ రాజధానిలో తనయుడు సాత్విక్‌కు 'ఖేల్‌రత్న' పురస్కార ప్రదానోత్సవంలో పాల్గొనాల్సి ఉంది. ఇందుకోసం సొంతూరు అమలాపురం నుంచి కారులో రాజమండ్రి విమానాశ్రయానికి బయలుదేరిన ఆయన పట్టణం దాటిన కొద్దిసేపటికే గుండెపోటుకు గురై మృతి చెందారు. ఊహించని విషాద వార్త అక్కడి కుటుంబసభ్యుల్ని, ఢిల్లీలో ఉన్న సాత్విక్ సాయిరాజ్‌ను కన్నీటి సంద్రంలో ముంచేసింది. అమెరికాలో ఉన్న సాత్విక్ సోదరుడు రాంచరణ్ స్వస్థలం చేరుకున్నాక శనివారం అంత్యక్రియలు నిర్వహిస్తారు.

బ్యాడ్మింటన్ క్రీడపై ఆసక్తి కనబరిచిన సాత్విక్‌కు తొలి కోచ్‌గా ఓనమాలు నేర్పిన తండ్రి తదనంతరం అతని ప్రతిభను గుర్తించి అంతర్జాతీయ షట్లర్‌గా తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషించారు. డబుల్స్‌లో అసాధారణ ప్లేయర్‌గా ఎదిగిన సాత్విక్ ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య అంతర్జాతీయ టోర్నీల్లో, ఒలింపిక్స్, కామన్వెల్త్, ఆసియా క్రీడల్లో పాల్గొన్నాడు. అనతికాలంలోనే ఎన్నో పతకాలు, ట్రోఫీలు నెగ్గిన సాత్విక్ ప్రతిభను గుర్తించిన భారత ప్రభుత్వం సాత్విక్‌తోపాటు అతని డబుల్స్ భాగస్వామి చిరాగ్ శెట్టిని 2023 సంవత్సరానికిగాను 'ఖేల్‌రత్న' పురస్కారానికి ఎంపిక చేసింది. 2024 జనవరిలో ఢిల్లీలో జాతీయ క్రీడా అవార్డుల ప్రదానోత్సవం జరగ్గా... సాత్విక్–చిరాగ్ మలేసియా ఓపెన్ టోర్నీ లో ఆడుతుండటంతో హాజరు కాలేకపోయారు. ప్రస్తుతం పెట్రోలియం స్పోర్ట్స్ ఇంటర్ యూనిట్ టోర్నీ ఆడేందుకు సాత్విక్, చిరాగ్ ఢిల్లీలో ఉన్నారు. దాంతో కేంద్ర క్రీడా శాఖ 'ఖేల్‌రత్న' అందజేయాలని భావించి కార్యక్రమం ఏర్పాటు చేసింది.



కాల్ మెర్జింగ్‌తో కాజేస్తారు!

ఇదో సరికొత్త సైబర్ మోసం • ఫోన్ కాల్ మెర్జింగ్‌తో ఖాతాలు ఖాళీ
అప్రమత్తంగా ఉండాలని యూపీఐ సూచన

సాక్షి, హైదరాబాద్: దేశంలో సైబర్ నేరగాళ్లు రోజుకో రూపంలో అమాయకులను మోసం చేసి డబ్బు కొల్లగొడుతున్నారు. తాజాగా కాల్ మెర్జింగ్ స్కాంకు తెరలేపారు. మనకు తెలియకుండానే మన నుంచి ఓటీపీలు తీసుకుని మన బ్యాంకు ఖాతాలను కాజేస్తున్నారు. ఈ తరహా మోసాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)కు చెందిన ది యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) హెచ్చరించింది. అపరిచితులు ఫోన్ చేసి అడిగితే ఎట్టి పరిస్థితుల్లో ఓటీపీలను చెప్పవద్దని సూచించింది.

కాల్ మెర్జింగ్ స్కాం అంటే?

ఒక అపరిచితుడు మీ ఫోన్ నంబర్‌ను మీ స్నేహితుడి నుంచి తీసుకున్నానని చెబుతూ కాల్ చేయడంతో ఈ స్కాం ప్రారంభమవుతుంది. మీతో ఫోన్ మాట్లాడుతూనే.. మీ స్నేహితుడు వేరే నంబర్ నుంచి కాల్ చేస్తున్నాడని చెప్పి, రెండు కాల్స్‌ను విలీనం (మెర్జ్) చేయమని స్కామర్ అడుగుతాడు. ఆ 'స్నేహితుడి'కాల్ నిజంగా మీ మిత్రుడిది కాదు. అది బ్యాంకు ఓటీపీ కాల్. స్కామర్ అడగ్గానే మీరు కాల్ విలీనానికి అనుమతిస్తే సదరు వ్యక్తి వెంటనే బ్యాంకు ధ్రువీకరణకు సంబంధించిన ఓటీపీ కాల్‌తో కనెక్ట్ అవుతాడు. ఇలా బ్యాంకు కాల్ నుంచి వచ్చే ఓటీపీని అవతలి నుంచి వింటున్న సైబర్ మోసగాళ్లు సేకరిస్తారు. అప్పటికే బ్యాంకు వివరాలు తీసుకుని పెట్టుకునే సైబర్ మోసగాళ్లు..ఆ ఓటీపీని ఉపయోగించి మీ బ్యాంకు ఖాతాల్లోంచి డబ్బులు కొల్లగొడతారు. ఇదంతా కచ్చితమైన సమయంలోపు పూర్తిచేస్తారు. మీరు బ్యాంకు ఓటీపీ వారికి చెప్పినట్లు కూడా గుర్తించలేరు.

కాల్ మెర్జింగ్ స్కాంకు చిక్కకుండా ఉండాలంటే?

- అపరిచిత వ్యక్తులు మీకు ఫోన్ చేసి, మరో నంబర్ నుంచి వస్తున్న కాల్‌ను మెర్జ్ చేయాలని కోరితే అది కచ్చితంగా మోసమని గ్రహించాలి.
- మీకు అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి మేం బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని, లేదా మీ స్నేహితుడికి స్నేహితుడిని అని చెప్తే నమ్మవద్దు.
- అనుమానాస్పద ఫోన్‌కాల్స్‌పై వెంటనే సైబర్ సెక్యూరిటీ బ్యూరో టోల్‌ఫ్రీ నంబర్ 1930లో ఫిర్యాదు చేయాలి.
- మీరు ఓటీపీ పంచుకున్నట్టు అనుమానం వస్తే వెంటనే మీ బ్యాంకు అధికారులకు సమాచారం ఇచ్చి డబ్బులు పోకుండా తగిన చర్యలు తీసుకోవాలి.



15 అడుగుల పత్తి మొక్క

పత్తి మొక్క 15 అడుగుల ఎత్తు పెరిగి ఔరా అనిపిస్తోంది. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం నీలంపల్లి నుంచి పొగుళ్లపల్లికి వెళ్లే దారిలో మొలిచిన పత్తి మొక్క భారీగా పెరిగింది. ఎలాంటి మందులు, ఎరువులు వేయక పోయినా 15 అడుగుల ఎత్తు ఎదిగి పూత, కాయలతో కనువిందు చేస్తోంది.

\- కొత్తగూడ



వెంకటాపురం తండా పాఠశాలలో...



కేశోత్ తండా పాఠశాలలో...

పాఠాలు చెబుదామన్నా.. పిల్లలు లేరు..

మూడు స్కూళ్లలో పిల్లలు నిల్..
రోజూ విధులకు హాజరై ఖాళీగా కూర్చొని వెళ్తున్న టీచర్లు

గార్ల: మహబూబాబాద్ జిల్లా గార్ల మండలంలోని మూడు ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు రాక పోవడంతో ఉపాధ్యాయులు విధులకు హాజరై ఖాళీగా కూర్చొని వెళ్లిపోతున్నారు. వెంకటాపురం తండా, సర్వన్ తండా, కేశోత్ తండాలోని ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాలలను గురువారం 'సాక్షి' సందర్శించింది. మూడింటి లోనూ ఒక్క విద్యార్థి కూడా పాఠశాలకు రాలేదు. తండాల్లోని ఇంటింటికీ తిరిగి తమ పిల్లలను పంపాలని కోరుతున్నా.. తల్లిదండ్రులు మాత్రం గార్లలోని ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తున్నారని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
శుక్రవారం ı 21-2-2025


అప్పటి ముఖ్యమంత్రి వైఎస్‌తో చిందుల శ్యామ్


కళారత్న అవార్డుతో శ్యామ్


అప్పటి ముఖ్యమంత్రి అంజయ్యతో చిందుల శ్యామ్

కనువిందు.. ఇందూరు చిందు

చిందుల ఎల్లమ్మ 'చిందు కళ' వారసత్వాన్ని బతికిస్తున్న చిందుల శ్యాం కుటుంబం

కళను బతికించేందుకు రాష్ట్రవ్యాప్తంగా కృషి చేస్తున్న పరిమిత కుటుంబాలు

ప్రత్యేక ఆభరణాలు వాడుతున్న కళాకారులు

1981 నుంచి ప్రభుత్వం ద్వారా ప్రదర్శనలిస్తున్న చిందు బాగోతం బృందాలు


పాత్రధారణలో శ్యామ్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: జానపద కళారూపాల్లో చిందు బాగోతానికి ప్రత్యేక స్థానముంది. చిందు బాగోతాన్ని బతికించేందుకు ఇందూరు జిల్లా కళాకారులు ఎనలేని కృషి చేస్తున్నారు. 'చిందు కళాసింధు'గా పేరొందిన బోధన్ ప్రాంతానికి చెందిన చిందుల ఎల్లమ్మ వారసత్వాన్ని.. జక్రాన్‌పల్లి మండలం మునిపల్లి గ్రామానికి చెందిన పులింటి శ్యామ్ (చిందుల శ్యామ్) కుటుంబం కొనసాగిస్తోంది. చిందుల శ్యామ్‌కు పద్మశ్రీ అవార్డు కోసం 2018లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. శ్యామ్ దేశంలోని అన్ని రాష్ట్రాల్లో వేలాది ప్రదర్శనలు ఇచ్చారు. 2021లో శ్యామ్ మరణించగా.. ఆయన కుటుంబం ఈ కళను బతికించేందుకు కృషి చేస్తోంది. శ్యామ్ కుమారులు పులింటి కృష్ణయ్య, గంగాధర్, కృష్ణయ్యతో పాటు డిగ్రీ చదువుతున్న కుమార్తె పులింటి శరణ్య సైతం చిందు బాగోతం ప్రదర్శనలిస్తోంది. అయిదో ఏట నుంచే శరణ్య చిందు కళను ప్రదర్శిస్తోంది. ఈ కళను బతికించడమే తన లక్ష్యమని శరణ్య చెబుతోంది. ప్రస్తుతం నిజామాబాద్ జిల్లాలో 40 బృందాలు, నిర్మల్, కరీంనగర్, నల్లగొండ, వరంగల్, ఖమ్మం, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాల్లో మరో 70 బృందాలు మాత్రమే ఉన్నాయి. ఒక్కొక్క బృందంలో 10 నుంచి 20 మంది కళాకారులు ఉన్నారు.


కుటుంబసభ్యులతో శ్యామ్

- 1981లో పేరిణి శివతాండవం కళాకారుడు నటరాజ రామకృష్ణ ఆధ్వర్యంలో చిందు బాగోతంపై నిజామాబాద్ జిల్లాలో సర్వే చేశారు. అప్పటి నుంచి గుర్తింపు వచ్చింది. 1983లో చిందు బాగోతం మేళాను నిర్వహించగా ఇందూరు జిల్లా కళాకారులు నాయకత్వం వహించారు. 1986లో ఢిల్లీలో అప్నా ఉత్సవ్‌లో ఆర్మూర్ ప్రాంత చిందు కళాకారుల ప్రదర్శనను అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ, రష్యా నేత మిఖాయిల్ గోర్బచేవ్‌లు తిలకించి అభినందించారు.
- చిందు బాగోతానికి నేపథ్యగానం ఉండదు. పురాణాలను ఆకళింపు చేసుకుని.. సన్నివేశాలకు అనుగుణంగా భావోద్వేగాలను ప్రదర్శిస్తుంటారు. ఈ కళాకారులు తమ ఆభరణాలను 'పాణికి' (పునికి) కర్రతో తయారు చేసుకుంటారు. వీటి తయారీకి ఆరునెలల సమయం పడుతుంది. చిందు బాగోతానికి సంబంధించి నిజామాబాద్, నిర్మల్ కళాకారులు తమకే ప్రత్యేకమైన సూర్యకిరీటం వినియోగిస్తున్నారు. వీటితో పాటు భుజకీర్తులు(శంఖు చక్రాలు), కంఠసరి, పెద్దపేరు, చిన్నపేరు. జడల చిలుకలు, మల్లెదండలు, చేదస్తాలు, దుస్తులు ఉపయోగిస్తున్నారు. రామాయణం, మహాభారతం, భాగవతం కథలతో కళా ప్రదర్శనలు ఇస్తున్నారు. ప్రస్తుతం సాంస్కృతిక, దేవాదాయ శాఖలు సూచించిన చోట్ల ప్రదర్శనలు ఇస్తున్నారు. ఇక చిందు బాగోతానికి చిరునామాగా ఉన్న చిందుల ఎల్లమ్మకు.. ఉమ్మడి ఏపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక 'హంస' అవార్డుతో సత్కరించింది. చిందు బాగోతంలో స్త్రీ పాత్రలను సైతం పురుషులే ధరిస్తారు. అయితే చిందుల ఎల్లమ్మ మాత్రం.. స్త్రీ పాత్రలతో పాటు అన్నిరకాల పురుష పాత్రలు ధరించి ఈ కళకు చిరునామాగా నిలవడం విశేషం.

రాత్రిపూట రారాజులం.. తెల్లారితే బిచ్చగాళ్లం..



ప్రాచీన కళను బతికిస్తున్న మమ్మల్ని ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలి. ప్రదర్శనలకు వెళ్తే.. రాత్రి పూట రారాజులం.. తెల్లవారితే బిచ్చగాళ్లం అనేలా మా పరిస్థితి తయారైంది. గురుశిష్య పరంపరలో నేర్చుకుని కళను బతికించేవారు వేళ్లమీద లెక్కపెట్టే సంఖ్యలోనే ఉన్నారు. వారసులే చిందు కళను బతికిస్తూ వస్తున్నారు. కళను బతికించేందుకు ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.
– పులింటి కృష్ణయ్య, మునిపల్లి, జక్రాన్‌పల్లి మండలం, నిజామాబాద్ జిల్లా

కండరాల వ్యాధితో బాధపడుతున్న రాకేశ్‌కి వైద్య సాయమందించండి

సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: కండరాల వ్యాధితో బాధపడుతూ వైద్యం చేయించుకోలేకపోతున్న నిరుపేద యువకుడు రాకేశ్‌కు కావాల్సిన వైద్య సాయం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉచితంగా వైద్యం అందించడంతో పాటు రాకేశ్ కోసం ఎలక్ట్రికల్ చార్జింగ్ వాహనాన్ని కూడా అందించాలని సూచించారు. సీఎం ఆదేశాల మేరకు సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు.. రాకేశ్ కుటుంబీకులతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి అన్ని రకాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రంగయ్యపల్లి గ్రామానికి చెందిన గూళ్ల రాకేశ్ చాలా కాలంగా సూడో మస్క్యులర్ డిస్ట్రోఫీ అనే కండరాల వ్యాధితో బాధపడుతున్నాడు. ఇటీవల వ్యాధి తీవ్రత పెరగడంతో నడవలేని పరిస్థితికి వచ్చాడు. అయితే రాకేశ్‌కు ఆరోగ్యం మెరుగు కావాలంటే ఖరీదైన ఇంజెక్షన్లను క్రమం తప్పకుండా ఇవ్వాలని వైద్యులు సూచించారు. పేదరికంలో ఉన్న రాకేశ్ కుటుంబం ఖరీదైన వైద్యం చేయించలేకపోతోందని, పత్రికల్లో వచ్చిన కథనంపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. ములకనూరులోని ఓ ప్రైవేటు కాలేజీలో రాకేశ్ ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. తమ బిడ్డను ఆదుకున్న సీఎంకు రాకేశ్ తల్లిదండ్రులు గూళ్ల సమ్మయ్య, లక్ష్మి ధన్యవాదాలు తెలిపారు.

మాతృభాషను కాపాడుకుందాం

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: 'భారతదేశ భాషా వైవిధ్యతే.. మన గొప్ప నాగరికతకు పునాది. మన ఆటలు, మాటలు, పాటలు, సంగీతం, కళలు, పండుగలు, పబ్బాలు, వ్యాపార సంబంధాలు భాష లేకుండా పెంపొందలేవు'.. అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. వీటన్నింటినీ కాపాడుకుని.. భవిష్యత్ తరాలకు అనుగుణంగా పరిస్థితులు కల్పించాలంటే.. మాతృభాషను మనం కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. 'మన దైనందిన జీవితంలో మాతృభాష వినియోగం పెరగాలి.. మాతృభాష అయిన తెలుగు ప్రాశస్త్యం గురించి ఎంత చెప్పినా తక్కువే.. మన భాష చాలా గొప్పది.. ఇందులో ఎలాంటి సందేహం లేదు'.. అని కిషన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఆయన అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. 'ఎన్నో యాసలు, మరెన్నో మాండలికాలు. ఒక్కో దాంట్లో.. ఒక్కో అందమైన భావన.. ఇవేవీ ఇతర భాషల్లో అంతగా కనిపించవు.. 'అవధానం' వంటి అద్భుతమైన ప్రక్రియ ఒక్క తెలుగు భాషకే సాధ్యం.. ఇదంతా తెలుగు భాష గొప్పదనమే.. ఇదీ మన తెలుగుభాష గొప్పదనం. అందుకే మన అమృతపు భాషను కాపాడుకోవడానికి మనమంతా పునరంకితం అవుదాం'.. అని ఆయన కోరారు. 'తల్లి గర్భంలో ఉన్నప్పటినుంచే మనకు అలవడే భాష మాతృభాష. ఇదే మన అస్తిత్వం. ఇదే మన సంస్కృతి, సంప్రదాయాలకు మూలం. భాష, సంస్కృతులకు అవినాభావ సంబంధముంది. భాష మన సంస్కృతికి జీవనాడి. ఉన్నతమైన సంస్కృతి, ఉన్నతమైన సమాజానికి బాటలు వేస్తుంది'.. అని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

మహిళా సీఎం సారథ్యంలో ఢిల్లీలో మరింత అభివృద్ధి: డీకే అరుణ



సాక్షి, హైదరాబాద్: మహిళా సీఎం రేఖాగుప్తా సారథ్యంలో ఢిల్లీలో మరింత అభివృద్ధి జరగబోతోందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ పేర్కొన్నారు. ప్రధాని మోదీ మరోసారి నారీశక్తిని గుర్తించారని, సీఎం పదవికి రేఖాగుప్తాను ఎంపిక చేయడం సంతోషకరమన్నారు. గురువారం అరుణ మీడియాతో మాట్లాడుతూ ఆప్ పదేళ్ల పాలనలో అక్కడి ప్రజలు అష్టకష్టాలు పడ్డారని, ఆ సమస్యలు, బాధలన్నీ తీర్చే దిశగా బీజేపీ పాలన సాగుతుందనే ధీమా వ్యక్తంచేశారు. 'ఎన్నికల్లో ఇచ్చిన ప్రతిహామీని తు.చ. తప్పకుండా అమలు చేస్తాం. మాట తప్పం. మడమ తిప్పం. ఢిల్లీ ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం' అని అరుణ తెలిపారు. మోదీ గ్యారంటీకి తిరుగులేదని, అక్కడ అభివృద్ధి ఆగేది లేదని స్పష్టంచేశారు. ఢిల్లీ నూతన సీఎంగా బాధ్యతలు చేపట్టిన రేఖాగుప్తాకు అరుణ అభినందనలు తెలిపారు. ఢిల్లీ సీఎంగా మహిళా నేతకు అవకాశం కల్పించిన ప్రధాని మోదీ, పార్టీ అధ్యక్షుడు నడ్డాకు కృతజ్ఞతలు తెలియజేశారు.


బార్ కౌన్సిల్ చైర్మన్ నరసింహారెడ్డికి రాజీనామా పత్రాలను అందజేస్తున్న గండ్ర మోహన్‌రావు, న్యాయవాది బి.శంకర్

బార్ కౌన్సిల్‌కు ఇద్దరు సభ్యుల రాజీనామా

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు, న్యాయవాది బి.శంకర్ రాజీనామా చేశారు. గురువారం తమ రాజీనామా పత్రాలను బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డికి అందజేశారు. ఇప్పటికే ఐదేళ్ల కాల పరిమితితోపాటు ఏడాది కాలం గడిచిపోయిందని, వెంటనే ఎన్నికలు జరిపించాలని వారు కోరారు. హైకోర్టు ఆదేశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉందన్నారు. తెలంగాణ బార్ కౌన్సిల్‌కు ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పాలని గత నెల న్యాయస్థానం ఆదేశించినా.. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) ఎలాంటి నిర్ణయం తీసుకోని విషయం తెలిసిందే. దీనిపై రెండు రోజుల క్రితం విచారణ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి అసహనం కూడా వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వీలైనంత త్వరగా ఎన్నికలు జరపాలని కోరుతూ ఇద్దరు సభ్యులు రాజీనామా చేయడం గమనార్హం. తెలంగాణ బార్ కౌన్సిల్‌లో మొత్తం సభ్యుల సంఖ్య 25. వీరిలో 24 మంది సభ్యులుగా ఎన్నికవుతారు. అడ్వొకేట్ జనరల్ ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఉంటారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని 24న నిరసనలు

టీడబ్ల్యూజేఎఫ్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద జర్నలిస్టులు నిరసనలు చేపట్టనున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) తెలిపింది. జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు అందించాలని గురువారం టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్ణయించింది. జర్నలిస్టులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చింది. జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు, అక్రెడిటేషన్ కార్డులు, హెల్త్‌కార్డులు, పెన్షన్ స్కీం, దాడుల నివారణకు ప్రత్యేక కమిటీల ఏర్పాటు, చిన్న, మధ్య తరహా పత్రికలకు ప్రభుత్వ గుర్తింపు, జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం వంటి డిమాండ్ల పరిష్కారానికి రాష్ట్రప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని సమావేశం తీర్మానించింది. ఈనెల 25 నుంచి మార్చి 25 వరకు ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాలని సమావేశం తీర్మానించింది. సమావేశంలో టీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సోమయ్య, బసవ పున్నయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనందం, పిల్లి రాంచందర్, బండి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

3 ఫారెస్ట్ బ్లాక్‌లను రిజర్వ్ చేస్తూ ఉత్తర్వులు జారీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మూడు ఫారెస్ట్ బ్లాక్‌లను రిజర్వ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వం ఆయా జిల్లాల్లోని భూములను ఫారెస్ట్ బ్లాక్‌లుగా రిజర్వ్ చేస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. రంగారెడ్డి జిల్లాలోని ఆమన్‌గల్ రేంజ్ (మాడుగుల మండలం నాగిళ్లలోని 176 ఎకరాలు), జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం గొడిసెలపేట (బాసర సర్కిల్)లోని కొంత భూమిని, అదే జిల్లా ఎండపల్లి మండలం గుళ్లకోటలోని కొన్ని సర్వే నంబర్లలోని భూమిని ఫారెస్ట్ బ్లాక్ కోసం రిజర్వ్ చేస్తూ గురువారం అటవీశాఖ ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీమ్ ఉత్తర్వులు జారీచేశారు.

బడ్జెట్‌లో ఎస్సీలకు 18 శాతం కేటాయించండి

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు గడ్డం వివేక్ లేఖ

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో ఎస్సీలకు 18 శాతం కేటాయింపులు చేయాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఖర్గేకు లేఖరాశారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కులగణన సర్వేలో ఎస్సీల శాతం 18 శాతానికి పెరిగిందని ఖర్గే దృష్టికి తీసుకెళ్లారు. చట్టం ప్రకారం ఎస్సీలకు బడ్జెట్‌లో 18 శాతం కేటాయింపులు చేసేలా చొరవ తీసుకుని, ఎస్సీ వర్గానికి మేలు చేసేలా నిర్ణయం తీసుకోవాలని వివేక్ లేఖలో కోరారు.

తప్పుడు కేసులో న్యాయం గెలిచింది..

బీజేపీ నేతల హర్షం

సాక్షి, హైదరాబాద్: మూడేళ్ల న్యాయపోరాటం అనంతరం, నాంపల్లి కోర్టు తమపై వచ్చిన ఆరోపణలను కొట్టివేస్తూ నిర్దోషులుగా ప్రకటించడంపై బీజేపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. అప్పటి బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌పై.. 2021 నవంబర్‌లో టీఆర్‌ఎస్ నేతలు చేసిన ఆరోపణలపై జూబ్లీహిల్స్‌లో నిరసన తెలిపినందుకు కేసులు పెట్టారని ఒక ప్రకటనలో వెల్లడించారు. అప్పుడు అరెస్టై.. కేసులు ఎదుర్కొన్న వారిలో బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, ప్రస్తుత బీజేపీ నగర సెంట్రల్ అధ్యక్షుడు లంకల దీపక్ రెడ్డి, రాహుల్ చంద్ర, ప్రేమ్ కుమార్, చంద్రమోహన్ తదితరులు ఉన్నారని వారు వివరించారు. బీజేపీ తరపున కరుణ సాగర్ చేసిన వాదనలతో.. కేసును న్యాయస్థానం కొట్టివేసిందని వెల్లడించారు.

హైడ్రా స్టాండింగ్ కౌన్సిల్‌గా పవన్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: నీటి వనరులు, సర్కార్ స్థలాల పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్‌గా న్యాయవాది కొటూరి పవన్‌కుమార్‌ను నియమించారు. ఈ మేరకు న్యాయశాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. మూడేళ్లు లేదా ప్రభుత్వం నిర్ణయం తీసుకునే వరకు ఆయన ఈ బాధ్యతల్లో కొనసాగుతారు. నిబంధనల మేరకు జీతభత్యాలు వర్తిస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బీసీ వెల్ఫేర్ ఫైనాన్స్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్‌గా ఎం.జంగయ్యను నియమించారు.


పూలబుట్ట మాదిరి రంగులతో అలంకరించిన చేదబావి వద్ద పర్సా మల్లయ్య-వెంకటనర్సమ్మ దంపతులు

చేదబావికి అందమైన రూపం

కొత్తగా అలంకరణ, వర్షపు నీటిని నిల్వ చేసేలా ఏర్పాట్లు

వైరా: నలభై ఏళ్ల కిందట నిర్మించుకున్న ఇంట్లో చేద బావి ఉండేది. అయితే ఆ ఇంటిని పునర్నిర్మించుకున్న దంపతులు చేదబావిని మాత్రం తొలగించకుండా కొత్త రూపంలో తీర్చిదిద్దారు. పూలబుట్ట మాదిరి చిన్న చిన్న మార్పులు చేయించి రంగులు వేయించగా, బావి కొత్త అందాలు సంతరించుకుంది. ఖమ్మం జిల్లా వైరా మున్సిపాలిటీ రెండో వార్డుకు చెందిన పర్సా మల్లయ్య-వెంకటనర్సమ్మ దంపతులు వినూత్న ఆలోచనతో ఇది రూపుదిద్దుకుంది. అంతటితో సరిపెట్టకుండా వర్షం కురిసినప్పుడు భవనం పైనుంచి నీరు డ్రైనేజీలో కలవకుండా బావిలో చేరడానికి పైప్‌లైన్ వేయించారు. దీనికి రెండు గేట్‌వాల్వ్‌లు ఏర్పాటుచేసి ఒకటి బావికి, మరొకటి వర్షం కురిసినప్పుడు చెత్తాచెదారం బయటకు వెళ్లేలా చేశారు. తద్వారా వర్షపు నీరు బావిలోకి చేరితే భూగర్భజలాలు పెరుగుతాయని చెబుతున్నారు. వైరా మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి ఇటికాల భాస్కర్ సూచనలతో చేసిన ఈ మార్పులకు రూ.10 వేల వరకు వ్యయం కాగా, బావిని చూసిన స్థానికులు మల్లయ్య దంపతులను అభినందిస్తున్నారు.


చేదబావిలోకి వర్షపు నీరు చేరేలా ఏర్పాటు చేసిన గేట్ వాల్వ్‌లు

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయండి

కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో సమగ్ర శిక్షలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని బీజేపీ ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కోరారు. ఈ మేరకు గురువారం సమగ్ర శిక్ష ఉద్యోగుల బృందంతో కలిసి ఆయన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు 20 ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం పాయల్ శంకర్ తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి రాగానే వీరిని శాశ్వత ఉద్యోగులుగా గుర్తిస్తామని హామీ ఇచ్చిన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు మాట మార్చాయని విమర్శించారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో రేవంత్‌రెడ్డి కూడా సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపితే తాము సిద్ధంగా ఉన్నట్లు కేంద్రమంత్రి హామీ ఇచ్చినట్లు శంకర్ తెలిపారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, అనిల్, సురేందర్, సత్యనారాయణ, దీప్తి, రమేశ్, రాజిరెడ్డి, సంధ్యారాణి, బిందుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు సాయం

తెలంగాణ మీడియా అకాడమీ గవర్నింగ్ కౌన్సిల్ నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ మీడియా అకాడమీ తొలి గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం గురువారం మీడియా అకాడమీ భవనంలో అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా.. వర్కింగ్ జర్నలిస్టులకు శిక్షణ తరగతుల నిర్వహణ, వర్కింగ్ జర్నలిస్ట్స్ వెల్ఫేర్ ఫండ్ కింద.. మరణించిన వర్కింగ్ జర్నలిస్టుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడం వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రభుత్వ సహకారంతో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ 'న్యూస్‌పేపర్స్ ఆర్కైవ్స్'ను కొనసాగించాలని సమావేశం ఏకగ్రీవంగా నిర్ణయించింది. సమావేశానికి ఆర్థిక శాఖ అదనపు కార్య దర్శి కె.ధర్మయ్య, ఐ అండ్ పీఆర్ శాఖ జాయింట్ డైరెక్టర్ డీఎస్ జగన్ హాజరయ్యారు.

'పోలీస్ డ్యూటీ మీట్' విజేతలకు డీజీపీ రివార్డులు

సాక్షి, హైదరాబాద్: ఈనెల 10 నుంచి 15 వరకు జార్ఖండ్‌లోని రాంచీ పట్టణంలో నిర్వ హించిన 68వ అఖిల భారత పోలీస్ డ్యూటీ మీట్‌లో విజేతలుగా నిలిచిన పోలీసు అధికా రులు, సిబ్బందిని డీజీపీ జితేందర్ అభినందించారు. ఈ మేరకు డీజీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో పోలీస్ డ్యూటీ మీట్ విజేతలకు రివార్డులు అందజేశారు. తెలంగాణ పోలీస్ బృందం అద్భుత ప్రదర్శన కనబరిచి మొత్తం 18 పతకాలు గెలుచుకుందని డీజీపీ సంతోషం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో తెలంగాణ పోలీస్ డ్యూటీ మీట్ నోడల్ ఆఫీసర్ శిఖా గోయల్, స్పోర్ట్స్ ఐజీ ఎం.రమేశ్ పాల్గొన్నారు. తెలంగాణ పోలీస్ బృందం టీం మేనేజర్‌గా వ్యవహరించిన సీఐడీ ఎస్పీ బి.రాంరెడ్డి, కోచ్‌లు ఐఎస్‌డబ్ల్యూ, ఎస్పీ ఎం.రామకృష్ణ, జెన్కో అడిషనల్ ఎస్పీ ప్రతాప్, సచివాలయ భద్రత ఏసీపీ పూర్ణచందర్ తదితరులు రివార్డులు స్వీకరించిన వారిలో ఉన్నారు.

'అధునాతన వ్యవసాయానికి సిద్ధం'



సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ రంగంలో అధునాతన విధానాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు స్పష్టం చేశారు. ఇజ్రాయెల్‌కు చెందిన ఎండీహెచ్ఏఐఆర్అండ్‌డీ సంస్థతో పాటు విండ్‌పానిక్స్ సంస్థ ప్రతినిధులు గురువారం మంత్రి తుమ్మలను సచివాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వారు తమ సంస్థల ద్వారా శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వ్యవసాయ రంగంలో చేపడుతున్న కార్యక్రమాలను తెలిపారు. వ్యవసాయంలో స్మార్ట్ అగ్రికల్చర్, ఏఐ సెన్సార్, ఆటోమేషన్ పద్ధతులు, డిజిటల్ రెయిన్ హార్వెస్టింగ్, గ్రే వాటర్ ట్రీట్‌మెంట్ పద్ధతులను వివరించారు. ఇజ్రాయెల్, భారత్ మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం.. తెలంగాణ రాష్ట్రంలో పైలట్ పద్ధతిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో వ్యవసాయం చేసేలా రైతులకు శిక్షణ ఇవ్వనున్నట్లు విండ్ పానిక్స్ సంస్థ ప్రతినిధులు వెల్లడించారు.

గురుకుల ఉద్యోగులకు ఫ్యామిలీ పెన్షన్

సీపీఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ వినతి

సాక్షి, హైదరాబాద్: సంక్షేమ గురుకుల విద్యా సంస్థలు, ఆదర్శ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఫ్యామిలీ పెన్షన్‌ను వర్తింపజేయాలని సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎనిమిదేళ్ల క్రితం జీవో 32 ద్వారా సీపీఎస్ విధానంలోకి వచ్చినప్పటి నుంచి ఫ్యామిలీ పెన్షన్ అమలు చేయలేదన్నారు. మృతి చెందిన 38 మంది ఆదర్శ పాఠశాలల టీచర్ల కుటుంబాలు ఫ్యామిలీ పెన్షన్ అందక అవస్థలు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

25, 26 తేదీల్లో బయో ఆసియా సదస్సు

సాక్షి, హైదరాబాద్: ఆసియాలోనే అతిపెద్ద జీవ శాస్త్ర, ఆరోగ్య, సాంకేతిక వేదిక 'బయో ఆసియా–2025'సదస్సును ఈనెల 25, 26 తేదీల్లో నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అంతర్జాతీయంగా పేరొందిన పారిశ్రామికవేత్తలు, విధాన నిర్ణేతలు, స్టార్టప్‌లు, ఎంఎస్‌ఎంఈలు ఆరోగ్య రంగంలో పరివర్తన కోసం అవసరమైన ఆవిష్కరణలపై దిశానిర్దేశం చేస్తారు. కేంద్రమంత్రి పీయూష్ గోయల్, సీఎం రేవంత్‌రెడ్డి, క్వీన్స్‌లాండ్ గవర్నర్ జెనెట్ యంగ్‌తో పాటు ప్రపంచ ఆరోగ్య రక్షణ రంగ కంపెనీలు, పరిశోధన సంస్థల అధిపతులు ఈ సదస్సులో పాల్గొంటారు. ఆమ్జెన్ సీఈఓ రాబర్ట్ ఏ బ్రాడ్వే, జీనోమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సింగపూర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పాట్రిక్ టాన్, మెడ్‌ట్రానిక్ సీటీఓ కెన్ వాషింగ్టన్, ఇస్రో మాజీ చైర్మన్ సోమనాథ్‌తో పాటు రెడ్డీస్ ల్యాబ్స్, భారత్ బయోటెక్ చైర్మన్లు, తదితరులు సదస్సులో ప్రసంగిస్తారు. సదస్సులో ఏఐ ఆధారిత ఆరోగ్య రక్షణ, క్లినికల్ రీసెర్చ్, వ్యక్తిగత ఆరోగ్య రక్షణ రంగాలకు సంబంధించి బృంద చర్చలుంటాయి. లైఫ్ సైన్సెస్ రంగంలో హైదరాబాద్ స్థానాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా అనేక భాగస్వామ్యాలు, పెట్టుబడులకు సంబంధించిన ప్రకటనలుంటాయి.

డోలీలో మృతదేహాన్ని 3 కి.మీ మోసారు

కుక్కునూరు: ఏలూరు జిల్లా కుక్కునూరు మండలంలోని బండారిగూడెం గ్రామానికి చెందిన ముచికి దేవమ్మ కిడ్నీ సంబంధిత అనారోగ్య సమస్యతో బాధపడుతూ గురువారం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందింది. నాలుగు రోజుల క్రితం అనారోగ్యానికి గురైన దేవమ్మను కుటుంబసభ్యులు ముందుగా భద్రాచలం ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించి అక్కడి నుంచి చింతూరు, రంపచోడవరం ఆసుపత్రులకు తరలించి చికిత్స చేయించారు. అయినప్పటికీ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడకపోవడంతో రాజమహేంద్రవరం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ దేవమ్మ మృతి చెందింది. మృతదేహాన్ని వెంకటాపురం గ్రామానికి తీసుకువచ్చారు. అక్కడి నుంచి బండారిగూడెం గ్రామానికి తీసుకెళ్లేందుకు రహదారి సౌకర్యం లేకపోవడంతో డోలీలో 3 కిలోమీటర్లు దూరం మృతదేహాన్ని ఇలా మోసుకువెళ్లారు.



కెరటంతో సావాసం



మత్స్యకారుల జీవితం సముద్రంతోనే ముడిపడి ఉంటుంది. విశాఖ తీరంలో వందలాది మంది మత్స్యకారులు నిత్యం సముద్రంలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి బయలుదేరుతుంటారు. సాంప్రదాయ పడవలతో పాటు డీజిల్ ఇంజన్లు కలిగిన మర పడవలను సైతం నేడు విరివిగా వినియోగిస్తున్నారు. ఇలా గురువారం వేటకు బయలుదేరుతున్న 2 పడవలపై మత్స్యకారులు ఎదురుపడి, ముచ్చటించుకుంటున్నారు.- సాక్షి, ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

పేదోడి ఫ్రిడ్జ్‌కు ఫుల్ డిమాండ్



ఎండా కాలం వచ్చింది అంటే చాలు పేదల ఫ్రిజ్ (మట్టి కుండ)లకు ఎక్కువ డిమాండ్ ఉంటుంది. మండు వేసవిలో కరెంట్ బిల్లులు అధికంగా వస్తుండటంతో చాలామంది చల్లటి నీరు కోసం మట్టి కుండల వైపే మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలో కడపలో గురువారం కొంతమంది వీటిని కొనుగోలు చేస్తున్న దృశ్యాన్ని 'సాక్షి' బంధించింది. - సాక్షి, ఫొటోగ్రాఫర్, కడప

క్లుప్తంగా...

సంచార పశువైద్యసేవలకు ఆటంకం కలిగిస్తే చర్యలు

పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ టి.దామోదర నాయుడు

సాక్షి, అమరావతి: సంచార పశువైద్యసేవల్లో ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ టి.దామోదర నాయుడు హెచ్చరించారు. ఈ సేవల్లో ఏదైనా ఆటంకం ఏర్పడితే టోల్ ఫ్రీ నం.1962కు లేదా సమీప పశువైద్యాధికారిని సంప్రదించాలని గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సంచార వైద్య సేవలందించే అధీకృత ఏజెన్సీ కాలపరిమితి ఇటీవలే ముగిసిందని, అర్హత కలిగిన ఏజెన్సీల ఎంపిక కోసం టెండర్లు పిలిచామని తెలిపారు. కేంద్ర నిబంధనల మేరకు ఏజెన్సీ ఎంపిక ప్రక్రియ జరుగుతోందని, మరికొన్ని రోజుల్లోనే అన్ని అర్హతలున్న ఏజెన్సీ ద్వారా మెరుగైన రీతిలో పూర్తి స్థాయిలో సంచార వైద్యసేవలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

'ఎస్‌జీటీలకు టెన్త్ పరీక్షల విధులు వద్దు'

సాక్షి, అమరావతి: ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్‌జీటీలకు పదో తరగతి పబ్లిక్ పరీక్షల విధులు కేటాయించవద్దని ఆంధ్రప్రదేశ్ పూలే టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు అన్నం శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి వాసిలి సురేష్ ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఎస్‌జీటీలకు మార్చి, ఏప్రిల్ నెలల్లో ఇంటర్, పదో తరగతి పరీక్షల ఇన్విజిలేషన్ డ్యూటీలు, తర్వాత స్పాట్ విధులు కేటాయిస్తుండటంతో ప్రాథమిక పాఠశాలలు సింగిల్ టీచర్స్ స్కూల్స్‌గా మారి బోధనకు ఆటంకం ఏర్పడుతోందని పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షల విధుల నుంచి ఎస్‌జీటీలను మినహాయించాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) అధ్యక్షుడు ఎ.జి.ఎస్.గణపతిరావు, ప్రధాన కార్యదర్శి కాకి ప్రకాష్‌రావు మరో ప్రకటనలో కోరారు.

'బకాయిలు చెల్లించాలి'

సాక్షి, అమరావతి: ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం బకాయి పడ్డ రూ.25 వేల కోట్ల చెల్లింపుపై వెంటనే విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఇందులో భాగంగా ఉద్యోగులకు అమరావతితో పాటు 26 జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వం సబ్సిడీపై ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆ సంఘం అధ్యక్షుడు హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు కోరారు. కాంట్రాక్టర్ల బకాయిలు చెల్లిస్తున్న ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించకపోవడం దారుణమని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో లక్ష్మణరావుకు ఏపీటీఎఫ్ మద్దతు

సాక్షి, అమరావతి: కృష్ణా–గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావుకు తమ ఫెడరేషన్ మద్దతు ప్రకటించినట్లు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) అధ్యక్షుడు హృదయరాజు, ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు. మండలిలో 5 గ్రాడ్యుయేట్, 5 టీచర్ల కోటా ఎమ్మెల్సీలుగా ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, కర్షక, పెన్షనర్ల సమస్యలపై అవగాహన ఉన్నవారిని, ఆ సమస్యలను పరిష్కరించేందుకు ప్రశ్నించే తత్వం ఉన్నవారిని ఎన్నుకోవాలని కోరారు. ఎమ్మెల్సీగా అనుభవంతో పాటు సమస్యలపై పోరాటం చేసే లక్ష్మణరావును ఎన్నుకోవాలని వారు కోరారు.

పోలీస్ డ్యూటీమీట్ విజేతలకు డీజీపీ అభినందన

సాక్షి, అమరావతి: అఖిల భారత పోలీస్ డ్యూటీమీట్‌లో విజేతలుగా నిలిచిన రాష్ట్ర పోలీసు జట్లను డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా అభినందించారు. జార్ఖండ్ రాజధాని రాంచీలో నిర్వహించిన ఈ పోటీల్లో వ్యక్తిగత విభాగంలో ఫోరెన్సిక్ సైన్స్, క్రిమినల్ లా, మెడికో లీగల్ విభాగాల్లో ఎస్ఐ కె.కృష్ణమూర్తి స్వర్ణ పతకాలు సాధించారు. మొత్తం 4 స్వర్ణ, 1 రజత, 2 కాంస్య పతకాలతో ఏపీ పోలీస్ జట్లు పతకాల పట్టికలో ద్వితీయస్థానంలో నిలిచాయి. పతక విజేతలు గురువారం మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో డీజీపీని కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారిని అభినందించారు.



జీలుగు చెట్టు నుంచి నీరా సేకరణ



జీలుగు నీరా

జీలుగు నీరా.. లాభాలు జోరా

- ఫలించిన కేవీకే శాస్త్రవేత్తల పరిశోధనలు
- జీలుగు నీరాతో సిరప్, బెల్లం, ఇతర ఉత్పత్తుల తయారీ
- ఆధునిక పద్ధతుల్లో సేకరణపై దృష్టి
- గిరిజనులకు ఆదాయవనరుగా మార్చేందుకు చర్యలు
- కార్యాచరణకు అల్లూరి జిల్లా కలెక్టర్ ఆదేశం

నీరా...చెట్టు నుంచి సహజంగా లభించే అద్భుత పానీయం... పోషక విలువలెన్నో ఉన్న ఆరోగ్య ప్రదాయిని. జిల్లాలో అధిక సంఖ్యలో ఉన్న జీలుగు చెట్ల నీరాపై పందిరి మామిడి కేవీకే శాస్త్రవేత్తలు పలు పరిశోధనలు చేశారు. నీరా నుంచి సిరప్, బెల్లం, ఇతర పదార్థాలు తయారు చేసి మార్కెటింగ్ చేసి, తద్వారా గిరిజనులకు అధిక ఆదాయాన్ని సమకూర్చాలని భావిస్తున్నారు. ఇదే విషయాన్ని ఇటీవల పందిరి మామిడి కేవీకేను సందర్శించిన అల్లూరి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు.

రంపచోడవరం: నీరా చూసేందుకు కొబ్బరినీళ్లలా ఉంటుంది. సూర్యోదయానికి ముందు చెట్టు నుంచి తీసినదాన్ని నీరా అంటారు. పోషకాలు, ఔషధ గుణాలు మెండుగా ఉండే ఈ పానీయాన్ని ఇష్టపడనివారు ఉండరు. ఇప్పటికే అల్లూరి జిల్లాలో తాటి చెట్ల నుంచి నీరా సేకరిస్తున్నారు. జీలుగు నీరాను కూడా శాస్త్రీయ పద్ధతుల్లో సేకరించేందుకు పందిరిమామిడి కేవీకే శాస్త్రవేత్తలు ఇటీవల పలు పరిశోధనలు జరిపారు.

ఇప్పటి వరకు తాటిపై పరిశోధనలు

పందిరిమామిడి కేవీకే శాస్త్రవేత్తలు ఇప్పటి వరకు తాటిపై మాత్రమే పరిశోధనలు చేశారు. తాటి నుంచి నీరా సేకరణ, దానితో వివిధ ఆహార ఉత్పత్తులు తయారు చేయడంలో మంచి ఫలితాలను సాధించారు. జిల్లాలో తాటితో పాటు జీలుగు చెట్లు అధిక సంఖ్యలో ఉండడంతో జీలుగు చెట్టు నుంచి నీరా సేకరణ, ఇతర ఉత్పత్తుల తయారీపై కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజేంద్రప్రసాద్ దృష్టి సారించారు. కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాలతో ప్రాజెక్టు రూపుదిద్దుకుంటోంది.

సేకరణ ఇలా..

సూర్యోదయానికి ముందే తాటి,జీలుగు చెట్ల గెలలను ట్యాపింగ్ చేసి, కూలింగ్ ఉండే విధంగా కవర్లను, కూలింగ్ క్యాన్‌లను ఏర్పాటు చేసి నీరాను సేకరిస్తారు. చెట్ల నుంచి వచ్చిన ద్రవం చల్లదనంలో కాకుండా ఎక్కువ సేపు బయట ఉంటే కల్లుగా మారుతుంది. శాస్త్రవేత్తలు కల్లుగా కాకుండా నీరాగా తీసే విధంగా ఆధునిక టెక్నాలజీతో చేసిన పరిశోధనలు మంచి ఫలితాలిచ్చాయి.నీరాతో తయారు చేసిన పదార్థాలలో మంచి పోషక విలువలు ఉంటాయి.జీలుగు చెట్లు సముద్ర మట్టానికి 450 నుంచి 500 మీటర్ల ఎత్తు గల కొండ ప్రాంతంలో ఎక్కువగా ఉంటాయి. మారేడుమిల్లి, వై.రామవరం అప్పర్ పార్ట్ సముద్రమట్టం కంటే ఎత్తులో ఉండడంతో ఈ ప్రాంతంలో జీలుగు చెట్లు అధికంగా ఉన్నాయి.



జీలుగు నీరా సిరప్

సిరప్, బెల్లం తయారీ

కేవీకే శాస్త్రవేత్తలు జీలుగు నీరాతో సిరప్, బెల్లం తయారు చేశారు. నీరాను మంట మీద సుమారు మూడు గంటల వరకు మరగపెడతారు. దాని నుంచి మంచి ఆరోమా వస్తూ చిక్కపడిన తరువాత పానకం దశలో ఉండగా మంటమీద నుంచి తీసివేస్తే సిరప్‌గా తయారవుతుంది. పంచదార,చెరకు బెల్లానికి ప్రత్యామ్నాయంగా దీనిని వినియోగించవచ్చు.ఎన్ని రోజులైన నిల్వ ఉంటుంది. జీలుగు నీరాను మూడున్నర గంటల మరగపెడుతూ పానకం దశ దాటిన తరువాత, ఎక్కువ సేపు కలుపుతూ ఉంటే పాకం గట్టిపడి బెల్లంగా మారుతుంది. వీటిని స్వీట్ల తయారీలో ఉపయోగించవచ్చు.



బెల్లం

తాటికంటే అధికంగా కల్లు ఉత్పత్తి

జిల్లాలో మారేడుమిల్లి, వై.రామవరం అప్పర్ పార్ట్ మినహా అన్ని చోట్ల తాటి చెట్లు విరివిగా కనిపిస్తాయి. ఒక తాటి చెట్టు నుంచి రోజుకు నాలుగైదు లీటర్ల వరకు మాత్రమే కల్లు సేకరించగలరు. అదే జీలుగు చెట్టు నుంచి రోజుకు 40 నుంచి 60 లీటర్ల వరకు కల్లు ఉత్పత్తి అవుతుంది. తాటి కల్లును సొంతంగా వాడుకోవడంతో పాటు ఎక్కువగా ఉంటే దాని నుంచి చిగురు (కల్లును మరగబెట్టి ఆవిరి నుంచి తయారు చేసే సారా) తయారు చేసుకుంటారు. జీలుగు కల్లును మాత్రం గిరిజనుల నుంచి సేకరించి జిల్లాలో నలుమూలలతో పాటు మైదాన ప్రాంతాలకు వ్యాపారులు రవాణా చేస్తున్నారు. ఎక్కువ మొత్తంలో జీలుగు కల్లు లభించడమే ఇందుకు ప్రధాన కారణం.

నీరా సేకరణ, ఉత్పత్తులపై శిక్షణ

జీలుగు నీరా, ఉత్పత్తుల తయారీపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు వైఎస్సార్ ఉద్యానవన విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.గోవిందరాజులు చర్యలు తీసుకున్నారు. ఇటీవల కేవీకేను సందర్శించిన కలెక్టర్ దినేష్ కుమార్‌కు జీలుగు నీరా గురించి వివరించడంతో ఆయన వెంటనే స్పందించి, జిల్లాలో ఎన్ని జీలుగు చెట్లు ఉన్నాయో సమగ్ర సర్వే నిర్వహించాలని దిశ నిర్దేశం చేశారు. నీరా ఉత్పత్తిని జిల్లా అంతా విస్తరించేలా చర్యలు తీసుకోవాలని, అందుకు ప్రణాళికలు తయారీ చేయాలని ఆదేశించారు. తాటి, జీలుగులను కలిపి ఒక బోర్డు ఏర్పాటు చేస్తే భవిష్యత్‌లో మంచి ఫలితాలు ఉంటాయి.

–డాక్టర్ రాజేంద్రప్రసాద్, కేవీకే కోఆర్డినేటర్, సీనియర్ శాస్త్రవేత్త, పందిరిమామిడి



జీలుగు చెట్లపై సర్వే

జిల్లాలో మారేడుమిల్లి, వై.రామవరం, చింతూరు, రాజవొమ్మంగి, పాడేరు, కొయ్యూరు, అరకు, చింతపల్లి ,జీకే వీధి, డుంబ్రిగుడ తదితర మండలాల్లో ఈ చెట్లు అధికంగా ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఎన్ని చెట్లు ఉన్నాయో సర్వే చేయనున్నారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా జీలుగు నీరా సేకరణకు కార్యాచరణ రూపొందిస్తారు. కొంతమంది రైతులను కలిపి ఒక యూనిట్‌గా ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చి, శాస్త్రీయంగా నీరా సేకరణ జరిపేందుకు చర్యలు తీసుకోనున్నారు.

ఈసారైనా కనీస పెన్షన్ పెరిగేనా?

- ప్రస్తుతం ఈపీఎఫ్‌ఓ కనీస పింఛన్ రూ.1000
- ఈ మొత్తాన్ని పెంచాలంటూ కేంద్రంపై కార్మిక సంఘాల ఒత్తిడి
- ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పెంపు కోసం డిమాండ్
- ఈపీఎఫ్‌ఓ పెన్షన్ కంటే రాష్ట్రాల్లో ఇచ్చే సామాజిక పింఛన్ ఎక్కువ
- పెంపుపై వచ్చే వారం సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ తీర్మానం చేసే అవకాశం



సాక్షి, హైదరాబాద్: ఉద్యోగి భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌ఓ) ద్వారా అమలవుతున్న ఉద్యోగుల పెన్షన్ పథకం (ఈపీఎస్) కింద ఇచ్చే కనీస పెన్షన్ పరిమితి పెంచాలనే డిమాండ్ తీవ్రమవుతోంది. ఈ పథకం కింద అర్హత సాధించిన కార్మికులకు పదవీ విరమణ తర్వాత ఇచ్చే కనీస పెన్షన్ కింద రూ.1000గా ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఈపీఎస్ ద్వారా అందే కనీస పెన్షన్ కార్మికుడి కుటుంబానికి ఏమాత్రం సరిపోవడం లేదు. దేశంలోని వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సామాజిక పెన్షన్ పథకం కింద కూడా ఇంతకు రెట్టింపు స్థాయిలో ఇస్తుండటంతో... కనీసం ఆ మేరకైనా పెంచాలనే డిమాండ్‌ను కార్మిక సంఘాలు బలంగా వినిపిస్తున్నాయి. దీనిపై ఇప్పటికే ఈపీఎఫ్‌ఓ, కేంద్ర కార్మిక శాఖకు పెద్ద ఎత్తున వినతులు సైతం సమర్పించాయి. పెన్షన్ పెంపు కోసం కార్మికులు పదేళ్లుగా ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు.

రూ.2 వేలతో ప్రతిపాదనలు

దేశవ్యాప్తంగా ఈపీఎఫ్‌ఓలో నమోదైన ఎస్టాబ్లిష్‌మెంట్ (వాణిజ్య, వ్యాపార సంస్థ)లు 7.66 లక్షలు. ఈ సంస్థల పరిధిలో ప్రస్తుతం ఈపీఎఫ్‌ఓ చందాదారులుగా ఉన్న వారు 7.37 కోట్లు. వీరంతా ఈపీఎస్ కింద వాటా చెల్లిస్తున్న వారే. మరో 78.49 లక్షల మంది పెన్షనర్లు ఉన్నారు. ఒక్కో పెన్షనర్ కనీస పెన్షన్ కింద రూ.వెయ్యి చొప్పున అందుకుంటున్నారు. అయితే ఈ పెన్షన్ కింద వచ్చే డబ్బులు కనీసం నెలవారీ బీపీ, మధుమేహంలాంటి దీర్ఘకాలిక వ్యాధుల మందుల ఖర్చులకూ చాలడం లేదంటూ వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో కనీస పింఛన్ పెంపు కోసం కార్మిక సంఘాలు కేంద్రంపై తీవ్రంగానే ఒత్తిడి చేస్తున్నాయి. మరోవైపు కనీస పెన్షన్ పెంపుకోసం ఏర్పాటైన కమిటీలు సైతం పెంపును సమర్థిస్తూ కేంద్రానికి నివేదికలు సమర్పించాయి. కనీస పెన్షన్‌ను రూ.2 వేలకు పెంచాలంటూ ప్రతిపాదనలు సైతం పంపాయి. పెన్షన్ పెంపుతో తలెత్తే ఆర్థిక భారాన్ని అధిగమించేందుకు ఆర్థిక శాఖ ద్వారా కొంత సాయం అందించాలన్న అంశాన్ని కూడా ప్రస్తావించాయి. కానీ ఈ ప్రతిపాదనలకు ఆమోదం తెలపని ఆర్థిక శాఖ... కనీస పెన్షన్ పెంపు ప్రతిపాదనలను తిరస్కరించింది.

చందాల రూపంలో రూ.65 వేల కోట్లు

ప్రస్తుతం ఈపీఎఫ్‌ఓకు నెలవారీ చందాల రూపంలో ఏడాదికి రూ.65 వేల కోట్లు సమకూరుతోంది. అదేవిధంగా పెన్షన్ నిధి నిల్వలతో వచ్చే వడ్డీ సైతం భారీగా జమ అవుతోంది. అంతేకాకుండా ఈపీఎఫ్‌ఓ ద్వారా సెక్యూరిటీస్‌లో పెట్టుబడులతోనూ భారీగా ఆదాయం వస్తోంది. ఈ పరిస్థితుల్లో కనీస పెన్షన్ రెట్టింపు చేసినా ఆర్థిక భారం ఉండదనేది కార్మిక సంఘాల వాదన. ఇలాంటి పరిస్థితుల్లో ఆర్థిక శాఖ సాయం లేకున్నా కనీస పింఛన్ పెంపుతో ఇబ్బందులు ఉండవని సంఘాల నేతలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మరోమారు కనీస పెన్షన్ పెంచుతూ కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించాలని ఈపీఎఫ్‌ఓ ట్రస్టీలు సైతం సూచిస్తున్నారు. వచ్చే వారంలో ఈపీఎఫ్‌ఓ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (సీబీటీ) సమావేశం జరగనుంది. అందులోనైనా కనీస పెన్షన్‌పై తీర్మానం చేసి కేంద్ర కార్మిక శాఖకు సమర్పించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

ఈపీఎఫ్‌ఓలో నమోదైన ఎస్టాబ్లిష్‌మెంట్లు, చందాదారులు, పెన్షనర్లు ఇలా..


కేటగిరీ	ఎస్టాబ్లిష్‌మెంట్లు	చందాదారులు	పెన్షనర్లు
దేశంలో	7,66,254	7,37,39,204	78,49,338
తెలంగాణ	34,052	41,64,917	3,51,627
ఆంధ్రప్రదేశ్	20,211	14,99,530	2,64,925



శ్రీవారి దర్శనానికి 14 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 12 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 72,745 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.3.48 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 14 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

భక్తిశ్రద్ధలతో చండీహోమం



చౌడేపల్లె : చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలంలోని పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో రెండో రోజైన గురువారం కుంకుమార్చన పూజలు వైభవంగా కొనసాగాయి. అమ్మవారి ఉత్సవ మూర్తికి ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో దంపతులకు పూజా సామగ్రిని అందజేశారు. అమ్మవారి ఉత్సవ మూర్తి ఎదుట ప్రత్యేక పూజలు, చేశారు. 151 దంపతులకు అమ్మవారి సన్నిధిలో లక్ష నామ గలార్చనల మధ్య పూజలు చేయించారు. 2 రోజులుగా సాగుతున్న లక్ష కుంకుమార్చన పూజలు శుక్రవారంతో ముగియనున్నాయి.

ముత్యపుపందిరిపై కోనేటిరాయుడు..

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో కొలువైన కల్యాణ వెంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలలో అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో మూడవరోజు అయిన గురువారం రాత్రి స్వామి, అమ్మవార్లు ముత్యపు పందిరిపై ఆశీనులై భక్తులను కటాక్షించారు. శ్రీనివాసుడు చల్లని వెన్నెల్లో ముత్యాల కాంతుల మధ్య దేదీప్యమానంగా వెలుగుతూ శ్రీదేవి, భూదేవి సమేతంగా ముత్యపుపందిరి వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం స్వామి వారు యోగ ముద్రలో యోగనరసింహ అవతారంలో భక్తులకు అభయమిచ్చారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు ఆలయ ప్రాంగణంలో ఊంజల్‌సేవను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అడగడునా స్వామి వారికి మంగళహారతిలతో మొక్కులు చెల్లించుకున్నారు.



మాతృభాషపై వ్యాసరచన పోటీలు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ తెలుగు విభాగం, కేంద్ర ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వశాఖ, నెల్లూరు సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వేస్టిగేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం విద్యార్థినులకు మాతృభాష సామర్థ్యంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా బహుమతులు, ధృవపత్రాలను అందజేయనున్నారు.

ఎస్పీడబ్ల్యూలో ఎంబ్రాయిడరీపై శిక్షణ



తిరుపతి సిటీ: పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల హోమ్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఎంబ్రాయిడరీ ఎంబెలిష్మెంట్స్ టు స్పార్క్ యువర్ క్రియేటివిటీ అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగే జాతీయస్థాయి వర్క్‌షాప్ గురువారం ప్రారంభమైంది. ప్రిన్సిపాల్ టి నారాయణమ్మ వర్క్‌షాప్‌ను ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థులకు అకడమిక్ విద్యతో పాటు ఉపాధి రంగాలపై శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.

తిరుపతి ఐఐటీలో నేటి నుంచి 'తిరుత్సవ-2025'

టెక్నో- కల్చరల్ ఫెస్ట్ పేరుతో నిర్వహణ

ఏర్పేడు(రేణిగుంట): తిరుపతి ఐఐటీలో శుక్రవారం నుంచి ప్రతియేటా వైభవంగా నిర్వహించే తిరుత్సవ-2025 టెక్నో కల్చరల్ ఫెస్ట్ ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కెఎన్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రతియేటా ఎంతో వైవిధ్యంగా జరిగే ఈ ఉత్సవంలో సాంకేతికత, సాంస్కృతికత మేళవింపుతో విద్యార్థులు ఉల్లాసంగా జరుపుకుంటారు. విద్యార్థుల మేధాసంపత్తిని పరీక్షించే పోటీలతో పాటు, భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు మేళవించే ప్రదర్శనలు, ప్రఖ్యాత సినీ, సంగీత, డీజే, పాప్ సింగర్లతో నిర్వహించే ప్రత్యేక ప్రదర్శనలు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. తిరుపతి ఐఐటీ విద్యార్థులు ఏర్పేడు సమీపంలోని క్యాంపస్ ప్రాంగణాన్ని మొత్తం ఇంటరాక్టివ్ 3డీ మ్యాప్‌ను రూపొందించి బయట ప్రాంతాల నుంచి వచ్చే వారికి దిక్సూచిగా నిలిచే రీతిలో వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.

సినిమా

జానర్ మాత్రమే కాదు... ఒక్కోసారి కాంబినేషన్స్ కూడా ఆడియన్స్‌ను థియేటర్స్‌కు రప్పిస్తాయి. అలాంటి క్రేజీ కాంబినేషన్ మూవీస్‌కు ప్రస్తుతం సన్నాహాలు జరుగుతున్నాయి. కొందరు తెలుగు స్టార్ హీరోలు ఇప్పటివరకు తమతో సినిమాలు చేయని దర్శకులతో సినిమాలు చేసేందుకు రెడీ అవుతున్నారు. ఇంకా అధికారిక ప్రకటన రాలేదు కానీ ఇండస్ట్రీలో చర్చ జరుగుతున్న కొన్ని కొత్త కాంబినేషన్స్ కథా కమామీషుపై ఓ లుక్ వేయండి.


ప్రభాస్


ఎన్టీఆర్


అల్లు అర్జున్


రవితేజ


నాని


విజయ్ దేవరకొండ

గురూ... కొత్త కాంబినేషన్ షురూ!

ప్రభాస్‌తో లోకేశ్


లోకేశ్ కనగరాజ్

‘రాజా సాబ్, ఫౌజి’ సినిమాలతో బిజీగా ఉన్నారు ప్రభాస్. ఈ రెండు సినిమాల చిత్రీకరణలు తుది దశకు చేరుకుంటున్నాయి. దీంతో త్వరలోనే సందీప్ రెడ్డి వంగా డైరెక్షన్‌లోని ‘స్పిరిట్’ మూవీ చిత్రీకరణలో పాల్గొంటారు ప్రభాస్. ‘స్పిరిట్’ సినిమా ఇంకా సెట్స్‌పైకి వెళ్లలేదు. అయితే తనతో ‘సలార్’ వంటి మాస్ సినిమాను నిర్మించిన హోంబలే ఫిలింస్‌తో ప్రభాస్ మూడు సినిమాలు కమిటయ్యారు. ఈ మూడు సినిమాలు వరుసగా 2026, 2027, 2028లలో విడుదల కానున్నాయి. కాగా వీటిలో ఓ చిత్రాన్ని తమిళ దర్శకుడు లోకేశ్ కనగరాజ్ డైరెక్ట్ చేయనున్నారనే టాక్ వినిపిస్తోంది. అయితే లోకేశ్ కార్తీతో ‘ఖైదీ 2’ చేయాల్సి ఉంది. మరోవైపు ప్రభాస్ కమిట్‌మెంట్స్ కూడా ఉన్నాయి. కాబట్టి ప్రభాస్–లోకేశ్ కనగరాజ్ కాంబినేషన్‌లోని మూవీ చిత్రీకరణ కాస్త ఆలస్యంగా ప్రారంభం అయ్యే చాన్సెస్ ఉన్నాయి. అలాగే ‘హనుమాన్’తో భారీ బ్లాక్‌బస్టర్ హిట్ సాధించిన ప్రశాంత్ వర్మతో ప్రభాస్ ఓ మూవీ చేయనున్నారు. ప్రస్తుతం ‘జై హనుమాన్’తో బిజీగా ఉన్నారు ప్రశాంత్ వర్మ. ఈ సినిమా పూర్తయిన తర్వాత ప్రభాస్‌తో ప్రశాంత్ వర్మ సినిమా చేసే అవకాశం ఉందని ఫిల్మ్‌నగర్ సమాచారం.

గ్రీన్ సిగ్నల్


నెల్సన్ దిలీప్‌కుమార్

తమిళంలో రజనీకాంత్‌తో ‘జైలర్’ సినిమా తీసి సూపర్‌హిట్ అందుకున్నారు దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్. ప్రస్తుతం రజనీకాంత్‌తోనే ‘జైలర్ 2’ సినిమా చేసే పనుల్లో నిమగ్నమయ్యారు నెల్సన్. అయితే ‘జైలర్’కు, ‘జైలర్ 2’కు మధ్య తనకు లభించిన గ్యాప్‌లో ఓ కథ రాసుకున్నారట నెల్సన్. ఈ కథను ఎన్టీఆర్‌కు వినిపించగా, ఎన్టీఆర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సమాచారం. అయితే ఇటీవలే హిందీలో ‘వార్ 2’ (ఈ చిత్రంలో హృతిక్ రోషన్ మరో హీరో) సినిమాను పూర్తి చేసిన ఎన్టీఆర్, ప్రస్తుతం ప్రశాంత్ నీల్‌తో తాను కమిటైన ‘డ్రాగన్’ (ప్రచారంలో ఉన్న టైటిల్) మూవీ సినిమా కోసం కావాల్సిన మేకోవర్ పనుల్లో బిజీగా ఉన్నారు. వచ్చే నెలలో ‘డ్రాగన్’ మూవీ రెగ్యులర్ షూటింగ్‌లో జాయిన్ అవుతారు ఎన్టీఆర్. ఈ సినిమా చిత్రీకరణను పూర్తి చేసిన తర్వాత నెల్సన్ సినిమాను ఎన్టీఆర్ సెట్స్‌కు తీసుకువెళతారని ఊహించవచ్చు. అలాగే ‘హాయ్ నాన్న’ వంటి ఫీల్‌గుడ్ మూవీ తీసిన శౌర్యువ్ కూడా ఎన్టీఆర్‌కు ప్రాథమికంగా ఓ లైన్ చెప్పారని, స్టోరీ కుదిరితే శౌర్యువ్‌తోనూ ఎన్టీఆర్ మూవీ చేస్తారనే వార్త ప్రచారంలోకి వచ్చింది.

అర్జున్‌తో అట్లీ


అట్లీ

‘పుష్ప: ది రూల్’ సినిమా సక్సెస్‌తో మంచి జోష్‌లో ఉన్నారు అల్లు అర్జున్. ఈ సక్సెస్‌ను ఎంజాయ్ చేసేందుకు ప్రస్తుతం స్పెయిన్‌లో ఉన్నారు అల్లు అర్జున్. కాగా ‘పుష్ప’ సినిమా నిర్మాణం సమయంలోనే దర్శకుడు త్రివిక్రమ్, దర్శకుడు సందీప్ రెడ్డి వంగాలతో అల్లు అర్జున్ సినిమాలు చేయనున్నట్లుగా అధికారిక ప్రకటనలు వెల్లడయ్యాయి. అయితే ప్రభాస్ ‘స్పిరిట్’ మూవీతో సందీప్ రెడ్డి వంగా బిజీగా ఉండటంతో అల్లు అర్జున్ తన నెక్ట్స్ మూవీని త్రివిక్రమ్‌తో చేస్తారనే టాక్ వినిపించింది. కానీ త్రివిక్రమ్‌తో అల్లు అర్జున్ చేయాల్సిన సినిమాకు మైథలాజికల్ బ్యాక్‌డ్రాప్ ఉంటుందట, చాలా గ్రాఫిక్స్ వర్క్ అవసరం అవుతుందట. ఇలా ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ ఇంకా సమయం పడుతుందట. దీంతో తన నెక్ట్స్ మూవీ కోసం తమిళ టాప్ డైరెక్టర్ అట్లీతో చర్చలు జరిపారట అల్లు అర్జున్. అట్లీ డైరెక్షన్‌లోనే అల్లు అర్జున్ నెక్ట్స్ మూవీ సెట్స్‌పైకి వెళ్లనుందని టాక్. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తారని, సన్ పిక్చర్స్ సంస్థ నిర్మించనుందని భోగట్టా. అల్లు అర్జున్ ‘పుష్ప 2’ సినిమా రూ. 1871 కోట్ల వసూళ్లు రాబట్టింది. మరోవైపు దర్శకుడిగా షారుక్ ఖాన్‌తో రూ. 1000 కోట్ల ‘జవాను’ను తీశారు అట్లీ. ఈ నేపథ్యంలో అల్లు అర్జున్–అట్లీ కాంబినేషన్‌పై భారీ అంచనాలు ఉన్నాయి. అల్లు అర్జున్ స్పెయిన్ నుంచి తిరిగి వచ్చిన తర్వాత ఈ మూవీ పై మరింత సమాచారం బయటకు రానుందని తెలిసింది. అలాగే ప్రముఖ హిందీ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీని ఇటీవల ముంబైలో కలిశారు అల్లు అర్జున్. వీరి మధ్య ఓ సినిమాకు సంబంధించిన చర్చలు జరిగాయి. సో... భన్సాలీతో కూడా అల్లు అర్జున్ సినిమా చేసే చాన్స్ ఉందని ఊహించవచ్చు.

మాస్ ప్లస్ క్లాస్


కిశోర్ తిరుమల

ఎక్కువగా మాస్, వీలైనప్పుడు క్లాస్ మూవీస్ చేస్తుంటారు రవితేజ. అయితే రీసెంట్ టైమ్స్‌లో రవితేజ మాస్ సినిమాలే ఆడియన్స్ ముందుకు వచ్చాయి. ప్రస్తుతం రవితేజ చేస్తున్న ‘మాస్ జాతర’ మాస్ అప్పీల్ ఉన్న సినిమాయే. దీంతో ఓ క్లాస్ మూవీ చేయాలని రవితేజ అనుకుంటున్నారట. ఇందులో భాగంగానే కిశోర్ తిరుమల రెడీ చేసిన ఓ ఫీల్ గుడ్ ఎంటర్‌టైనర్ మూవీకి రవితేజ పచ్చజెండా ఊపారని, త్వరలోనే ఈ వీరి కాంబినేషన్‌లోని మూవీపై స్పష్టత రానుందని ఫిల్మ్‌నగర్ సమాచారం.

ఓకే చెప్పిన నానీ


సిబీ చక్రవర్తి

శివ కార్తికేయన్‌తో తమిళంలో ‘డాన్’ (2022) వంటి క్యాంపస్ డ్రామా ఫిల్మ్ తీసి హిట్ సాధించారు తమిళ యంగ్ డైరెక్టర్ సిబీ చక్రవర్తి. అప్పట్నుంచి సిబీ చక్రవర్తితో ఓ మూవీ చేయాలని నానీ అనుకుంటున్నారట. ఆ సమయం ఇప్పుడు వచ్చిందని, నానీ–సిబీ చక్రవర్తి కాంబినేషన్‌లోని మూవీకి సన్నాహాలు జరుగుతున్నాయని, మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఈ సినిమాను నిర్మించనుందనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ప్రస్తుతం నానీ ‘హిట్ 3’ మూవీతో బిజీగా ఉన్నారు. మే 1న ఈ చిత్రం రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ మూవీ తర్వాత తనకు ‘దసరా’ వంటి హిట్ ఇచ్చిన శ్రీకాంత్ ఓదెలతో నానీ ‘ప్యారడైజ్’ అనే మూవీ చేస్తారు. అయితే ‘ప్యారడైజ్’ చిత్రానికి సమాంతరంగా సిబీ సినిమాను కూడా నానీ చేస్తారా? లేక ‘ప్యారడైజ్’ చిత్రాన్ని పూర్తి చేశాక సిబీ చక్రవర్తి సినిమాను స్టార్ట్ చేస్తారా? అనే విషయంపై క్లారిటీ రావాల్సి ఉంది. అలాగే దర్శకుడు శేఖర్ కమ్ముల చెప్పిన ఓ కథ నానీని ఇంప్రెస్ చేసిందని, నానీ ప్రస్తుత కమిట్‌మెంట్స్ కంప్లీట్ అయిన తర్వాత శేఖర్ కమ్ములతో చేసే మూవీపై ఓ స్పష్టత వస్తుందని సమాచారం. ఈ నెల 24న నానీ బర్త్ డే. ఈ సందర్భంగా ఈ హీరో తదుపరి చిత్రాలపై అధికారిక అప్‌డేట్స్ ఏమైనా వస్తాయా? అనేది చూడాలి.

కిల్ డైరెక్టర్‌తో..!


నిఖిల్ నగేశ్ భట్

హిందీలో ‘కిల్’ వంటి మాస్ యాక్షన్ ఫిల్మ్ తీసి, ఒక్కసారిగా టాక్ ఆఫ్ ది బాలీవుడ్ అయ్యారు దర్శకుడు నిఖిల్ నగేశ్ భట్. ఈ దర్శకుడు ఇప్పుడు ఓ క్రేజీ తెలుగు హీరోతో భారీ బడ్జెట్ మూవీ తీయాలని ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగానే ఇటీవల హైదరాబాద్‌లో విజయ్ దేవరకొండను కలిశారు నిఖిల్ నగేశ్. వీరి మధ్య ఓ కొత్త సినిమా గురించిన చర్చలు జరిగాయి. ప్రస్తుతం ‘కింగ్‌డమ్’ మూవీ చేస్తున్నారు విజయ్ దేవరకొండ. మే 30న ఈ మూవీ రిలీజ్ కానుంది. ఈ మూవీ తర్వాత దర్శకుడు రాహుల్ సంకృత్యాన్‌తో రాయలసీమ నేపథ్యంలో ఓ పీరియాడికల్ యాక్షన్ ఫిల్మ్, రవికిరణ్ కోలాతో ఓ విలేజ్ యాక్షన్ డ్రామా ఫిల్మ్ కమిటయ్యారు విజయ్ దేవరకొండ. ఈ సినిమాలు పూర్తయ్యాక విజయ్ దేవరకొండ–నిఖిల్ నగేశ్‌ల కాంబినేషన్‌లోని మూవీపై ఓ స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ఈ తరహాలో మరికొందరు తెలుగు హీరోలు తాము ఇప్పటివరకు చేయని దర్శకులతో సినిమాలు చేసేందుకు రెడీ అవుతున్నారు.

– ముసిమి శివాంజనేయులు

క్రైమ్ థ్రిల్లర్


నానీ

నానీ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ‘హిట్: ది థర్డ్ కేస్’. శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో శ్రీనిధీ శెట్టి కథానాయికగా నటిస్తున్నారు. యునానిమస్ ప్రొడక్షన్స్‌తో కలిసి వాల్ పోస్టర్ సినిమాపై ప్రశాంతి తిపిర్నేని నిర్మిస్తున్న ఈ సినిమా మే 1న విడుదల కానుంది. కాగా ఈ నెల 24న నానీ పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. ‘‘క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న చిత్రం ‘హిట్: ది థర్డ్ కేస్’. ఈ మూవీలో అర్జున్ సర్కార్‌గా పవర్‌ఫుల్ పోలీస్‌గా కనిపించనున్నారు నానీ. ‘హిట్’ సిరీస్‌లో మూడవ భాగంగా రాబోతున్న ఈ చిత్రం గ్లింప్స్, పోస్టర్‌లకు అద్భుతమైన స్పందన వచ్చింది. దీంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి’’ అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమేరా: సాను జాన్ వర్గీస్, సంగీతం: మిక్కీ జె. మేయర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్. వెంకటరత్నం (వెంకట్), లైన్ ప్రొడ్యూసర్: అభిలాష్ మాంధదపు.

గతం నిశ్శబ్దంగా ఉండదు!


జీతూ జోసెఫ్, మోహన్‌లాల్, ఆంటోనీ

మలయాళంలో హీరో మోహన్‌లాల్, దర్శకుడు జీతూ జోసెఫ్‌ల కాంబినేషన్‌లోని ‘దృశ్యం’ ఫ్రాంచైజీ బ్లాక్‌బస్టర్. ఈ మలయాళ ‘దృశ్యం’ ఫ్రాంచైజీలోని సినిమాలు భారతదేశ ఇతర భాషల్లోనే కాకుండా అంతర్జాతీయ భాషల్లో కూడా రీమేక్ అయ్యాయి. రీమేక్ అయిన ప్రతి భాషలోనూ ఈ చిత్రం హిట్ కావడం విశేషం. ‘దృశ్యం’ సినిమాకు ఇంతటి క్రేజ్ ఉంది. కాగా కొన్ని రోజులుగా ‘దృశ్యం 3’ సినిమా గురించి అధికారిక ప్రకటన రానుందనే టాక్ మాలీవుడ్‌లో వినిపిస్తూనే ఉంది. ఫైనల్‌గా గురువారం ఈ సినిమాపై అధికారిక ప్రకటన చేశారు మోహన్‌లాల్. ‘దృశ్యం 3’ సినిమా కన్ఫార్మ్ అని, ‘ఎక్స్’లో ఓ ఫొటోను షేర్ చేశారు. ‘ఎక్స్’లో మోహన్‌లాల్ పేర్కొన్న పోస్ట్‌లో ‘ది పాస్ట్ నెవర్ స్టేస్ సైలెంట్’ (గతం ఎప్పుడూ నిశ్శబ్దంగా ఉండదు) అనే క్యాప్షన్ కూడా ఉంది. ‘దృశ్యం, దృశ్యం 2’ సినిమాలను నిర్మించిన ఆంటోనీ పెరుంబవూర్ ‘దృశ్యం 3’ సినిమానూ నిర్మించనున్నారు. త్వరలోనే ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుంది. మరోవైపు అనూప్ మీనన్‌తో తన నెక్ట్స్ మూవీ ఉంటుందని ఇటీవల ప్రకటించారు మోహన్‌లాల్. ఆయన సోలో హీరోగా అనూప్ మీనన్ మూవీని పూర్తి చేసిన తర్వాత ‘దృశ్యం 3’ సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉంది. ఇక మమ్ముట్టీ, మోహన్‌లాల్‌ల కాంబినేషన్‌లో ఓ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. అలాగే మోహన్‌లాల్ సోలో హీరోగా నటించిన ‘ఎల్2: ఎంపురాన్’ చిత్రం మార్చి 28న రిలీజ్ కానుంది.

స్వప్నాల నావ సిరివెన్నెలకి అంకితం


వీఎన్ ఆదిత్య
సిరివెన్నెల సీతారామశాస్త్రి

‘మనసంతా నువ్వే, నేనున్నాను’ వంటి పలు విజయవంతమైన సినిమాలు తెరకెక్కించిన డైరెక్టర్ వీఎన్ ఆదిత్య తాజాగా ‘స్వప్నాల నావ’ అనే మ్యూజిక్ వీడియోను రూపొందించారు. డల్లాస్‌కి చెందిన ప్రవాసాంధ్రుడు గోపీకృష్ణ కొటారు శ్రీ క్రియేటివ్ మ్యూజిక్ అండ్ ఎంటర్‌టైన్మెంట్ అనే నిర్మాణ సంస్థను స్థాపించి తొలి ప్రయత్నంగా ‘స్వప్నాల నావ’ మ్యూజిక్ వీడియోను నిర్మించారు. గోపీకృష్ణ కుమార్తె శ్రీజ కొటారు ఈ పాటను ఆలపించడమే కాకుండా నటించారు. పార్థసారధి నేమాని సంగీతం అందించగా, యశ్వంత్ ఆలూరు ఈ పాటకి సాహిత్యం సమకూర్చారు. ‘‘చదువులో ఫెయిలైన విద్యార్థులను మోటివేట్ చేసే పాట ‘స్వప్నాల నావ’. శ్రీ క్రియేటివ్స్ యూఎస్ఏ యూట్యూబ్ ఛానల్‌లో రిలీజైన మా పాటకు పది లక్షల వ్యూస్ వచ్చాయి. ఇంత ఘన విజయం సాధించిన ఈ పాటని దివంగత పాటల రచయిత ‘సిరివెన్నెల’ సీతారామశాస్త్రిగారికి అంకితం ఇస్తున్నాం’’ అని మేకర్స్ పేర్కొన్నారు. మాస్టర్ టైలన్ (చైనా) నటించిన ఈ మ్యూజిక్ వీడియోకి సమర్పణ: ఓ.ఎమ్.జీ ప్రొడక్షన్స్ మీనాక్షి, కెమేరా: బుజ్జి .కె.

ఆయుష్మాన్‌కు జోడీగా...


శార్వరీ

హిందీలో ‘మైనే ప్యార్ కియా, హమ్ అప్ కే హై కౌన్, ఊంచాయీ’ వంటి సక్సెస్‌ఫుల్ ఫిల్మ్స్ తీసిన ప్రముఖ దర్శకుడు సూరజ్ బర్జాత్యా మరో కథను రెడీ చేశారు. ఈ సినిమాలో ఆయుష్మాన్ ఖురానా హీరోగా నటించనున్నారు. కాగా ఈ మూవీలో హీరోయిన్‌గా శార్వరీని తీసుకోవాలనుకుంటున్నారట. సూరజ్ బర్జాత్యా వంటి సీనియర్ దర్శకుడి సినిమా కావడంతో శార్వరీ వెంటనే ఓకే చెప్పారని బాలీవుడ్ భోగట్టా. ఈ వేసవిలో ఈ సినిమా చిత్రీకరణను ప్రారంభించి, వచ్చే ఏడాది ప్రారంభంలో రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

బిజినెస్ రీల్

బీఎస్ఈలో వేగా జ్యూయలర్స్ లిస్టింగ్



ముంబై: వేగా జ్యూయలర్స్ లిమిటెడ్ షేర్లు గురువారం బీఎస్ఈ ఎక్స్ఛేంజీలో లిస్ట య్యాయి. ఈ కంపెనీ గతంలో 'పీహెచ్ ట్రేడింగ్ లిమిటెడ్' పేరుతో ట్రేడయ్యేది. ఈ సందర్భంగా ఎండీ నవీన్ కుమార్ మాట్లాడుతూ.. 'ఇది 20 ఏళ్ల కల సాఫల్యం. వేగా సంస్థ అభివృద్ధి, విజయాలకు తోడ్పడిన డైరెక్టర్లు, పెట్టుబడిదారులు, ఉద్యోగులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. బీఎస్ఈ సారథ్యంలో మరింత ప్రగతి సాధిస్తాము' అన్నారు. లిస్టింగ్ కార్యక్రమంలో ఎండీతో పాటు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుధాకర్ వనమా, చైర్మన్ రామ్ మోహన్, ఇతర డైరెక్టర్లు, మేనేజింగ్ పార్టనర్లు, ఇన్వెస్టర్లు, ఉద్యోగులు, బీఎస్ఈ అధికారులు పాల్గొన్నారు. వేగా జ్యూయలర్స్‌కి విజయవాడ, హైదరాబాద్, కాకినాడలో స్టోర్లున్నాయి.

బీఎస్ఈలో గురువారం కంపెనీ షేరు ధర 2% పెరిగి రూ.29.48 వద్ద ముగిసింది.

ఆధార్ సాయంతో బ్యాంక్ ఖాతా

ప్రారంభించిన ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

చెన్నై: ఆధార్ ఓటీపీ సాయంతో బ్యాంక్ ఖాతా తెరిచే సేవలను ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ప్రారంభించింది. అలాగే, ఏపీఐ బ్యాంకింగ్ సదుపాయాలను కూడా ప్రారంభించింది. బ్యాంక్ 89వ వ్యవస్థాపక దినోత్సవాల్లో భాగంగా.. వ్యక్తులు, కార్పొరేట్ కస్టమర్లకు సులభతర బ్యాంకింగ్ సేవలను అందించే లక్ష్యంతో వీటిని ఆవిష్కరించింది. బ్యాంక్ వెబ్‌సైట్‌కు వెళ్లి ఆధార్ నంబర్ నమోదు చేసి, మొబైల్‌కు వచ్చే ఓటీపీని ఎంటర్ చేయడం ద్వారా సేవింగ్స్ ఖాతా తెరుచుకోవచ్చని తెలిపింది. ఏపీఐ బ్యాంకింగ్ సర్వీస్ కింద.. కార్పొరేట్ కస్టమర్లు లావాదేవీలు, ఇంటర్‌బ్యాంక్ ఫండ్ బదిలీలను తమ అకౌంటింగ్ సిస్టమ్ నుంచే చేసుకోవచ్చని పేర్కొంది. ఇందు కోసం కార్పొరేట్ కస్టమర్లకు సెక్యూర్ గేట్‌వేను ఆఫర్ చేస్తోంది.

టీఎస్‌హెచ్‌పీలో టాటా స్టీల్‌కు 191 కోట్ల షేర్లు

న్యూఢిల్లీ: సింగపూర్‌కి చెందిన అనుబంధ సంస్థ టీ స్టీల్ హోల్డింగ్స్‌లో (టీఎస్‌హెచ్‌పీ) 191 కోట్ల షేర్లు కొనుగోలు చేసినట్లు టాటా స్టీల్ వెల్లడించింది. ఇందుకోసం రూ. 2,603 కోట్లు వెచ్చించినట్లు వివరించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

21-2-2025

విశాఖ	440-00
చిత్తూరు	493-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	430-00
విజయవాడ	440-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	420-00
వరంగల్	422-00
రిటైల్ ధర	4.80

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SHRIRAMFIN	580.1	4
NTPC	325.05	3.26
M&M	2,832.35	2.72
BEL	260.15	2.66
ADANIPORTS	1,110.00	2.51

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HDFCBANK	1,685.95	-2.39
MARUTI	12,420.00	-2.1
TECHM	1,657.00	-1.71
TATACONSUM	1,009.00	-1.59
HCLTECH	1,690.90	-1.25

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	4,051
ఎన్ఎస్ఈ	80,372
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,65,880
ఎఫ్ఐఐ	- 3,312
డీఐఐ	+ 3,908

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	73.08 (రాత్రి 11.30కు)	$ 72.01 (క్రితం ముగింపు)
బ్రెంట్	77.07 (రాత్రి 11.30కు)	$ 76.40 (క్రితం ముగింపు)

టెర్మినల్ నుంచి బంక్ దాకా

ప్రతీ చుక్కకూ లెక్క!

- నిఘా నీడన ఇంధన వ్యాపారం
- పరిమాణం, నాణ్యతకు పెద్దపీట
- ఆయిల్ కంపెనీల కఠిన విధానాలు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహనంలో ఇంధనం కావాల్సి వస్తే సమీపంలోని ఫిల్లింగ్ స్టేషన్‌కు వెళతాం. పెట్రోల్ లేదా డీజిల్ కావాల్సినంత కొట్టించి డబ్బులు కట్టి బయటకు వస్తాం. ఇందులో కొత్తేమి ఉంది అనే కదా మీ సందేహం. అక్కడికే వస్తున్నాం.. ఎక్కడో తయారైన ఇంధనం వేలాది కిలోమీటర్లు ప్రయాణం చేసి మనదాకా వస్తోంది. ఈ ప్రయాణంలో నాణ్యత, పరిమాణంలో ఎటువంటి రాజీ లేకుండా కస్టమర్‌కు కల్తీ లేని ఇంధనం చేరేందుకు చమురు కంపెనీలు, డీలర్లు నిరంతరం తీసుకుంటున్న చర్యల గురించి ఎప్పుడైనా ఆలోచించారా? రిఫైనరీ నుంచి టెర్మినల్.. అక్కడి నుంచి ఫిల్లింగ్ స్టేషన్. ఇలా వినియోగదారుడి వాహనంలోకి ఇంధనం చేరే వరకు కంపెనీల నిఘా కళ్లు వెంటాడుతూనే ఉంటాయన్న సంగతి చాలా మందికి తెలియదు.

తేడా వస్తే రద్దు చేస్తారు..

చక్రం తిరిగితేనే వ్యవస్థ పరుగెడుతుంది. ఇంధన అమ్మకాలు పెరిగాయంటే ఆర్థిక వ్యవస్థ బాగున్నట్టు. అందుకే ఆయిల్ కంపెనీలు బాధ్యతగా వ్యవహరిస్తున్నాయి. సాంకేతికతను ఆసరాగా చేసుకుని దేశంలోని మారుమూలన ఉన్న పల్లెకూ నాణ్యమైన ఇంధనాన్ని చేర్చాలన్న సంకల్పంతో పనిచేస్తున్నాయి. పరిమాణంలో తేడా రాకుండా న్యాయబద్ధంగా కస్టమర్ చెల్లించిన డబ్బులకు తగ్గట్టుగా ఇంధనం అందిస్తున్నాయి. పైగా ప్రభుత్వ నియంత్రణలోనే చమురు వ్యాపారాలు సాగుతుంటాయి. దీంతో రెవెన్యూ, పోలీసు, తూనికలు కొలతల శాఖకు చెందిన అధికారులు సైతం తనిఖీలు చేపడుతుంటారు. ఈ క్రమంలో ఏమాత్రం తప్పు జరిగినా ఆయిల్ కంపెనీలు కఠిన చర్యలకు దిగుతున్నాయి. ఫిల్లింగ్ స్టేషన్‌లో స్టాక్‌లో కొద్ది తేడా వచ్చినా భారీ జరిమానా లేదా డీలర్‌షిప్ రద్దుకు వెనుకాడడం లేదు. ఇంధనం రవాణా చేసే ఏజెన్సీలు చేతివాటం ప్రదర్శిస్తే బ్లాక్ లిస్టులో పెడతాయి. దేశవ్యాప్తంగా ఉన్న 88 వేల బంకుల్లో ఎక్కడో ఒక దగ్గర జరిగిన తప్పును మొత్తం పరిశ్రమకు ఆపాదించకూడదన్నది కంపెనీలు, డీలర్ల వాదన.

టెర్మినల్ నుంచి బంక్ దాకా..

ఆయిల్ కంపెనీకి చెందిన టెర్మినల్స్ నుంచి వివిధ ప్రాంతాల్లోని బంకులకు ఇంధనం సరఫరా అవుతుంది. ఇంధనం కేటాయించగానే సంబంధిత ఫిల్లింగ్ స్టేషన్ (బంక్) యజమానికి ఆయిల్ టెర్మినల్ నుంచి సందేశం వెళుతుంది. అలాగే ట్యాంకర్ బయలుదేరగానే, బంక్‌కు చేరిన వెంటనే మెసేజ్ వస్తుంది. టెర్మినల్ నుంచి బంక్ వరకు ట్యాంకర్ ప్రయాణాన్ని జీపీఎస్ ఆధారంగా ట్రాక్ చేస్తారు. ఇచ్చిన రూట్ మ్యాప్‌లోనే ట్యాంకర్ వెళ్లాలి. మరో రూట్‌లో వెళ్లినట్టయితే తదుపరి లోడ్‌కు అవకాశం లేకుండా ఆ వాహన ఏజెన్సీని బ్లాక్ చేస్తారు. నిర్దేశించిన ప్రాంతంలోనే డ్రైవర్లు భోజనం చేయాల్సి ఉంటుంది. మార్గ మధ్యలో వాహనం ఆపినా కారణం చెప్పాల్సిందే. ఇక బంక్ వద్దకు ట్యాంకర్ చేరగానే నిర్దేశించిన స్థలంలో కాకుండా మరెక్కడైనా పార్క్ చేసినా ఫిల్లింగ్ స్టేషన్‌పై చర్యలుంటాయి. బంక్ యజమాని ఓటీపీ ఇస్తేనే ట్యాంకర్ తెరుచుకుంటుంది. అన్‌లోడ్ అయ్యాక ట్యాంకర్‌లో నిల్ స్టాక్ అని కంపెనీకి సమాచారం ఇవ్వాలి.

ఫిల్లింగ్ స్టేషన్‌లో ఇలా..

బంకులోని ట్యాంకులో ఎంత ఇంధనం మిగిలి ఉంది, లోడ్ ఎంత వచ్చింది, అమ్మకాలు.. అంతా పారదర్శకం. గణాంకాలు అన్నీ ఎప్పటికప్పుడు కంపెనీ, డీలర్ వద్ద ఆన్‌లైన్‌లో దర్శనమిస్తాయి. ట్యాంకర్ తీసుకొచ్చిన స్టాక్‌లో తేడా ఉంటే ఇన్వాయిస్‌పైన వివరాలు పొందుపరిచి కంపెనీకి సమాచారం ఇవ్వాలి. ఇలా ప్రతీ చుక్కకూ లెక్క ఉంటుంది. మీటర్ తిరిగినదానికి తగ్గట్టుగా బంకు ట్యాంకులో ఖాళీ కావాలి. స్టాక్‌లో తేడా 2 శాతం మించకూడదు. మించితే జవాబు చెప్పాల్సిందే. అంతేకాదు రూ.3 లక్షల వరకు పెనాల్టీ భారం తప్పదు. తరచుగా కంపెనీకి చెందిన సేల్స్ ఆఫీసర్ తనిఖీ చేస్తుంటారు. థర్డ్ పార్టీ నుంచి, అలాగే ఇతర ఆయిల్ కంపెనీల నుంచి కూడా తరచూ తనిఖీలు ఉంటాయి.



ఆ మూడు సంస్థలదే..



దేశంలో మొత్తం ఇంధన రిటైల్ పరిశ్రమలో ప్రభుత్వ రంగ ఆయిల్ కంపెనీలైన బీపీసీఎల్, ఐవోసీఎల్, హెచ్‌పీసీఎల్ వాటా ఏకంగా 90% ఉంది. కంపెనీల వెబ్‌సైట్స్ ప్రకారం ఐవోసీఎల్‌కు 37,500లకుపైగా, బీపీసీఎల్‌కు 22,000ల పైచిలుకు, హెచ్‌పీసీఎల్‌కు 17,000 లకుపైగా ఫ్యూయల్ స్టేషన్స్ ఉన్నాయి. ప్రైవేటు సంస్థలు జియో–బీపీ, నయారా, షెల్ సైతం ఈ రంగంలో పోటీపడుతున్నాయి. దేశవ్యాప్తంగా నిర్వహణ మాత్రమే బంకుల యజమానులది. మౌలిక వసతుల ఏర్పాటు, మెషినరీ, ఇంధనంపై సర్వ హక్కులూ పెట్రోలియం కంపెనీలదేనని వ్యాపారులు చెబుతున్నారు. నిర్వహణకుగాను ప్రతి నెల డీలర్‌కు వేతనం కింద కంపెనీలు రూ.27,500 చెల్లిస్తున్నాయి. డీలర్లకు లీటరు పెట్రోల్ అమ్మకంపై రూ.3.99, డీజిల్‌పై రూ.2.51 కమిషన్ ఉంటుంది.

ఫిల్లింగ్ స్టేషన్లలో ఇవి తప్పనిసరి

- మంచి నీరు
- వాష్ రూమ్స్
- ఫిర్యాదుల పుస్తకం
- ఫస్ట్ ఎయిడ్
- ఫ్రీ ఎయిర్ కోసం టైర్ ఇన్‌ఫ్లేటర్
- సీసీ కెమెరాలు
- ఫైర్ ఎక్స్‌టింగ్విషర్, ఇసుక



వేగానికీ పరిమితులు..



ట్యాంకర్ గంటకు 60 కిలోమీటర్ల వేగాన్ని మించకూడదు. ఒక్క వాహనం నిబంధనలు అతిక్రమించినా ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీనే రద్దు చేస్తారు. టెర్మినల్ నుంచి సుదూర ప్రాంతంలో ఫిల్లింగ్ స్టేషన్ ఉన్నట్టయితే.. డ్రైవర్లకు భోజనానికి 45 నిముషాలు, టీ తాగడానికి 15 నిముషాలు సమయం ఇస్తారు. నిర్దేశిత సమయం మించితే కంపెనీ నుంచి ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ యజమానికి మెయిల్, ఎస్ఎంఎస్ వెళుతుంది. ఆలస్యానికి కారణం తెలపాల్సిందే. రాత్రి 12 నుంచి ఉదయం 5 మధ్య రవాణా నిషేధం.

వయబిలిటీ స్టడీలో లోపాలు..



మోసాలకు తావు లేకుండా కస్టమర్లకు నాణ్యమైన ఇంధనం అందుతోందనడంలో ఎటువంటి సందేహం లేదు. అయితే పెట్రోల్ బంక్ ఏర్పాటు కోసం ఇచ్చే ప్రకటనలో సంబంధిత ప్రాంతంలో ఇంత మొత్తంలో విక్రయాలు జరుగుతాయని కంపెనీ ఇచ్చే అంకెలకు, వాస్తవ అమ్మకాలకు భారీ వ్యత్యాసం ఉంటోంది. వయబిలిటీ స్టడీ సక్రమంగా జరగడం లేదు. ప్రకటన ఆధారంగా ముందుకొచ్చి బంక్ ఏర్పాటు చేసి నష్టాలు మూటగట్టుకుంటున్న యజమానులు ఎందరో.

– మర్రి అమరేందర్ రెడ్డి, తెలంగాణ పెట్రోల్ డీలర్స్ అసోసియేషన్.

బంకు యజమానులే బాధ్యులా?

డ్రైవర్లు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా వర్షాకాలంలో ట్యాంకర్ లోపలికి నీరు చేరే అవకాశం ఉంది. ఇథనాల్ మిశ్రమంలో తేడాలున్నా సమస్యకు దారి తీస్తుంది. బంకుల్లోని ట్యాంకులు స్టీలుతో తయారయ్యాయి. తుప్పు పడితే ట్యాంకులో చెమ్మ చేరుతుంది. ఇదే జరిగితే ఆ నీరు కాస్తా బంకులోని ట్యాంకర్‌కు, అక్కడి నుంచి కస్టమర్ వాహనంలోకి వెళ్లడం ఖాయం. ఈ సమస్యకు పరిష్కారంగా హెచ్‌డీపీఈతో చేసిన ట్యాంకులను బంకుల్లో ఏర్పాటు చేయాల్సిందిగా విన్నవిస్తున్నా కంపెనీల నుంచి స్పందన లేదు. రవాణా ఏజెన్సీ తప్పిదం, మౌలిక వసతుల లోపం వల్ల సమస్య తలెత్తినా బంకు యజమానిని బాధ్యులను చేస్తున్నారు.

– రాజీవ్ అమరం, జాయింట్ సెక్రటరీ, కన్సార్షియం ఆఫ్ ఇండియన్ పెట్రోలియం డీలర్స్.

దేశవ్యాప్తంగా 2024 డిసెంబర్ అమ్మకాలు, (2023 డిసెంబర్‌తో పోలిస్తే వృద్ధి)

విభాగం	పరిమాణం	వృద్ధి
పెట్రోల్	2.99 మిలియన్ టన్నులు	9.8%
డీజిల్	7.07 మిలియన్ టన్నులు	4.9%



ద్వితీయార్ధంలో ఎకానమీ జోరు

ఆర్‌బీఐ బులెటిన్ వెల్లడి

ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్ధంలో ఆర్థిక వ్యవస్థ పుంజుకున్నట్టు ఆర్‌బీఐ బులెటిన్ (ఫిబ్రవరి నెల) వెల్లడించింది. వాహన విక్రయాలు, విమాన ప్రయాణికుల రద్దీ, స్టీల్ వినియోగం, జీఎస్‌టీ ఈ–వే బిల్లులు తదితర కీలక గణాంకాలు ఇదే విషయాన్ని తెలియజేస్తున్నట్టు పేర్కొంది. డాలర్ బలోపేతం కావడంతో వర్ధమాన ఆర్థిక వ్యవస్థల నుంచి పెట్టుబడులు వెనక్కి పోవడం కరెన్సీ రిస్కులను పెంచుతున్నట్టు తెలిపింది. ''ఆర్థిక కార్యకలాపాలు స్థిరంగా కొనసాగనున్నాయి. బలమైన గ్రామీణ వినియోగానికి, వ్యవసాయ రంగం పటిష్ట పనితీరు మద్దతునివ్వనుంది. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడం, బడ్జెట్‌లో పన్ను రాయితీలు పెంపుతో పట్టణ వినియోగం సైతం కోలుకోనుంది''అని బులెటిన్ వివరించింది. 27 రకాల కీలక సూచికల ఆధారంగా ఆర్థిక కార్యకలాపాల తీరును అంచనా వేస్తుండడం గమనార్హం. ద్రవ్యోల్బణం తగ్గుదల నిదానంగా ఉండడం, టారిఫ్‌ల రిస్క్ పట్ల ఫైనాన్షియల్ మార్కెట్లలో ఆందోళన నెలకొందని చెబుతూ.. వర్ధమాన మార్కెట్లలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐలు) అమ్మకాలకు తోడు డాలర్‌తో కరెన్సీలు బలహీనపడడాన్ని ఈ బులెటిన్ ప్రస్తావించింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ స్థిరమైన వృద్ధిలోనే ఉన్నప్పటికీ, అది మోస్తరుగా ఉన్నట్టు తెలిపింది. ''వృద్ధిని, ద్రవ్య స్థిరీకరణను యూనియన్ బడ్జెట్ చక్కగా సమతుల్యం చేసింది. మూలధన వ్యయాలు, వినియోగానికి మద్దతుతోపాటు డెట్ స్థిరీకరణకు స్పష్టమైన కార్యాచరణను ప్రకటించింది. దీనికి అదనంగా రెపో రేటు తగ్గింపుతో దేశీ డిమాండ్ పుంజుకోనుంది'' అని ఆర్‌బీఐ బులెటిన్ వెల్లడించింది.



2025లో జీడీపీ 6.4 %

మూడీస్ ఎనలిటిక్స్ అంచనా

న్యూఢిల్లీ: భారత జీడీపీ 2025లో 6.4 శాతం మేర వృద్ధిని సాధించొచ్చని అంతర్జాతీయ సంస్థ మూడీస్ ఎనలిటిక్స్ తెలిపింది. యూఎస్ టారిఫ్‌లు, అంతర్జాతీయంగా డిమాండ్ బలహీనపడడం ఎగుమతులపై ప్రభావం చూపిస్తాయని పేర్కొంది. 2024లో జీడీపీ 6.6%గా ఉందని గుర్తు చేసింది. 2025లో ఆసియా పసిఫిక్ వ్యాప్తంగా వృద్ధి నిదానిస్తుందని మూడీస్ ఎనలిటిక్స్ తెలిపింది. వాణిజ్య ఉద్రిక్తతలు, విధానపరమైన మార్పులు ఈ ప్రాంతం వృద్ధిపై ప్రభావం చూపిస్తాయని పేర్కొంది. చైనా జీడీపీ 2024లో 5%గా ఉంటే.. 2025లో 4.2%కి, 2026లో 3.9 శాతానికి తగ్గుముఖం పడుతుందని వివరించింది. భారత వృద్ధి 2024లో ఉన్న 6.6% నుంచి వచ్చే రెండేళ్లు 6.4 శాతానికి తగ్గొచ్చని అంచనా .

మార్చిలో ఎన్ఎస్‌డీఎల్ ఐపీవో

రూ. 3,000 కోట్ల పబ్లిక్ ఇష్యూ

ముంబై: డిపాజిటరీ సంస్థ ఎన్ఎస్‌డీఎల్ ప్రతిపాదిత ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) మార్చిలో వచ్చే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. మార్కెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ (ఎంఐఐ) హోదా ఉన్నందున మరికొన్ని అనుమతులు కూడా తీసుకోవాల్సి రావడమే ఇందుకు కారణమని వివరించాయి. నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డీఎల్) ఐపీవోకి మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ గతేడాది సెప్టెంబర్‌లో గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ఇష్యూ ద్వారా కంపెనీ రూ. 3,000 కోట్లు సమీకరించనుంది. ఇందులో వాటాలున్న ఎన్ఎస్ఈ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సంస్థలు ఆఫర్ ఫర్ సేల్ విధానంలో 5.72 కోట్ల షేర్లను విక్రయించనున్నట్లు తెలుస్తోంది. డిసెంబర్ క్వార్టర్‌లో ఎన్ఎస్‌డీఎల్ నికర లాభం 30 శాతం పెరిగి రూ. 66 కోట్ల నుంచి రూ. 86 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం 16 శాతం వృద్ధి చెంది రూ. 391 కోట్లుగా నమోదైంది.

రూ. 100 కోట్ల సమీకరణలో ప్రచయ్ క్యాపిటల్

న్యూఢిల్లీ: నాన్–కన్వర్టబుల్ డిబెంచర్ల (ఎన్‌సీడీ) జారీ ద్వారా రూ.100 కోట్లు సమీకరించనున్నట్లు నాన్–బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థ ప్రచయ్ క్యాపిటల్ తెలిపింది. ఈ ఇష్యూ ఫిబ్రవరి 28న ప్రారంభమై మార్చి 13న ముగుస్తుందని పేర్కొంది. క్రిసిల్ నుంచి ట్రిపుల్ బీ మైనస్ (స్టేబుల్) రేటింగ్ పొందిన ఈ ఎన్‌సీడీలపై వార్షికంగా 13 శాతం రాబడి ఉంటుందని, నెలవారీగా వడ్డీ చెల్లింపులు ఉంటాయని సంస్థ ఎండీ గిరీష్ మురళీధర్ లఖోటియా తెలిపారు.

ఈ–కామర్స్ దూకుడు

- 2035 నాటికి నాలుగింతలు
- రూ.47.30 లక్షల కోట్లకు చేరే అవకాశం
- అనరాక్, ఈటీ రిటైల్ సంయుక్త నివేదిక



ముంబై: ఈ–కామర్స్ రంగం ఆకాశమే హద్దుగా విస్తరించనుంది. వచ్చే పదేళ్లలో 2035 నాటికి నాలుగు రెట్లు పెరగనుందని, 550 బిలియన్ డాలర్లకు (రూ.47.30 లక్షల కోట్లు) చేరుకోనుందని అనరాక్, ఈటీ రిటైల్ సంయుక్త నివేదిక వెల్లడించింది. 2024 చివరికి ఇది 125 బిలియన్ డాలర్లుగా ఉన్నట్టు తెలిపింది. ఏటా 15 శాతం కాంపౌండెడ్ వృద్ధిని చూడనుందని అంచనా వేసింది. ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్ల వినియోగం విస్తరణ, డిజిటల్ చెల్లింపుల సదుపాయాలు, యువతరం, టెక్నాలజీ తెలిసిన జనాభా ఈ–కామర్స్ వృద్ధికి కీలకంగా పనిచేస్తాయని తెలిపింది. ప్రభుత్వ కార్యక్రమమైన డిజిటల్ ఇండియాతో పాటు లాజిస్టిక్స్, సరఫరా నెట్‌వర్క్ సదుపాయాల విస్తరణ ఈ వృద్ధిని మరింత వేగవంతం చేయనున్నట్టు వివరించింది. మెట్రోలతోపాటు చిన్న పట్టణాల్లోనూ పెరుగుతున్న డిమాండ్‌ను అందుకునేందుకు ఈ–కామర్స్ సంస్థలు ప్రయత్నం చేస్తున్నట్టు అనరాక్ సీఈవో, ఎండీ అనుజ్ కేజ్రీవాల్ తెలిపారు. మొత్తానికి భారత రిటైల్ మార్కెట్ పరిమాణం 2035 నాటికి 2500 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని, 2019 నాటితో పోల్చి చూస్తే మూడు రెట్లు వృద్ధి చెందనుందని చెప్పారు. ఖర్చు చేసే ఆదాయంలో పెరుగుదల, పట్టణీకరణ, పెరుగుతున్న మధ్యతరగతి వర్గీయులు.. ఇవన్నీ రిటైల్ మార్కెట్ విస్తరణకు దోహదం చేసేవిగా ఈ నివేదిక తెలిపింది.

5 స్టార్టప్స్‌లో ఫ్లిప్‌కార్ట్ వెంచర్స్ పెట్టుబడులు

న్యూఢిల్లీ: ఫ్లిప్‌కార్ట్ లీప్ ఎహెడ్ (ఎఫ్ఎల్ఏ) ప్రోగ్రాంలో భాగంగా మూడో విడత కోసం అయిదు స్టార్టప్‌లను ఎంపిక చేసినట్లు ఫ్లిప్‌కార్ట్ వెంచర్స్ వెల్లడించింది. వీటిలో ఎక్స్‌పోర్టెల్, ఫ్యాక్టర్స్‌డాట్‌ఏఐ, ఎక్స్‌పర్టియాడాట్‌ఏఐ, భారత్ కృషి సేవా, వీసా2ఫ్లై ఉన్నాయి. ప్రారంభ దశలో ఉన్న ఈ అంకుర సంస్థలకు ఎఫ్ఎల్ఏ కింద 5,00,000 డాలర్ల వరకు ఈక్విటీ పెట్టుబడులు, మెంటార్‌షిప్ లభిస్తాయి. బిజినెస్ మోడల్, వృద్ధి అవకాశాలు, విజన్ తదితర అంశాల ప్రాతిపదికన అంకుర సంస్థలు ఎంపికవుతాయి. ఫ్లిప్‌కార్ట్ వెంచర్స్ ఇప్పటివరకు డీప్ టెక్, ఫిన్‌టెక్, హెల్త్ టెక్, జనరేటివ్ ఏఐ తదితర విభాగాల్లో 20 పైచిలుకు స్టార్టప్‌లకు తోడ్పాటునిచ్చింది. ఎక్స్‌పోర్టెల్ సీమాంతర ఈ–కామర్స్ లాజిస్టిక్స్ సేవల రంగానికి సంబంధించిన అంకుర సంస్థ. ఫ్యాక్టర్స్‌డాట్‌ఏఐ అనేది ఏఐ ఆధారిత మార్కెటింగ్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫాం. ఎక్స్‌పర్టియాడాట్‌ఏఐ అనేది ఏజెంటిక్ ఏఐ రిక్రూటింగ్ ప్లాట్‌ఫాం కాగా, భారత్ కృషి సేవా సంస్థ అగ్రిటెక్ స్టార్టప్‌గా, వీసా2ఫ్లై ట్రావెల్ టెక్ ప్లాట్‌ఫాంగా కార్యకలాపాలు సాగిస్తున్నాయి.



మరిన్ని రూట్లలో ఎయిరిండియా లుఫ్తాన్సా కోడ్‌షేర్ ఒప్పందం

మరో 60 రూట్లలో సేవల విస్తరణ



ముంబై: విమానయాన దిగ్గజం ఎయిరిండియా తాజాగా లుఫ్తాన్సా గ్రూప్‌తో కోడ్ షేర్ ఒప్పందాన్ని మరిన్ని రూట్లకు విస్తరించింది. దేశీయంగా 12 నగరాలు, యూరప్‌లో 26 నగరాలవ్యాప్తంగా కొత్తగా 60 రూట్లలో సేవలు అందించేందుకు ఇది ఉపయోగపడనుంది. అలాగే ఆస్ట్రియన్ ఎయిర్‌లైన్స్‌తో కొత్తగా కోడ్‌షేర్ ఒప్పందం కుదుర్చుకోగా, స్విస్ ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్‌తో ప్రస్తుత ఒప్పందం పరిధిని ఎయిరిండియా మరింతగా పెంచుకుంది. భాగస్వామ్యాలను పెంపొందించుకోవడం ద్వారా భారత్, యూరప్ మధ్య ప్రయాణాలకు మరిన్ని ఆప్షన్లు అందుబాటులోకి తెస్తున్నట్లు ఎయిరిండియా చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ నిపుణ్ అగర్వాల్ తెలిపారు.

ఈ–రీసైక్లింగ్ @ 20 కోట్ల డాలర్లు

- ఏటా 13 శాతం వృద్ధి
- 2032 నాటికి అంచనా
- ఇండియా రేటింగ్స్ నివేదిక



ముంబై: దేశీయంగా ఈ–రీసైక్లింగ్ రంగం ఏటా 13.52 శాతం మేర వృద్ధి చెందనుంది. 2032 నాటికి దాదాపు 20 కోట్ల డాలర్లకు చేరనుంది. బుధవారం విడుదల చేసిన నివేదికలో ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్ (ఇండ్–రా) ఈ విషయాలను వెల్లడించింది. అత్యధిక స్థాయిలో ఈ–వ్యర్థాల విషయంలో చైనా, అమెరికా తర్వాత భారత్ మూడో స్థానంలో ఉందని పేర్కొంది. ఈ–వ్యర్థాలను అత్యంత సమర్థంగా రీసైక్లింగ్ చేస్తున్న దేశాల్లో స్విట్జర్లాండ్ అగ్రస్థానంలో ఉండగా ఆ తర్వాత స్థానాల్లో స్వీడన్, నార్వే ఉన్నట్లు వివరించింది. వ్యర్థాల నిర్వహణ బాధ్యతను ఉత్పత్తిదార్లపై ఉంచే నిబంధనలను పటిష్టం చేయడం, సాంకేతిక పురోగతి తదితర అంశాల కారణంగా దేశీయంగా ఈ–రీసైక్లింగ్ రంగంలో వ్యాపార అవకాశాలు గణనీయంగా ఉన్నట్లు నివేదిక వివరించింది.

సంఘటిత సంస్థలకు అవకాశం..

సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడంతో చాలాకాలంగా అసంఘటిత సంస్థలు, ఈ–వ్యర్థాలను సరిగ్గా రీసైకిల్ చేయకపోవడం వల్ల ఆరోగ్యపరమైన, పర్యావరణంపరమైన రిస్కులు తలెత్తాయని తెలిపింది. ప్రస్తుతం సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (సీపీసీబీ)లో రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేయడం, నిర్దిష్ట ప్రమాణాలు, సర్టిఫికేషన్లను పాటించాల్సి రావడం వల్ల చాలా మటుకు అసంఘటిత సంస్థలు తప్పుకుంటాయని, సంఘటిత రంగ సంస్థలు వృద్ధి చెందుతాయని నివేదిక పేర్కొంది. సీపీసీబీ ప్రకారం దేశవ్యాప్తంగా రిజిస్టర్ అయిన, అధీకృత రీసైక్లింగ్ సంస్థలు 569 ఉండగా, వీటి వార్షిక సామర్థ్యం 1.79 మిలియన్ టన్నులుగా ఉంది. ఈ–వ్యర్థాల రీసైక్లింగ్ బాధ్యతను ఉత్పత్తిదారుపైనే (ఈపీఆర్) మోపే నిబంధనల వల్ల ఈ–వ్యర్థాల రీసైక్లింగ్ సంస్థలకు మరింత ఆదాయం వచ్చే అవకాశం ఉందని నివేదిక వివరించింది. కస్టమర్ల నుంచి నేరుగా ఈ–వ్యర్థాలను సేకరించడం వల్ల కొనుగోలు వ్యయాలు తగ్గుతాయని పేర్కొంది.

2047 నాటికి అధిక ఆదాయ దేశం

- 23–35 ట్రిలియన్ డాలర్లకు జీడీపీ
- బెయిన్ అండ్ కంపెనీ, నాస్కామ్



న్యూఢిల్లీ: సేవల రంగం తోడ్పాటుతో భారత్ 2047 నాటికి అధిక ఆదాయ దేశంగా అవతరిస్తుందని ఒక నివేదిక అంచనా వేసింది. అప్పటికి జీడీపీ 23–35 ట్రిలియన్ డాలర్లకు (రూ.1,978–3,010 లక్షల కోట్లు) చేరుకుంటుందని తెలిపింది. దేశ జీడీపీలో సేవల రంగం వాటా 60 శాతంగా, తయారీ రంగం వాటా 32 శాతం మేర ఉంటుందని పేర్కొంది. ఈ నివేదికను బెయిన్ అండ్ కంపెనీ, నాస్కామ్ సంయుక్తంగా రూపొందించాయి. ''రానున్న దశాబ్దాల్లో 20 కోట్ల మంది శ్రామికశక్తి అందుబాటులోకి వస్తారు. అధిక విలువ ఉద్యోగాలను కల్పించే వినూత్నమైన అవకాశం భారత్ ముందుంది. తద్వారా గణనీయమైన ఆర్థిక సామర్థ్యాలను వెలికి తీయగలదు. ఇందుకు రంగాలవారీ టెక్నాలజీపరమైన కార్యాచరణ అవసరం. ఏఐ ఆధారిత చిప్ డిజైన్, విడిభాగాల తయారీకి కావాల్సిన ముడి సరుకుల సరఫరా వ్యవస్థ ఏర్పాటు చేసుకోవడం వంటి చర్యలు పోటీతత్వాన్ని, ఆవిష్కరణలను పెంచుతాయి. దీనివల్ల ఎగుమతుల్లో తయారీ వాటా 24 శాతం నుంచి 2047 నాటికి 45–50 శాతానికి చేరుకుంటుంది''అని ఈ నివేదిక వివరించింది. అలాగే ఆటో విడిభాగాల ఎగుమతులు 200–250 బిలియన్ డాలర్లు చేరుకోవచ్చని అంచనా వేసింది.

ఐదు కీలక రంగాలు..

అంతర్జాతీయంగా నెలకొన్న ధోరణులు, విస్తృతమైన అవకాశాల దృష్ట్యా.. ఎలక్ట్రానిక్స్, ఇంధనం, కెమికల్స్, ఆటోమోటివ్, సేవలు భారత్‌కు వృద్ధి చోదకాలుగా పనిచేస్తాయని ఈ నివేదిక తెలిపింది. పెరిగే ఆదాయం, నైపుణ్య కార్మికులు, మౌలిక వసతుల కల్పన ఈ వృద్ధికి నడిపిస్తాయని పేర్కొంది.

విజయం దిశగా విదర్భ

ముంబై విజయలక్ష్యం 406... ప్రస్తుతం 83/3

- సూర్యకుమార్, శివమ్ దూబేలపై ఆశలు
- విదర్భ రెండో ఇన్నింగ్స్ 292
- యశ్ రాథోడ్ భారీ సెంచరీ
- షమ్స్ ములానీకి 6 వికెట్లు




యశ్ రాథోడ్

నాగ్‌పూర్: దేశవాళీ ప్రతిష్టాత్మక క్రికెట్ టోర్నమెంట్ రంజీ ట్రోఫీలో డిఫెండింగ్ చాంపియన్ ముంబై జట్టు ముందు భారీ లక్ష్యం నిలిచింది. విదర్భతో జరుగుతున్న సెమీఫైనల్లో 406 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ముంబై గురువారం ఆట ముగిసే సమయానికి 31 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 83 పరుగులు చేసింది. కెప్టెన్ అజింక్య రహానే (12), సిద్దేశ్ లాడ్ (2), ఆయుశ్ మాత్రే (18) విఫలం కాగా... ఆకాశ్ ఆనంద్ (92 బంతుల్లో 27 బ్యాటింగ్; 1 ఫోర్), శివమ్ దూబే (12 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. శుక్రవారం ఆటకు చివరి రోజు కాగా... చేతిలో 7 వికెట్లు ఉన్న ముంబై జట్టు విజయానికి మరో 323 పరుగులు చేయాల్సి ఉంది. తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో ఆకాశ్ ఆనంద్‌తో పాటు టీమిండియా ఆటగాళ్లు సూర్యకుమార్ యాదవ్, శివమ్ దూబే, శార్దుల్ ఠాకూర్ ప్రదర్శనపైనే ముంబై భవితవ్యం ఆధారపడి ఉంది. ఇప్పటి వరకు రికార్డు స్థాయిలో 42 సార్లు రంజీ ట్రోఫీ చేజిక్కించుకున్న ముంబై జట్టు... గత ఏడాది ఫైనల్లో విదర్భపైనే గెలిచి చాంపియన్‌గా అవతరించింది. ప్రత్యర్థికే తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కడంతో ముంబై ఫైనల్ చేరాలంటే... లక్ష్యాన్ని ఛేదించడం ఒక్కటే మార్గం. రాయ్‌స్టన్ డయస్, షమ్స్ ములానీ, తనుశ్ కొటియాన్ కూడా బ్యాటింగ్ చేయగల సమర్థులే కావడంతో... ముంబై దూకుడుగా ఆడి గెలవాలని భావిస్తోంది. విదర్భ బౌలర్లలో హర్ష్ దూబే 2 వికెట్లు పడగొట్టాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 147/4తో గురువారం నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భ జట్టు చివరకు 110.1 ఓవర్లలో 292 పరుగులకు ఆలౌటైంది. యశ్ రాథోడ్ (252 బంతుల్లో 151; 11 ఫోర్లు) భారీ సెంచరీతో చెలరేగాడు. అతడికి కెప్టెన్ అక్షయ్ వాడ్కర్ (202 బంతుల్లో 52; 5 ఫోర్లు) చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు 158 పరుగులు జోడించడంతోనే విదర్భ రెండో ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు చేయగలిగింది. ముంబై బౌలర్లలో షమ్స్ ములానీ 6 వికెట్లు పడగొట్టగా... తనుశ్ కొటియాన్ మూడు వికెట్లు తీశాడు.

స్కోరు వివరాలు

విదర్భ తొలి ఇన్నింగ్స్: 383; ముంబై తొలి ఇన్నింగ్స్: 270; విదర్భ రెండో ఇన్నింగ్స్: అథర్వ (ఎల్బీడబ్ల్యూ) (బి) శార్దుల్ 0; ధ్రువ్ షోరే (ఎల్బీడబ్ల్యూ) (బి) తనుశ్ 13; దానిశ్ (సి అండ్ బి) ములానీ 29; కరుణ్ నాయర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) ములానీ 6; యశ్ రాథోడ్ (సి) రహానే (బి) తనుశ్ 151; అక్షయ్ వాడ్కర్ (బి) ములానీ 52; హర్ష్ దూబే (ఎల్బీడబ్ల్యూ) (బి) తనుశ్ 1; దర్శన్ (సి) (సబ్) భత్కల్ (బి) ములానీ 4; పార్థ్ (సి) తనుశ్ (బి) ములానీ 20; నచికేత్ (సి) రహానే (బి) ములానీ 1; యశ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (110.1 ఓవర్లలో ఆలౌట్) 292. వికెట్ల పతనం:** 1-0, 2-40, 3-52, 4-56, 5-214, 6-221, 7-228, 8-262, 9-274, 10-292. **బౌలింగ్:** శార్దుల్ ఠాకూర్ 14-3-55-1; మోహిత్ 6-0-23-0; షమ్స్ ములానీ 44-9-85-6; రోస్టన్ డియాస్ 9-4-17-0; తనుశ్ కొటియాన్ 33.1-3-81-3; శివమ్ దూబే 3-0-17-0; ఆయుశ్ 1-0-3-0.

ముంబై రెండో ఇన్నింగ్స్: ఆకాశ్ ఆనంద్ (బ్యాటింగ్) 27; ఆయుశ్ (బి) హర్ష్ 18; సిద్దేశ్ (స్టంప్డ్) అక్షయ్ (బి) హర్ష్ 2; రహానే (ఎల్బీడబ్ల్యూ) (బి) పార్థ్ 12; శివమ్ దూబే (బ్యాటింగ్) 12; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (31 ఓవర్లలో 3 వికెట్లకు) 83. వికెట్ల పతనం:** 1-26, 2-37, 3-65. **బౌలింగ్:** నచికేత్ 4-1-14-0; దర్శన్ 2-0-9-0; హర్ష్ దూబే 13-3-26-2; యశ్ ఠాకూర్ 3-0-8-0; పార్థ్ రెఖాడే 8-1-16-1; కరుణ్ నాయర్ 1-0-3-0.

పంకజ్... అదే జోరు

ఆసియా చాంపియన్‌షిప్‌లో 14వ టైటిల్ సొంతం



దోహా: భారత క్యూస్పోర్ట్స్ దిగ్గజం పంకజ్ అద్వానీ మరో అంతర్జాతీయ టైటిల్ సాధించాడు. గురువారం ముగిసిన ఆసియా స్నూకర్ చాంపియన్‌షిప్‌లో అతను విజేతగా నిలిచాడు. ఫైనల్లో పంకజ్ 4-1 (42-72, 93-17, 93-1, 89-21, 70-41) ఫ్రేమ్‌ల తేడాతో ఇరాన్‌కు చెందిన మాజీ ఆసియా, ప్రపంచ స్నూకర్ చాంపియన్ అమీర్ సర్ఖోష్‌పై గెలుపొందాడు. అతని ఖాతాలో ఇది 14వ ఆసియా టైటిల్ కావడం విశేషం. ఇదివరకే అతను స్నూకర్‌లో నాలుగు, బిలియర్డ్స్‌లో తొమ్మిది టైటిల్స్ గెలిచాడు. వీటితో పాటు 2006, 2020లలో జరిగిన ఆసియా క్రీడల్లోనూ స్వర్ణ పతకాలు గెలిచాడు. తాజా ఆసియా టైటిల్‌తో ఓ క్యాలెండర్ ఇయర్‌లో జాతీయ, ఆసియా, ప్రపంచ స్నూకర్ చాంపియన్‌షిప్‌లు గెలిచిన ఆటగాడిగా ఘనత వహించనున్నాడు. బిలియర్డ్స్‌లో ఇదివరకే ఈ రికార్డు లిఖించిన పంకజ్ స్నూకర్‌లో లిఖించాల్సి ఉంది. ఇదే జరిగితే క్యూస్పోర్ట్స్ (బిలియర్డ్స్, స్నూకర్)లోనే ఈ ఘనత వహించిన ఆటగాడిగా చరిత్ర పుటల్లోకెక్కుతాడు. 'ఆసియా పతకం నాకు ప్రత్యేక ఆనందాన్నిచ్చింది. ఈ టోర్నీ చాలా కఠినంగా సాగింది. చివరకు మరో బంగారు పతకాన్ని నా ఖాతాలో వేసుకున్నాను. ఇదే నిలకడైన ప్రదర్శనతో భారత్ గర్వించే విజయాలు మరెన్నో సాధించాలని ఆశిస్తున్నాను' అని మ్యాచ్ విజయానంతరం పంకజ్ అద్వానీ అన్నాడు.

యూకీ జోడీ సంచలనం

ప్రపంచ నంబర్‌వన్ జంటపై గెలుపు



దోహా: ఖతర్ ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నీలో భారత డబుల్స్ స్టార్స్ యూకీ బాంబ్రీ, రోహన్ బోపన్నలకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. గురువారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో యూకీ బాంబ్రీ (భారత్)-ఇవాన్ డోడిగ్ (క్రొయేషియా) జోడీ ఏకంగా ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ జంటను బోల్తా కొట్టించి సెమీ ఫైనల్లోకి దూసుకెళ్లగా... రోహన్ బోపన్న (భారత్)-నునో బోర్జెస్ (పోర్చుగల్) ద్వయం క్వార్టర్ ఫైనల్లో ఇంటిదారి పట్టింది. ప్రపంచ నంబర్‌వన్ జంట మార్సెలో అరెవాలో (ఎల్ సాల్వడార్)-మాట్ పావిక్ (క్రొయేషియా)లతో జరిగిన క్వార్టర్ ఫైనల్లో యూకీ-డోడిగ్ 2-6, 6-3, 10-8తో విజయం సాధించింది. 74 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో యూకీ-డోడిగ్ ఆరు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తమ సర్వీస్‌ను రెండు సార్లు కోల్పోయి, ప్రత్యర్థుల సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేసింది. అయితే 'సూపర్ టైబ్రేక్'లో యూకీ-డోడిగ్ ద్వయం పైచేయి సాధించింది. జూలియన్ క్యాష్-లాయిడ్ గ్లాస్‌పూల్ (బ్రిటన్)లతో జరిగిన క్వార్టర్ ఫైనల్లో బోపన్న-బోర్జెస్ 4-6, 7-6 (7/5), 7-10తో 'సూపర్ టైబ్రేక్'లో ఓటమి పాలయ్యారు.

జైమీత్ పోరాటం

- తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దిశగా గుజరాత్
- రెండో ఇన్నింగ్స్‌లో 429/7
- మరో 29 పరుగులు చేస్తే ఫైనల్ బెర్త్
- కేరళతో రంజీ ట్రోఫీ సెమీఫైనల్



అహ్మదాబాద్: జైమీత్ పటేల్ (161 బంతుల్లో 74 బ్యాటింగ్; 2 ఫోర్లు), సిద్ధార్థ్ దేశాయ్ (134 బంతుల్లో 24 బ్యాటింగ్; 1 ఫోర్) మొండి పట్టుదలతో ఆడటంతో... గుజరాత్ జట్టు రంజీ ట్రోఫీ ఫైనల్‌కు చేరువైంది. కేరళతో జరుగుతున్న సెమీఫైనల్లో ఓవర్‌నైట్ స్కోరు 222/1తో గురువారం నాలుగో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన గుజరాత్ జట్టు... ఆట ముగిసే సమయానికి 154 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 429 పరుగులు చేసింది. ఫలితం తేలడం కష్టమైన ఈ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించిన జట్టే ఫైనల్‌కు చేరుకోవడం ఖాయమైంది. అంతకుముందు కేరళ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 457 పరుగులు చేయగా... ప్రస్తుతం చేతిలో 3 వికెట్లు ఉన్న గుజరాత్ మరో 29 పరుగులు చేస్తే కేరళ స్కోరును దాటేస్తుంది. ప్రియాంక్ పాంచాల్ (237 బంతుల్లో 148; 18 ఫోర్లు, 1 సిక్స్) భారీ సెంచరీ ఖాతాలో వేసుకోగా... మనన్ హింగ్‌రాజియా (127 బంతుల్లో 33; 3 ఫోర్లు), ఉర్విల్ పటేల్ (43 బంతుల్లో 25; 3 ఫోర్లు), హేమంగ్ పటేల్ (41 బంతుల్లో 27; 2 ఫోర్లు, 1 సిక్స్) తలా కొన్ని పరుగులు చేశారు. కెప్టెన్ చింతన్ గాజా (2), విశాల్ జైస్వాల్ (14) ఎక్కువసేపు నిలవలేకపోయారు. చివర్లో సిద్ధార్థ్ దేశాయ్‌తో కలిసి జైమీత్ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఓ పక్క పరుగులు సాధిస్తూనే... ఓవర్లు కరిగించాడు. ఈ జంట అబేధ్యమైన ఎనిమిదో వికెట్‌కు 220 బంతుల్లో 72 పరుగులు జోడించింది. ఓవరాల్‌గా గురువారం 83 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసిన గుజరాత్ జట్టు 207 పరుగులు చేసింది. కేరళ బౌలర్లలో జలజ్ సక్సేనా 4 వికెట్లు పడగొట్టాడు.

స్కోరు వివరాలు

కేరళ తొలి ఇన్నింగ్స్: 457; గుజరాత్ తొలి ఇన్నింగ్స్: ప్రియాంక్ (బి) జలజ్ సక్సేనా 148; ఆర్య దేశాయ్ (బి) బాసిల్ 73; మనన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) జలజ్ సక్సేనా 33; ఉర్విల్ పటేల్ (స్టంప్డ్) అజహరుద్దీన్ (బి) జలజ్ సక్సేనా 25; హేమాంగ్ పటేల్ (సి) (సబ్) రోజర్ (బి) నిధీశ్ 27; జైమీత్ పటేల్ (బ్యాటింగ్) 74; చింతన్ గాజా (ఎల్బీడబ్ల్యూ) (బి) జలజ్ సక్సేనా 2; విశాల్ జైస్వాల్ (సి) బాసిల్ (బి) ఆదిత్య 14; సిద్ధార్థ్ దేశాయ్ (బ్యాటింగ్) 24; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (154 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి) 429. వికెట్ల పతనం:** 1-131, 2-238, 3-277, 4-292, 5-320, 6-325, 7-357. **బౌలింగ్:** నిధీశ్ 23-4-86-1; జలజ్ సక్సేనా 61-12-137-4; బాసిల్ 22-1-59-1; ఆదిత్య సర్వతే 36-3-104-1; అక్షయ్ చంద్రన్ 11-0-31-0; ఇమ్రాన్ 1-0-3-0.


సాకేత్ జోడీ ఓటమి



పుణే: మహా ఓపెన్ ఏటీపీ చాలెంజర్-100 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో భారత డేవిస్ కప్ జట్టు సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ సాకేత్ మైనేని పోరాటం ముగిసింది. గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో సాకేత్-రామ్‌కుమార్ రామనాథన్ (భారత్) ద్వయం 3-6, 6-2, 10-12తో 'సూపర్ టైబ్రేక్'లో భారత్‌కే చెందిన టాప్ సీడ్ జీవన్ నెడుంజెళియన్-విజయ్ సుందర్ ప్రశాంత్ జంట చేతిలో ఓడిపోయింది. 88 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాకేత్-రామ్ ఏడు ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థుల సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశారు. అయితే నిర్ణాయక 'సూపర్ టైబ్రేక్'లో జీవన్-విజయ్ ద్వయం పైచేయి సాధించి విజయాన్ని ఖరారు చేసుకుంది. మరో క్వార్టర్ ఫైనల్లో నికీ కలియంద పునాచా (భారత్)-కోట్నీ జాన్ లాక్ (జింబాబ్వే) ద్వయం 7-6 (7/4), 6-7 (4/7), 10-8తో నాలుగో సీడ్ బ్లేక్ ఇలిస్-ట్రిస్టన్ స్కూల్‌కేట్ (ఆస్ట్రేలియా) జంటను ఓడించి సెమీఫైనల్లోకి ప్రవేశించింది.

ఫఖర్ స్థానంలో ఇమామ్


గాయం కారణంగా పాక్ జట్టులో మార్పులు


ఫఖర్

కరాచీ: ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలోనే అత్యంత కీలకమైన భారత్‌తో మ్యాచ్‌కు ముందు ఆతిథ్య పాకిస్తాన్‌కు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ ఓపెనర్ ఫఖర్ జమాన్ మోకాలు గాయంతో మొత్తం టోర్నీకి దూరమయ్యాడు. దీంతో టాపార్డర్ బ్యాటర్ స్థానాన్ని ఇమాముల్ హక్‌తో భర్తీ చేసుకుంది. ఈ మేరకు ముందుగా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ)కి తెలుపగా తాజాగా ఐసీసీ నుంచి ఆమోదం లభించింది. దీంతో గురువారం పాకిస్తాన్ జట్టు దుబాయ్‌కి పయనమైంది. ఈ జట్టుతో పాటు ఇమాముల్ కూడా ఉన్నాడు. 29 ఏళ్ల ఇమాముల్ హక్‌కు 72 వన్డేలు ఆడిన అనుభవం ఉంది. న్యూజిలాండ్‌తో జరిగిన టోర్నీ ఆరంభ మ్యాచ్‌లో ఫఖర్ గాయపడ్డాడు. అయితే అతని మోకాలు గాయం కొత్తదేమీ కాదు. చాలా ఏళ్లుగా అతన్ని వేధిస్తోంది. దీని వల్లే ఫఖర్ జమాన్ భారత్ ఆతిథ్యమిచ్చిన 2023 వన్డే ప్రపంచకప్ తర్వాత మళ్లీ ఇప్పుడే ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీతో జట్టులోకి వచ్చాడు. కానీ అతని ముచ్చట ఒక్క మ్యాచ్‌తోనే ముగిసింది. 34 ఏళ్ల ఫఖర్ 86 వన్డేలు ఆడి 3651 పరుగులు చేశాడు. అతని ఖాతాలో ఓ డబుల్ సెంచరీ (210 నాటౌట్) సహా 11 శతకాలు, 17 అర్ధసెంచరీలు ఉన్నాయి.

అంగరంగ వైభవంగా...

ఫార్ములావన్ 75వ సీజన్ ఆరంభ వేడుకలు



లండన్: ఫార్ములావన్ 75వ వార్షికోత్సవ సీజన్ ఆరంభ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. నలుపు రోడ్డుపై వాయువేగంతో కార్లు నడుపుతూ అభిమానులను అలరించే రేసర్లు... ఈ ఈవెంట్‌లో 'రెడ్ కార్పెట్'పై అభిమానులకు చేతులుపుతూ దర్శనమిచ్చారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో 2025 సీజన్‌లో పోటీపడే 20 మంది డ్రైవర్లు తమ కార్లతో పాటు పాల్గొన్నారు. ఏడు సార్లు ప్రపంచ చాంపియన్ లూయిస్ హామిల్టన్... స్టేజి మీదకు వచ్చిన సమయంలో ప్రేక్షకుల హర్షధ్వానాలతో ఆడిటోరియం మార్మోగిపోయింది. సుదీర్ఘ ఎఫ్1 చరిత్రలో ఇలాంటి వేడుక జరగడం ఇదే తొలిసారి కాగా... ఇందులో భాగంగా బ్రిటన్ సింగర్ కేన్ బ్రౌన్ మ్యూజిక్ షో ఆహుతులను కట్టిపడేసింది. కనీవినీ ఎరగని రీతిలో కళ్లు మిరుమిట్లు గొలిపేలా సాగిన ఈ కార్యక్రమంలో... పలువురు ప్రముఖ కళాకారులు పాల్గొన్నారు. ఫార్ములావన్‌ను మరింత విస్తరించడంలో భాగంగానే హాలీవుడ్ సినిమా స్థాయిలో ఈ వేడుకు నిర్వహించారు. దీనిపై హామిల్టన్ స్పందిస్తూ... 'చాలా ఉత్సాహంగా ఉంది. కొత్త సీజన్‌లో మరింత వేగంగా దూసుకెళ్లాలని చూస్తున్నా. అందుకు కావాల్సిన శక్తి ఉంది. కొత్త జట్టులో భాగం కావడం ఆనందంగా ఉంది. ఇదే ఉత్తేజంతో ముందుకు సాగుతా' అని అన్నాడు. 24 రేసులతో కూడిన 2025 ఫార్ములావన్ సీజన్ మార్చి 16న మెల్‌బోర్న్‌లో జరిగే ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రితో మొదలవుతుంది.



శ్రీజ పరాజయం

షెన్‌జెన్ (చైనా): ఆసియా కప్ టేబుల్ టెన్నిస్ (టీటీ) టోర్నమెంట్‌లో భారత నంబర్‌వన్, తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజకు తొలి పరాజయం ఎదురైంది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ గ్రూప్-1 రెండో లీగ్ మ్యాచ్‌లో శ్రీజ 8-11, 10-12, 5-11తో సన్ యింగ్‌షా (చైనా) చేతిలో ఓటమి పాలైంది. చియెన్ టుంగ్ చౌన్ (చైనీస్ తైపీ)తో నేడు జరిగే మ్యాచ్‌లో శ్రీజ గెలిస్తే ప్రిక్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది. పురుషుల సింగిల్స్‌లో గ్రూప్-3లో ఉన్న ఆచంట శరత్ కమల్ (భారత్) తొలి విజయం అందుకున్నాడు. రెండో లీగ్ మ్యాచ్‌లో శరత్ కమల్ 11-6, 11-4, 11-7తో గుబ్రాన్ (యెమెన్)పై గెలిచాడు. గ్రూప్-7లో ఉన్న మానవ్ ఠక్కర్ 6-11, 11-7, 11-8, 5-11, 11-4తో ఇజాక్ క్వెక్ (సింగపూర్)ను ఓడించాడు. గ్రూప్-8లో ఉన్న హర్మీత్ దేశాయ్ 7-11, 12-10, 11-9, 8-11, 11-9తో కిరిల్ జెరాసిమెంకో (కజకిస్తాన్)పై విజయం సాధించాడు.

భారత్ శుభారంభం

'పింక్ లేడీస్ కప్' తొలి మ్యాచ్‌లో జోర్డాన్‌పై గెలుపు



షార్జా: 'పింక్ లేడీస్ కప్-2025'లో భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు శుభారంభం చేసింది. గురువారం జరిగిన తమ తొలి పోరులో స్వీటీ దేవీ సారథ్యంలోని భారత జట్టు 2-0 గోల్స్ తేడాతో జోర్డాన్‌పై విజయం సాధించింది. భారత్ తరఫున ప్రియాంక దేవి (23వ నిమిషంలో), మనీషా (54వ నిమిషంలో) చెరో గోల్ చేశారు. మ్యాచ్ ఆరంభం నుంచే భారత మహిళల జట్టు దూకుడు కనబర్చింది. తొలి అర్ధభాగంలో వచ్చిన అవకాశాన్ని ప్రియాంక దేవి సద్వినియోగ పర్చుకుంటూ... జోర్డాన్ గోల్ కీపర్‌ను బోల్తా కొట్టించి భారత్ ఖాతా తెరిచింది. కాసేపటికే స్కోరు పెంచే అవకాశం వచ్చినా... దాన్ని మనీషా సరిగ్గా వినియోగించుకోలేక పోయింది. ద్వితీయార్థంలో ఎలాంటి పొరపాటుకు తావివ్వకుండా మనీషా గోల్ కొట్టి జట్టుకు విజయం ఖాయం చేసింది. క్రిస్పిన్ ఛెత్రి భారత మహిళల కోచ్‌గా ఎంపికైన అనంతరం మన జట్టుకు ఇదే తొలి విజయం కావడం విశేషం. జోర్డాన్ పదే పదే ప్రతి దాడులకు ప్రయత్నించినా... స్వీటీ దేవి, పూర్ణిమ కస్తూరితో కూడిన రక్షణ శ్రేణి వాటిని సమర్థవంతంగా అడ్డుకుంది. తెలంగాణ అమ్మాయి గుగులోతు సౌమ్య ఆకట్టుకుంది. ఈ మ్యాచ్ ద్వారా భారత యంగ్‌ప్లేయర్ లిషమ్ బబీనా దేవి అంతర్జాతీయ అరంగేట్రం చేసింది. తదుపరి పోరులో ఆదివారం రష్యాతో భారత్ తలపడుతుంది.

అన్ని వర్గాలకు నచ్చే విధంగా...

ఢిల్లీ కేబినెట్ కూర్పు

న్యూఢిల్లీ: ఢిల్లీలో దాదాపు 26 ఏళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన బీజేపీ తాజాగా ఏర్పాటైన రేఖా గుప్తా ప్రభుత్వంలో అన్ని ప్రధాన వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించింది. ముఖ్యమంత్రి రేఖా గుప్తా(50) బనియా వర్గానికి చెందిన ఎమ్మెల్యే. మంత్రులుగా పర్వేశ్ వర్మ, ఆశిష్ సూద్, మంజీందర్ సింగ్ సిర్సా, కపిల్ మిశ్రా, రవీందర్ ఇంద్రజ్ సింగ్, పంకజ్ సింగ్ ప్రమాణం చేశారు. వీరిలో పర్వేశ్ వర్మ జాట్ నేత. సీఎం పదవికి పోటీ పడిన వారిలో ఈయన ముందు వరుసలో ఉన్నారు. రవీందర్ ఇంద్రజ్ సింగ్ దళిత నేత కాగా, మజీందర్ సింగ్ సిర్సా సిక్కు నేత . కపిల్ మిశ్రా, పంకజ్ సింగ్‌లు పూర్వాంచల్ ప్రాంత వాసులు. ఆశిష్ సూద్ బీజేపీ పంజాబీ నేతల్లో ప్రముఖుడిగా ఉన్నారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని విజయ తీరాలకు చేర్చిన ఆయా వర్గాల వారికి సంతుష్టి కలిగించేందుకు బీజేపీ పెద్దలు యత్నించినట్లు చెబుతున్నారు.

కేబినెట్‌లో జాట్ వర్గం నేత

ఢిల్లీ అసెంబ్లీకి ఇటీవల జరిగిన ఎన్నికల్లో న్యూఢిల్లీ సీటు నుంచి ఆప్ చీఫ్, మాజీ సీఎం కేజ్రీవాల్‌పై ఘన విజయం సాధించడం ద్వారా ఒక్కసారిగా తెరపైకి వచ్చారు పర్వేశ్ వర్మ(47). ఢిల్లీ సీఎం కుర్చీ కోసం పోటీ పడిన బీజేపీ నేతల్లో ఈయన కూడా ఉన్నారు. 2014 ఎన్నికల్లో పశ్చిమ ఢిల్లీ లోక్‌సభ నియోజకవర్గం నుంచి విజయం సాధించిన పర్వేశ్ వర్మ పేరు జాతీయ రాజకీయాల్లో వినపడింది. అయితే, మూడుసార్లు సీఎంగా పనిచేసిన కేజ్రీవాల్‌ను ఓడించిన తర్వాత ఈయన పేరు ఒక్కసారిగా మారుమోగింది. ఢిల్లీలోని జాట్ నేతల్లో ప్రముఖంగా ఉన్నారు. గురువారం సీఎం రేఖా గుప్తాతోపాటు మంత్రిగా ప్రమాణం చేసిన వారిలో పర్వేశ్ వర్మ ఒకరు. మాజీ సీఎం సాహిబ్ సింగ్ వర్మ కుమారుడే పర్వేశ్. కేజ్రీవాల్‌పై పోటీ చేస్తానంటూ బహిరంగంగా ప్రకటించిన ఫైర్ బ్రాండ్ నేత. అసెంబ్లీ ఎన్నికల్లో కేజ్రీవాల్‌కు గట్టి పోటీ ఇచ్చేది తానేనంటూ ముందుకు వచ్చారు. ఇటీవలి ఎన్నికల్లో నాలుగు వేల ఓట్ల తేడాతో కేజ్రీను ఓడించారు. కాగా, మూడు పర్యాయాలు సీఎంగా పనిచేసిన షీలా దీక్షిత్‌ను ఇదే న్యూఢిల్లీ నియోజకవర్గంలో 2013లో కేజ్రీవాల్ ఓడించడం గమనార్హం. 1977లో పుట్టిన పర్వేశ్ వర్మ రాజకీయాలపై ఆసక్తి పెంచుకుని 1991లో ఆర్‌ఎస్‌ఎస్‌లో బాల్ స్వయంసేవక్‌గా చేరారు. బీజేపీ యువ మోర్చాలో చేరి నేషనల్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడి స్థాయికి ఎదిగారు. బీజేపీ ఢిల్లీ విభాగం ప్రధాన కార్యదర్శిగానూ పనిచేశారు. ఫోర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఎంబీఏ డిగ్రీ చేసిన వర్మ తన తండ్రి నెలకొల్పిన రాష్ట్రీయ స్వాభిమాన్ అనే ఎన్‌జీవో ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. 2013లో మెహ్రౌలీ నుంచి మొదటిసారిగా ఎమ్మెల్యే అయ్యారు. అనంతరం ఢిల్లీ పశ్చిమ లోక్‌సభ నియోజకవర్గం నుంచి 2014, 2019 ఎన్నికల్లో వరుస విజయాలు సాధించారు. 2019 ఎన్నికల్లో ఏకంగా 5.78 లక్షల ఓట్ల తేడాతో పర్వేశ్ వర్మ సాధించిన విజయం ఒక రికార్డుగా ఉంది.


పర్వేశ్ వర్మ


పంకజ్ కుమార్ సింగ్

దంత వైద్యుడు.. పూర్వాంచల్ నేత పంకజ్ కుమార్ సింగ్

రేఖా గుప్తా ప్రభుత్వంలో మంత్రిగా ప్రమాణం చేసిన మరో ఎమ్మెల్యే పంకజ్ కుమార్ సింగ్(48). వృత్తి రీత్యా దంతవైద్యుడైన పంకజ్ కుమార్ గుప్తా పూర్వాంచల్ ప్రాంతానికి చెందిన నేత. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో మొట్టమొదటిసారిగా వికాస్‌పురి నుంచి పోటీ చేసి, ప్రత్యర్థిపై 12వేల పైచిలుకు ఓట్ల తేడాతో ఘన విజయం సాధించారు. ఢిల్లీ బీజేపీ పూర్వాంచల్ మోర్చా ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు పంకజ్ కుమార్. ఢిల్లీలో ఉండే ఉత్తరప్రదేశ్, తూర్పు ప్రాంతం బిహార్, జార్ఖండ్ వారిని పూర్వాంచల్ వాసులుగా పిలుస్తుంటారు. ఢిల్లీలోని పలు నియోజకవర్గాల్లో వీరిదే పైచేయి. బిహార్‌లోని బోధ్‌గయలో ఉన్న మగధ్ యూనివర్సిటీ నుంచి 1998లో డెంటల్ సర్జరీలో డిగ్రీ చేశారు. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌లో మున్సిపల్ కార్పొరేషన్ నేతగా పనిచేశారు. మరికొద్ది నెలల్లో బిహార్ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న వేళ బీజేపీ ఈయనకు కేబినెట్‌లో స్థానం కల్పించడం గమనార్హం.

ఒకప్పుడు మోదీ విమర్శకుడు.. నేడు హిందుత్వ వీరాభిమాని

ఢిల్లీ మంత్రిగా గురువారం ప్రమాణం చేసిన కపిల్ మిశ్రా(44) ఒకప్పుడు ఆప్ సభ్యుడు. ప్రధాని మోదీని, బీజేపీ, ఆర్‌ఎస్‌లను తీవ్రంగా విమర్శించిన వివాదాస్పద నేతగా ఉన్నారు. అటువంటి వ్యక్తి పూర్తిగా మారిపోయారు. నేడు హిందుత్వకు వీరాభిమాని అయ్యారు. కపిల్ మిశ్రాను కేబినెట్‌లో తీసుకోవడాన్ని బీజేపీ వ్యూహాత్మక చర్యగా భావిస్తున్నారు. 2010లో ఢిల్లీలో కామన్‌వెల్త్ గేమ్స్ జరిగిన సమయంలో కపిల్ మిశ్రా అవినీతి వ్యతిరేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. ఆప్ వ్యవస్థాపకుల్లో ఒకరైన కుమార్ విశ్వాస్‌కు సన్నిహితుడిగా భావిస్తారు. ఢిల్లీ వర్సిటీ నుంచి సోషల్ వర్క్‌లో ఎంఏ చేసిన మిశ్రా 2015లో ఆప్ తరఫున కరవల్ నగర్ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించడం ద్వారా రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. కేజ్రీవాల్ కేబినెట్‌లో జల వనరుల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అయితే, కేజ్రీవాల్, కుమార్ విశ్వాస్ మధ్య విభేదాలు తలెత్తడంతో కపిల్ మిశ్రా కూడా కేజ్రీకి దూరమయ్యారు. అనంతరం కుమార్ విశ్వాస్, కపిల్ మిశ్రాలు కేజ్రీతోపాటు ఆప్ మరో నేత సత్యేందర్ జైన్‌లకు వ్యతిరేకంగా అవినీతి ఆరోపణలు చేశారు. 2017లో మంత్రి పదవి కోల్పోయారు. అయినప్పటికీ, ఆప్ ఎమ్మెల్యేగా ఉంటూనే కేజ్రీవాల్‌పై విమర్శలు మాత్రం మానలేదు. 2019లో ఆయనపై ఆప్ బహిష్కరణ వేటు వేసింది. 2019లోనే బీజేపీలో చేరారు కపిల్ మిశ్రా. బీజేపీ ఢిల్లీ విభాగం ఉపాధ్యక్ష పదవిని చేపట్టారు. 2020 ఎన్నికల్లో బీజేపీ టిక్కెట్‌పై పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనంతరం, బీజేపీ, హిందుత్వకు అనుకూలంగా ముస్లింలకు వ్యతిరేకంగా మాట్లాడటం మొదలైంది. 2020 ఢిల్లీ అల్లర్ల సమయంలో విద్వేష ప్రసంగాలు చేశారంటూ ఆయనపై ఆరోపణలొచ్చాయి. తాజాగా బీజేపీ ప్రభుత్వంలో మంత్రిగా ప్రమాణం చేసిన నేపథ్యంలో గతంలో ఆయన ప్రధాని మోదీ, ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీల తీరును ఎండగడుతూ ఆయన చేసిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. ఇటీవలి ఎన్నికల్లో ఆప్ నేత మనోజ్ కుమార్ త్యాగిపై 23 వేల పైచిలుకు ఓట్లతో విజయం సాధించారు.


కపిల్ మిశ్రా

పంజాబీ నేత ఆశిష్ సూద్


ఆశిష్ సూద్

ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షుడైన ఆశిష్ సూద్(58) ఢిల్లీలోని బీజేపీ పంజాబీ నేతల్లో ఒకరు. తాజా ఎన్నికల్లో జనక్‌పురి నుంచి 18 వేల ఓట్ల తేడాతో ఎమ్మెల్యేగా గెలుపొంది గురువారం రేఖా గుప్తా కేబినెట్‌లో మంత్రిగా ప్రమాణం చేశారు. సంస్థాగత వ్యవహారాల్లో నిపుణుడిగా పేరున్న సూద్ ప్రస్తుతం బీజేపీ గోవా వ్యవహారాలతోపాటు జమ్మూకశ్మీర్ సహ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఏబీవీపీ జాతీయ కార్యదర్శిగానూ పనిచేశారు. 2003లో బీజేపీ యువమోర్చా జనరల్ సెక్రటరీగా పనిచేసిన ఈయన, ఆ తర్వాత రెండేళ్లకే జాతీయ ఉపాధ్యక్షుడి స్థాయికి ఎదిగారు. 2009లో ఢిల్లీ బీజేపీ ప్రధాన కార్యదర్శిగా, ఆ తర్వాత రాష్ట్ర విభాగం ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. 2012లో దక్షిణ ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎన్నికయ్యారు. ఆర్‌ఎస్‌ఎస్‌తోపాటు బీజేపీ అగ్ర నాయకులకు ఆశిష్ సూద్ ఎంతో నమ్మకస్తుడని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. వ్యాపారవేత్త అయిన ఈయన కామర్స్‌లో డిగ్రీ చేశారు.

దళిత వర్గం నేత రవీందర్


రవీందర్ ఇంద్రజ్ సింగ్

రేఖా గుప్తా సారథ్యంలోని ప్రభుత్వంలో మంత్రిగా ప్రమాణం చేసిన రవీందర్ ఇంద్రజ్ సింగ్(50) కేబినెట్‌లో దళిత వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బీజేపీ ఎస్సీ మోర్చాలో కీలక సభ్యుడిగా ఉన్న రవీందర్ ఇటీవలి ఎన్నికల్లో మొదటిసారిగా ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఢిల్లీ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఓపెన్ లెర్నింగ్(ఎస్‌ఓఎల్) నుంచి బీఏ పట్టా అందుకున్న రవీందర్‌కు ఢిల్లీ బీజేపీలో దళిత నేతగా మంచి పేరుంది. ఇటీవలి ఎన్నికల్లో బావన ఎస్సీ రిజర్వుడ్ స్థానంలో ఆమ్‌ఆద్మీ పార్టీ నేత జై భగవాన్ ఉప్కార్‌ను 31 వేల ఓట్ల తేడాతో మట్టి కరిపించారు. నార్త్ ఢిల్లీ నియోజకవర్గంలో బీజేపీకి మద్దతు కూడగట్టడంలో రవీందర్ కీలకంగా వ్యవహరించారు. మొదట్నుంచీ బావన నియోజకవర్గంతోనే ఆయనకు ఎక్కువగా అనుబంధం ఉంది. ఈయన తండ్రి ఇంద్రజ్ సింగ్ గతంలో నరేల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పనిచేశారు. ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన అఫిడవిట్‌ను అనుసరించి ఈయన ఆస్తులు రూ.7 కోట్లు కాగా, ఎటువంటి క్రిమినల్ కేసులు లేవు.

సిక్కుల ప్రతినిధి మంజిందర్ సింగ్ సిర్సా


మంజిందర్ సింగ్ సిర్సా

ఢిల్లీ రాజకీయ ముఖచిత్రంలో బాగా వినిపించే పేరు మంజిందర్ సింగ్ సిర్సా(53). కోవిడ్ మహమ్మారి ప్రబలంగా ఉన్న సమయంలో ఆక్సిజన్ లాంగార్స్ నిర్వహించి చురుగ్గా వ్యవహరించిన సామాజిక కార్యకర్తగా సిక్కు నేతగా సిర్సాకు మంచి పేరుంది. తాజాగా రేఖా గుప్తా ప్రభుత్వంలో మంత్రిగా మాతృభాష పంజాబీలో ప్రమాణం చేశారు. సిక్కు వర్గం మద్దతు కూడగట్టేందుకే ఈయనకు బీజేపీ మంత్రి వర్గంలో స్థానం కల్పించినట్లు పరిశీలకులు చెబుతున్నారు. తాజా ఎన్నికల్లో ఆప్‌కు చెందిన ధన్వతి చండేలాపై 18 వేల పైచిలుకు ఓట్ల తేడాతో విజయం సాధించారు. రాజౌరీ గార్డెన్ స్థానం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మజీందర్ సింగ్ శిరోమణి అకాలీదళ్‌ను వీడి 2021లో బీజేపీలో చేరారు. 2013లో మొదటిసారిగా రాజౌరీ గార్డెన్ సీటును గెలుచుకున్నారు. 2013 నుంచి 2019 వరకు ఢిల్లీ సిక్కు గురుద్వారా యాజమాన్య కమిటీ(డీఎస్‌జీఎంసీ)కి సుదీర్ఘకాలం ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. అనంతరం డీఎస్‌జీఎంఎంసీకి అధ్యక్షుడిగా 2019–2022 మధ్య సేవలందించారు. ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్‌లో తనకు రూ.188 కోట్ల ఆస్తులు, భార్య సత్వీందర్ కౌర్ సిర్సాకు కూడా రూ.71 కోట్ల ఆస్తులున్నట్లు వెల్లడించారు. మంజిందర్‌పై ఒక ఎఫ్ఐఆర్, నాలుగు పరువు నష్టం కేసులు నమోదై ఉన్నాయి.

ఎయిర్ ఫోర్స్ వన్ కోసం పాత విమానాలకు మార్పులు చేయిస్తాం

బోయింగ్ విమానాలు ఆలస్యం కావడంపై ట్రంప్ అసహనం

వాషింగ్టన్: కాంట్రాక్టు ఒప్పందం ప్రకారం బోయింగ్ కంపెనీ ఎయిర్ ఫోర్స్ వన్ విమానాలను అందజేయడంలో ఆలస్యం చేస్తుండటంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయంగా బోయింగ్ పాత విమానాలను కొనుగోలు చేసి, వాటిని అవసరాలకు అనుగుణంగా మార్చనున్నామని చెప్పారు. అమెరికా అధ్యక్షుడి పర్యటనల కోసం ప్రత్యేకంగా వాడే 'ఎయిర్ ఫోర్స్ వన్'విమానాలను బోయింగ్ కంపెనీ రూపొందిస్తుంది. రెండు విమానాలను కొనుగోలు చేసేందుకు అమెరికా ప్రభుత్వం గతంలో ఒప్పందం కుదుర్చుకుంది. అయితే, ఖరీదు చాలా ఎక్కువైందంటూ ట్రంప్ మొదటిసారి అధ్యక్షుడైన సమయంలో కాంట్రాక్టును మార్చారు. మారిన నిబంధనల ప్రకారం 2024లోనే బోయింగ్ మొదటి విమానాన్ని అందజేయాల్సి ఉంది. కానీ, ఉద్యోగుల సమ్మె, కరోనా మహమ్మారి వంటి కారణాలతో ఆ కంపెనీ నష్టాల్లో కూరుకుపోయి పనులు నిలిచిపోయాయి. తాజా అంచనాల ప్రకారం, మొదటిది 2027లో, 2028లో ట్రంప్ పదవి నుంచి దిగిపోయే సమయానికి రెండో విమానం అందుతుంది. 35 ఏళ్ల నాటి బోయింగ్ 'ఎయిర్ ఫోర్స్ వన్'విమానంలో బుధవారం ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ..బోయింగ్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆ కాంట్రాక్టుకు ప్రత్యామ్నాయం చూస్తున్నామన్నారు. యూరప్ కంపెనీ ఎయిర్ బస్ నుంచి కొంటారా అన్న ప్రశ్నకు ఆయన.. అలాంటిదేమీ లేదన్నారు. విదేశీ కంపెనీ కంటే స్వదేశీ కంపెనీకి ప్రాధాన్యం ఇస్తామన్నారు. బోయింగ్ కంపెనీకే చెందిన వాడిన విమానాన్ని కొని, దానిలో మార్పులు చేయిస్తామని చెప్పారు. ఖరీదు ఎక్కువనే కారణంతో ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో డిజైన్ చేసిన కొత్తతరం వీసీ–25బీ రకం విమానాలను సైతం ట్రంప్ తిరస్కరించారు. గాలిలో ఉండగానే ఇంధనం నింపుకునే సౌకర్యంతోపాటు అధ్యక్షుడికి అవసరమైన మరెన్నో ప్రత్యేకతలు ఇందులో ఉన్నాయి. ఇలా ఉండగా, అధ్యక్షుడు ట్రంప్ శనివారం బోయింగ్ 747–800 రకం కొత్త విమానాన్ని పరిశీలించారని వైట్ హౌస్ తెలిపింది. ఇందులో అత్యాధునిక హార్డ్‌వేర్, ఇతర సాంకేతిక ప్రత్యేకతలను ఆయన తెలుసుకున్నారు. అదేవిధంగా, పామ్‌బీచ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో పార్కు చేసిన ఉన్న ఖతార్ రాజకుటుంబానికి చెందిన 15 ఏళ్లనాటి ప్రైవేట్ విమానం లోపల కూడా ఆయన తిరిగి చూశారని తెలిపింది.

మస్క్ ప్రతిపాదన నచ్చింది: ట్రంప్

వాషింగ్టన్: ఫెడరల్ వ్యవస్థ తగ్గింపుతో పొదుపు చేసిన డబ్బు ఖర్చుపై డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియెన్సీ (డోజ్) ప్రతిపాదనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సమర్థించారు. వ్యయ తగ్గింపుతో మిగిల్చిన మొత్తంలోని కొంత డబ్బును అమెరికా పౌరులకు డివిడెండ్ రూపంలో తిరిగి ఇచ్చే ఆలోచన తనకు నచ్చిందన్నారు. మయామీలో జరిగిన ఇన్వెస్టర్స్ మీట్‌లో ఆయన మాట్లాడారు. అనంతరం విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ.. మస్క్ ప్రతిపాదనకు మద్దతిచ్చారు. వ్యయ తగ్గింపులతో మిగిలే మొత్తంలో 20 శాతాన్ని అమెరికా పౌరులకు డివిడెండ్‌గా ఇవ్వాలని, మరో 20 శాతాన్ని జాతీయ రుణాలను చెల్లించడానికి ఉపయోగించాలని డోజ్ ప్రతిపాదించింది. ఈ సొమ్ము ప్రజల ఖాతాల్లోకి వెళ్లడం ద్వారా.. వృథాను అరికట్టేందుకు వారే ముందుకొస్తారన్నారు.

అస్సాం కాంగ్రెస్ ఎంపీపై దాడి

రకీబుల్‌కు తప్పిన ముప్పు | వ్యక్తిగత భద్రతా సిబ్బందికి గాయాలు

గౌహతి: అస్సాంకు చెందిన కాంగ్రెస్ ఎంపీ రకీబుల్ హుస్సైన్‌తోపాటు ఆయన వ్యక్తిగత భద్రతా సిబ్బందిపై దుండగులు దాడికి పాల్పడ్డారు. అస్సాంలోని నాగావ్ జిల్లాలో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఎంపీ క్షేమంగా బయటపడగా, ఆయన సిబ్బందికి స్వల్ప గాయాలయ్యాయి. రకీబుల్ హుస్సైన్ అస్సాంలో ధూబ్రీ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రుపోహీ పోలీసు స్టేషన్ పరిధిలోని గునమారీ గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొనేందుకు వెళ్తుండగా కొందరు వ్యక్తులు గుంపుగా వచ్చి దాడికి దిగారు. క్రికెట్ బ్యాట్లతో విరుచుకుపడ్డారు. గుర్తుపట్టకుండా ముఖాలకు నల్లరంగు వస్త్రాలు కప్పుకున్నారు. ఎంపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. భద్రతా సిబ్బంది ఎంపీకి రక్షణగా నిల్చున్నారు. అయినా దుండుగులు వెనక్కి తగ్గకపోవడంతో గాల్లోకి కాల్పులు జరపాల్సి వచ్చింది. భారీ సంఖ్యలో చుట్టుముట్టి దాడి చేయడంతో భద్రతా సిబ్బంది గాయపడ్డారు. ముష్కరులు వీరంగం సృష్టించారు. సమాచారం అందుకున్న అధికారులు అదనపు బలగాలను రంగంలోకి దించడంతో వారంతా పారిపోయారు. అనంతరం ఎంపీ రకీబుల్ యథావిధిగా కాంగ్రెస్ సమావేశంలో పాల్గొన్నారు. ఎంపీపై దాడి ఘటనపై అస్సాం కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. ముష్కర మూకను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై అస్సాం ముఖ్యమంత్రి హిమంతబిశ్వ శర్మ గురువారం అసెంబ్లీలో ఒక ప్రకటన చేశారు. ఎంపీ రకీబుల్‌కు తగిన భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. దాడికి పాల్పడిన వారికపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రకీబుల్ గతేడాది లోక్‌సభ ఎన్నికల్లో 10 లక్షల ఓట్ల మెజార్టీతో గెలిచారు. ఆయనపై దాడికి కారణం ఏమిటన్నది ఇంకా తెలియరాలేదు. బీజేపీ పాలనలో తమకు రక్షణ లేకుండాపోయిందని అస్సాం కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని సీనియర్‌నేత గౌరవ్ గొగోయ్ ధ్వజమెత్తారు. గూండారాజ్ సంస్కృతి నుంచి రాష్ట్ర ప్రజలు స్వాతంత్ర్యం కోరుకుంటున్నారని చెప్పారు.

ఇన్‌ఫార్మర్ల నెపంతో ఇద్దరి హత్య

ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో ఘటన

చర్ల: ఇన్‌ఫార్మర్ల నెపంతో మావోయిస్టులు ఇద్దరిని హతమార్చారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ జిల్లాలో బుధవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. బార్సూర్ పోలీస్‌స్టేషన్ పరిధి తోడ్మా గ్రామానికి బుధవారం రాత్రి వచ్చిన మావోయిస్టులు బామన్ కశ్యప్(29), అనీస్ రాం పోయం(38)అనే వారిని వారి ఇళ్ల వద్దే దారుణంగా నరికి చంపారు. పోలీస్ ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తున్నందునే హతమార్చామని మావోయిస్టు పార్టీ తూర్పు బస్తర్ డివిజన్ కమిటీ పేరిట అక్కడ లేఖ వదిలారు. 2024 అక్టోబర్ 4న దంతెవాడ జిల్లా అబూజ్‌మడ్‌లోని తుత్తులి– నెందూర్ సమీపంలో ఎన్‌కౌంటర్‌లో 38మంది మావోయిస్టులు మృతి చెందారు. అక్కడ మావోయిస్టులు సమావేశమయ్యారన్న విషయాన్ని కశ్యప్ పోలీసులకు తెలిపాడని ఆ లేఖలో పేర్కొన్నారు. కాగా, కశ్యప్ సమీప గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో తాత్కాలిక టీచర్‌గా పని చేస్తున్నాడు. ఘటన నేపథ్యంలో గురువారం ఉదయం పోలీసు బలగాలు దంతెవాడ– బీజాపూర్ జిల్లాల సరిహద్దుల్లో కూంబింగ్ చేపట్టాయి.

వాహనాలపై ఆర్సీ రెన్యువల్ మోత

టూ వీలర్‌కు రూ.2 వేలు, త్రీ వీలర్‌కు రూ.5 వేలు, కార్లకు రూ.10 వేలు

20 ఏళ్లు పైబడిన వాహనాల రెన్యువల్ ధరలు పెంచనున్న కేంద్రం

సాక్షి, న్యూఢిల్లీ: వాహన కాలుష్యాన్ని తగ్గించే చర్యల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనుంది. 20 ఏళ్లకు పైబడిన వాహనాల రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ (ఆర్సీ) రెన్యువల్ ఛార్జీలను భారీగా పెంచాలని భావిస్తోంది. ఇందులో భాగంగా కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ఇటీవల ముసాయిదా నోటిఫికేషన్‌ను జారీ చేసింది. దీనిని కేంద్రం ఆమోదించిన వెంటనే 20 ఏళ్లకు పైబడి ఉన్న వాహనాలను తమ వద్ద ఉంచుకోవాలనుకునే వారు ఎక్కువ ఖర్చు చేయాల్సి ఉంటుంది. బీఎస్–2 ఉద్గార నిబంధనలు అమల్లోకి రాకముందే తయారైన వాహనాలను ప్రజలు వదిలించుకోవాలనే కేంద్రం ఈ చర్యకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని అంటున్నారు. రానున్న రోజుల్లో 20 ఏళ్ల పైబడిన ద్విచక్ర వాహన రిజిస్ట్రేషన్ రెన్యువల్‌కు రూ.2 వేలు, త్రీ వీలర్‌కైతే రూ.5 వేలు, కార్లు/జీపులకు రూ.10 వేలు చేయాలని ఆ శాఖ ప్రతిపాదించింది. అంతేగాక 15 ఏళ్లు పైబడిన భారీ వాహనాలను దశలవారీగా రద్దు చేయడంపై దృష్టి సారించిన కేంద్రం వాణిజ్య మీడియం ప్యాసింజర్/గూడ్స్ వాహనానికి రూ.12 వేలు, హెవీ ప్యాసింజర్/ గూడ్స్ వాహనానికి రూ.18 వేలు రిజిస్ట్రేషన్ రెన్యువల్ ఛార్జీలుగా ప్రతిపాదించింది. అదే వాహనాలను 20 ఏళ్ల తర్వాత రిజిస్ట్రేషన్ రెన్యువల్ చేయించుకుంటే వాటి రుసుములను వరుసగా రూ.24 వేలు, రూ.36 వేలుగా రెట్టింపు చేస్తూ ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనలు అమలైతే దేశవ్యాప్తంగా వాహన యజమానులపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఢిల్లీ–ఎన్‌సీఆర్‌లో మాత్రం దీని ప్రభావం ఉండదు. ఎందుకంటే ఇక్కడ కోర్టు ఆదేశాల నేపథ్యంలో 10 ఏళ్ల పైబడిన డీజిల్, 15 ఏళ్ల పైబడిన పెట్రోల్ వాహనాలను తప్పనిసరిగా తొలగించాల్సి ఉన్న విషయం తెలిసిందే. 2021లో రోడ్డు రవాణా శాఖ మోటార్ సైకిళ్లు, త్రీ వీలర్లు, కార్ల రిజిస్ట్రేషన్ రెన్యువల్ రుసుమును మాత్రమే పెంచింది. దీంతో, తాజాగా 20 ఏళ్లు దాటిన మీడియం, హెవీ ప్రైవేట్ కమర్షియల్ వాహనాల ఫిట్‌నెస్ పరీక్షల ఫీజును రెట్టింపు చేయాలని ప్రతిపాదించింది.

గణాంకాలు

వాహనం రకం	20 సంవత్సరాల తర్వాత పునరుద్ధరణ రుసుము
1) 2-వీలర్	రూ. 2,000
2) 3-వీలర్ వాహనం	రూ. 5,000
3) కారు/జీప్	రూ. 10,000
4) మీడియం ప్యాసింజర్/గూడ్స్	రూ. 25,000
5) హెవీ ప్యాసింజర్/ గూడ్స్	రూ. 36,000

వాహనం రకం	15 సంవత్సరాల తర్వాత పునరుద్ధరణ రుసుము
1) మీడియం ప్యాసింజర్/గూడ్స్	రూ. 12,000
2) హెవీ ప్యాసింజర్/ గూడ్స్	రూ. 18,000

అన్ని అంశాలను ఇక్కడ విచారించలేం

హైకోర్టుకు వెళ్లాలని పిటిషనర్‌కు సుప్రీంకోర్టు సూచన

న్యూఢిల్లీ: స్థిరాస్తుల కూల్చివేత విషయంలో అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును ఉల్లంఘించారంటూ మహారాష్ట్ర ప్రభుత్వ అధికారులపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. సంబంధిత అధికారులపై కోర్టు ధిక్కరణ కింద చర్యలు చేపట్టాలని కోరుతూ దాఖలైన ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. పిటిషన్ గురువారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జి మాసీ నేతృత్వంలోని ధర్మాసనం ముందుకు వచ్చింది. దీనిపై తాము విచారణ చేపట్టలేమని, హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించింది. అన్ని అంశాలనూ తాము ఇక్కడ విచారించలేమని స్పష్టంచేసింది. ముందస్తుగా నోటీసు ఇవ్వకుండా ఆస్తులను కూల్చడానికి వీల్లేదని, కనీసం 15 రోజుల సమయం ఇవ్వాలని ఆదేశిస్తూ సుప్రీంకోర్టు 2024 నవంబర్ 13న తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. మహారాష్ట్రలో అధికారులు తగిన సమయం ఇవ్వకుండానే ఆస్తులు కూల్చేశారని ఆరోపిస్తూ బాధితుడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు.

పాలిచ్చే తల్లులకు ప్రైవసీ కల్పించండి

కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ: పాలిచ్చే తల్లులకు ప్రైవసీని కల్పించాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. పాలిచ్చే తల్లులకోసం బహిరంగ ప్రదేశాల్లో, ప్రత్యేకించి ప్రభుత్వ భవనాల్లో ప్రత్యేక గదులు ఏర్పాటు చేసేలా రాష్ట్రాలకు సూచించాలని కేంద్రాన్ని ఆదేశించిందది. బహిరంగ ప్రదేశాల్లో ఫీడింగ్ కోసం గదులు, పిల్లల సంరక్షణ కోసం సౌకర్యం కల్పించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ప్రసన్నలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు బుధవారం ఆదేశాలు జారీ చేసింది. పిల్లలు, మహిళలకు రాజ్యాంగం కల్పించిన ఆ హక్కులను కాపాడాలని గుర్తు చేసింది. ఇది పాలిచ్చే తల్లులకు సౌకర్యాన్ని, రక్షణను ఇస్తుందని పేర్కొంది. రాష్ట్రాలు ఈ ఆదేశాలను అమలు చేసేలా, ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న ప్రభుత్వ భవనాల్లో ఈ సౌకర్యానికి రాష్ట్ర ప్రభుత్వాలు తగినంత స్థలం కేటాయించేలా చూడాలని, ఇప్పటికే ఉన్న బహిరంగ ప్రదేశాల్లో గదులను కేటాయించాలని కోర్టు అభిప్రాయపడింది.

నైతిక విలువల్ని పాటించండి

ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లకు కేంద్రప్రభుత్వం హెచ్చరిక

న్యూఢిల్లీ: యూట్యూబర్ రణ్‌వీర్ అల్హాబాదియా వివాదాస్పద అశ్లీల వ్యాఖ్యలు, సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర జోకులు షికార్లు చేస్తున్న నేపథ్యంలో ఓవర్ ది టాప్(ఓటీటీ)ప్లాట్‌ఫామ్‌లు నైతిక విలువలకు కట్టుబడి ఉండాలని కేంద్ర ప్రభుత్వం హెచ్చరించింది. ఈ మేరకు స్వీయ నియంత్రణ సంస్థలు, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు ఐటీ నిబంధనలు,2021లోని 'కోడ్ ఆఫ్ ఎథిక్స్'ను పాటించాలని గురువారం కేంద్ర ప్రభుత్వం ఒక అడ్వైజరీని జారీ చేసింది. నైతిక నియమాల ఉల్లంఘన జరిగితే ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లకు సంబంధించిన స్వీయనియంత్రణ సంస్థలు తగు కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్రం సూచించింది. ఓటీటీ ప్లాట్‌ఫామ్ వంటి ఆన్‌లైన్ క్యూరేటెడ్ కంటెంట్, సోషల్ మీడియాలో అసభ్యకర, శృంగారభరిత, బూతు సమాచారం విస్తృతంగా ప్రసారంలోకి వస్తోందని పలువురు పార్లమెంట్ సభ్యులు, కొన్ని సంస్థల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో అడ్వైజరీ జారీచేసింది.

ఈ వ్యవస్థ మిమ్మల్ని అణచివేస్తోంది

దళితులనుద్దేశించి రాహుల్ వ్యాఖ్యలు

రాయ్‌బరేలీ(యూపీ): రాజ్యాంగ రూపకల్పనలో దళితుల పాత్ర ఎనలేనిదంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కొనియాడారు. 'రాజ్యాంగంలో ఉన్నది మీ భావజాలమే. కానీ, ఇప్పుడు మీరు ఎక్కడికెళ్లినా వ్యవస్థ చేతిలో అణచివేతకు గురవుతున్నారు'అంటూ వ్యాఖ్యానించారు. గురువారం సొంత నియోజకవర్గం యూపీలోని రాయ్‌బరేలీలోని బర్గద్ చౌరాహా వద్ద ఉన్న మూల్ భారతి హాస్టల్ వద్ద కొందరు దళిత విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. దేశంలోని టాప్–500 కంపెనీల్లో కొన్నిటి పేర్లను ప్రస్తావించిన రాహుల్..వీటిలో దళితుల సారథ్యంలో నడిచేవి ఎన్ని ఉంటాయంటూ ప్రశ్నించారు. ఏమీ లేవంటూ ఒక విద్యార్థి సమాధానమివ్వంగా ఎందుకు లేవంటూ తిరిగి ఆయన ప్రశ్నించారు. సరైన సదుపాయాలు లేనందునే అంటూ ఒక విద్యార్థి బదులిచ్చాడు. కారణం అది కాదంటూ రాహుల్..'రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌కు సైతం ఎలాంటి సదుపాయాలు అప్పట్లో లేవు. ఆయన ఒంటరిగా కృషి చేస్తూనే దేశ రాజకీయాలను మలుపుతిప్పారు. ప్రస్తుతం మీ ఎదుగుదలను కోరుకోని ఈ వ్యవస్థ మొత్తం మీకు వ్యతిరేకంగా పనిచేస్తోంది. నిత్యం మీపై దాడులకు పాల్పడుతోంది. ఎలా దాడులకు గురవుతున్నారో తెలుసుకునే సమయం మీకుండటం లేదు'అని రాహుల్ పేర్కొన్నారు. 'రాజ్యాంగంలో ఉన్నది మీ భావజాలమే అనే విషయాన్ని మీరు అర్థం చేసుకోవాలి. ఈ దేశంలో దళితులు లేకుంటే రాజ్యాంగం వచ్చేది కాదని నేను మీకు గట్టిగా చెప్పగలను. ఇది మీ రాజ్యాంగం, మీ భావజాలం. అయినా కూడా ఎక్కడికెళ్లినా ఈ వ్యవస్థ మిమ్మల్ని అణగదొక్కుతోంది'అంటూ రాహుల్ వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్‌ది రెండునాల్కల ధోరణి: మాయావతి

న్యూఢిల్లీ: బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ)కి కాంగ్రెస్ పార్టీ తలుపులు తెరిచే ఉన్నాయన్న రాహుల్ గాంధీ వ్యాఖ్యలకు బీఎస్పీ అధినేత్రి మాయావతి ఊహించని కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్‌ది రెండు నాల్కల ధోరణిని, ఆ పార్టీవి కులతత్వ రాజకీయాలని ఆరోపించారు. కాంగ్రెస్ బలంగా, అధికారంలోఉన్న రాష్ట్రాల్లో బీఎస్పీని శత్రువుగా పరిగణిస్తోందని, కులతత్వ ధోరణులను ప్రదర్శిస్తోందని, బలహీనంగా ఉన్న యూపీవంటి రాష్ట్రాల్లో మాత్రం పొత్తుల గురించి మాట్లాడుతోందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ లేదా ఇతర కులతత్వ పార్టీలతో పొత్తు పెట్టుకున్నప్పుడల్లా బీఎస్పీ ఓట్లు వారికి బదిలీ అయ్యేవని, కానీ బీఎస్పీకి ఆయా పార్టీల ఓట్లు ఎప్పుడూ రాలేదని, దానివల్ల తమ పార్టీ ఓడిపోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

అన్ని మతాలనూ గౌరవిస్తా: మమతా బెనర్జీ

కోల్‌కతా: అన్ని మతాలనూ, సంస్కృతులనూ ఎంతగానో గౌరవిస్తానని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత మమతా బెనర్జీ చెప్పారు. మతం అనేది వ్యక్తిగత విశ్వాసం అయినప్పటికీ మతపరమైన వేడుకల్లో అందరూ పాల్గొనడడం పరిపాటి అని అన్నారు. ఆమె మంగళవారం అసెంబ్లీలో మాట్లాడుతూ ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళాను సక్రమంగా నిర్వహించడంలో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించిన సంగతి తెలిసిందే.


'క్యాస్ట్ ఇన్ మోడ్రన్ ఇండియా' గ్రంథ రచయిత?

భారతీయ సమాజం
సమాజ శాస్త్ర మౌలికాంశాలు - కులం

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సోషియాలజీ



1. 'సమాజ శాస్త్రం' (Sociology) అనే పదాన్ని మొదట రూపొందించిందెవరు?
ఎ) సోక్రటీస్ బి) అరిస్టాటిల్
సి) ఆగస్ట్ కోమ్ట్ డి) దుర్క్‌హైమ్
2. 2011 జనాభా లెక్కల ప్రకారం కింది వాటిని జతపరచండి?
1) హిందువులు ఎ) 79.8 శాతం
2) ముస్లింలు బి) 14.2 శాతం
3) క్రైస్తవులు సి) 2.3 శాతం
4) సిక్కులు డి) 1.7 శాతం
ఎ) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి
బి) 1-డి, 2-సి, 3-బి, 4-ఎ
సి) 1-బి, 2-ఎ, 3-డి, 4-సి
డి) 1-ఎ, 2-డి, 3-సి, 4-బి
3. సమాజ శాస్త్రం పితామహుడిగా ఎవరిని పేర్కొంటారు?
ఎ) దుర్క్ హైమ్ బి) మాక్స్ వెబర్
సి) అరిస్టాటిల్ డి) ఆగస్ట్ కోమ్ట్
4. భారతీయ సమాజం వివిధ జాతుల ప్రదర్శన శాల (Ethnological Museum) అని పేర్కొన్నవారు?
ఎ) వి.ఎ.స్మిత్ బి) జిమ్మెల్
సి) పరేటో డి) మాకియవెల్లీ
5. సమాజ శాస్త్రం శాస్త్రీయంగా దేన్ని అధ్యయనం చేస్తుంది?
ఎ) మానవుడిని
బి) మానవ సంఘాలను
సి) వ్యక్తుల మధ్య ఉన్న సామాజిక సంబంధాలను
డి) పౌరుల హక్కులు, విధులను
6. భారత రాజ్యాంగం ఎన్ని భాషలను గుర్తించింది?
ఎ) 22 బి) 24
సి) 25 డి) 26
7. ది పీపుల్ ఆఫ్ ఇండియా గ్రంథాన్ని ఎవరు రచించారు?
ఎ) మలినో విస్కీ బి) బి.ఎస్. గుహా
సి) రిస్లీ డి) హెడన్
8. సమాజ శాస్త్రం (Sociology) అనే పదం లాటిన్ భాషలోని సొసైటస్(Societus), గ్రీకు భాషలోని లోగోస్(Logos) అనే పదాల నుంచి ఉద్భవించింది. దీని అర్థం?
ఎ) సమాజం, శాస్త్రం
బి) సమాజం, సూత్రాలు
సి) సామూహిత, శాస్త్రం
డి) సామాహికత, శాస్త్రం
9. కింది వాటిలో దక్షిణ భారత సాంస్కృతిక అంశం కానిది?
ఎ) హిందుస్తానీ సంగీతం
బి) జల్లికట్టు సి) యక్షగానం
డి) భరతనాట్యం
10. 'మానవుడు సామాజిక జంతువు' అని చెప్పిన వారు?
ఎ) ఆగస్ట్ కోమ్ట్ బి) దుర్క్ హైమ్
సి) హెర్బర్ట్ స్పెన్సర్ డి) అరిస్టాటిల్
11. సమాజం అంటే 'సామాజిక సంబంధాల అల్లిక' అని చెప్పిందెవరు?
ఎ) ఆగస్ట్ కోమ్ట్ బి) హెర్బర్ట్ స్పెన్సర్
సి) మెక్ ఐవర్ డి) మాక్స్ వెబర్
12. పరిణామ సిద్ధాంతాన్ని మొదట ప్రతిపాదించిన శాస్త్రవేత్త?
ఎ) ఆగస్ట్ కోమ్ట్ బి) హెర్బర్ట్ స్పెన్సర్
సి) దుర్క్ హైమ్ డి) చార్లెస్ డార్విన్
13. 'ది సోషల్ సిస్టమ్' గ్రంథ రచయిత?
ఎ) మార్టన్ బి) పార్సన్స్
సి) కార్ల్‌మార్క్స్ డి) ఆగస్ట్ కోమ్ట్
14. సోషల్ థియరీ అండ్ సోషల్ స్ట్రక్చర్ గ్రంథ రచయిత?
ఎ) రాబర్ట్ కె మర్టన్ బి) రాబర్ట్ పార్క్
సి) రాడ్‌క్లిఫ్ బ్రౌన్ డి) దుర్ఖెయిమ్
15. 'ఎక్కడైతే జీవితం ఉందో, అక్కడ సమాజం ఉంది' అని చెప్పింది?
ఎ) మెక్ ఐవర్ బి) కింగ్స్‌లీ డేవిస్
సి) దుర్క్ హైమ్ డి) మాక్స్ వెబర్
16. సంస్కృతి అంటే?
ఎ) వేషభాషలు, నడవడి విధానం, మతం, కళలు మొదలైన వాటి సమ్మేళనం
బి) శాస్త్రీయ, సాంకేతికాభివృద్ధి
సి) ఒక సముదాయం సాధించిన ఉన్నత అంశాలు
డి) పైవన్నీ
17. 'సోషల్ చేంజ్ ఇన్ మోడర్న్ ఇండియా' అనే గ్రంథ రచయిత?
ఎ) రామ్ అహుజా బి) కుప్పుస్వామి
సి) కేట్కార్ డి) ఎం.ఎన్. శ్రీనివాస్
18. 'ద సోషల్ కాంట్రాక్ట్' గ్రంథ రచయిత? (సీడీపీవో-2013)
ఎ) టానీస్ బి) రూసో
సి) అరిస్టాటిల్ డి) ప్లేటో
19. 'ఇంత వరకు ఉన్న సమాజాల చరిత్ర అంతా వర్గ పోరాట చరిత్రయే' అని పేర్కొన్నవారు? (గ్రూప్-2, 2000 బ్యాగ్‌లాగ్ పోస్ట్)
ఎ) లెనిన్ బి) మావో
సి) కార్ల్ మార్క్స్ డి) హిట్లర్
20. కులం అభివ్యక్తీకరణల్లో అస్పృశ్యతను అతినికృష్టమైందిగా పరిగణించిన వారు? (సీడీపీవో-2013)
ఎ) ఎం.ఎన్. శ్రీనివాస్
బి) సర్దార్ పటేల్
సి) నెహ్రూ డి) గాంధీ
21. 'క్యాస్ట్ ఇన్ మోడ్రన్ ఇండియా' గ్రంథ రచయిత? (సీడీపీవో-2013)
ఎ) హట్టన్ బి) ఘుర్యే
సి) కుప్పుస్వామి
డి) ఎం.ఎన్. శ్రీనివాస్
22. ఉన్నత అంతస్తును సాధించడానికి తొలిమెట్టుగా...ఉన్నత కులాల వారి ఆచారాలు, నమ్మకాలను నిమ్న కులాల వారు సమష్టిగా అవలంభించే ప్రక్రియను ఏ పేరుతో పిలుస్తారు? (సీడీపీవో-2013)
ఎ) ఆధునికీకరణ బి) సంస్కృతీకరణ
సి) పాశ్చాత్యీకరణ డి) నగరీకరణ
23. గ్రామాల్లో కులాల మధ్య సంబంధాలను నియంత్రించే వ్యవస్థ ఏది? (సీడీపీవో-2013)
ఎ) బంధుత్వం
బి) వర్గం సి) స్నేహం
డి) జాజ్‌మాని(Jajmani)
24. బ్రహ్మ ఏ అవయవం నుంచి క్షత్రియులు ఆవిర్భవించారు? (సీడీపీవో-2013)
ఎ) పాదాలు బి) తొడలు
సి) చేతులు డి) భుజాలు
25. కుల క్రమానుగత శ్రేణిలో అన్నిటికంటే పై శ్రేణిలో ఉండేవారు? (సీడీపీవో-2013)
ఎ) వైశ్యులు బి) బ్రాహ్మణులు
సి) శూద్రులు డి) క్షత్రియులు
26. 'ది అన్‌టచబుల్స్' అనే గ్రంథాన్ని రాసిందెవరు?
ఎ) శ్రీనివాస్ బి) అంబేద్కర్
సి) ఘుర్యే డి) గాంధీ
27. అస్పృశ్యులను 'హరిజనులని' సంభోదించింది? (సీడీపీవో-2013)
ఎ) లాల్ బహదూర్ శాస్త్రి
బి) అంబేద్కర్
సి) విద్యాసాగర్ డి) గాంధీ
28. కింది వాటిలో ఏది కుల లక్షణం కాదు?
ఎ) అంతర్వివాహం
బి) వృత్తి అనుబద్ధత
సి) ఛాయ(Colour)
డి) సహపంక్తి భోజన కట్టుబాటు
29. ఒక వ్యక్తి కుల సభ్యత్వం దేని ఆధారంగా నిర్ణయిస్తారు?
ఎ) అంతస్తు బి) సంపద
సి) పుట్టుక డి) ఆరోగ్యం
30. కులం ఒకే _____ సమూహం.
ఎ) బహిర్వివాహిత బి) సంవృత
సి) అంతర్వివాహిత డి) అనివార్య
31. కులం, వర్గం, అధికారం(Caste, Class and Power) గ్రంథం రచించింది ఎవరు?
ఎ) పి.వి.బెయిలీ
బి) అంధ్రె బీటెల్లీ
సి) ఎం.ఎన్. శ్రీనివాస్
డి) హట్టన్
32. ఎలాంటి అంటరానితనాన్ని అయినా నిషేధించే ఆర్టికల్ ఏది?
ఎ) ఆర్టికల్-14 బి) ఆర్టికల్-17
సి) ఆర్టికల్-16 డి) ఆర్టికల్-18
33. కుల వ్యవస్థకు ___ స్వభావం ఉంటుంది?
ఎ) క్రమానుగత శ్రేణి(Hierarchical)
బి) సౌష్ఠవ(Symmetrical)
సి) పరస్పర వ్యతిరేక(Contradictory)
డి) సహకార(Co-operative)
34. కిందివాటిలో కులవ్యవస్థను బలహీన పరచని కారణాలేవి?
ఎ) పారిశ్రామికీకరణ, నగరీకరణ
బి) రవాణా సౌకర్యాలు పెరగడం
సి) రాజ్యాంగం
డి) రిజర్వేషన్ పాలసీ
35. కింది వాటిలో కుల వ్యవస్థ లక్షణం కానిది?
ఎ) శుచి- అశుచి
బి) క్రమానుగత శ్రేణి ఆరాధన
సి) క్రమానుగత శ్రేణి
డి) వారసత్వ రీత్యా వచ్చే ప్రత్యేకీకరణ
36. కులస్తరీకరణకు ఇది ఆధారం?
ఎ) పునర్జన్మ
బి) వర్ణాశ్రమ వ్యవస్థ - చతుర్వర్ణాలు
సి) పురుషార్థాలు
డి) మత విభాగం
37. రుగ్వేదంలో పేర్కొనని వర్ణాలు ఏవి?
ఎ) ఆర్య, శూద్ర వర్ణాలు
బి) ఆర్య, దాస వర్ణాలు
సి) బ్రాహ్మణ, క్షత్రియ వర్ణాలు
డి) క్షత్రియ, శూద్ర వర్ణాలు
38. భారతీయ కులవిధానం గురించి ప్రస్తావన మొట్టమొదట దేనిలో కనిపిస్తుంది?
ఎ) మహాభారతం బి) ఉపనిషత్తులు
సి) వేదాలు డి) రామాయణం
39. క్యాస్ట్(Caste)అనే పదం ఏ భాషలోని కాస్టా (Casta) అనే పదం నుంచి ఆవిర్భవించింది?
ఎ) స్పానిష్, పోర్చుగీసు బి) జర్మన్
సి) లాటిన్ డి) ఏదీకాదు
40. అస్పృశ్యులు ముందంజ వేయక పోవడానికి కారణం?
ఎ) విజ్ఞాన లేమి బి) నిరక్షరాస్యత
సి) అల్పులమనే భావన
డి) సంప్రదాయ ధోరణులు
41. కుల వ్యవస్థలో లేని అంశం?
ఎ) ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం
బి) శ్రామికులు గతిశీలతను తిరస్కరించడం
సి) వ్యక్తులకు వృత్తులను ఇవ్వడం
డి) సహకారాన్ని అందించడం
42. కుల వ్యవస్థను బ్రాహ్మణులే, బ్రాహ్మణుల కోసం సృష్టించారని పేర్కొన్నవారు?
ఎ) అబె దుబాయ్(Abbe Dubois)
బి) జి.ఎస్. ఘుర్యే(G. S. Ghurye)
సి) కేట్కర్ డి) ఎం.ఎన్. శ్రీనివాస్
43. భారతీయ సమాజంలోని స్తరీకరణ రూపం?
ఎ) సామాజిక వర్గం
బి) అంతస్తు సమూహం
సి) ఎస్టేట్ డి) కులం
44. 'ఒకే పేరును కలిగి, ఒకే పూర్వీకుడి సంతతి అని భావిస్తూ ఒకే సజాతీయ సముదాయంగా మెలుగుతూ ఉండే కొన్ని కుటుంబాల మొత్తమే కులం' అని వ్యాఖ్యానించింది ఎవరు?
ఎ) ఎం.ఎన్. శ్రీనివాస్ బి) హెర్బర్ట్ రిస్లే
సి) మెకైవర్ డి) హట్టన్
45. వెలికి గురైనవారు (Out castes).. కుల వ్యవస్థాపన ఫలితమే. కుల వ్యవస్థను నిర్మూలిస్తే తప్ప వారిని స్వతంత్రులను చేయలేమని భావించిన వారు?
ఎ) జవహర్‌లాల్ నెహ్రూ
బి) మహాత్మాగాంధీ సి) కామరాజ్
డి) బి.ఆర్.అంబేద్కర్
46. సరైన క్రమాన్ని తెల్పండి?
1) బ్రాహ్మణులు 2) క్షత్రియులు
3) వైశ్యులు 4) శూద్రులు
ఎ) 1, 2, 3, 4 బి) 4, 3, 2, 1
సి) 4, 3, 1, 2 డి) 2, 1, 3, 4
47. సంస్కారపరమైన అశుచి (Ritual Pollution) కి ఆధారాలు?
ఎ) జన్మ బి) శరీరం నుంచే వచ్చే వాసనలు
సి) మరణం
డి) జనన, మరణాలు
48. కింది వాటిలో సరికానిది?
ఎ) కులం సంస్కృతి వాహకంగా పనిచేస్తుంది
బి) కులం సామాజిక గతిశీలతను ప్రోత్సహిస్తుంది
సి)కులం రాజకీయాలతో ముడిపడి ఉంటుంది
డి) కులం సామాజిక జీవనానికి కావలసిన ప్రకార్యాలను తీరుస్తుంది.

సమాధానాలు

1) సి; 2) ఎ; 3) డి; 4) ఎ; 5) సి;
6) ఎ; 7) సి; 8) ఎ; 9) ఎ; 10) డి;
11) సి; 12) డి; 13) బి; 14) ఎ; 15) ఎ;
16) డి; 17) డి; 18) బి; 19) సి; 20) సి;
21) డి; 22) బి; 23) డి; 24) డి; 25) బి;
26) బి; 27) డి; 28) సి; 29) సి; 30) సి;
31) బి; 32) బి; 33) ఎ; 34) బి; 35) బి;
36) బి; 37) బి; 38) సి; 39) ఎ; 40) సి;
41) ఎ; 42) ఎ; 43) డి; 44) బి; 45) డి;
46) ఎ; 47) ఎ; 48) బి.

హేలీ తోకచుక్క ఎన్నేళ్లకు ఒకసారి కనిపిస్తుంది?

గ్రహాలు
మాదిరి ప్రశ్నలు



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

భౌతిక శాస్త్రం

1. గ్రీకు భాషలో ప్లానెట్ అనే పదం దేన్ని సూచిస్తుంది?
ఎ) విశ్వంలో ఒక వస్తువు
బి) ఎల్లప్పుడూ తిరుగుతున్న వస్తువు
సి) స్వయం ప్రకాశకత్వం
డి) ఉపగ్రహాలను కలిగింది
2. సూర్యుడు ఏ రకమైన నక్షత్రం?
ఎ) పెద్ద పరిమాణం ఉన్న నక్షత్రం
బి) చిన్న పరిమాణం ఉన్న నక్షత్రం
సి) మరుగుజ్జు నక్షత్రం
డి) మధ్యతరహా పరిమాణం ఉన్న నక్షత్రం
3. సూర్యుడి తర్వాత దగ్గరగా ఉన్న నక్షత్రం?
ఎ) ప్రాక్సిమా సెంటారీ బి) సీరియస్
సి) QBI-352 డి) మెఘాలినిక్ మేఘం
4. సౌరకుటుంబం కలిగిన మన పాలపుంతకు భారతీయులు పెట్టిన పేరు?
ఎ) శివగంగ బి) పాతాళగంగ
సి) ఆకాశగంగ డి) హిమగంగ
5. సూర్యకేంద్ర సిద్ధాంతాన్ని ఎవరు ప్రతిపాదించారు?
ఎ) కోపర్నికస్ బి) టాలమీ
సి) భాస్కరాచార్యుడు డి) న్యూటన్
6. సౌరకుటుంబాన్ని మొదట పరిశీలించినవారు?
ఎ) న్యూటన్ బి) గెలీలియో
సి) ఐన్‌స్టీన్ డి) పొల్సన్
7. భూమిపై ఉన్న ప్రతి వస్తువుపైనా గురుత్వ బలం సమానంగా ఉంటుందని నిరూపించిన వారు?
ఎ) కోపర్నికస్ బి) జిల్లెట్
సి) గెలీలియో డి) డాప్లర్
8. బిగ్‌బ్యాంగ్ సిద్ధాంతాన్ని ఎవరు ప్రతిపాదించారు?
ఎ) జార్జియస్ లైమెట్రీ బి) హబుల్
సి) గెలీలియో డి) న్యూటన్
9. ప్రస్తుతం సౌరకుటుంబంలో గుర్తించిన గ్రహాల సంఖ్య?
ఎ) 7 బి) 8 సి) 9 డి) 10
10. భూమికి దగ్గరగా ఉన్న ఖగోళ వస్తువు?
ఎ) సూర్యుడు బి) అంగారకుడు
సి) చంద్రుడు డి) బుధుడు
11. సూర్యుడి నుంచి గ్రహాలకు మధ్య దూరాన్ని కొలవడానికి ఉపయోగించే ప్రమాణం?
ఎ) కాంతి సంవత్సరం
బి) ఖగోళ ప్రమాణం సి) పార్-సెక్
డి) పైవన్నీ
12. సూర్యుడి చుట్టూ గ్రహాలు ఏ మార్గంలో పరిభ్రమిస్తున్నాయి?
ఎ) సరళరేఖ బి) వృత్తాకార
సి) దీర్ఘవృత్తాకార డి) వక్రమార్గం
13. సూర్యుడికి దగ్గరగా ఉన్న గ్రహం?
ఎ) శుక్రుడు బి) బుధుడు
సి) భూమి డి) శని
14. ధ్రువ నక్షత్రం పేరు?
ఎ) జొడాయిక్ బి) ఎప్సిలాన్ అరిగా
సి) పొలారిస్ డి) ఆంద్రోమెడ్
15. హేలీ తోకచుక్క ఎన్నేళ్లకు ఒకసారి కనిపిస్తుంది?
ఎ) 66 బి) 76
సి) 86 డి) 100
16. కిందివాటిలో ఏ గ్రహం పగలు ఎక్కువ వేడిగా, రాత్రి అతి చల్లగా ఉంటుంది?
ఎ) శుక్రుడు బి) అంగారకుడు
సి) బృహస్పతి డి) బుధుడు
17. సౌరకుటుంబంలో పరిమాణంలో భూమి ఏ స్థానంలో ఉంది?
ఎ) 1 బి) 2
సి) 4 డి) 5
18. సౌరకుటుంబంలోని గ్రహాల చలనాలను పరిశీలించిన దేశస్థులు?
ఎ) భారతీయులు బి) చైనీయులు
సి) గ్రీకులు డి) జపనీయులు
19. రెండు గ్రహాల మధ్య దూరం రెండింతలు అయినప్పుడు వాటి మధ్య విశ్వగురుత్వాకర్షణ బలం?
ఎ) రెండు రెట్లు తగ్గుతుంది
బి) రెండు రెట్లు పెరుగుతుంది
సి) నాలుగు రెట్లు పెరుగుతుంది
డి) నాలుగు రెట్లు తగ్గుతుంది
20. ఒక ఇనుపగోళం, అల్యూమినియం గోళాలను ఒకే ఎత్తు నుంచి శూన్యంలో ఒకేసారి జారవిడిచినప్పుడు ఏది ముందుగా కిందికి చేరుతుంది?
ఎ) ఇనుపగోళం
బి) అల్యూమినియం గోళం
సి) రెండూ ఒకేసారి కిందికు చేరుతాయి
డి) రెండూ పైకి వెళ్తాయి
21. ఒక వస్తువు భారం ఎక్కడ ఎక్కువగా ఉంటుంది?
ఎ) భూమి కేంద్రం వద్ద
బి) భూమధ్యరేఖ వద్ద
సి) ధ్రువాల వద్ద
డి) పైవన్నీ
22. ప్రదేశాన్ని బట్టి ఒక వస్తువుకు చెందిన ఏ భౌతికరాశి మారుతుంది?
ఎ) ద్రవ్యరాశి బి) ఘనపరిమాణం
సి) ఆకారం డి) భారం
23. చంద్రుడిపై గురుత్వ త్వరణం విలువ?
ఎ) $9.8 ms^{-2}$ బి) $9.8 cms^{-2}$
సి) $1.67 cms^{-1}$ డి) $1.67 ms^{-2}$
24. భూమిపై పలాయన వేగం?
ఎ) $11.2\ kms^{-1}$ బి) $11.2\ ms^{-1}$
సి) $11.2\ cms^{-1}$ డి) $1.12\ ms^{-1}$
25. విశ్వగురుత్వాకర్షణ నియమాన్ని ప్రతిపాదించిన వారు?
ఎ) న్యూటన్ బి) గెలీలియో
సి) అరిస్టాటిల్ డి) కోపర్నికస్
26. భూస్థిర ఉపగ్రహం ఆవర్తన కాలం?
ఎ) 24 సెకన్లు బి) 24 నిమిషాలు
సి) 24 గంటలు డి) 24 రోజులు
27. ఇప్పటివరకు కనుగొన్న ఉపగ్రహాల్లో అతి పెద్దది?
ఎ) చంద్రుడు బి) గనిమెడ
సి) యూరోపా డి) ఫోబోస్
28. భూమిని పోలిన ఉపగ్రహం?
ఎ) చంద్రుడు బి) ఫోబోస్
సి) టైటాన్ డి) పైవన్నీ
29. శాస్త్రవేత్తలు ఇటీవల భూమిని పోలిన గ్రహాన్ని కనుగొన్నారు. దానిపేరు?
ఎ) సూపర్ నోవా బి) సూపర్ ఎర్త్
సి) సుప్రీం ఎర్త్ డి) న్యూ ఎర్త్ గ్లోబ్
30. ప్లూటో ఉపగ్రహం చరాన్ గురించి పరిశోధించడానికి ప్రయోగించిన అంతరిక్ష నౌక పేరు?
ఎ) న్యూహొరిజాన్ బి) కేసిని
సి) హ్యూగన్స్ డి) స్పీట్జర్
31. మరుగుజ్జు గ్రహం హోదా పొందిన గ్రహం?
ఎ) బుధుడు బి) అంగారకుడు
సి) భూమి డి) ప్లూటో
32. భూమిపై సముద్రంలో ఆటుపోటులు ఏర్పడటానికి కారణం?
ఎ) భూమి, సూర్యుడికి మధ్య ఉన్న విశ్వ గురుత్వార్షణ బలం
బి) భూమి, చంద్రుడికి మధ్య ఉన్న విశ్వ గురుత్వాకర్షణ బలాలు
సి) సూర్యుడు, చంద్రుడికి మధ్య ఉన్న విశ్వగురుత్వాకర్షణ బలాలు
డి) భూమి, అంగారకుడి మధ్య ఉన్న విశ్వగురుత్వాకర్షణ బలాలు
33. విశ్వం గురించి అధ్యయనం చేయడాన్ని ఏమంటారు?
ఎ) కాస్మాలజీ బి) ఆస్ట్రానమీ
సి) స్పేస్ డి) జియాలజీ
34. భూమికి ఇతర వస్తువులను ఆకర్షించే గురుత్వాకర్షణ బలం ఉందని వివరించిన తొలి భారతీయ శాస్త్రవేత్త?
ఎ) ఆర్యభట్ట బి) భాస్కరాచార్యుడు
సి) బ్రహ్మగుప్తుడు డి) వరాహమిహిరుడు
35. సూర్యుడిలో పొరలు ఏవి?
ఎ) ఫొటోస్ఫియర్ బి) క్రోమోస్ఫియర్
సి) కరోనా డి) పైవన్నీ
36. ఏ గ్రహాన్ని ఉదయతార, సాయంత్రం తారగా పిలుస్తారు?
ఎ) అంగారకుడు బి) శుక్రుడు
సి) శని డి) యురేనస్
37. అరుణ గ్రహం అని దేన్ని పిలుస్తారు?
ఎ) శని బి) భూమి
సి) అంగారకుడు డి) బృహస్పతి
38. భూమి చుట్టూ పరిభ్రమిస్తున్న కృత్రిమ ఉపగ్రహం స్థానాన్ని కింది కక్ష్య నుంచి పై కక్ష్యవరకు పెంచినప్పుడు దాని కక్ష్యావేగం?
ఎ) పెరుగుతుంది
బి) తగ్గుతుంది సి) మారదు
డి) రెండు రెట్లు పెరుగుతుంది
39. బృహస్పతి ఉపగ్రహం పేరు?
ఎ) గనిమెడ బి) యూరోపా
సి) కెలిస్టో డి) పైవన్నీ
40. సౌరకుటుంబంలో గరిష్ట సాంద్రత ఉన్న గ్రహం?
ఎ) భూమి బి) శని
సి) బృహస్పతి డి) బుధుడు
41. సంవత్సర కాలవ్యవధి తక్కువగా ఉన్న గ్రహం?
ఎ) భూమి బి) బుధుడు
సి) యురేనస్ డి) శని
42. భూస్థిర ఉపగ్రహాలను భూమి కేంద్రం నుంచి ఎన్ని కిలోమీటర్ల ఎత్తులో ప్రవేశపెడతారు?
ఎ) 3,600 కి.మీ. బి) 36,000 కి.మీ.
సి) 42,400 కి.మీ. డి) 56,500 కి.మీ.
43. మన పాలపుంత వ్యాసం సుమారు ఎన్ని కాంతి సంవత్సరాలు?
ఎ) 102 బి) 103
సి) 104 డి) 105
44. కాస్మిక్ సంవత్సరం దేని ప్రమాణం?
ఎ) దూరం బి) కాలం
సి) ద్రవ్యరాశి డి) పరిమాణం
45. భూ కేంద్ర సిద్ధాంతాన్ని ప్రతిపాదించినవారు?
ఎ) టాలమీ బి) కోపర్నికస్
సి) గెలీలియో డి) న్యూటన్
46. గ్రహం ఏ భౌతికరాశిపై పలాయనవేగం ఆధారపడి ఉంటుంది?
ఎ) ద్రవ్యరాశి బి) వ్యాసార్ధం
సి) గురుత్వ త్వరణ విలువ
డి) ఆకారం
47. చంద్రుడిపై పలాయన వేగం?
ఎ) $2.42\ ms^{-1}$ బి) $2.42\ kms^{-1}$
సి) $2.42\ cms^{-1}$ డి) $11.2\ kms^{-1}$
48. సౌరకుటుంబంలో సూర్యుడి చుట్టూ పరిభ్రమిస్తున్న గ్రహాలకు కావలసిన అభికేంద్రక బలాన్ని అందించేవి?
ఎ) విద్యుత్ బలాలు
బి) విశ్వగురుత్వాకర్షణ బలాలు
సి) అయస్కాంత బలాలు
డి) పైవన్నీ
49. సంవత్సర కాలవ్యవధి గరిష్ఠంగా ఉన్న గ్రహం?
ఎ) శని బి) బృహస్పతి
సి) నెప్ట్యూన్ డి) శుక్రుడు
50. భూమికి అతిచేరువలో పరిభ్రమిస్తోన్న కృత్రిమ ఉపగ్రహ ఆవర్తన కాలం (సుమారుగా)?
ఎ) 24 గంటలు బి) 10 గంటలు
సి) 500 సెకన్లు డి) 5000 సెకన్లు

సమాధానాలు

1) బి; 2) డి; 3) ఎ; 4) సి; 5) ఎ;
6) బి; 7) సి; 8) ఎ; 9) బి; 10) సి;
11) బి; 12) సి; 13) బి; 14) సి; 15) బి;
16) డి; 17) డి; 18) సి; 19) డి; 20) సి;
21) సి; 22) డి; 23) డి; 24) ఎ; 25) ఎ;
26) సి; 27) బి; 28) సి; 29) బి; 30) ఎ;
31) డి; 32) సి; 33) ఎ; 34) సి; 35) డి;
36) బి; 37) సి; 38) బి; 39) డి; 40) ఎ;
41) బి; 42) సి; 43) డి; 44) బి; 45) ఎ;
46) డి; 47) బి; 48) బి; 49) సి; 50) డి.

విద్య, ఉద్యోగ సమాచారం

రైట్స్ లిమిటెడ్, గుర్గావ్‌లో చీఫ్ రెసిడెంట్ ఇంజనీర్ పోస్టులు

గుర్గావ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్(రైట్స్) ఒప్పంద ప్రాతిపదికన చీఫ్ రెసిడెంట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **అర్హత:** డిగ్రీ(సివిల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** 10.02.2025 నాటికి 63 ఏళ్లు మించకూడదు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **దరఖాస్తులకు చివరితేది:** 21.02.2025.
» **వెబ్‌సైట్:** https://www.rites.com

ఏపీ బీసీ గురుకులాల్లో ఐదో తరగతి ప్రవేశాలు

విజయవాడలోని మహాత్మా జ్యోతిబా పులే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో బీసీ బాలబాలికల పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదో తరగతి(ఇంగ్లిష్ మీడియం)లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 6,600.
» **అర్హత:** విద్యార్థులు సంబంధిత జిల్లాల్లోని ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో నాలుగో తరగతి 2024-25 విద్యా సంవత్సరంలో చదివి ఉండాలి. జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి సంబంధిత జిల్లాలోని పాఠశాలల్లో చదువుతూ ఉండాలి. విద్యార్థి తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.లక్షకు మించకూడదు.
» **వయసు:** ఓసీ, బీసీ, ఈబీసీ విద్యార్థులు 11 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 12 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్షలో ప్రతిభ, రిజర్వేషన్, ప్రత్యేక కేటగిరీ(అనాథ /మత్స్యకార)ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** ప్రవేశ పరీక్ష ఆబ్జెక్టివ్ పద్ధతిలో ఓఎంఆర్ షీట్ విధానంలో 100 మార్కులకు నిర్వహిస్తారు. తెలుగు, ఇంగ్లిష్, గణితం, పరిసరాల విజ్ఞానం సబ్జెక్టులు నుంచి ప్రశ్నలు వస్తాయి. ప్రశ్నాపత్రం తెలుగు/ఇంగ్లిష్ మాధ్యమంలో ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**15.03.2025
» **పరీక్ష కేంద్రం:** విద్యార్థుల సంబంధిత జిల్లాలో పరీక్ష నిర్వహిస్తారు.
» **వెబ్‌సైట్:** https://mjpapbcwreis.apcfss.in

అమ్రాబాద్ గుట్టలు విస్తరించి ఉన్న జిల్లా ఏది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ భూగోళ శాస్త్రం

తెలంగాణ నైసర్గిక స్వరూపం

తెలంగాణ రాష్ట్రం పురాతన గోండ్వానా ప్రాంతం నుంచి విడిపోయిన ద్వీపకల్ప భారతదేశంలో భాగం. ఇది దక్కన్ పీఠభూమి ప్రాంతానికి చెందింది. సముద్రమట్టానికి 150-600 మీటర్ల ఎత్తులో విస్తరించి ఉంది.

పీఠభూమి

- దక్కన్ పీఠభూమి మీసోజోయిక్ కాలానికి చెందింది. ఈ పీఠభూమిలో అగ్నిమయ ఉదర విచ్ఛేదనం వల్ల లావా పెల్లుబుకి, ఘనీభవించడం ద్వారా బసాల్ట్ శిలలు ఏర్పడ్డాయి.
- తెలంగాణ పీఠభూమిలో హైదరాబాద్.. సముద్ర మట్టానికి 600 మీటర్ల ఎత్తులో ఉంది. ఇది రాష్ట్ర రాజధాని.
- పడమటి పీఠభూమి ఆర్కియన్ శిలలతో ఏర్పడింది. ఇది సముద్ర మట్టం నుంచి 450 నుంచి 600 మీటర్ల వరకు ఎత్తు ఉంది.
- తెలంగాణ పీఠభూమి ఉత్తరాన ఆదిలాబాద్‌లోని నిర్మల్ గుట్టల నుంచి దక్షిణాన మహబూబ్‌నగర్‌లోని అమ్రాబాద్ గుట్టల వరకు వ్యాపించి ఉంది.
- ఉత్తర భాగంలో గోదావరి నదీలోయలో గోండ్వానా శిలలు ఉన్నాయి.
- గోండ్వానా శిలల్లో ప్రధాన ఖనిజం–బొగ్గు.

తెలంగాణ పీఠభూమిలో

2 రకాల శిలలు ఉన్నాయి. అవి.

1. గోండ్వానా శిలలు
2. దక్కన్ శిలలు

గోండ్వానా శిలలు: పురాతన యుగం తర్వాత ప్రకృతి ఉత్పాతాల వల్ల ఏర్పడిన వృక్ష సంబంధిత అవక్షేప శిలలను 'గోండ్వానా శిలలు' అంటారు. ఈ శిలల్లో అత్యధికంగా దొరికే ఖనిజం – బొగ్గు.

దక్కన్ శిలలు: అగ్ని పర్వత ఉద్బేదనం వల్ల ఇవి ఏర్పడ్డాయి. ఇవి తెలంగాణలోని గోదావరి నది పరిసర ప్రాంతాల్లో విస్తరించి ఉన్నాయి.

- ఉత్తర తెలంగాణ (ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం)లో గొండ్వానా శిలలతో బొగ్గు నిక్షేపాలు ఏర్పడ్డాయి. ఇవి గోదావరి నది వెంబడి ఉన్నాయి.
- హైదరాబాద్‌లో దక్కన్ పీఠభూమి సముద్రమట్టానికి 600 మీటర్ల ఎత్తులో, కృష్ణా-తుంగభద్ర నదీ లోయల మధ్య 350-450 మీటర్ల ఎత్తులో, భీమా-గోదావరి నదుల మధ్య 730 మీటర్ల ఎత్తులో ఉంది.
- మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల మధ్య ఈ పీఠభూమి 600-900 మీటర్ల ఎత్తులో విస్తరించి ఉంది.

పర్వతాలు (కొండలు, గుట్టలు)

తెలంగాణ ప్రాంతంలో అనేక రకాల కొండలు, గుట్టలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని పర్వత శ్రేణులకు సంబంధించిన ముఖ్యాంశాలు..

తెలంగాణ ప్రాంతం ఒకప్పుడు ఎత్తైన కొండలు, గుట్టలతో; ఎగుడు, దిగుడులతో శిలాప్రాంతంగా ఉండేది. కొన్ని మిలియన్ ఏళ్ల కాలంలో క్రమక్షయానికి గురై వికోషీకరణ చెంది అవశిష్ట పీఠభూమిగా ఏర్పడింది. నదుల కోతల వల్ల అక్కడక్కడా సమతల ప్రదేశాలతో పెనిప్లేన్లు ఏర్పడ్డాయి.

- పడమటి కనుమలు లేదా సహ్యాద్రి పర్వతాలు అజంతా శ్రేణి నుంచి విడిపోయి ఆగ్నేయ దిశగా తెలంగాణ ప్రాంతంలోకి ఆదిలాబాద్ జిల్లాలో ప్రవేశిస్తాయి. అక్కడి నుంచి ఈ పర్వతాలు కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల వరకు విస్తరించాయి.

ఈ పర్వతాలను కింద చూపిన విధంగా వివిధ జిల్లాల్లో వివిధ పేర్లతో పిలుస్తారు.

జిల్లా పేరు	పర్వతాల స్థానిక పేరు
ఆదిలాబాద్	నిర్మల్ గుట్టలు
కరీంనగర్	రాఖీ గుట్టలు
వరంగల్	కందికల్ గుట్టలు
ఖమ్మం	పాపి కొండలు

తెలంగాణ పీఠభూమిలో తూర్పు కనుమలు మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రవేశించి, రంగారెడ్డి, నల్గొండ వరకు విస్తరించాయి. వీటిని కూడా వివిధ జిల్లాల్లో వేర్వేరు పేర్లతో పిలుస్తున్నారు.

జిల్లా	పర్వతాలు
మహబూబ్‌నగర్	నల్లమల కొండలు, అమ్రాబాద్ కొండలు
రంగారెడ్డి	అనంతగిరి గుట్టలు, రాచకొండ గుట్టలు
నల్గొండ	నంది కొండలు, యాదగిరి గుట్ట.

- తెలంగాణ పీఠభూమి సముద్రమట్టానికి 531 మీ. ఎత్తులో లేదా 1741 అడుగుల ఎత్తులో విస్తరించి ఉంది.
- హైదరాబాద్-సికింద్రాబాద్ జంట నగరాలను హుస్సేన్‌సాగర్ వేరు చేస్తోంది. దీన్ని మూసీ ఉపనది అయిన కల్వలేరు నదికి అడ్డుకట్ట వేసి నిర్మించారు. హిమాయత్‌సాగర్ లేదా ఉస్మాన్ సాగర్‌ను మూసీ ఉపనది అయిన ఈసా వాగుపై నిర్మించారు. ఇది హైదరాబాద్ నగరానికి పశ్చిమాన 25 కి.మీ. దూరంలో ఉంది.
- పోచారం సరస్సును మంజీరా ఉపనది అయిన ఆలేరు పాయపై నిర్మించారు. ఇది నిజామాబాద్ జిల్లాలో ఉంది.
- ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్ హస్తకళలకు, పెయింటింగ్స్‌కు ప్రఖ్యాతి చెందింది. అదే జిల్లాలోని కడెం నదిపై 45 మీటర్ల ఎత్తులో కుంతాల జలపాతం ఉంది. ఇది తెలంగాణ రాష్ట్రంలోనే ఎత్తైన జలపాతం.
- మల్లూరు ఉగ్రనరసింహస్వామి దేవాలయం వరంగల్ జిల్లాలోని మంగపేటలో ఉంది.
- కంచర్ల గోపన్న నిర్మించిన భద్రాచలం దేవాలయం ఖమ్మం జిల్లాలో గోదావరి నది ఒడ్డున ఉంది.
- 1980లో మద్రాస్ నుంచి హైదరాబాద్‌కు మారిన తెలుగు ఫిలిం కల్చర్ (టాలీవుడ్ ఇండస్ట్రీ) దేశంలోనే రెండో అతిపెద్ద సినీ పరిశ్రమ.



తెలంగాణ రాష్ట్రంలోని ముఖ్యమైన ప్రదేశాలు

- **ఓరుగల్లు:** నాటి కాకతీయ రాజధాని. నేడు ఖిలా వరంగల్‌గా పేర్కొంటున్నారు. 12వ శతాబ్దంలో మట్టికోట, రాతి కోటలను నిర్మించారు. వీటి మధ్యలో కాకతీయుల చిహ్నంగా నిలిచిన కీర్తి తోరణాలు, ఖుష్‌మహల్‌లు ఉన్నాయి.
  - ఇక్కడ భద్రకాళీ దేవాలయం, రుద్రేశ్వర ఆలయం (వెయ్యి స్తంభాల గుడి) వంటి చారిత్రక ప్రాంతాలు ఉన్నాయి.
  - దీనికి సమీపంలో రామప్ప ఆలయం అద్భుత శిల్పకళా సౌందర్యానికి ప్రతీక.
- **పిల్లల మర్రి:** మహబూబ్‌నగర్‌లో సుమారు మూడు ఎకరాలకు పైగా విస్తరించి ఉన్న మహా వృక్షం. దీని మొదలు, కొమ్మక్కెడో గుర్తించడానికి వీలు లేకుండా పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఇది పట్టణ కేంద్రానికి సుమారు 4 కి.మీ.ల దూరంలో ఉంది.
- **మెదక్ చర్చి:** ఆసియాలోనే అతి పెద్దదైన మెదక్ డయాసిస్‌లో ఈ చర్చిని గోథిక్ నిర్మాణ శైలిని అనుసరిస్తూ 1914లో నిర్మించారు. ఈ చర్చి టవర్ ఎత్తు దాదాపు 173 అడుగులు. ఇక్కడ ఒకేసారి 5000 మంది ప్రార్థన చేసుకోవచ్చు.
- **వేములవాడ:** కరీంనగర్ జిల్లాలో ఉన్న ఈ ప్రాంతం.. రాజరాజేశ్వర దేవాలయానికి ప్రసిద్ధి. ఈ ఆలయాన్ని దక్షిణ కాశీ అంటారు. ఇది తెలంగాణలోనే అత్యధిక ఆదాయం ఆర్జించే, అత్యధిక భక్తులు దర్శించే ఆలయాల్లో ఒకటి.
- **కొలనుపాక జైన మందిరం:** ఇది హైదరాబాద్–వరంగల్ రోడ్డుపై ఆలేరు దగ్గరలోని కొలనుపాకలో ఈ దేవాలయం ఉంది. ఇది తెలంగాణలోని అత్యంత ప్రాశస్తి కలిగిన జైన మందిరం.
- **జ్ఞాన సరస్వతీ దేవాలయం:** ఇది ఆదిలాబాద్‌లోని బాసరలో ఉంది. దేశంలో ఉన్న రెండు సరస్వతీ దేవాలయాల్లో ఇది ఒకటి. ఆదిలాబాద్ నుంచి సుమారు 157.6 కి.మీ. దూరంలో ఉంది.
- **శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం:** ఇది నల్గొండ జిల్లాలోని యాదగిరిగుట్టలో ఉంది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఈ దేవాలయ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది.

మాదిరి ప్రశ్నలు

1. రాఖీ గుట్టలు విస్తరించి ఉన్న జిల్లా?
   1) ఆదిలాబాద్ 2) కరీంనగర్
   3) వరంగల్ 4) ఖమ్మం
2. కుంతాల జలపాతం ఏ జిల్లాలో ఉంది?
   1) వరంగల్ 2) కరీంనగర్
   3) ఆదిలాబాద్ 4) ఖమ్మం
3. తెలంగాణలో 'దక్షిణ కాశీ'గా పేరొందిన దేవాలయం?
   1) వేములవాడ రాజరాజేశ్వరాలయం
   2) బాసర సరస్వతీ ఆలయం
   3) యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి
   4) ఆలంపూర్ నవబ్రహ్మ ఆలయం
4. పిల్లలమర్రి ఏ జిల్లాలో ఉంది?
   1) హైదరాబాద్ 2) రంగారెడ్డి
   3) నల్గొండ 4) మహబూబ్‌నగర్
5. హైదరాబాద్ సముద్ర మట్టానికి సుమారుగా ఎన్ని మీటర్ల ఎత్తులో ఉంది?
   1) 200 మీ. 2) 450 మీ.
   3) 600 మీ. 4) 1000 మీ.
6. పశ్చిమ కనుమలు తెలంగాణ రాష్ట్రంలోకి ఏ జిల్లాలో మొదట ప్రవేశిస్తాయి?
   1) నిజామాబాద్ 2) రంగారెడ్డి
   3) మహబూబ్‌నగర్
   4) ఆదిలాబాద్
7. ఆదిలాబాద్ జిల్లాలో పశ్చిమ కనుమలను ఏ పేరుతో పిలుస్తారు?
   1) కందికల్ గుట్టలు 2) నిర్మల్ గుట్టలు
   3) రాచ కొండలు 4) పాపి కొండలు
8. మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల మధ్య దక్కన్ పీఠభూమి ఎంత ఎత్తులో విస్తరించి ఉంది?
   1) 600-900 మీటర్లు
   2) 350-450 మీటర్లు
   3) 700-850 మీటర్లు
   4) 200-375 మీటర్లు
9. అనంతగిరి పర్వత శ్రేణులు విస్తరించి ఉన్న జిల్లా ఏది?
   1) నల్గొండ 2) మెదక్
   3) రంగారెడ్డి 4) కరీంనగర్
10. అమ్రాబాద్ గుట్టలు విస్తరించి ఉన్న జిల్లా ఏది?
   1) రంగారెడ్డి 2) మహబూబ్‌నగర్
   3) నల్గొండ 4) ఆదిలాబాద్

సమాధానాలు

1) 2; 2) 3; 3) 1; 4) 4; 5) 3; 6) 4; 7) 2; 8) 1; 9) 3; 10) 2.

విద్య, ఉద్యోగ సమాచారం

బెల్, బెంగళూరులో సీనియర్ అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టులు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్).. శాశ్వత ప్రాతిపదికన సీనియర్ అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 08.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 50 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
- **వేతనం:** నెలకు రూ.30,000 నుంచి 120000
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును అసిస్టెంట్ మేనేజర్, హెచ్‌ఆర్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, జలహళ్లి పోస్టు, బెంగళూరు –560013 చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 26.02.2025.
- **వెబ్‌సైట్:** https://bel-india.in

ఏపీ బీసీ గురుకులాల్లో బ్యాక్‌లాగ్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలోని మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో బీసీ బాలబాలికల పాఠశాలల్లో 2025–26విద్యా సంవత్సరానికి సంబంధించి (6, 7, 8, 9వ తరగతుల)లో మిగిలి ఉన్న బ్యాక్‌లాగ్ ఖాళీల ప్రవేశాలకు అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** ప్రవేశపరీక్షకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 2025–26 విద్యా సంవత్సరంలో చేరాలనుకుంటే తరగతికి ముందు ఉండే తరగతి 2024–25 విద్యా సంవత్సరంలో చదివి ఉండాలి. ఉదాహరణకు ఆరో తరగతి ప్రవేశానికి ఐదో తరగతి చదువుతూ ఉండాలి. విద్యార్థి తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.లక్షకు మించకూడదు.
- **ప్రవేశ పరీక్ష:** ప్రవేశపరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఓఎంఆర్ షీట్ విధానంలో 100 మార్కులకు నిర్వహిస్తారు. ఆరో తరగతి ప్రవేశ పరీక్షకు తెలుగు,గణితం, ఈవీఎస్ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు వస్తాయి. మిగతా అన్ని తరగతుల్లో ప్రవేశాలకు తెలుగు, ఇంగ్లిష్, గణితం, సైన్స్, సోషల్ స్టడీస్ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు వస్తాయి.
- **ఎంపిక విధానం:** అర్హులైన అభ్యర్థులకు ప్రవేశ పరీక్షలో ప్రతిభ, రిజర్వేషన్, ప్రత్యేక కేటగిరీ(అనాథ/మత్స్యకార)ఆధారంగా సీటు కేటాయిస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.03.2025.
- **ప్రవేశ పరీక్ష తేది:** 28.04.2025.
- **వెబ్‌సైట్:** https://mjpapbcwreis.apcfss.in

Permanent Memory in computer is called

BANK EXAMS
COMPUTER AWARENESS



Model Questions

1. To make the number keypad act as directional arrows you press the _______ key.
   a) Num lock b) Caps lock
   c) Arrow lock d) Shift
   e) None of these
2. The skill to find an individual item in a file instantly ___ is used
   a) File allocation table
   b) Directory c) Sequential access
   d) Direct access
   (e) None of these
3. _____ memory improves processing by acting as a temporary high-speed holding area between the memory and the CPU.
   a) RAM b) ROM
   c) Cache memory
   d) Flash memory e) EPROM
4. A DVD is an example of a(n) _____
   a) Hard disk b) Optical disc
   c) Output device
   d) Solid-state storage device
   e) None of these
5. A ___ is a resourcefully designed "empty" document that can be adapted to the user's needs
   a) File b) Guide
   c) Template d) User guide file
   e) None of these
6. The hardware device normally referred to as the 'brain' of the computer is the____.
   a) RAM chip b) Data input
   c) CPU d) Secondary storage
   e) None of these
7. One of the oldest calculating devices was
   a) Arithmometer b) Ready reckoner
   c) Abacus d) All of these
   e) None of these
8. All formula in Excel start with
   a) % b) + c) =
   d) – e) None of these
9. The Recycle Bin stores discarded items until _______
   a) Another user logs on
   b) The computer is shut down
   c) The end of the day
   d) You empty it
   e) None of these
10. Which of the following special effects can you use for the slide background?
   a) Gradient b) Texture
   c) Picture d) All of these
   e) None of these
11. Which of the following is not a valid formula in Microsoft Excel?
   a) = A2 + A1 b) = A2 + 1
   c) = A1 + A3 d) = 1A + 2
   e) = A1 + A2
12. What does the acronym ISP stands for?
   a) Internal Service Provider
   b) International Service Provider
   c) Internet Service Provider
   d) Internet Service Providing
   e) Internet Service Provision
13. What is the full form of WWW?
   a) Work Wide Web
   b) World Wide Web
   c) World with Wet
   d) World Wide Wet
   e) World Weak Web
14. Which of the following is hardware?
   a) Assembler b) Server
   c) Compiler d) Interpreter
   e) OS
15. USB in data cables stands for?
   a) Unicode Smart Bus
   b) Universal Structural Bus
   c) Unicode Serial Bus
   d) Universal Smart Bus
   e) Universal Serial Bus
16. Which of the following is not a binary number?
   a) 11101 b) 110 c) 233
   d) 1001 e) 100110
17. ____ is approximately one billion bytes.
   a) Megabyte b) Kilobyte
   c) Terabyte d) Gigabyte
   e) Bit
18. A normal compiler takes source code as input and produces ___ as output
   a) Machine code b) Object code
   c) Assembly code d) C++
   e) None of these
19. ____ is an internet forum to discuss spacious range of topics like current news, articles and current affairs, etc.
   a) E-Learning b) Chatting
   c) E-Discussions
   d) Newsgroup e) None of these
20. A technique in which a number of similar items or transactions to be processed are grouped and processed in a designated sequence during a machine run is ____.
   a) Batch processing
   b) Online processing
   c) Real time processing
   d) All of these e) None of these
21. Ada is a/an _______
   a) High-level programming language for the development of defense
   b) Structured programming language
   c) Association of data processing
   d) All of the above
   e) None of the above
22. What is the number of bit patterns provided by a 7-bit code?
   a) 256 b) 128 c) 64
   d) 512 e) All of these
23. Regarding a VDU, which statement is more correct?
   a) It is a peripheral device
   b) It is an input device
   c) It is an output device
   d) It is a hardware item
   e) None of the above
24. Which printer is very commonly used for desk top publishing?
   a) Dot matrix printer
   b) Ink Jet Printer
   c) Daisy wheel printer
   d) Laser printer
   e) None of these
25. The radix of a hexadecimal system is:
   a) 8 b) 3 c) 16
   d) 2 e) 10
26. Which of the following are types of sound files?
   a) LOG files b) DAT files
   c) WAV files d) DAV files
   e) None of these
27. Permanent Memory in computer is called
   a) RAM b) Auxiliary storage
   c) CPU d) CD ROM
   e) None of these
28. Apple Macintoshes (Macs) and PCs use different CPU's to process data and different ________
   a) Languages b) Methods
   c) Operating system
   d) Storage devices
   e) None of these
29. Smaller and less expensive PC based servers are replacing today _______ in many businesses
   a) Super computers
   b) Clients c) Laptops
   d) Mainframes
   e) None of the above
30. After a picture has been taken with a digital camera and processed appropriately, the actual print of the picture is considered
   a) Data b) Output
   c) Input d) The process
   e) None of these
31. _____ is the science that attempts to produce machines that display the same type of intelligence that humans do.
   a) Nanoscience b) Nanotechnology
   c) Simulation
   d) Artificial intelligence
   e) None of the above
32. SMTP, FTP and DNS are applications of the ____ layer.
   a) Data link b) Network
   c) Transport d) Application
   e) None of these
33. ____ provides a common address space and routes the packets of data across the entire internet?
   a) IP b) TCP c) UDP
   d) ALU e) None of these
34. ____ was the precursor to internet as we know it today?
   a) ARPANET b) USENET
   c) TELNET d) DBMS
   e) None of these
35. Hardware that adds two numbers is:
   a) The control unit
   b) An internal CPU register
   c) Arithmetic Unit
   d) Browser e) None of these
36. What is the decimal from of 3b4?
   a) 846 b) 848 c) 946
   d) 948 e) None of these
37. The term _____ designate equipment that might be added to a computer system to enhance its functionality.
   a) Digital device
   b) System add
   c) Disk pack
   d) Peripheral device
   e) None of these
38. A device designed to read information encoded onto a small plastic card is..
   a) Light pen
   b) Pun chard card
   c) Magnetic tape
   d) Magnetic e) Badge reader
39. The property that, when classes are arranged in a hierarchy, each class assumes the attributes and methods of its ancestors is
   a) Generalization
   b) Inheritance c) Encapsulation
   d) Information hiding
   e) None of these
40. This part of operating system manages the essential peripherals, such as the keyboard, screen, disk drives, and parallel and serial ports_____
   a) Basic input / output system
   b) Secondary input / output system
   c) Peripheral input / output system
   d) Marginal input / output system
   e) None of these
41. Which of the following is not a type of key?
   a) Alphabetic Keys
   b) Numeric keys
   c) Function keys
   d) Toggle keys e) None of these
42. What is gutter margin?
   a) Margin that is added to the left margin when printing
   b) Margin that is added to right margin when printing
   c) Margin that is added to the binding side of page when printing
   d) Margin that is added to the outside of the page when printing
   e) None of these
43. To insert a new slide in a presentation, press_____
   a) CTRL+N b) CTRL+M
   c) CTRL+O d) CTRL+S
   e) CTRL+F
44. ______ is a combination of software and hardware
   a) Firmware b) Shareware
   c) Freeware d) Netware
   e) Software
45. Memory which forgets everything when you switch off the power is known as
   a) Corrupted b) Volatile
   c) Non-Volatile
   d) Non - Corrupted
   e) None
46. Format command is used to create____
   a) Sector b) Memory
   c) Tracks d) Tracks and sector
   e) None of these

KEY

1) a	2) d	3) c	4) b	5) c
6) c	7) c	8) c	9) d	10) d
11) d	12) c	13) b	14) b	15) e
16) c	17) d	18) b	19) d	20) a
21) d	22) b	23) a	24) d	25) c
26) c	27) b	28) c	29) d	30) b
31) d	32) d	33) a	34) a	35) c
36) d	37) d	38) e	39) b	40) a
41) e	42) c	43) b	44) a	45) b
46) d				